www.andhrajyothy.com ధర (Price) : Rs. 6.50

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI
సంపుటి (Volume) : 64
సంచిక (Issue) : 344

శుక్రవారం | 29-3-2024 | పేజీలు: 14

టికెట్ రాకపోవడంతో ఎంపీ ఆత్మహత్య

పురుగుల మందు తాగిన ఈరోడ్ ఎంపీ



నాలుగు రోజులుగా కోయంబత్తూర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గణేషమూర్తి మృతి 12

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం; తిథి: చవితి రా. 8.22 తదుపరి పంచమి; నక్షత్రం: విశాఖ రా. 8.37 తదుపరి అనూరాధ; వర్జ్యం: రా. 12.51-2.33; దుర్ముహూర్తం: ఉ. 8.42-9.30, మ. 12.45-1.33; అమృతఘడి యలు: ఉ. 11.05-12.49; రాహుకాలం: ఉ. 10.30-12.00; సూర్యోదయం: 6.16; సూర్యాస్తమయం: 6.25 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



ఓరి దేవుడా!

జగన్ నోట వివేకా హత్య మాట

చంపింది, చంపించిందీ ఎవరో ఎప్పుడో తేల్చేసిన సీబీఐ

అవినాశ్ రెడ్డి పాత్రపై స్పష్టత

గుండెపోటు కథ అల్లిందే ఆయన

రాజకీయంగా వాడుకున్నది జగన్

అయినా 'కలియుగం' కథలు

నిందితుడిని పక్కనే పెట్టుకుని కబుర్లు



'వివేకాను చంపిందెవరో ఆయనకూ, దేవుడికీ తెలుసు' అని ప్రకటించిన ప్రొద్దుటూరు సభా వేదికపై అవినాశ్ రెడ్డితో జగన్

(అమరావతి/కడప - ఆంధ్రజ్యోతి)

అబద్ధాలు సైతం సిగ్గుపడేట్లు... కరడుగట్టిన నేరగాళ్లు సైతం నవ్వుకునేట్లు... సామాన్య జనం ముక్కున వేలేసుకునేట్లు... ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మరోసారి తనదైన శైలిలో చిలకపలుకులు పలికారు. 'చిన్నాన్న వివేకానంద రెడ్డిని చంపిందెవరో ఆయనకు, దేవుడికీ, జిల్లా ప్రజలందరికీ తెలుసు'... అని ఈ హత్య కేసులో నిందితుడైన తన తమ్ముడు, ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డిని పక్కనపెట్టుకుని మరీ చెప్పారు. తనను చంపిందెవరో వివేకా ఇప్పుడు మళ్లీ బతికొచ్చి చెప్పలేరు. దేవుడు పైనుంచి అన్నీ చూస్తుంటాడుకానీ, కోర్టుల్లో సాక్ష్యం చెప్పే బాధ్యత ఆయనది కాదు. ఇక... ముఖ్యమంత్రి మారువేషంలో పులివెందుల పూల అంగళ్ల సెంటర్‌కు వెళ్లి, 'ఏంబ్బా, వివేకాను చంపిందెవరు' అని అడిగితే ఇట్టే సమాధానం వస్తుంది. 'దేవుడికీ, ప్రజలకే కాదు... మా నాన్నను చంపిందెవరో జగన్‌కూ తెలుసు' అని వివేకా కుమార్తె సునీతా రెడ్డి పేర్కొంటున్నారు. ఇవన్నీ పక్కన పెట్టేద్దాం! వివేకా హత్యకేసును దర్యాప్తు చేసిన సీబీఐ... హంతకులెవరో అన్ని సాక్ష్యాలు, సాంకేతిక ఆధారాలతో సహా ఇప్పటికే రుజువు చేసింది. అయినప్పటికీ... బుధవారం ప్రొద్దుటూరు

మిగతా 14వ పేజీలో...



వివేకాను ఎవరు చంపారో జగన్‌కు తెలుసు

చంపించినవాళ్లతోనే తిరుగుతున్నారు

నిందితుడిని పక్కన పెట్టుకుని ఓటడుగుతున్నారు

భాస్కర్‌రెడ్డి, అవినాశ్ చంపించారని హంతకుడే చెబుతున్నా నమ్మరా?.. జగన్, భారతి వారిని రక్షిస్తున్నారు

ఐదేళ్ల క్రితం వివేకా హత్యను రాజకీయంగా వాడుకున్నారు

సీబీఐ అడిగి మళ్లీ వద్దన్నారు.. నేడు మళ్లీ సానుభూతి యత్నం

హంతకులకు, జగన్‌కు ఓటేయొద్దు

వచ్చే ఎన్నికల్లో వైసీపీని ఓడించండి

ప్రజలకు వివేకా కుమార్తె సునీత విజ్ఞప్తి

హైదరాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డిని ఎవరు చంపారో దేవుడికి, కడప జిల్లా ప్రజలతో పాటు తన సోదరుడు, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి కూడా తెలుసునని ఆయన కుమార్తె సునీతా రెడ్డి వ్యాఖ్యానించారు. తన చిన్నాన్న (వివేకా)ను చంపించిన వారెవరో తెలిసి కూడా

మిగతా 14వ పేజీలో...



శ్రీసత్యసాయి జిల్లా కదిరిలో నిర్వహించిన బహిరంగ సభలో ప్రసంగిస్తున్న చంద్రబాబు

గొడ్డలి వేటు వేసి.. నంగనాచి కబుర్లు

వివేకా హత్యపై జగన్ మాటలకు నవ్వొస్తోంది: చంద్రబాబు

ఆయన నటన హాలీవుడ్‌ను మించిపోయింది.. తొలుత గుండెపోటన్నారు.. తర్వాత రక్తపు వాంతులు

చివరికి గొడ్డలిపోటని తేలినా నారాసుర రక్త చరిత్ర అంటూ దుష్ప్రచారం

ఆయన చెల్లెళ్లను నేను మేనేజ్ చేస్తున్నానట!.. కట్టుకథలకు జనం మోసపోరు

జగనాసుర వధకు గడువు 46 రోజులే.. ఈ సీఎం ఓ మానసిక రోగి

బడుగు, బలహీన వర్గాల ద్రోహి.. నిరుద్యోగుల సంఖ్యను పెంచేశాడు

దీంతో వారు డ్రగ్స్ బాట పట్టారు.. ఐదేళ్లలో అన్ని వర్గాలకూ అన్యాయం

అందరూ గుర్తుపెట్టుకుని ఓటేయాలి.. సూపర్ సిక్స్‌తో అందరికీ న్యాయం

టీడీపీ అధినేత ప్రకటన.. ఉమ్మడి అనంతలో 3 చోట్ల ప్రజాగళం సభలు

సీఎంగా తొలి సంతకం మెగా డీఎస్సీపైనే
చంద్రబాబు హామీ

అనంతపురం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): సొంత బాబాయి వివేకానందరెడ్డి హత్యపై సీఎం జగన్‌రెడ్డి నంగనాచి కబుర్లు చెబుతుండడం చూస్తుంటే నవ్వొస్తోందని టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. పులివెందులలో ఆయన మాట్లాడిన తీరు హాలీవుడ్.. బాలీవుడ్ స్థాయి నటనను మించిపోయిందని ఎద్దేవాచేశారు. మనం 'మహాశక్తి'తో ఆడబిడ్డలను గౌరవిస్తుంటే.. జగన్ సొంత చెల్లెళ్ల పుట్టుకనే ప్రశ్నిస్తున్నారని విమర్శించారు. గురువారం ఉమ్మడి అనంతపురం జిల్లా రాప్తాడు, శింగనమల, కదిరి నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన ప్రజాగళం బహిరంగ సభల్లో ఆయన ప్రసంగించారు. జగనాసుర వధకు గడువు 46 రోజులేనని.. ప్రజాగళం సభలకు వస్తున్న ప్రజా ఉధృతే ఈ విషయం చెబుతోందని చెప్పారు. మే 13న

మిగతా 13వ పేజీలో...

ఏమిటీ ఉత్తర్వులు..



ముఖ్య కార్యదర్శిని జైలుకు పంపాలి

ప్రిన్సిపాళ్లుగా బోధనేతర సిబ్బందా!?

ఇలాంటి ఉత్తర్వులు జారీ చేయడం ఆత్మహత్యా సదృశమే

సిలబస్ గురించి లైబ్రేరియన్లు, పీడీలకు ఏం తెలుస్తుంది?

సర్వీసు ఉందని స్వీపర్‌ను కూడా ప్రిన్సిపాల్ చేస్తారేమో

అసమర్థులను నియమిస్తే విద్యా సంస్థల తలరాత ఏమిటి?

జీవోపై వివరణ ఇచ్చేందుకు 1న కోర్టు ముందు హాజరుకండి

పాఠశాల విద్యా శాఖ ముఖ్య కార్యదర్శికి హైకోర్టు ఆదేశం

ప్రిన్సిపాళ్ల పదోన్నతిపై సింగిల్ జడ్జి ఉత్తర్వులు సస్పెండ్

అమరావతి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కాలేజీల ప్రిన్సిపాళ్లుగా లైబ్రేరియన్లు, ఫిజికల్ డైరెక్టర్లను నియమించే నిమిత్తం జీవో ఇవ్వడంపై హైకోర్టు విస్మయం వ్యక్తం చేసింది. ఇలాంటి జీవో జారీ చేసిన

మిగతా 3వ పేజీలో...

అడ్డగోలుగా చేస్తే అంతే!

హైకోర్టులో జగన్ సర్కారుకు ఝలక్

ప్రభుత్వ జూనియర్ కాలేజీల ప్రిన్సిపాల్ పదోన్నతుల్లో నిబంధనలకు పాతర

తోచినట్లు సర్వీసు రూల్స్ మార్పు

అర్హులకు పదోన్నతులు నిలిపివేత

తమ్ముడు చెప్పాడని!

అక్రమాధికారికి అన్నయ్య 'మేలు'

అక్రమాలు రుజువైనా రక్షణ.. ధర్మచంద్రారెడ్డిపై అభియోగాలు హుష్

అవినాశ్ కోరగానే ఫైలు కదిపిన సీఎం.. మధ్యలో ధనుంజయ రెడ్డి పెత్తనం

కోడ్‌కు ముందే జరిగిన తతంగం.. 'పాత తేదీ'తో ఉత్తర్వులు జారీ!?

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

దేవుడు శాసిస్తాడు.. అరుణాచలం పాటిస్తాడు!

ఇక్కడేమో... తమ్ముడు అడుగుతాడు. అన్నయ్య అనుసరిస్తాడు!

తమ్ముడు వైఎస్ అవినాశ్ రెడ్డి కాగా, అన్నయ్య ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి. ఇప్పటికే ఒక తమ్ముడు అనిల్ రెడ్డికి రాష్ట్రంలోని ఇసుక ర్యాంపులు రాసిచ్చేశారు. మరో తమ్ముడికి మన్యంలోని మైన్స్ వ్యాపారం అప్పగించారు. ఇక అవినాశ్ రెడ్డికి చేసిన మేళ్లు ఏమిటో.. 'దేవుడికీ, రాష్ట్ర ప్రజలందరికీ' తెలుసు! ఉద్యోగుల క్రమబద్ధీకరణ, పోస్టింగ్‌లు, తీవ్రమైన అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులపై అభియోగాలు

మిగతా 14వ పేజీలో...

అప్రూవర్‌కు ఆ హక్కు ఉంటుంది

నిందితుల బెయిల్ రద్దు కోరవచ్చు

దస్తగిరి పిటిషన్‌ను తిరస్కరించలేం

తెలంగాణ హైకోర్టు స్పష్టీకరణ

అవినాశ్ బెయిల్ రద్దుపై విచారణ 4వ తేదీకి వాయిదా

కౌంటర్ దాఖలుకు ఆదేశాలు



నంద్యాలలో ముఖ్యమంత్రి జగన్ ప్రసంగిస్తుండగానే ఖాళీగా ఉన్న సభా ప్రాంగణం

జగన్ షో అట్టర్‌ఫ్లాప్

నంద్యాల సభకు స్పందన కరువు

మాట్లాడుతుండగానే జారుకున్న జనం.. వారిని ఆపేందుకు పోలీసుల తంటాలు

బారికేడ్లు దూకి పారిపోయిన జనం.. కర్నూలులోకి సీఎం బస్సు యాత్ర 13

డీఎస్సీ పరీక్షలు వాయిదా?

షెడ్యూల్ ప్రకారం రేపటి నుంచే మొదలవ్వాలి

ఈసీ నుంచి రాని స్పష్టత

సెంటర్ల ఎంపిక ప్రక్రియ ప్రారంభమే కాలేదు 14



గురువారం కోర్టు నుంచి బయటకు వస్తున్న కేజ్రీవాల్

అసలు కుంభకోణం ఈడీదే!

బీజేపీ కోసం బలవంతపు వసూళ్ల రాకెట్

శరత్ రూ.55 కోట్లతో బెయిలు కొన్నాడు

బీజేపీకి బాండ్లు ముట్టాకే బెయిలొచ్చింది

రాజకీయ కుట్రతోనే నన్ను అరెస్టు చేశారు

నలుగురు చెబితే సీఎంను అరెస్టు చేస్తారా?

నన్ను ఇరికించి ఆప్‌ను లేకుండా చేద్దామని ప్లాన్

ఈడీ కోర్టులో కేజ్రీవాల్ స్వయంగా వాదనలు

ఏప్రిల్ 1 వరకు ఈడీ కస్టడీలోనే సీఎం

జైలు నుంచి పాలనను అడ్డుకోలేమన్న హైకోర్టు

కేజ్రీవాల్‌పై రాష్ట్రపతే తేల్చుకోవాలని స్పష్టీకరణ

న్యూఢిల్లీ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రాజకీయాల్లో ఆమ్‌ఆద్మీ పార్టీని లేకుండా చేయాలనే కుట్రతోనే తనను అరెస్టు చేశారని ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. మద్యం విధానం కేసులో వంద కోట్లు చేతులు మారాయన్న ఈడీ ఆరోపణ కూడా అబద్ధమన్నారు. నిజమైతే వంద కోట్లు ఏమయ్యాయో, ఎక్కడున్నాయో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కేసులో నిందితుడిగా ఉన్న శరత్ చంద్రారెడ్డి బీజేపీకి రూ.55 కోట్లు విరాళంగా ఇచ్చి బెయిల్‌ను కొనుక్కున్నాడని ఆరోపించారు. ఈ దందాకు సంబంధించి తన దగ్గర పూర్తి ఆధారాలున్నాయని ప్రకటించారు. అసలు మనీ ట్రయల్ జరిగిందే బీజేపీ, శరత్‌ల మధ్య అని చెప్పారు. ఈడీ జోక్యం తర్వాతే కుంభకోణం మొదలైందని వ్యాఖ్యానించారు. బీజేపీ తరఫున ఈడీ బలవంతపు వసూళ్ల రాకెట్‌ను నడుపుతోందని

మిగతా 12వ పేజీలో...

అమరావతి రైతుల పాపమేంటి?

రాజధాని నిర్మాణానికి భూములిచ్చారు 11



ఇంకేమి నేరం చేయలేదు.. కేసులతో మహిళా రైతులకు ఇబ్బందులు

దక్షిణ భారతంలోనే పెద్ద రైతు ఉద్యమం.. దేశంలో సాగుకు గుర్తింపు లేదు

రైతు వ్యతిరేక చట్టాలను ప్రశ్నించలేని దుస్థితి : జస్టిస్ ఎన్వీ రమణ

లోక్‌సభ రెండోదశ ఎన్నికలకు నోటిఫికేషన్

88 స్థానాలకు మొదలైన నామినేషన్ల పర్వం

ఏప్రిల్ 4న ఆఖరు

5న నామినేషన్ల పరిశీలన

అదే నెల 26న పోలింగ్ 12

'అప్పు'డే మొదలైంది

2024-25 ఆర్థిక సంవత్సరంలో తొలి వర్కింగ్ డేనే 4,000 కోట్ల అప్పు

ఏప్రిల్ 2న ఆర్‌బీఐ వేలంలో జగన్ సర్కారు సెక్యూరిటీల విక్రయం 12

ఆన్సర్ షీట్ చూపించలేదని కత్తితో పొడిచారు 12


Centuary MATTRESSES
INDIA KA SLEEP SPECIALIST
OFFICIAL SPONSOR OF SUNRISERS HYDERABAD
Sleep Cooler.
Sleep Better.™
Q-GEL™ MATTRESS
Powered by
CuSense™ Technology
CuSense™ Technology
Centrik Pro Responsive Cushioning™
Ergo-form Transition Foam™
Euro top
ANTI SLIP
Grip+™ Fabric
CertiPUR-US
Certification of Quality
NEW LAUNCH OFFER
FREE
Antimicrobial Bedsheet
CuSense™ Pillow Set
10% off
*T&C Apply
VIJAYAWADA: PAVAN ENTERPRISES 99480 15402 | JYOTHI FURNITURE CENTRE 98481 33713 | CENTRAL FURNITURE 94402 49385 | NARAYANASWAMY FURNITURE 9246493265 | NEELIMA FURNITURE HOUSE 93921 01858 | SRI SAI PADMA MARKETINGS 98481 17944 | RAMACHANDRA BROTHERS-6 80087 44687 | GUDIVIDA: SRI BHARAGAVI FURNITURES 94904 73565 | NANDIGAMA: PAVAN SAI FURNITURE SHOW ROOM 98491 00237 | NUZIVID: SAI SRINIVASA FURNITURE-NZ 99851 44365
FOR TRADE & BULK ENQUIRY: 7702838112

ఏమిటీ ఉత్తర్వులు..

ముఖ్య కార్యదర్శిని జైలుకు పంపాలి

(మొదటి పేజీ తరువాయి)

పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శిని జైలుకు పంపించాలని ఘాటు వ్యాఖ్యలు చేసింది. ప్రిన్సిపాళ్లుగా పదోన్నతి కల్పించేందుకు లైబ్రేరియన్లు, పీడీలకు సిలబస్, పాఠ్యాంశాలపై ఏం అవగాహన ఉంటుందని ప్రశ్నించింది. 20 ఏళ్లు మోటర్ సైకిల్ నడిపిన అనుభవం ఉందని విమానం నడిపేందుకు అనుమతిస్తారా అని నిలదీసింది. సర్వీసు ఉంది కదా అని వార్డు బాయ్‌ని సర్జన్‌గా, కళాశాలలోని స్వీపర్‌కు ప్రిన్సిపాల్‌గా పదోన్నతి కల్పించండంటూ మండిపడింది. బోధనేతర సిబ్బందిని కళాశాల ప్రిన్సిపాళ్లుగా నియమిస్తే సిలబస్ గురించి వారికేం అవగాహన ఉంటుందని ప్రశ్నించింది. జీవో 76 జారీ చేయడం ఆత్మహత్యా సదృశ్యమేనని, అసలు ఈ ప్రభుత్వం ఏం చేస్తోందని నిలదీసింది. ఇలాంటి జీవోలను పౌర సమాజం హర్షించదని పేర్కొంది. ఈ ఉత్తర్వుల కారణంగా ఉత్పన్నమయ్యే పరిణామాల గురించి ఒకసారి ఆలోచించాలని సూచించింది. అసమర్థులను విద్యాసంస్థలకు అధిపతులుగా నియమిస్తే వాటి తలరాత ఏమిటని ప్రశ్నించింది. విద్యా ప్రమాణాలకు విఘాతం కలిగించేలా ప్రభుత్వ జీవో ఉందని ప్రాథమికంగా అభిప్రాయపడింది. ఇలాంటి చర్యలను అనుమతిస్తే విద్యావ్యవస్థ విధ్వంసానికి దారితీస్తుందని స్పష్టం చేసింది. విద్యావ్యవస్థ ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకొని కాకుండా ఇతర కారణాలతో జీవో తెచ్చినట్లు కనపడుతోందని వ్యాఖ్యానించింది. 2021 డిసెంబరు 8న జారీ చేసిన జీవో 76లోని అంశాలు, చట్టనిబంధనలపై అధ్యయనం చేసి కోర్టు ముందు హాజరుకావాలని పాఠశాల ముఖ్యకార్యదర్శిని ఆదేశించింది. జూనియర్ కాలేజీల్లో 197మంది జూనియర్ లెక్చరర్లకు ప్రిన్సిపాళ్లుగా పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ప్రొసీడింగ్స్‌ని సస్పెండ్ చేస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను ధర్మాసనం సస్పెండ్ చేసింది. విచారణ ఏప్రిల్ 1కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ జి. నరేందర్, జస్టిస్ ఎన్. హరినాథ్‌తో కూడిన ధర్మాసనం గురువారం ఆదేశాలిచ్చింది. ప్రభుత్వ ఇంటర్మీడియెట్ జూనియర్ కాలేజీల్లో జూనియర్ లెక్చరర్లకు ప్రిన్సిపాళ్లుగా పదోన్నతి కల్పించే వ్యవహారంలో 2021లో ప్రభుత్వం జారీ చేసిన జీవో 76, ఏపీ స్టేట్ అండ్ సబార్డినేట్ సర్వీస్ రూల్స్‌ను పాటించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ ఏపీ గవర్నమెంట్ జూనియర్ లెక్చరర్స్ ఇన్ లైబ్రరీ సైన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.సంజీవరావు, మరో నలుగురు హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యాలపై విచారణ జరిపిన సింగిల్ జడ్జి.. 197 మంది జూనియర్ లెక్చరర్లకు ప్రిన్సిపాళ్లుగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఇచ్చిన ప్రొసీడింగ్స్‌ని సస్పెండ్ చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ నెల్లూరు జిల్లా సూళ్లూరుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్యామ్‌కుమార్ ధర్మాసనం ముందు అప్పీల్ వేశారు. ఈ అప్పీల్ గురువారం విచారణకు రాగా అప్పిలెంట్ తరఫున సీనియర్ న్యాయవాది కేజీ కృష్ణమూర్తి వాదనలు వినిపించారు. సింగిల్ జడ్జి వద్ద పిటిషనర్ తమను ఉద్దేశపూర్వకంగా ప్రతివాదిగా చేర్చలేదని, సింగిల్ జడ్జి ఉత్తర్వులను ఉత్తర్వులను సస్పెండ్ చేయాలని కోరారు. పిటిషనర్ల తరఫున న్యాయవాది ఠాగూర్ యాదవ్ వాదనలు వినిపిస్తూ... ఇంటర్మీడియట్ కమిషనర్ ఇచ్చిన ప్రొసీడింగ్స్ హైకోర్టు ఆదేశాలు, ప్రభుత్వ జీవోకు విరుద్ధంగా ఉన్నాయని తెలిపారు. లైబ్రరీ సైన్స్ లెక్చరర్లను పదోన్నతిలో పరిగణనలోకి తీసుకోలేదని ఆరోపించారు. ప్రిన్సిపాల్ కేవలం పరిపాలనా వ్యవహారాలు మాత్రమే చూస్తారని, ఈ నేపథ్యంలో నాన్‌టీచింగ్ స్టాఫ్‌ను ప్రిన్సిపాళ్లుగా నియమించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా నాన్‌టీచింగ్ స్టాఫ్‌కు ప్రిన్సిపాళ్లుగా పదోన్నతి కల్పించే విషయంలో ప్రభుత్వం జారీ చేసిన జీవో 76ను ధర్మాసనం లోతుగా పరిశీలించింది. లైబ్రేరియన్లు, పీడీలు ప్రిన్సిపాళ్లుగా పదోన్నతి పొందేందుకు అర్హులుగా పేర్కొనడంపై విస్మయం వ్యక్తం చేసింది. జీవోను ఇప్పటివరకు ఎందుకు సవాల్ చేయలేదని అప్పిలెంట్ తరఫు సీనియర్ న్యాయవాదిని ప్రశ్నించింది. నాన్‌టీచింగ్ స్టాఫ్‌ను ప్రిన్సిపాళ్లుగా నియమిస్తే విద్యావ్యవస్థకు నష్టం జరగదా, దీనివల్ల ఉత్పన్నమయ్యే ప్రతికూల పరిణామాల గురించి ఆలోచించారా అని జీపీని ప్రశ్నించింది. ఉత్తర్వులు జారీ చేసిన పాఠశాల విద్యశాఖ ముఖ్యకార్యదర్శిని జైలుకు పంపిస్తామని హెచ్చరించింది. విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి హాజరుకు ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది.

అడ్డగోలుగా చేస్తే... అంతే!

హైకోర్టులో జగన్ సర్కారుకు ఝలక్

- ప్రభుత్వ జూనియర్ కాలేజీల ప్రినిపాల్ పదోన్నతుల్లో నిబంధనలకు పాతర
- తోచినట్లు సర్వీసు రూల్స్ మార్పు
- అర్హులకు పదోన్నతులు నిలిపివేత
- ఓ మంత్రి సొంత నిర్ణయాలతో కొత్త రూల్స్
- ప్రమోషన్లకు జేఎల్స్ నుంచి లక్షలు వసూలు
- అధికారులు వద్దన్నా వినిపించుకోని మంత్రి



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

"ఇది మా ప్రభుత్వం. మేం అనుకున్నదే చేస్తాం. తోచినట్లుగా నిబంధనలు మార్చేస్తాం. అర్హులను పక్కన పెట్టేసి అనర్హులకు పదోన్నతులు ఇచ్చేస్తాం. అంతా మా ఇష్టం" అంటూ అడ్డగోలుగా వ్యవహరిస్తున్న జగన్ సర్కారుకు హైకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. జూనియర్ కాలేజీల ప్రిన్సిపాల్ పదోన్నతుల్లో నిబంధనలు బేఖాతరు చేయడంపై ధర్మాసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ వ్యవహారంలో ప్రభుత్వ పెద్దల సొంత రూల్స్ చూసి ఒకదశలో హైకోర్టే విస్మయం వ్యక్తం చేసింది. ఇటీవల 197 మంది జూనియర్ లెక్చరర్లకు ప్రిన్సిపాళ్లుగా పదోన్నతులు కల్పిస్తూ ఇంటర్ విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. పదోన్నతుల్లో తమను పరిగణనలోకి తీసుకోకపోవడంపై కాలేజీల్లో పనిచేసే లైబ్రేరియన్లు హైకోర్టును ఆశ్రయించారు. వారిని కూడా పరిగణనలోకి తీసుకోవాలని, ఇంటర్ విద్యాశాఖ ఇచ్చిన పదోన్నతులను సస్పెండ్ చేస్తూ ఇటీవల న్యాయస్థానం ఆదేశాలిచ్చింది. దానిపై మళ్లీ కొందరు కోర్టును ఆశ్రయించగా అసలు లైబ్రేరియన్లు, ఫిజికల్ డైరెక్టర్లు పదోన్నతుల జాబితాలోకి ఎలా వచ్చారని న్యాయస్థానం ఆరా తీసింది. 2021లో వారికీ పదోన్నతులు కల్పించే విధంగా సర్వీసు రూల్స్‌ను జగన్ ప్రభుత్వం మార్చిన విషయం వెలుగులోకి వచ్చింది. అంతకుముందు ప్రిన్సిపాల్ పదోన్నతులకు అర్హుల జాబితాలో మూడు కేటగిరీలు ఉండేవి. డైరెక్ట్ కోటాలో వచ్చిన జూనియర్ లెక్చరర్లు, టీచర్ నుంచి పదోన్నతి ద్వారా జేఎల్ అయినవారు, ఇంటర్, డిగ్రీ కాలేజీల్లో పనిచేసే మినిస్టీరియల్ సిబ్బంది నుంచి జేఎల్ అయినవారికి కలిపి ఒకే సీనియారిటీ జాబితా తయారుచేసి ప్రమోషన్లు ఇచ్చేవారు. 2018లో ఇచ్చిన పదోన్నతుల్లోనూ ఇదే విధానం పాటించారు.

ఆ అధికారి అత్యుత్సాహం

మొదటినుంచీ ఉన్న సీనియారిటీ జాబితా విధానాన్ని జగన్ ప్రభుత్వం మార్చేసింది. ప్రిన్సిపాళ్ల పదోన్నతుల్లో తమను కూడా పరిగణించాలని లైబ్రేరియన్లు కోరడంతో దానిపై 2021 డిసెంబరులో ఏకంగా జీవో 76 జారీ చేసింది. అప్పటి వరకూ ఉన్న కేటగిరీలతో పాటు ఇకనుంచి లైబ్రేరియన్లు, ఫిజికల్ డైరెక్టర్లను కూడా పదోన్నతుల్లోకి పరిగణించాలని స్పష్టంచేసింది. దీనిని జూనియర్ లెక్చరర్లు తీవ్రంగా వ్యతిరేకించారు. వారు పాఠాలు చెప్పరని, పరీక్షల బాధ్యతలు ఉండవని, ఉత్తీర్ణత టార్గెట్లతో సంబంధం లేదని, వారు ప్రిన్సిపాళ్లు కావడానికి అర్హులుకారని వాదించారు. ఇదే విషయాన్ని అప్పటి పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్‌కు నాటి ఇంటర్మీడియెట్ కమిషనర్ బి.ఉదయలక్ష్మి లేఖ రాశారు. జేఎల్స్ కూడా నేరుగా ఆయన్ను కలిసి ఇది నిబంధనలకు విరుద్ధమని వివరించారు. కానీ ప్రభుత్వ ఆదేశాలతో నిబంధనలను పట్టించుకోకుండా ముఖ్య కార్యదర్శి జీవో 76 జారీ చేశారు. లైబ్రేరియన్లకు, పీడీలకు ఎందుకు అర్హత కల్పించాల్సి వచ్చిందో అందులో ఎక్కడా పేర్కొనలేదు. వారిని కూడా ప్రిన్సిపాళ్ల జాబితాలోకి చేరుస్తూ సర్వీస్ రూల్స్ సవరిస్తూ ఏకపక్షంగా జీవో ఇచ్చారు. ఇప్పుడు ఆ జీవోనే వివాదానికి కారణమైంది. అవసరమైతే ఆ ముఖ్యకార్యదర్శిని జైలుకు పంపుతామని కోర్టు వ్యాఖ్యానించేలా నిబంధనలు తుంగలో తొక్కారు.

అర్హులకు ఆపేశారు

లైబ్రేరియన్లు, పీడీల సీనియారిటీని 2016 నుంచే లెక్కిస్తుండటం, అంతకుముందు నుంచే సీనియర్ జేఎల్స్ ఉండటంతో వారికి తాజా పదోన్నతుల్లో అవకాశం లభించలేదు. అయితే టీచర్ల నుంచి వచ్చిన జేఎల్స్‌ను తాజా పదోన్నతుల్లో పక్కనపెట్టారు. వారికి సంబంధించి కొన్ని కేసులు కోర్టు పరిధిలో ఉన్నాయని, అవి తేలకుండా వారికి పదోన్నతులు ఇవ్వలేమని ఇంటర్ విద్యాశాఖ పేర్కొంది. అయితే న్యాయస్థానంలో వేర్వేరు కేసులు పెండింగ్‌లో ఉన్నప్పటికీ డీఆర్ కోటా నుంచి వచ్చినవారికి, మినిస్టీరియల్ సిబ్బందికి పదోన్నతులు ఇచ్చేశారు. అయితే వారికి ఇచ్చినవి అడహక్ పదోన్నతులని, కోర్టు కేసుల తర్వాత వెనక్కి పంపాల్సిన అవసరం రావొచ్చని అందులో స్పష్టం చేసింది. దీంతో ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే వారిని పక్కనపెట్టిందని అర్థమవుతోంది.

అమాత్యుడి వసూళ్ల పర్వం

పదోన్నతుల్లో ఒక కేటగిరీని పక్కనపెట్టేందుకు ఓ సీనియర్ మంత్రి భారీగా ముడుపులు వసూలు చేశారని విద్యాశాఖలో ప్రచారం జరుగుతోంది. ఎన్నికలకు ముందు పాఠశాల విద్యాశాఖ నుంచి అన్ని స్థాయిల్లో వసూళ్లకు తెరతీసిన ఆయన ఈ అవకాశాన్ని కూడా వినియోగించుకున్నారు. ఇటీవల 1,200 మంది టీచర్లను అక్రమంగా బదిలీ చేయడం ద్వారా రూ.40కోట్ల వరకు ఆయన వెనకేశారన్న విమర్శలున్నాయి. ఈ వ్యవహారంలో కూడా ఓ కేటగిరీని పక్కనపెట్టడం ద్వారా లబ్ధిపొందే డీఆర్ కోటా జేఎల్స్ నుంచి కూడా భారీగా వసూలు చేశారని ఆ వర్గాలు అంటున్నాయి. ఒక్కో జేఎల్ నుంచి రూ.3లక్షల వరకు వసూలు చేసి, టీచర్ల నుంచి వచ్చిన జేఎల్స్‌ను పక్కనపెట్టేలా ఆదేశించారని చెబుతున్నాయి. కాగా, ఇది నిబంధనలకు విరుద్ధమని కొందరు అధికారులు చెప్పినా ఆ మంత్రి సొంత నిబంధనలు అమలుచేయించారని తెలుస్తోంది.



తిరుమల ఆలయం ముందు కుటుంబ సభ్యులతో జస్టిస్ వెంకటరమణ

తిరుమలేశుడి సేవలో జస్టిస్ వెంకటరమణ

తిరుమల, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకటరమణ తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని గురువారం దర్శించుకున్నారు. తిరుమల పుష్పగిరి మఠంలో బుధవారం ఆయన సోదరుడి కుమారుడి వివాహం జరిగింది. ఈ క్రమంలో వధూవరులు, కుటుంబ సభ్యులతో కలిసి జస్టిస్ వెంకటరమణ గురువారం ఉదయం వీఐపీ బ్రేక్‌లో శ్రీవారిని దర్శించుకున్నారు.

శ్రీవారి సేవలో భారత్ బయోటెక్ చైర్మన్



కృష్ణ, సుచిత్ర ఎల్లా

తిరుమల శ్రీవారిని భారత్ బయోటెక్ సంస్థ అంతర్జాతీయ చైర్మన్ కృష్ణా ఎల్లా, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ సుచిత్ర ఎల్లా గురువారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

నడక మార్గంలో చిరుత సంచారం



26వ తేదీ రాత్రి ట్రాప్ కెమెరాలో చిక్కిన చిరుత

తిరుమల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): అలిపిరి నడక మార్గంలో మరోసారి చిరుత సంచారం కలకలం సృష్టించింది. గాలిగోపురం నుంచి లక్ష్మీనరసింహస్వామి ఆలయం వరకు నడకమార్గానికి ఇరువైపులా ట్రాప్ కెమెరాలను ఏర్పాటుచేసి ఎప్పటికప్పుడు వన్యమృగాల సంచారాన్ని గమనిస్తున్నారు. ఈ నెల 20వ తేదీ ఓ చిరుత నడకమార్గానికి సమీపంలో సంచరించడాన్ని గుర్తించారు. 25వ తేది రాత్రి 7.30 గంటల సమయంలో, 26వ తేదీ రాత్రి 12.10 గంటలకు మరో చిరుత నడకమార్గానికి 150 మీటర్ల దూరంలో సంచరించడం ట్రాప్ కెమెరాల్లో రికార్డయింది. దీంతో అటవీశాఖ అధికారులు అప్రమత్తమై భక్తులకు మైకుల ద్వారా సూచనలు చేస్తున్నారు.

తుంగభద్ర బోర్డు ఇన్‌చార్జి చైర్మన్‌గా వీరేంద్ర శర్మ

అమరావతి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర బోర్డు ఇన్‌చార్జి చైర్మన్‌గా కేంద్ర జల సంఘం ఆపరేషన్స్ చీఫ్ ఇంజనీర్ వీరేంద్ర శర్మను నియమిస్తూ కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం తుంగభద్ర బోర్డు చైర్మన్‌గా ఉన్న డీఎం రాయ్‌పురేను బోర్డు చైర్మన్ పదవి నుంచి తప్పించింది.

నారాయణ ఎడ్యుకేషనల్ సొసైటీ ఖాతాలు సీజ్

- కోడ్ అమల్లోకి వచ్చినా మారని అధికారుల తీరు
- నారాయణ లక్ష్యంగా కొనసాగుతున్న వేధింపులు

నెల్లూరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ నాయకుడు, మాజీ మంత్రి పొంగూరు నారాయణపై వైసీపీ ప్రభుత్వం వేధింపుల పర్వం కొనసాగుతోంది. నారాయణ ఎడ్యుకేషనల్ సొసైటీకి చెందిన 5 బ్యాంకు ఖాతాలను ఇదివరకే సీజ్ చేయగా గురువారం మరో 4 ఖాతాలను సీజ్ చేసింది. రాజధాని అమరావతి భూసేకరణ నుంచి అవుటర్, ఇన్నర్ రింగురోడ్లు, ప్రశ్నపత్రాల లీకేజీ కేసులు మొదలు తాజాగా నెల్లూరులోని నారాయణ నివాసం, కార్యాలయాలు, చివరికి ఆయన అనుచరుల ఇళ్ల వరకు వేటినీ వదలకుండా దాడులు చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు బస్సుల కొనుగోళ్ల విషయాన్ని అడ్డుపెట్టుకొని ఖాతాలను సీజ్ చేయడం ద్వారా నారాయణను ఆర్థికంగా ఇబ్బందులు పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. రాజకీయంగా నారాయణను, తద్వారా టీడీపీ వేధించేందుకే ఈ చర్యలు చేపడుతున్నారని రాజకీయ వర్గాలు ఆరోపిస్తున్నాయి. నారాయణ ఎడ్యుకేషనల్ సొసైటీకి అవసరమైన 92 బస్సులను దానికి అనుబంధంగా ఉన్న ఇన్‌స్పైయిరా సంస్థ ద్వారా కొనుగోలు చేశారు. ఎడ్యుకేషనల్ ట్రాన్స్‌పోర్టు యాక్టుకు అనుగుణంగా ఆ బస్సులను నారాయణ ఎడ్యుకేషనల్ సొసైటీకి అద్దెకు ఇవ్వడాన్ని రవాణాశాఖ అధికారులు తప్పుబట్టారు. ఈ శాఖ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసులు నమోదు చేశారు. దీన్ని సవాల్ చేస్తూ నారాయణ ఎడ్యుకేషనల్ సొసైటీ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. ప్రస్తుతం కేసు కోర్టు పరిధిలో ఉంది. అయితే వైసీపీ పెద్దలు మాత్రం ఈ కేసు ఆధారంగా నారాయణను ఇబ్బందులకు గురిచేసే ప్రయత్నాలు ఆపలేదని టీడీపీ ఆరోపిస్తోంది. అకౌంట్ల సీజ్‌పై ఎడ్యుకేషనల్ సొసైటీ మరోసారి న్యాయస్థానాన్ని ఆశ్రయించనుంది. కోడ్ అమలులోకి వచ్చినా కూడా అధికారులు తమ స్వామిభక్తిని ప్రదర్శించడం పట్ల ప్రజలు విస్తుపోతున్నారు.



గుడ్లవల్లేరు మండలం పోలిమెట్లలో మాట్లాడుతున్న నారా భువనేశ్వరి

రాష్ట్రాభివృద్ధికి కూటమి గెలవాలి

- విధ్వంసం వినాశనానికి చిరునామా వైసీపీ
- వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి 30,196 మంది మహిళల అదృశ్యం
- గంజాయి రాజధానిగా వైజాగ్
- గుడివాడను నందమూరి కుటుంబం ఎన్నటికీ మరచిపోదు
- 'నిజం గెలవాలి' యాత్రలో భువనేశ్వరి

గుడివాడ, నూజివీడు, మార్చి 28: విధ్వంసం, వినాశనానికి వైసీపీ చిరునామాగా మారిందని, భావితరాల భవిష్యత్తు బాగుండాలంటే కూటమి గెలవాలని నారా భువనేశ్వరి అన్నారు. నిజం గెలవాలి యాత్రలో భాగంగా కృష్ణా జిల్లా గుడివాడ నియోజకవర్గంలోని మోటూరు, అంగలూరు, పోలిమెట్ల గ్రామాల్లో గురువారం ఆమె పర్యటించారు. చంద్రబాబు అక్రమ అరెస్ట్ నేపథ్యంలో తీవ్ర మనోవేదనతో మృతి చెందిన పార్టీ కార్యకర్తల కుటుంబ సభ్యులను ఆమె ఓదార్చారు. చంద్రబాబు అక్రమ అరెస్టు కారణంగా ఆవేదనతో మృతి చెందిన యార్లగడ్డ శ్రీనివాసరావు (మోటూరు), చేబ్రోలు కోటేశ్వరరావు(అంగలూరు), అట్లూరి వీర లక్ష్మణ సంజీవకుమార్ (పోలిమెట్ల) కుటుంబాలను పరామర్శించారు. మృతుల కుటుంబాలకు టీడీపీ అండగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గుడివాడ ప్రజల ఆశీస్సులతో అన్న ఎన్టీఆర్ ముఖ్యమంత్రి అయ్యారని, నందమూరి కుటుంబం ఎన్నడూ గుడివాడను మరచిపోదని చెప్పారు. ఎన్టీఆర్ బాటలో చంద్రబాబు కూడా ప్రజల మంచిని కోరి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. అధికార వైసీపీ నేతలు మట్టి, ఇసుకను దోచుకోవడమే కాకుండా, అక్రమాలను ప్రశ్నిస్తే దాడులకు తెగబడుతున్నారని, అమానుషంగా మనుషులను చంపేస్తున్నారని అన్నారు. రాష్ట్రానికి తలమానికంగా నిలిచే అమరావతి, పోలవరం ప్రాజెక్టులను నిలుపుదల చేశారని, అన్నక్యాంటీన్లను ఎత్తివేసి పేదల కడుపులు కొట్టారని దుయ్యబట్టారు. ఓటు అనే ఆయుధంతో జగన్ రాక్షస పాలనకు ముగింపు పలకాలని, ప్రతి ఒక్కరూ తమతో పాటు తోటి వారితో కూడా కూటమి అభ్యర్థులకు ఓట్లు వేయించి గెలిపించాలని కోరారు. ఆమె వెంట గుడివాడ టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాము, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, టీడీపీ, జనసేన, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే, ఏలూరు జిల్లా ఆగిరి పల్లి, నూజివీడు మండలాల్లో ఆమె పర్యటించారు. తోటపల్లికి చెందిన బెజవాడ రామారావు, ఆగిరిపల్లిలో కలవకొల్లు శ్రీరాములమ్మ, పలగాని చంద్రయ్య, నూజివీడు మండలం గొల్లపల్లిలో వెనిగళ్ల పూర్ణచంద్రరావు కుటుంబ సభ్యులను భువనేశ్వరి పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 'వైజాగ్‌ను రాష్ట్ర రాజధానిని చేయడం ఏమోకానీ మూడు రాజధానుల్లో ఒకటిగా చెప్పే వైజాగ్‌ను గంజాయి క్యాపిటల్‌గా వైసీపీ తీర్చిదిద్దుతోంది. అక్కడ 25 వేల కిలోల మత్తు పదార్థాలు దొరికాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. అలాగే, వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటినుంచి 30,196 మంది మహిళలు అదృశ్యమయ్యారు. నాసిరకం మద్యం కారణంగా ఎంతోమంది ఆడపడుచుల మాంగల్యాలు గాలిలో కలిసిపోయాయి' అంటూ భువనేశ్వరి వైసీపీ ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ అధికారంలోకి వస్తే 20 లక్షల ఉద్యోగాల కల్పనతో పాటు నిరుద్యోగులకు నెలకు రూ.3వేలు, అన్నదాతలకు పెట్టుబడి సాయంగా సంవత్సరానికి రూ.20 వేలు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసిందన్నారు. 'చేయిచేయి కలిపి టీడీపీని గెలిపిద్దాం. టీడీపీని ఎన్టీఆర్ స్థాపిస్తే చంద్రబాబు నడుపుతున్నారు. భవిష్యత్ సారథి లోకేశ్ ఒక్కడే కాదు, లక్షలాదిమంది పసుపు సైన్యం టీడీపీ వారసులే' అని అన్నారు. కాగా, ఈ కార్యక్రమంలో నారా బ్రాహ్మణి ఆద్యంతం భువనేశ్వరి వెంట ఉన్నప్పటికీ ఆమె కారులోనే ఉండిపోయారు.

పెళ్లింట పెను విషాదం

- రోడ్డు ప్రమాదంలో వధువు తల్లి సహా ముగ్గురు మహిళలు మృతి
- మరో ముగ్గురికి తీవ్రగాయాలు
- వివాహ వేడుక నుంచి తిరిగి వస్తుండగా ఘోరం
- డివైడర్ దాటి వెళ్లి సిమెంట్ దిమ్మెను ఢీకొన్న కారు
- అతివేగం, నిద్రమత్తే కారణం
- ప్రకాశం జిల్లా తూర్పునాయుడుపాలెం వద్ద ఘటన





ప్రమాదంలో దెబ్బతిన్న కారు, మృతులు అరుణ, దివ్య, శ్రావణి

టంగుటూరు/కందుకూరు, మార్చి 28: కుమార్తె పెళ్లి చేసి తిరిగివస్తూ రోడ్డు ప్రమాదానికి గురై ఆమె తల్లి సహా ఒకే కుటుంబంలోని ముగ్గురు మృత్యువాత పడ్డారు. ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెం సమీపంలో 16వ నంబర్ జాతీయ రహదారిపై గురువారం అతివేగం, నిద్రమత్తు కారణంగా జరిగిన ప్రమాదం ముగ్గురు ప్రాణాలు తీసింది. మరో ముగ్గురిని ఆస్పత్రి పాలుచేసింది. నెల్లూరు జిల్లా కందుకూరులోని గుర్రంవారిపాలెంకు చెందిన రాయని స్రవంతికి తెలంగాణ రాష్ట్రం పాల్వంచలో బుధవారం రాత్రి వివాహమైంది. ఈ శుభకార్యానికి స్రవంతి కుటుంబ సభ్యులు, బంధువులు బుధవారం ఉదయం వాహనాల్లో బయల్దేరి వెళ్లారు. వివాహం అనంతరం అర్ధరాత్రి 12 గంటల తర్వాత వారు తిరుగు ప్రయాణమయ్యారు. వధువు తల్లి అరుణ (50), సోదరుడు వేణు, చిన్నమ్మ కుమార్తె గుళ్లాపల్లి శ్రావణి (22), మేనమామ తల్లపనేని వినోద్, ఆయన భార్య దివ్య (28) వారి మూడేళ్ల కుమారుడు అభిరామ్ ఒక కారులో బయల్దేరారు. టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెం సమీపంలోని ఫ్లైఓవర్ దిగువన గురువారం ఉదయం వీరు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి రెండో వైపు మార్గంలోకి వెళ్లి మార్జిన్‌లో ఉన్న సిమెంటు దిమ్మెను ఢీకొట్టింది. దీంతో వెనుక సీట్లో కూర్చున్న అరుణ, శ్రావణి, దివ్య అక్కడికక్కడే మృతి చెందారు. కారు నడుపుతున్న వినోద్, ఆయన కుమారుడు అభిరామ్, ముందు సీట్లో కూర్చొన్న వేణుకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే ఎస్సై నాగేశ్వరరావు, హైవే సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కారు నుంచి మృతులను, క్షతగాత్రులను బయటకు తీశారు. గాయపడిన వారిని 108 వాహనంలో రిమ్స్‌కు పంపారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఒంగోలులోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వీరిలో వినోద్, ఆయన కుమారుడి పరిస్థితి విషమంగా ఉంది. వెనుకనే వస్తున్న పెళ్లి బస్సులో ఉన్న వధూవరులు, బంధువులు, ఇతర వాహనాల్లో ఉన్న మరికొందరు ప్రమాద స్థలం వద్ద దిగి కన్నీరు మున్నీరయ్యారు. అతివేగం, నిద్రమత్తు ప్రమాదానికి కారణమని తెలుస్తోంది. ప్రమాద సమయంలో కారు 120 కిలోమీటర్ల వేగంతో వెళుతున్నట్టు పోలీసులు భావిస్తున్నారు. కారు వేగం ధాటికి సిమెంటు పోల్ సైతం విరిగిపోయింది. ఒంగోలు ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం గురువారం రాత్రి మృతదేహాలను కందుకూరుకు తీసుకు రాగా బంధువుల రోదనలు మిన్నంటాయి.

రెండు బైకులు ఢీకొని ముగ్గురి మృతి

రామభద్రపురం, మార్చి 28: విజయనగరం జిల్లా రామభద్రపురం మండలం కొట్టక్కి వద్ద జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతిచెందగా ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో ఈ ప్రమాదం సంభవించింది. ఎస్ఐ జ్ఞానప్రసాద్ కథనం మేరకు.. రామభద్రపురం మండలం జన్నివలస గ్రామానికి చెందిన జొన్నాడ పురుషోత్తం (25), జి.రాంప్రసాద్, జి.గణేష్ గురువారం రాత్రి 8.30 గంటల సమయంలో సాలూరు నుంచి బైక్‌పై స్వగ్రామానికి వస్తున్నారు. సాలూరు గొల్ల వీధికి చెందిన జి.శ్రీను (45), యశోద కృష్ణ (47) రామభద్రపురం వైపు నుంచి ద్విచక్రవాహనంపై సాలూరు వెళ్తున్నారు. ఈ క్రమంలో కొట్టక్కి వద్ద జాతీయ రహదారిపై ఎదురెదురుగా వస్తున్న రెండు వాహనాలూ ఢీకొన్నాయి. పురుషోత్తం తలకు తీవ్రగాయాలు కావడంతో ఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయాడు. శ్రీను, యశోద కృష్ణ సాలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. గణేష్, రాంప్రసాద్ తీవ్ర గాయాలతో విజయనగరం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సంఘటన స్థలాన్ని బొబ్బిలి డీఎస్పీ శ్రీనివాసరావు, రూరల్ సీఐ తిరుమలరావు పరిశీలించారు.

మద్య నిషేధం చేశాకే ఓట్లు అడగాలి

- పురందేశ్వరిని విమర్శిస్తే ఊరుకోం: పాతూరి

అమరావతి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): 'మద్య నిషేధం హామీతో ఓట్లు వేయించుకుని గెలిచావ్. రాష్ట్రంలో మద్యం లేకుండా చేయకపోతే వచ్చే ఎన్నికల్లో ఓట్లు అడగనని చెప్పావ్. ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని ప్రజల్లోకి వెళ్లి ఓటు అడుగుతున్నావ్' అంటూ సీఎం జగన్‌పై బీజేపీ రాష్ట్ర నాయకుడు పాతూరి నాగభూషణం విరుచుకుపడ్డారు. విజయవాడలోని బీజేపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 'దేశంలో ఎక్కడ గంజాయి పట్టుబడ్డా ఏపీ పేరే వినిపిస్తోంది. అత్యంత నాసిరకం మద్యం అతి ఎక్కువ ధరలకు విక్రయించే రాష్ట్రం కూడా ఏపీనే. ఈ రెండింటిపై బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి పోరాటం చేస్తే ఆమెపై వ్యక్తిగత విమర్శలు చేసే స్థాయికి రాష్ట్ర ముఖ్యమంత్రి దిగజారి పోవడం తగదు' అని హితవు పలికారు. విశాఖపట్నంలో పట్టుబడ్డ డ్రగ్స్ వ్యవహారంలో ఎవరి పాత్ర ఉందో సీబీఐ తేలుస్తుందన్నారు. కాగా, రాబోయే ఎన్నికల్లో వైసీపీకి 15అసెంబ్లీ స్థానాలకు మించి రాబోవని ఆదోనీ బీజేపీ అభ్యర్థి పార్థసారథి చెప్పారు.

బీజేపీలో హిందూ దళితులు లేరా?

ప్రధాని మోదీ ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా భగవద్గీత అందజేస్తున్నారు. రాష్ట్రంలో మాత్రం భగవద్గీత పట్టుకునే హిందూ దళితులు బీజేపీకి కనిపించడంలేదా? బైబిల్ పట్టుకునే వారికే ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం ఇస్తారా? అంటూ బద్వేల్‌కు చెందిన పనతల సురేశ్ రాష్ట్ర బీజేపీ నేతలను ప్రశ్నించారు. ఉపఎన్నికల్లో పోటీ చేసి ఓడిన సురేశ్.. బద్వేల్ అసెంబ్లీ టికెట్ ఆశించారు. రోశన్న వైపు అధిష్ఠానం మొగ్గు చూపడంతో గురువారం ఆయన విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి వచ్చి నిరసన తెలిపారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

నివేదికలు, నిజాలు!

వికసిత భారత్, అచ్ఛేదిన్, అమృత్‌కాల్ ఇత్యాది అద్భుతపదజాలంతో ఎన్నికల్లో ఘన విజయాలు సాధించాలని భారతీయ జనతాపార్టీ అనుకుంటూంటే, దేశంలో పరిస్థితులు అంత పచ్చగా ఏమీ లేవని, పైగా దిగజారిపోతున్నాయని ఇటీవల వెలువడిన నివేదికలు తేల్చేస్తున్నాయి. ఉపాధి దెబ్బతిన్నదనీ, అసమానతలు ఆకాశాన్నంటాయని, సగం బలం అనుకున్న సంతోషానికి కూడా ఈ దేశపౌరుడు నోచుకోవడం లేదని ఆ సూచికలూ సర్వేలు హెచ్చరిస్తున్నాయి. భారతదేశంలో కొందరు పోగేస్తున్న సంపద గురించి, అసంఖ్యాకులైన సామాన్యజనం సంపాదన కృశించిపోవడం గురించి ఎంతోకాలంగా చదువుతున్నదీ, చూస్తున్నదే మరోమారు మన కళ్ళముందు ఆవిష్కృతమైంది.

నోబెల్ విజేత థామస్ పికెట్టీ సహా నలుగురు ఆర్థికవేత్తలు తయారుచేసిన నివేదికకు ఓ ప్రత్యేకస్థానం ఉంది. బ్రిటీషువాడి ఏలుబడిలో కంటే ఇప్పుడే భారతదేశంలో అసమానతలు అధికంగా ఉన్నాయని ఈ వరల్డ్ ఇనీక్వాలిటీ ల్యాబ్ అధ్యయనపత్రం హెచ్చరిస్తున్నప్పుడు అవమానం కలగడం సహజం. అందుకే కాకిలు, దానిమీద అనుమానాలు రేపే కార్యక్రమం కూడా వెంటనే మొదలైంది. కానీ, భారతదేశాన్ని ప్రత్యేకంగా తప్పుడు లెక్కలతో తప్పుబట్టడం వల్ల సదరు ఆర్థికవేత్తలకు ఒరిగేదేమీ ఉండదు. పైగా, వారు చెప్పిన విషయాలు మన ఊహకు అందనివీ కావు. ఆదాయ అసమానతల్లో మనదేశం దక్షిణాఫ్రికాలను, దక్షిణమెరికాలను సైతం దాటేసిందని ఈ పత్రం హెచ్చరిస్తోంది. స్వాతంత్ర్యం వచ్చిన తొలిదశాబ్దాల్లో బలహీనుల పక్షాన నిలిచిన దేశం, ఆర్థిక సంస్కరణల అనంతరకాలంలో బిలీయనీర్ల రాజ్యంగా అవతరించిందని చెబుతోంది. ఒకశాతం అపరకుబేరుల దగ్గర నలభైశాతం దేశ సంపద పోగుపడిందని అంటూ, 1982నాటికి వీరి ఆదాయాలు, సంపదలు ఎలా ఉన్నాయో, అనంతర దశాబ్దాల్లో అవి ఎంతవేగంగా వృద్ధిచెందాయో వివరించింది. ఆర్థిక సంస్కరణలతోనూ, అనంతరం ప్రస్తుత పాలకుల ఏలుబడిలోనూ అపరకుబేరుల సంఖ్యలోనూ, వారి ఆదాయాల్లో అనూహ్యమైన పెరుగుదల ఉందని అర్థం. 167 సంపన్న కుటుంబాలమీద ఓ రెండుశాతం అధికంగా పన్నువేస్తే జాతీయ ఆదాయంలో అరశాతం పెరుగుతుందట. గత దశాబ్దిన్నరలోనే అసమానతలు అమితవేగంగా హెచ్చాయని ఈ పత్రం పునరుద్ఘాటించడంతో పాటు శతకోటీశ్వరులమీద విధించే పన్నుల విధానంలోనూ విప్లవాత్మకమైన మార్పులు రావాలని ఆకాంక్షించింది. కానీ, కుబేరులతో పాలకులకు ఉన్న పేగుబంధం తెలిసిందే. ఆర్థిక వ్యత్యాసాలను చక్కదిద్దడానికి ఈ పత్ర రచయితలు చేసిన చక్కని సూచనలు ఈ ప్రభుత్వాలకు పట్టవు. దేశ ఆర్థికరంగం ఎదుగుతున్నదనీ, అగ్రరాజ్యాలను దాటేస్తున్నామని గర్విస్తున్న దశలో, కార్మికశక్తిని సద్వినియోగపరచడంలోనూ, ఉపాధి కల్పించడంలోనూ ఎంతో వెనుకబడివున్నామని మరో నివేదిక హెచ్చరిస్తోంది. శ్రామికశక్తిలో నైపుణ్యాలను పెంచడం, తయారీరంగాన్ని అభివృద్ధిపరచడంతో పాటు మేక్ ఇన్ ఇండియా వంటి కార్యక్రమాలు ఆచరణలో ఎందుకు విఫలమైనాయన్నది సమీక్షించుకోవడం అవసరం. శ్రామికశక్తిలో దాదాపు సగం ఇంకా వ్యవసాయరంగంమీదే ఆధారపడి బతుకులీడ్వడం సరికాదు. డెమోగ్రాఫిక్ డివిడెండ్ గురించి ఉపన్యాసాలు ఇచ్చేముందు ఉన్న శక్తిని సద్వినియోగం చేసుకోవడం, మిగతారంగాలకు విస్తరించడం మీద దృష్టిపెట్టాలి. చదువున్నవారు, లేనివారు కూడా ఒకే దుస్థితిలో ఉన్నట్టు ఈ నివేదిక తేల్చింది. పదేళ్ళకాలంలో పాతికకోట్లమంది పేదలు పేదరికం నుంచి విముక్తిపొందారని పాలకులు పనిగట్టుకొని మరీ ప్రచారం చేసుకుంటారు. కానీ, ఉపాధికీ ప్రభుత్వానికీ సంబంధం లేదని కేంద్రప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు వాదిస్తారు. ఆర్థికంగా అతివేగంగా ఎదుగుతున్న అత్యధికజనాభా గల ఈ దేశం యువత ఎదుర్కొంటున్న సమస్యను విస్మరించడం ప్రమాదం. మరిన్ని ఉద్యోగాలు ఇవ్వండి, ఉపాధి కల్పించండి అంటూ పరిశ్రమల సంఘాలకు, సమాఖ్యలకు విజ్ఞప్తిచేయడంతో సరిపెట్టకుండా, నిరుద్యోగికతను నిర్మూలించే విషయంలో కలసికట్టుగా పనిచేయడం అవసరం.

పదేళ్ళుగా నరేంద్రమోదీ ప్రభుత్వం అమలు చేసిన పథకాలు పేదల బతుకులను మార్చివేశాయని, పేదరికంగా నుంచి బయటపడవేశాయని భారతీయ జనతాపార్టీ నాయకులు విస్తృతంగా ప్రచారం చేసుకుంటున్నారు. కానీ, ఆకలినుంచి ఆనందం వరకూ ప్రతీ విషయంలోనూ పరిస్థితులు దిగజారాయని, ఇరుగుపొరుగు చిన్నాచితకా దేశాలకంటే మనం దయనీయంగా ఉన్నామని ఇటువంటి నివేదికలు ఎప్పటికప్పుడు గుర్తుచేస్తూనే ఉన్నాయి.


నిరంకుశత్వం వైపు పరిగెడుతున్న ప్రజాస్వామ్యం

ప్రజాస్వామ్య ప్రభుత్వాల ఏర్పాటు దిశగా గణనీయమైన పురోగతి భారత ఉపఖండంలోనూ, సమీప తూర్పు దేశాల్లోనూ ఏనాడో ఆరంభమైంది. సమాజంలో 'స్వేచ్ఛ, ఆమోదయోగ్యత, సమానత్వం, సమగ్రత'ల ప్రాతిపదికగా, సనాతన భారతీయ ధర్మానికి అనుగుణంగా, పౌరులకు నాణ్యమైన, గౌరవప్రదమైన జీవనం లభించేలా పరిఢవిల్లిన మహత్తర ప్రజాస్వామ్య భావన భారతదేశం స్వంతం. భారతదేశంలోని సర్వతంత్ర స్వతంత్ర గణతంత్ర రాజ్యాల నాటి నుండే తొలినాటి ప్రజాస్వామ్య సంస్థల ఆవిర్భావం జరిగిందని చరిత్ర చెపుతున్నది. ప్రాచీన భారతావనిలోనే ప్రజాస్వామ్య రాష్ట్రాలు ఉద్భవించాయని గ్రీక్ చరిత్రకారుడు డియోడోరస్ సైతం ధ్రువీకరించాడు.

భారతదేశంతో సహా బ్రిటీష్ సామ్రాజ్య పరిధిలోని పలు దేశాలు బ్రిటీష్ పార్లమెంట్ విధానాన్ని స్వీకరించాయి. భారతదేశంలో స్వాతంత్ర్యానంతరం, 1950లో రాజ్యాంగం ఏర్పడినాక, సమాఖ్య విధాన పార్లమెంటరీ తరహా ప్రజాస్వామ్య ప్రభుత్వం ఏర్పాటు కావడంతో, ఆధునిక ప్రజాస్వామ్యం ప్రారంభమైంది. భారత మొదటి ప్రధానమంత్రి నెహ్రూ ప్రజాస్వామ్యానికి పటిష్టమైన పునాదులు వేసినప్పటికీ, అడపాదడపా అనేక అవాంతరాలను ఎదుర్కొంటూ నిలదొక్కుకుంది. 'ఆధునిక ప్రజాస్వామ్యానికి ఆద్యుడు'గా అమెరికా మాజీ అధ్యక్షుడు జార్జ్ వాషింగ్టన్‌ను పేర్కొంటారు. మరో మాజీ అధ్యక్షుడు అబ్రహం లింకన్ ప్రజాస్వామ్యాన్ని "ప్రజల చేత, ప్రజల కొరకు, ప్రజలే ఎన్నుకొనే ప్రభుత్వం"గా నిర్వచించాడు. ఆంగ్లేయ తత్త్వవేత్త, వ్యావహారిక సత్తావాదం స్థాపకుడు జాన్ లాక్‌ను కూడా 'ప్రజాస్వామ్య పితామహు'డని అంటారు.

ప్రజలచే పాలన అనే స్ఫూర్తికి కాని, పౌరులకు తాము కోరుకునే, తమ గొంతు వినే వ్యవస్థగా కాని ఆధునిక ప్రజాస్వామ్యం కట్టుబడిలేదనాలి. అప్పుడప్పుడో, ఒక క్రమపద్ధతిలోనో, న్యాయబద్ధంగానో అన్యాయబద్ధంగానో నిర్వహిస్తున్న ఎన్నికలు మాత్రమే ప్రజాస్వామ్యానికి నిదర్శనం, గీటురాయి అనే అపోహ కలుగుతున్నది. కఠోర వాస్తవం ఏమిటంటే, ప్రపంచం మొత్తం ప్రస్తుతం 'నిరంకుశత్వాలు, ప్రజాస్వామ్యాలు'గా విడిపోయింది. వాస్తవానికి మనం అనుకుంటున్న మెజారిటీ ప్రజాస్వామ్యాలు కూడా దాదాపుగా అర్ధ నిరంకుశాలే. ప్రజాస్వామ్యం భవిష్యత్తు విషయంలో అసంతృప్తి సర్వత్రా వ్యక్తమవుతున్నది.

పరిపక్వత చెందిన ప్రజాస్వామ్యంలో నాయకులు ప్రజల భాగస్వామ్యాన్ని, సలహాలను, సూచనలను స్వాగతిస్తారు, ప్రోత్సహిస్తారు. అభిప్రాయాలను వ్యక్తీకరించడానికి పుష్కలంగా అవకాశాలు కలిగించి, విభిన్న దృక్కోణాలకు విలువ ఇస్తారు. అలాంటి ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం పాత్ర తక్కువ నియంత్రణలు కలిగిందిగా, ప్రజలు నమ్మినదాన్ని, కోరుకున్న దాన్ని సులభతరంగా పొందడానికి సహకరించేదిగా ఉంటుంది. ప్రజలు తాము ఎంపికచేసుకున్న రాజకీయ పార్టీలోకాని, ఇతర సమూహాలలోకాని నిరభ్యంతరంగా చేరే అవకాశం ఉంటుంది. ప్రజాస్వామ్యం పరిపక్వత చెందక, నియంతృత్వ ధోరణులు ఉన్న చోట పార్టీ, ప్రభుత్వం, దేశంపై సంపూర్ణ నియంత్రణ చేసే ఒకే ఒక్క నాయకుడు వుంటాడు.



> కఠోర వాస్తవం ఏమిటంటే, ప్రపంచం మొత్తం ప్రస్తుతం 'నిరంకుశత్వాలు, ప్రజాస్వామ్యాలు'గా విడిపోయింది. మనం అనుకుంటున్న మెజారిటీ ప్రజాస్వామ్యాలు కూడా దాదాపుగా అర్ధ నిరంకుశాలే. ప్రజాస్వామ్యం భవిష్యత్తు విషయంలో అసంతృప్తి సర్వత్రా వ్యక్తమవుతున్నది.

'నిరంకుశ తరహా ప్రజాస్వామ్య నాయకత్వం', 'ప్రజాస్వామ్య నియంతృత్వం' అనే రెండు విచిత్ర ప్రజాస్వామ్య విధానాలు ఇటీవలికాలంలో ఆవిర్భవించి, పుంజుకుంటున్నాయి. ఈ రెండింటిలోనూ నిర్ణయాధికారాలన్నీ ఒకే ఒక్క వ్యక్తి (నాయకుడు) చేతుల్లో కేంద్రీకృతమై ఉంటున్నాయి. క్యాబినెట్ సహచరులతో సహా, పౌర సంఘాల, బ్యూరోక్రాట్ల, మేధావుల, వివిధ రంగాలకు చెందిన నిపుణుల సూచనలు కూడా ససేమిరా పట్టించుకోని పరిస్థితి ఉంటున్నది.

భారతదేశానికి సంబంధించినంత వరకు 'ప్రజాస్వామ్య నియంతృత్వం' ఇందిరాగాంధీ పాలనలో మొదలైందని చెప్పాలి. ప్రాంతీయపార్టీల ఆవిర్భావంతో, వ్యవస్థాపకుడి తిరుగులేని ఆధిపత్యం ప్రజాస్వామ్యానికి ఇబ్బందికరంగా మారిందనవచ్చేమో!

స్వాతంత్ర్యానంతర భారతావనిలో రాజకీయ పార్టీల నిర్ణయాధికారం ఒక అద్భుతమైన 'టీం వర్క్'లాగా ఉండేది. కాంగ్రెస్ పార్టీ 'పార్లమెంటరీ బోర్డ్' కానీ, కమ్యూనిస్ట్ పార్టీ 'పోలిట్ బ్యూరో' కానీ, అలాంటి ఏర్పాటే ఉన్న జనసంఘ్ లేదా దాని రూపాంతరమైన భారతీయ జనతా పార్టీ కాని, 'ఏకాభిప్రాయం' ఆధారంగా నిర్ణయాలు తీసుకునేవి. క్రమేపీ 'ఏకాభిప్రాయం' అర్థమే మారిపోయి, 'ఏక వ్యక్తి అభిప్రాయం'గా, ఏకస్వామ్యంగా మారింది.

ఒకానొక కాలంలో ఏ రాజకీయ పార్టీలోనైనా అంచెలంచెలుగా నిచ్చెన మెట్లు ఎక్కాలంటే పార్టీ ప్రాథమిక సభ్యత్వం తప్పనిసరి. అదిప్పుడు పూర్తిగా గత చరిత్ర. అలాగే సర్పంచ్ స్థాయి నుంచి కేంద్రమంత్రి స్థాయికి ఎదిగేవారు. ఇక ఇప్పుడు అన్నీ సత్వరమార్గాలే! చిలక్కొయ్యకు తగిలించిన చొక్కాలు మార్చినంత సులభం. మరీ చెప్పాలంటే, రసాయన శాస్త్రంలోని 'సబ్లిమేషన్' ప్రక్రియలో ఒక పదార్థం నేరుగా ఘనస్థితి నుండి మధ్యస్థ ద్రవస్థితి దాటవేసి, వాయుస్థితికి మారడంలాగా. చాలామందిలో రాజకీయ భావజాలం కాని, నిబద్ధత కాని అసలే లేవు. ఒక హార్డ్‌కోర్ కమ్యూనిస్ట్ పార్టీ వ్యక్తి, లేదా నిబద్ధతగల ఒక సెక్యులర్ పార్టీ సభ్యుడు, రాత్రికి రాత్రే సభ్యత్వంతో సంబంధం లేకుండా, మతతత్త్వ పార్టీ పక్షాన ఎన్నికల బరిలో దిగుతున్నారు. అలాగే ఇటు నుండి అటు మారుతున్నారు. అలా మారినవారికి వెంటనే పార్టీ టికెట్ ఇవ్వకూడదన్న నిబంధన పెట్టే ధైర్యం ఎన్నికల కమీషన్కు ఏమాత్రం లేదు. పలుకుబడి కలవారికి, సంపన్నులకు, పార్టీ సభ్యత్వం తీసుకుని, కొంతకాలం వేచి వుండి, ఆ తరువాతే ఎన్నికలలో పోటీ చేయాల్సిన అవసరం లేనే లేదు. దీన్నే ఆంగ్లంలో 'లీప్ ఫ్రాగింగ్' అంటారు. రాజకీయ పార్టీగా నమోదు చేసుకుంటున్నప్పుడు ఉన్నతమైన ఆదర్శాలను వల్లించని రాజకీయపార్టీ వుండదు. ఆచరణలో మాత్రం శూన్యం.

ఈ నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగానూ, భారతదేశంలోనూ, కొన్ని రాష్ట్రాలలోనూ చోటుచేసుకుంటున్న కొన్ని సంఘటనల అంతరార్థాలను నిశితంగా అవగతం చేసుకున్న వారిని ఆందోళనకు కలుగుతున్నది. కాంగ్రెస్ పార్టీ హిందు సమాజాన్ని అణచి వేసేందుకు వక్రీకరించిన రాజ్యాంగాన్ని మార్చాలంటే తమ పార్టీకి 400 లోక్‌సభ స్థానాలు అవసరమౌతాయని కర్నాటక బీజేపీ ఎంపీ అనంత్ కుమార్ హెగ్డే చేసిన వ్యాఖ్యలు జుగుప్సాకరంగా ఉన్నాయి. బీజేపీ అధినాయకత్వం ఆ వ్యాఖ్యలను ఖండించినప్పటికీ, కాంగ్రెస్ పార్టీ నాయకుడు చిదంబరం ఆ మాటలు 'పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి ముగింపు'గా ముద్రవేశారు.

డాక్టర్ ఎన్. భాస్కర రావు అనే ఒక సామాజిక పరిశోధనా మార్గదర్శి 'రెజువెనేటింగ్ ద రిపబ్లిక్' అనే తన ఆంగ్ల పుస్తకంలో ప్రజాస్వామ్యంపై వ్యాఖ్యానిస్తూ– చాలామంది భారతీయులకు, అందునా యువతకి, స్వాతంత్ర్య సౌధం ఎంతమంది త్యాగాల పునాది మీద నిర్మించబడిందో అవగాహన లేదంటారు. వారికి స్వాతంత్ర్యం, గణతంత్రం, రాజ్యాంగం లాంటివాటి ద్వారా ప్రయోజనాలు పొందడం మాత్రమే కావాలని చెబుతారు. నిజానికి ఇన్ని దశాబ్దాల కాలంలో దేశ గణతంత్ర పరిస్థితి ఒకేలా స్థిరంగా లేదని, మొదటి 25 సంవత్సరాలు ఒకే ఒక పార్టీ పెత్తనం నడిచిందని, తరువాతి 25 యేళ్లలో సంకీర్ణ ప్రభుత్వాలు నడిచాయని, ప్రస్తుతం ఒకే నాయకుడు, ఒకే పార్టీ అన్న లక్షణాలు ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయని చెబుతారు. ఇదే పంథా మరొక 25 యేళ్లు సాగుతుందా అన్నది ప్రజల ఊహాగానాలకే వదిలేద్దామంటారు.

ఏటా ప్రపంచ దేశాలలో ప్రజాస్వామ్య పరిస్థితుల మీద నివేదిక విడుదల చేసే 'వెరైటీస్ ఆఫ్ డెమోక్రసీస్' అనే సంస్థ తన నివేదికలో నియంతృత్వం పరంగా ప్రపంచ దేశాలలో భారత్ 'విశ్వగురు' స్థానంలో ఉందని పేర్కొంది. ఎన్నికలు జరిగే నియంతృత్వ దేశం స్థాయికి భారత దేశం పడిపోయిందని వెల్లడించింది. భారత్ అసలు ప్రజాస్వామ్య దేశంగానే లేదని తీర్మానించింది. అలాగే, మూడింట రెండువంతులకు పైగా భారతీయులు దేశంలో 'నిరంకుశ' లేదా 'సైనిక' పాలనకు మద్దతు ఇస్తున్నట్లు 'ప్యూ రీసర్చ్ సెంటర్' నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. ఇలాంటి కథనాలు భారత దేశంలో ప్రజాస్వామ్య పరిస్థితిపై ఆందోళన కలిగిస్తున్నాయి.

• వనం జ్వాలానరసింహారావు

అప్పలసూరి చరిత్ర కోసం

మామిడి అప్పలసూరి జీవితచరిత్ర ఈపాటికే గ్రంథస్థం కావలసింది. సూరి జీవితచరిత్ర అంటే ఓ విధంగా అది సామాజికచరిత్ర. సామాజిక సంఘర్షణ చరిత్ర. మరీ ముఖ్యంగా శ్రీకాకుళ రైతాంగ పోరాట చరిత్ర! దురదృష్టవశాత్తూ చరిత్ర సృష్టించిన వాళ్ళెవరూ చరిత్రను రాయలేరు (ఎక్కడో కొద్దిమంది తప్ప). భారతదేశ రాజకీయాలను పార్లమెంటరీయేతర సాయుధ రాజకీయబాటకు మలుపు తిప్పిన శ్రీకాకుళ రైతాంగ పోరాటం చారిత్రాత్మకమైనది. కానీ ఆ పోరాటాన్ని చేసినవారెవరూ ఆ చరిత్రను రాయలేరు. అధికశాతం ఆదివాసీలు, దళితులు కావటం, రైతాంగం కావటం... కొన్నికారణాలు. ఆ పోరాటంలోకి దూకిన ఉపాధ్యాయులు, వైద్యులు, ఉద్యోగులు, మేధావులు, నాయకులూ కూడా రాయలేకపోయారు, పోరాటంలో మునిగి తేలటాన, కొందరు అమరులవటాన! ఆ పోరాటానికి అయిదు దశాబ్దాల తర్వాత కూడా ఆ పోరాట చరిత్ర రావలసినంత సమగ్రంగా రానేలేదు. 1997 మార్చి 21న అమరులైన మామిడి అప్పలసూరి జీవిత చరిత్ర ఎప్పుడో రావలసీ, రాకపోవడంలో ఇదిగో ఇన్నిన్ని కారణాలున్నవి.

కోమర్తిలో ఆరంభించిన వ్యవసాయకార్మిక సంఘం (1956?) నుండీ వ్యవసాయక విప్లవం (దున్నేవానికే భూమి కీలక నినాదంగా సాగిన విప్లవోద్యమం) దాకా అప్పలసూరి కీలకపాత్ర పోషించేరు. సాయుధబాటను సమర్థించారు. తరువాత సవరణ జరగాలన్నారు. సాయుధబాట కాలంలో పోలీసు కస్టడీల నుంచీ, చెరసాల నుంచీ పరారై ఉద్యమాలు నిర్మించారు. ఎనభైల తర్వాత మైదాన ప్రాంత ప్రజా ఉద్యమాలు నిర్మాణం చేశారు. ఇలా ఎన్నెన్నో సంఘటనలు అప్పలసూరి జీవనయానంలో జరిగాయి.

అప్పలసూరి జీవించి ఉండగా వివరాలు సేకరించకపోవటం, అప్పలసూరి సహచరులు జీవించి ఉండగా కూడా సేకరించకపోవటం, కొద్దిమంది (తేజేశ్వరరావు లాంటి వారు) జీవించివుండినా జ్ఞాపకశక్తి సన్నగిల్లటంతో అసమగ్ర సమాచారమే దొరుకుతోంది. దుప్పల గోవిందరావు, చౌదరి సంపూర్ణమ్మ, డా. బి.శివరామిరెడ్డి, భూపాల్‌రెడ్డి వంటి కొందరు కొన్ని ముఖ్యమైన ఘటనలను, వారి జ్ఞాపకాలమేర అందించేరు. అప్పలసూరి రాసిన డైరీలలో కొంత, పార్వతీపురం కుట్రకేసు ఛార్జిషీట్లల్లో కొంత, ఇంకా చెరుకూరి సత్యనారాయణ 'సూర్యోదయం కుట్ర కాదు' పుస్తకం, డా. బి.శివరామిరెడ్డి 'మహత్తర శ్రీకాకుళ పోరాటం' పుస్తకాల నుంచి మరికొన్ని ఆధారాలతో సాధ్యమైనంత విషయసేకరణ జరుగుతోంది. వీటన్నిటితో 'మండేటి సూరీడు... మామిడి అప్పలసూరి' పుస్తకాన్ని తీసుకు రానున్నాం.



1980లో అప్పలసూరి జైలు నుంచి విడుదలై వచ్చిన తర్వాత మైదాన ప్రాంతంలో– ముఖ్యంగా అటు బొబ్బిలి, పార్వతీపురం తాలూకాలలో, ఇటు నరసన్నపేట, శ్రీకాకుళం తాలూకాలలో– ఉద్యమాలు నిర్మించారు. తనదైన రాజకీయ పంథాలో సీవోసీలో కొనసాగుతూ రైతాంగ పేదల సమితి సంస్థ ద్వారా వ్యవసాయ రంగ పేదలను, ప్రగతిశీల కార్మిక సంఘం సంస్థ ద్వారా కార్మికులను కదలించి మిలిటెంట్ పోరాటాలు నడిపేరు. సాంస్కృతిక రంగంలో కూడా జనకళామండలి నిర్మాణంతో ప్రజలను చైతన్యపరిచేరు. దాదాపు రెండు దశాబ్దాలకు పైగా సాగిన ఆ ఉద్యమాలూ, వాటి వెనక అప్పలసూరి కృషీ చెప్పగలిగే వారుండినా ఎందరిని సంప్రదించగలమో, వారెంత వివరించగలరో చూడాలి.


నిజానికి మామిడి అప్పలసూరిపై ఈ పుస్తకాన్ని మార్చి 21 అప్పలసూరి వర్ధంతి నాటికే తేవాలనుకున్నాం గానీ విషయసేకరణ తగిన సమయంలో జరగలేదు. అంచేత కవర్ పేజీ మాత్రమే కోమర్తి అమరవీరుల స్తూపం వద్ద ఆవిష్కరించేం. ఈ ఏడాది మే 4 న మామిడి అప్పలసూరి సహచరి మామిడి లచ్చమ్మ వర్ధంతి రోజుకు పుస్తకాన్ని తేదలిచాం. ఈలోగా అప్పలసూరికి సంబంధించిన ఏ అనుభవమైనా, ఏ విశేషమైనా మీ దగ్గర ఉంటే మాకు అందించి, అప్పలసూరి చరిత్రను సమగ్రం చేయడానికి సహకరించ కోరుతున్నాం. ఆ వివరాలను 94400 31961 ఫోన్ నెంబరుకు వాట్సాప్ చేయగలరు.

• అట్టాడ అప్పల్నాయుడు
(కోమర్తి అమరవీరుల స్మారక కమిటీ తరఫున)

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా

ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్,
హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్,
హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

చైతన్య స్ఫూర్తి స్మరణానంద



లోక్‌సభ ఎన్నికల పండుగ హడావిడి సమయాన ఓ వార్త మనసులో కొన్ని క్షణాల పాటు అలజడిని సృష్టించింది. భారతదేశ ఆధ్యాత్మిక స్పృహలో అగ్రగణ్యుడైన శ్రీమత్ స్వామి స్మరణానంద జీ మహారాజ్ శివైక్యం చెందడం వ్యక్తిగత నష్టం లాంటిది. కొన్ని సంవత్సరాల క్రితం, స్వామి ఆత్మస్థానంద జీ మహా మరణం, ఇప్పుడు స్వామి స్మరణానంద జీ శాశ్వతంగా నిష్క్రమించడం చాలా మందిని విషాదంలోకి నెట్టింది. కోట్లాది మంది భక్తులు, సాధువులు, రామకృష్ణ మఠం, మిషన్ అనుచరుల మాదిరిగానే నా హృదయం కూడా బాధగా ఉంది.

ఈనెల ప్రారంభంలో బెంగాల్ పర్యటనకు వెళ్లినప్పుడు, స్వామి స్మరణానంద ఆరోగ్యం గురించి తెలుసుకునేందుకు ఆస్పత్రికి వెళ్లాను. స్వామి ఆత్మస్థానంద మాదిరిగానే, ఆచార్య రామకృష్ణ పరమహంస, మాతా శారద మరియు స్వామి వివేకానంద ఆలోచనల ప్రపంచవ్యాప్తవ్యాప్తికి స్వామి స్మరణానంద తన జీవితాన్ని అంకితం చేశారు. ఈ వ్యాసం రాస్తున్నప్పుడు ఆయనతో జరిపిన సమావేశాలు, ఆయనతో నా సంభాషణలు, ఆ జ్ఞాపకాలు నా మదిలో సజీవంగా ఉన్నాయి.

2020 జనవరిలో బేలూరు మఠంలో ఉన్న సమయంలో స్వామి వివేకానంద గదిలో కూర్చొని ధ్యానం చేశాను. ఆ పర్యటనలో నేను స్వామి స్మరణానందతో ఆత్మస్థానందజీ గురించి చాలాసేపు మాట్లాడాను. రామకృష్ణ మిషన్‌తో, బేలూరు మఠంతో నాకు ఎంత సన్నిహిత సంబంధం ఉందో మీకు తెలుసు. ఒక ఆధ్యాత్మిక సాధకుడిగా, గత ఐదు దశాబ్దాలుగా, నేను పలువురు సాధువులను, మహాత్ములను కలిశాను, అనేక ప్రదేశాలకు వెళ్ళాను. రామకృష్ణ మఠంలో కూడా ఆధ్యాత్మికతకు తమ జీవితాలను అంకితం చేసిన సాధువులతో నాకు పరిచయం ఏర్పడింది. వారిలో స్వామి ఆత్మస్థానందజీ, స్వామి స్మరణానంద జీ వంటి ప్రముఖులు ఉన్నారు. జీవితంలో అత్యంత ముఖ్యమైన కాలంలో, అటువంటి సాధువులు నాకు ప్రజా సేవయే దేవునిసేవ అనే నిజమైన సూత్రాన్ని బోధించారు. 'ఆత్మనో మోక్షార్థ జగద్ధితాయ చ' అనే రామకృష్ణ మిషన్ సిద్ధాంతానికి స్వామి ఆత్మస్థానానంద జీ, స్వామి స్మరణానంద జీ జీవితాలు చెరగని ఉదాహరణ.

విద్యాభివృద్ధికి, గ్రామీణాభివృద్ధికి రామకృష్ణ మిషన్ చేస్తున్న కృషి మనందరికీ స్ఫూర్తిదాయకం. భారతదేశ ఆధ్యాత్మిక స్పృహ, విద్యా సాధికారత, మానవతా సేవ సంకల్పానికి రామకృష్ణ మిషన్ కృషి చేస్తోంది. 1978లో బెంగాల్ ను వరదలు ముంచెత్తినప్పుడు రామకృష్ణ మిషన్ తన నిస్వార్థ సేవతో అందరి హృదయాలను గెలుచుకుంది. 2001లో కచ్ భూకంపం వచ్చినప్పుడు విపత్తు నిర్వహణకు రామకృష్ణ మిషన్ అన్ని విధాలుగా సహాయం చేయడానికి సిద్ధంగా ఉందని నాకు ఫోన్ చేసి చెప్పిన మొదటి వ్యక్తుల్లో స్వామి ఆత్మస్థానంద ఒకరు. ఆయన సూచనల మేరకు రామకృష్ణ మిషన్ భూకంప విపత్కర సమయంలో ప్రజలకు ఎంతో సాయం చేసింది.

కొన్నేళ్లుగా స్వామి ఆత్మస్థానానంద జీ మరియు స్వామి స్మరణానంద జీ వివిధ పదవుల్లో ఉంటూ సామాజిక సాధికారతకు పెద్దపీట వేశారు. ఆధునిక విద్య నైపుణ్యం, మహిళా సాధికారత పట్ల ఇలాంటి మహానుభావులు ఎంత అంకితభావంతో ఉండేవారో ఈ మహానుభావుల జీవితాలు తెలిసిన వారికి తప్పకుండా గుర్తుండే ఉంటుంది. స్వామి ఆత్మస్థానందజీ మహోన్నత వ్యక్తిత్వంలోని ప్రత్యేకత నన్ను బాగా ఆకట్టుకుంది ప్రతి సంస్కృతి, ప్రతి సంప్రదాయం పట్ల ఆయనకున్న గౌరవం, ప్రేమ దీనికి కారణం, అతను భారతదేశంలోని వివిధ ప్రాంతాలలో చాలా కాలం గడిపాడు, నిరంతరం ప్రయాణించేవాడు. గుజరాత్‌లో ఉంటూ గుజరాతీ మాట్లాడటం నేర్చుకున్నాడు. నాతో కూడా ఆయన గుజరాతీలోనే మాట్లాడేవారు. భారతదేశ అభివృద్ధి ప్రయాణంలో అనేక దశలలో, మన మాతృభూమిని స్వామి ఆత్మస్థానంద, స్వామి స్మరణానంద వంటి ఎందరో సాధువులు ఆశీర్వదించారు. సమాజ శ్రేయస్సు కోసం కలసికట్టుగా పనిచేయాలని ఈ సాధువులు మనకు దీక్షను అందించారు. రాబోయే కాలంలో ఈ ఆలోచనలు అభివృద్ధి చెందిన భారతదేశానికి, అమృత్ కాలానికి సంకల్పశక్తిగా మారతాయి. అలాంటి మహనీయులకు యావత్ దేశం తరఫున మరోసారి నివాళులర్పిస్తున్నాను. రామకృష్ణ మిషన్‌తో సంబంధం ఉన్న వారంతా ఆయన చూపిన మార్గాన్ని మరింత ముందుకు తీసుకెళ్తారనే నమ్మకముంది.

ఓం శాంతి



• నరేంద్ర మోదీ
భారత ప్రధానమంత్రి

మన ఆత్మగౌరవ ప్రతీకకు 'భారతరత్న' ఇంకెన్నడు?

తెలుగుదేశం పార్టీని ప్రకటించిన సందర్భంలో నందమూరి తారకరామారావు "ఈ పార్టీ పేదవాడి ఆకలిమంటల్లోంచి పుట్టింది" అని చెప్పినప్పుడు అందరూ ఆశ్చర్యపోయారు. అప్పటి వరకూ ఏ రాజకీయ నాయకుడూ ఉపయోగించని పదజాలం అది. ఆ సమయంలోనే ఓ విలేకరి "మీ సిద్ధాంతం ఏమిటి రామారావు గారూ?" అని ప్రశ్నించినపుడు ఎన్టీఆర్ నోటి వెంట సమాధానం బుల్లెట్‌లా వెలువడింది: "గ్రంథాలయాల్లో దుమ్ము పేరుకుపోయిన పుస్తకాల్లో మీకు మా సిద్ధాంతం కన్పించదు. మీ వీధిలో ఉన్న పేదవాడి ఆకలి చూపులలో మాత్రమే అది మీకు దర్శనమిస్తుంది" అంటూ ఆవేశంతో చెప్పారు. ఆ తర్వాత తెలుగుదేశం పార్టీ ప్రకటించిన ఎన్నికల ప్రణాళికలో, "పేదవాడికి పట్టెడన్నం పెట్టడం, నిలువనీడ కల్పించడం, ఒంటి నిండా బట్ట కప్పుకొని ఆత్మగౌరవంతో జీవించే పరిస్థితి కల్పించడం" తొలి ప్రాధాన్యతాంశంగా పేర్కొన్నారు. 1983లో అధికారంలోకి రాగానే కిలో రూ.2లకు 25 కిలోల బియ్యం పథకం, పక్కా గృహ నిర్మాణం, సగం ధరకే జనతా వస్త్రాలు వంటి పథకాలు అమలు చేశారు.

సబ్సిడీ బియ్యం పథకం ప్రభుత్వ ఖజానాకు భారం అవుతుందని కొందరు అధికారులు చెప్పినపుడు "పేదవాడికి ఇంత నైవేద్యం పెట్టలేని ప్రభుత్వం దేనికండి?" అంటూ ఎన్టీఆర్ వారి మీద ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆవిర్భావం నుంచి తెలుగుదేశం పార్టీని స్పష్టమైన సిద్ధాంతాలతో, విధానాలతో, ఉన్నత రాజకీయ విలువలతో నడిపిన ఎన్టీఆర్ ఎన్నడూ వాటి నుండి దూరంగా జరగలేదు, ఎప్పుడూ రాజీపడలేదు. పరిపాలనలో సామాజిక న్యాయం, సంస్కరణలకు పెద్దపీట వేసి సంక్షేమాన్ని, అభివృద్ధిని సమతుల్యం చేశారు. సామాన్యులు, రైతులు, మహిళలు బడుగు బలహీన వర్గాల సాధికారత కోసం ఎన్టీఆర్ చేసిన కృషి, కల్పించిన రాజకీయ భాగస్వామ్యం, ప్రవేశపెట్టిన పథకాలు ఆనాడు దేశానికే దిక్సూచిగా నిలిచాయి.

కారణాలు ఏవైనా ఆనాడు దేశంలోని ప్రాంతీయ పార్టీలంటేనే సంకుచిత భావాలు కలిగి ప్రాంతీయతత్వాన్ని రేపుతాయనే అపప్రథ బలంగా నాటుకొని ఉండేది. తెలుగుదేశం పార్టీని సైతం అదేగాటన కట్టాలని కొందరు చూశారు. ముఖ్యమంత్రిగా పదవీ స్వీకారం చేసిన అనంతరం తొలిసారిగా దేశ రాజధాని ఢిల్లీ వెళ్లి అక్కడ ఏర్పాటుచేసిన 'మీట్ ది ప్రెస్'లో పాల్గొన్నప్పుడు ఎన్టీఆర్‌ను ఓ విలేకరి "మీరు ప్రాంతీయవాది కదా? కేంద్రంతో కలిసి పనిచేయడం ఇబ్బంది కాదా?" అని అడిగాడు. దానికి సమాధానంగా ఎన్టీఆర్ "నేను మొదట భారతీయుణ్ణి. తర్వాతే తెలుగువాణ్ణి. అయినా రాష్ట్రాలు బలంగా ఉండాలని కోరుకోవడం ప్రాంతీయవాదం కాదు. రాష్ట్రాలు బలంగా ఉంటేనే కేంద్రం బలంగా ఉండగలుగుతుంది" అని పేర్కొన్నారు.

ఎన్టీఆర్ అనగానే తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీక అని అందరూ అంటారు. నిజానికి ఎన్టీఆర్ తెలుగువారి ఆత్మగౌరవమే కాదు దేశంలోని రాష్ట్రాల ఆత్మగౌరవాన్ని సైతం నిలబెట్టారంటే అతిశయోక్తి కాదు. రాష్ట్రాల యూనియన్ అయిన భారతదేశంలో సమాఖ్య విధానం సంపూర్ణంగా అమలై వికేంద్రీకరణ జరగడం కోసం ఎన్టీఆర్ చేసిన కృషి అసామాన్యం, అద్వితీయం. పేరుకే పెదరలిజం కాకుండా రాష్ట్రాలు ఆత్మగౌరవంతో మనుగడ సాగించేలా కేంద్రం సహకరించాలని, అందుకొరకు రాష్ట్రాలకు మరిన్ని అధికారాలు ఇచ్చితీరాల్సిందేనని నాటి కేంద్ర ప్రభుత్వంపై ఎన్టీఆర్ ఒత్తిడి పెంచారు. రాష్ట్రాల హక్కుల సాధన కోసం ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులను ఒక వేదికపైకి తెచ్చి కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కేంద్రీకృత విధానాలను ఎండగట్టారు. ఎన్టీఆర్ చొరవతో కేంద్ర–రాష్ట్ర సంబంధాల మీద ఏర్పాటయిన 'సర్కారియా కమిషన్'కు అనేక విజ్ఞప్తులు పంపి రాష్ట్రాలకు మరిన్ని నిధులు, అధికారాలు అందించేందుకు అవసరమైన సూచనలు చేయాలని కోరారు. ప్రాంతీయ ప్రయోజనాలు, ప్రజల ఆకాంక్షలు నెరవేరాలంటే లోక్‌సభలో ప్రాంతీయ పార్టీలు ఎక్కువ ప్రాతినిధ్యం పొందడానికి కృషి చేయాలని, అందుకు కాంగ్రేసేతర పక్షాల మధ్య ఐక్యత సాధించాలని చెప్పేవారు. జాతీయ స్థాయిలో కాంగ్రేసేతర పార్టీలన్నింటినీ ఒక వేదిక మీదకు తీసుకురావడానికి ముందుగా ఆ ప్రయోగాన్ని ఆంధ్రప్రదేశ్‌లోనే ఆచరించి అందరినీ ఆశ్చర్యపరిచారు. 1984లో జరిగిన లోక్‌సభ ఎన్నికలలో ఒక పక్క సీపీఐ, సీపీఎంలతో, మరోపక్క బీజేపీ, జనతా పార్టీలతో పొత్తు కుదుర్చుకొని రాష్ట్రంలోని 42 లోక్‌సభ స్థానాల్లో 35 స్థానాలను గెలుచుకొని లోక్‌సభలో అతి పెద్ద పార్టీగా తెలుగుదేశంను నిలిపి దేశం దృష్టిని తన వైపు తిప్పుకోగలిగారు.

> ఆవిర్భావం నుంచి తెలుగుదేశం పార్టీని స్పష్టమైన సిద్ధాంతాలతో, విధానాలతో, ఉన్నత రాజకీయ విలువలతో నడిపిన ఎన్టీఆర్ ఎన్నడూ వాటి నుండి దూరంగా జరగలేదు, ఎప్పుడూ రాజీపడలేదు. రాష్ట్రానికి, దేశానికి ఎన్టీఆర్ చేసిన సేవల్ని పరిగణనలోకి తీసుకొన్నప్పుడు, అనితర సాధ్యమైన ఆయన నట జీవితాన్ని లెక్కలోకి తీసుకొన్నప్పుడు ఎన్టీఆర్‌కు 'భారతరత్న' లభించాలని కోరుకోవడం అత్యాశ కాబోదు.




1984 ఆగస్ట్‌లో గవర్నర్ రామ్‌లాల్, నాదెండ్ల భాస్కరరావు, కేంద్రంలోని ఇందిరా గాంధీ ప్రభుత్వం కుమ్మక్కై తనను పదవీచ్యుతుడిని చేశాక నెల రోజులపాటు ఎన్టీఆర్ చేసిన ప్రజాస్వామ్య పోరాటం స్వాతంత్ర్యానంతర దేశ రాజకీయ చరిత్రలో ఓ ఉజ్వల ఘట్టంగా మిగిలిపోతుంది. తిరిగి అధికారంలోకి వచ్చాక, ఎన్టీఆర్ కేంద్ర ప్రభుత్వ నియంతృత్వ విధానాలపైన తన పోరాటాన్ని మరింత ఉధృతం చేశారు. రాష్ట్రపతి పాలన విధించేందుకు ఉద్దేశించిన రాజ్యాంగంలోని ఆర్టికల్ 356ను తొలగించాలని డిమాండ్ చేయడంతోపాటు రాష్ట్ర చట్టాలను కేంద్రం వీటో చేసేందుకు అధికారం కల్పించే ఆర్టికల్ 200, 201లను సవరించాలని ఎన్టీఆర్ చేసిన ప్రతిపాదన ఆనాడు దేశంలో ఓ సంచలనం. అలాగే, అంబేడ్కర్ రాజ్యాంగ స్ఫూర్తి అమలు జరగాలంటే వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, విద్య, ప్రజారోగ్యం, సాంఘిక సంక్షేమం వంటి కార్యక్రమాలను రాష్ట్రాలే నిర్వహించుకొనే అవకాశం కల్పించాలని, బాధ్యతలకు తగినట్టుగా నిధుల సేకరణకు, పన్ను అధికారాలను హేతుబద్ధంగా కేంద్రం–రాష్ట్రాల మధ్య విభజించాలని కోరారు.

కేంద్ర జాబితాలో ఉన్న ఎక్సయిజ్, ఇన్‌కంటాక్స్, కస్టమ్స్ డ్యూటీ మొదలయిన ఆదాయాల్లో రాష్ట్రాలకు సముచిత వాటాలు ఇవ్వాలంటూ ఎన్టీఆర్ చేసిన ప్రతిపాదనలు జాతీయ స్థాయిలో పెద్ద ఎత్తున చర్చకు దారితీశాయి. దాని ఫలితంగానే ఆనాడు 9, 10వ ఫైనాన్స్ కమిషన్లు రాష్ట్రాల వాదనలను పరిగణనలోకి తీసుకొని రాష్ట్రాలకు పన్నుల్లో ఎక్కువ వాటా ఇవ్వాలని సిఫార్సు చేశాయి. అంతేకాదు, మార్కెట్ రుణాల్లో రాష్ట్రాల వాటా పెంచాలని, రాష్ట్ర స్థాయి ప్రభుత్వరంగ సంస్థలు కూడా బాండ్ల ద్వారా వనరులు సేకరించేందుకు కేంద్రం అనుమతి ఇవ్వాలని ఎన్టీఆర్ కేంద్రంపై ఒత్తిడి చేశారు. చట్టబద్ధ వనరుల వాటాలో కేంద్రం అనుసరించే ద్వంద్వ వైఖరిని ఉపేక్షించబోమంటూ రాష్ట్రాల తరఫున ఎన్టీఆర్ చేసిన హెచ్చరిక నాడు దేశంలోని కాంగ్రేసేతర ప్రభుత్వాలకు సైతం కళ్లు తెరిపించినట్లయింది. అప్పటివరకు కేంద్రం ఎంతిస్తే అంత తీసుకొనే విధానమే అమలయ్యేది. దానిని ఎన్టీఆర్ వ్యతిరేకించిన తర్వాత కేంద్రం–రాష్ట్రాల మధ్య సంబంధాలలో గుణాత్మకమైన మార్పులు చోటుచేసుకున్నాయి. మరో విధంగా చెప్పాలంటే కేంద్రాన్ని యాచించే స్థాయి నుంచి ఆత్మగౌరవంతో తమ హక్కుల సాధన కోసం రాష్ట్రాలు పోరాడే స్థాయికి చేరుకొన్నాయి. ఎన్టీఆర్ హయాంలో చరిత్రను తిరగరాసిన ఇటువంటి విప్లవాత్మక సంఘటనలు ఎన్నో ఉన్నాయి.

42 సంవత్సరాల తెలుగుదేశం పార్టీ చరిత్రలో ఎన్టీఆర్‌ది ఓ ఉజ్వల అధ్యాయం. అయితే, ఓ సందర్భంలో ఎన్టీఆర్ "నాతో పుట్టిన పార్టీ నాతోనే పోతుందేమో" అని నిర్వేదంగా అన్నారు. నిజానికి 1995 ఆగస్ట్‌లో నారా చంద్రబాబునాయుడు ఎన్టీఆర్ నుంచి తెలుగుదేశం పార్టీ పగ్గాలను తీసుకోకపోయి ఉంటే ఆ తర్వాత ఏం జరిగేదో కానీ, సకాలంలో సరియైన నిర్ణయం తీసుకొని తెలుగుదేశం పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసి తన విలక్షణ నాయకత్వంతో, పరిపాలనా సామర్థ్యంతో ఎన్టీఆర్ ఆశయాలను మరింత ముందుకు తీసుకువెళ్లడంలో ఆయన విజయం సాధించారు. ఇందుకు అనేక ఉదాహరణలు కళ్లముందు కనిపిస్తాయి. తన రాజకీయ ప్రత్యర్థులు సృష్టించిన ఎన్నో అవరోధాలను, ఇబ్బందులను దాటుకొంటూ ఓ బలీయమైన రాజకీయ శక్తిగా తెలుగుదేశం పార్టీని మలిచి ప్రజల ఆదరాభిమానాలను చూరగొని తొమ్మిదేళ్లపాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు; ఐదేళ్లపాటు విభజిత ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా పనిచేసిన నారా చంద్రబాబునాయుడు ఎన్టీఆర్ స్ఫూర్తితో రానున్న ఎన్నికలలో విజయం సాధించే దిశగా కృషి చేయడం కనిపిస్తోంది.

ఈ నేపథ్యంలోనే, క్రిందటేడాది 'శత జయంతి' సంవత్సరాన్ని జరుపుకొన్న ఎన్టీఆర్‌కు కేంద్ర ప్రభుత్వం 'భారత రత్న' ప్రకటిస్తుందని చాలామంది భావించారు. రాష్ట్రానికి, దేశానికి ఎన్టీఆర్ చేసిన సేవల్ని పరిగణనలోకి తీసుకొన్నప్పుడు, అనితర సాధ్యమైన ఆయన నట జీవితాన్ని లెక్కలోకి తీసుకొన్నప్పుడు ఎన్టీఆర్‌కు 'భారతరత్న' లభించాలని కోరుకోవడం అత్యాశ కాబోదు. ఎన్టీఆర్‌కు 'భారతరత్న' ఇంకెప్పుడు అనే ప్రశ్న ప్రతి తెలుగువాడి మదిలో మెదులుతూనే ఉంది. అన్నట్టు దేశ రాజకీయాల్లోనే చిన్న అవినీతి మరక కూడా అంటని ఏకైక రాజకీయ నాయకుడు ఒక్క ఎన్టీఆరే!

• విక్రమ్ పూల
సీనియర్ జర్నలిస్ట్
(నేడు తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం)



ఎన్నికల కోడ్ వచ్చినా విజయవాడ నగర పోలీసుల తీరు మారడం లేదు. చాలామంది పోలీసు సిబ్బంది ఇంకా అధికార పార్టీ నాయకుల సేవలో తరిస్తున్నారు. వైసీపీ నాయకుల వల్ల ఇబ్బంది పడిన బాధితులు చేసిన ఫిర్యాదులను బుట్టదాఖలు చేస్తున్నారు. నాయకుల మాటే వేదంగా వి ధులు నిర్వహిస్తున్నారు. ప్రతి ఆదివారం కౌన్సెలింగ్‌కు హాజరుకావాల్సిన రౌడీషీటర్లు డుమ్మా కొట్టి అధికార పార్టీ నేతల ప్రచారంలో పాల్గొంటున్నా కళ్లప్పగించి చూడటం తప్ప పోలీసులు ఏం చేయలేని పరిస్థితి ఏర్పడింది. ఎన్నికల సందర్భంగా ఇతర జిల్లాల నుంచి నగరానికి వచ్చిన సీఐలు సైతం అధికార పార్టీకి వత్తాసు పలుకుతుండటం గమనార్హం. - విజయవాడ, ఆంధ్రజ్యోతి

గుడ్లవల్లేరు మండలం పోలిమెట్ల గ్రామంలో మహిళలకు అభివాదం చేస్తున్న భువనేశ్వరి



భావితరం బాగుండాలంటే..

కూటమిని గెలిపించాలి

- విశాఖ పోర్టులో డ్రగ్స్ కంటైనర్ దొరకడమే వైసీపీ పాలనకు నిదర్శనం
- 'నిజం గెలవాలి' యాత్రలో నారా భువనేశ్వరి
- గ్రామగ్రామాన మహిళల బ్రహ్మరథం

గుడివాడ/గుడివాడ రూరల్/పెనమలూరు : భావితరాలు బాగుండాలంటే టీడీపీ, జనసే, బీజేపీ కూటమిని ఈ ఎన్నికల్లో గెలిపించాలని టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి... ప్రజలకు పిలుపునిచ్చారు. నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా ఏలూరు జిల్లా నుంచి కృష్ణాజిల్లాకు వస్తున్న తరుణంగా నందివాడ మండలం అరిపిరాల వద్ద భువనేశ్వరికి టీడీపీ నేతలు, కార్యకర్తలు స్వాగతం పలికారు. నియోజకవర్గంలో గుడివాడ మండలం మోటూరు, గుడ్లవల్లేరు మండలం అంగలూరు, పోలిమెట్ల గ్రామాల్లో ఆమె పర్యటించారు. చంద్రబాబు అక్రమ అరెస్టును తట్టుకోలేక మృతిచెందిన వారి కుటుంబాలను ఆమె పరామర్శించారు. పెనమలూరు నియోజకవర్గం కానూరుకు చెందిన వేమూరి పార్థసారథి కుటుంబాన్ని ఆమె కలిసి ధైర్యం చెప్పారు. వారికి చంద్రన్న భరోసా హామీ పత్రాలను అందించారు. చంద్రబాబు అన్న క్యాంటీన్‌లతో కోట్లాది మంది పేదల కడుపు నింపారన్నారు. వైసీపీ అధికారంలోకొచ్చాక వాటిని మూసివేసి పేదల కడుపుకొట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జీవనాడి పోలవరాన్ని 10 శాతం కూడా పూర్తి చేయలేక ఈ ప్రభుత్వం చేతులెత్తేసిందన్నారు. జిల్లాలో కనీసం పంటలకు సాగునీరు అందించడంలో ప్రభుత్వం వి ఫలమైందన్నారు. వారం క్రితం విశాఖపట్నం పోర్టుకు 25 వేల కిలోల మత్తు పదార్థాలు రావడం వైసీపీ పాలన తీరుకు నిదర్శనమన్నారు.

● భువనేశ్వరికి ఘన స్వాగతం

గుడివాడ, పెనమలూరు నియోజకవర్గాల్లో నారా భువనేశ్వరికి గ్రామగ్రామాన మహిళలు బ్రహ్మరథం పట్టారు. ఆమె రాక కోసం గంటల తరబడి వేచి చూశారు. పర్యటన మార్గ మధ్యలో మల్లాయిపాలెం వద్ద ముస్లిం మైనార్టీ యువత, మహిళలు, సిద్ధాంతం గ్రామం వద్ద టీడీపీ సీనియర్ నాయకురాలు అడుసుమిల్లి శశికళ (అప్పాజమ్మ), టీడీపీ శ్రేణులు స్వాగతం పలికారు.

● నేడు తాడేపల్లికి భువనేశ్వరి

ఘంటసాల మండలం తాడేపల్లి గ్రామంలో నారా భువనేశ్వరి శుక్రవారం పర్యటించనున్నారు. మండల పరిధిలోని తాడేపల్లిలో విలేకరుల సమావేశంలో మండలి బుద్ధప్రసాద్ ఈ మేరకు వివరాలు వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబు అరెస్టు వార్త విని గుండె పోటుతో మరణించిన సుధాకరరావు కుటుంబాన్ని పరామర్శిస్తారన్నారు.

వారు వన్‌సైడ్

వైసీపీ కనుసన్నల్లో పోలీసుల వి ధులు



గన్నవరంలో కడప టీడీపీ అభ్యర్థి కారుకు వాహనాలు అడ్డుపెట్టిన వారిని వదిలేసి టీడీపీ కార్యకర్తలపై సీరియస్ అవుతున్న సీఐ ప్రసాద్ (ఫైల్)

కోడ్ వచ్చినా.. వైసీపీ నాయకుల దారిలోనే..

- చాలా కేసుల్లో వారికే వత్తాసు
- కేసులు కూడా నమోదు చేయని దుస్థితి
- వైసీపీ రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ వి ఎనహాయింపు
- వెలంపల్లి భక్తిలో స్పెషల్ బ్రాంచి అధికారి



● ఇటీవల కృష్ణలంక పోలీస్‌స్టేషన్ పరిధిలో వైసీపీ కార్పొరేటర్ సత్యం తన ఇద్దరు అనుచరులతో ఒక మెకానిక్ షెడ్డులో అరు వాహనాలను ధ్వంసం చేయించారు. ఈ ఘటనలో కార్పొరేటర్, ఇద్దరు అనుచరులపై బాధితులు ఫిర్యాదు చేశారు. పోలీసులు కార్పొరేటర్‌పై కేసు నమోదు చేయకుండా మిగిలిన ఇద్దరిపై అనుమానితులుగా కేసు నమోదు చేసి చేతులు దులుపుకొన్నారు. అధికార పార్టీ నేతలకు వత్తాసు పలుకుతూ సీఐ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు.

● గవర్నరుపేట పోలీసుస్టేషన్ పరిధిలో అధికార పార్టీకి చెందిన పలువురు నాయకులు ఎన్నికల కోడ్ ఉల్లంఘించినా ఎటువంటి చర్యలు తీసుకోలేదన్న ఆరోపణలున్నాయి. సీపీఎం నాయకుడు సీహెచ్ బాబూరావు పోలీసుల నుంచి అనుమతి తీసుకుని ప్రజాసమస్యల పరిష్కారం, ప్రజావ్యతిరేక ప్రభుత్వ విధానాలపై లెనిన్ సెంటర్‌లో ఆందోళన చేస్తే మాత్రం కేసు నమోదు చేయడం పోలీసుల ఏకపక్ష విధానానికి నిదర్శనం.

● ముత్యాలంపాడుకు చెందిన వైసీపీ నాయకుడు బెజ్జం రవికుమార్ రైతు బజారులో షాపులు ఇప్పిస్తామని పలువురికి మోసపు మాటలు చెప్పి డబ్బు గుంజడంతో పాటు బెదిరింపులకు గురిచేసిన వైనంపై బాధితులు పోలీసులను ఆశ్రయించారు. వారికి 'మీరూ మీరూ పంచాయితీ చేసుకుని తేల్చుకోండి' అని పోలీసులు చెబుతూ వైసీపీ నేతలకు అనుకూలంగా మాట్లాడారు.

● గతంలో కొత్తపేట, వన్‌టౌన్‌లో పనిచేసిన ఓ సీఐ ప్రస్తుతం స్పెషల్ బ్రాంచిలో విధులు నిర్వహిస్తున్నారు. పశ్చిమ నియోజకవర్గంలో వైసీపీ నేతలపై ఈగ వాలకుండా చూసుకోవడం ఈయన ప్రధాన బాధ్యత. రోజూ వెలంపల్లి శ్రీనివాస్, షేక్ ఆసిఫ్ వద్దకు వెళ్లి హాజరు వేయించుకున్నాకే ఈయన వి ధులకు వెళ్తుంటారని పోలీసులే చెబుతున్నారు.

● జనసేన నాయకుడు పోతిన మహేశ్‌కు సీటు ఇవ్వాలని ఇటీవల చిట్టినగర్ సెంటర్‌లో ఆయన అనుచరులు నిరసన దీక్ష చేపట్టారు. ఈ సమయంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా వెళ్తూ మహేశ్ అనుచరులను రెచ్చగొట్టారు. అయినా దీక్ష శిబిరం వద్ద ఉన్న పోలీసులు ఏమాత్రం పట్టించుకోలేదు. రెచ్చగొట్టిన వైసీపీ నాయకులపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు.

● భవానీపురం పోలీసు స్టేషన్ పరిధిలో ఒక బార్‌లో గొడవ జరిగితే అధికార పార్టీకి చెందిన నాయకులు గొడవ చేసిన వారికి అండగా ఉండి, వారిపై ఎటువంటి కేసులు లేకుండా పోలీసులతో మంతనాలు జరిపారు. అధికార పార్టీ నేతల ఒత్తిడికి తలొగ్గిన పోలీసులు కేసు పెట్టకుండా గొడవ చేసిన వారిని వదిలేశారు.

● నగరంలో పలు పోలీసు స్టేషన్ల పరిధిలో పదుల సంఖ్యలో అధికార పార్టీకి చెందిన రౌడీషీటర్లు ఉన్నారు. ప్రతి ఆదివారం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తుంటారు. కానీ, అధికశాతం రౌడీషీటర్లు ఈ కౌన్సెలింగ్‌కు హాజరుకాకుండా వైసీపీ నేతల ప్రచారంలో పాల్గొంటున్నారు. అయినా పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోవట్లేదు.

● కొద్దిరోజుల క్రితం గన్నవరంలో టీడీపీ కడప అసెంబ్లీ అభ్యర్థి రెడ్డప్పగారి మాధవి స్థానిక ఎమ్మెల్యే కార్యాలయం వద్ద ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు సంబంధించిన ఫొటోలను తీశారు. ఈ సమయంలో పోలీసులు ప్రవర్తించిన తీరు వి వాదాస్పదమైంది. ఫొటోలు తీసినందుకు మాధవిని పోలీసులు పోలీసుస్టేషన్‌కు పిలిపించారు.

● మచిలీపట్నంలో తోట సందీప్ అనే జనసేన కార్యకర్తపై వైసీపీ నాయకులు దాడి చేశారు. అయినా సందీప్‌నే స్టేషన్‌కు తీసుకెళ్లిన పోలీసులు అక్కడ అతడిని కొట్టారు. చివరికి సందీప్ కుటుంబ సభ్యులతో అతనిదే తప్పని చెప్పించారు.

కాసులు.. కేసులు..

మూడో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో మాయ

- కాసులు కురిపిస్తున్న డ్రంకెన్ డ్రైవ్ కేసులు
- బడాబాబులే టార్గెట్‌గా వసూళ్లు
- తాగి వాహనం నడిపినా వదిలేస్తారు
- ఇద్దరు కానిస్టేబుళ్ల వసూలు దందా



'డ్రంకెన్ డ్రైవ్ చేపట్టేటప్పుడు పారదర్శకంగా వీడియో తీస్తున్నాం. ఎవరైనా దొరికితే కేసు పెడతాం' అని ట్రాఫిక్ పోలీసులు చెప్పే మాటలు విని అందరూ నిజమే అనుకుంటారు. కానీ, ఈ వ్యవహారమంతా కొన్నిచోట్ల సక్రమంగా జరుగుతున్నా.. సత్యనారాయణపురం మూడో ట్రాఫిక్ పోలీసుల పరిస్థితి మాత్రం భిన్నంగా ఉంది. కాసులిస్తే చాలు.. ఎంతటి వారైనా, తాగి వాహనం నడిపినా కేసులు, కోర్టులు లేకుండా ఇక్కడ తేలిగ్గా బయటకొచ్చేయొచ్చు.

- 6లో..

వైసీపీ అరాచకం

కాంట్రాక్టర్ అనుమానాస్పద మృతి



మృతుడు శ్రీనివాసరావు (ఫైల్ ఫొటో)

- జగ్గయ్యపేట ఎమ్మెల్యే ఉదయభాను, కౌన్సిలర్ భర్తతో వివాదం
- అనుచరుడికి ఉదయభాను వత్తాసు
- సాధారణ కేసును హత్యాయత్నంగా మార్పు
- కుటుంబసభ్యులకు పోలీసుల వేధింపులు
- కలత చెందిన శ్రీనివాసరావు

తుని వద్ద రైల్వేట్రాక్‌పై అనుమానాస్పద మృతి

వైసీపీ నేతల అరాచకాలకు జగ్గయ్యపేటకు చెందిన ప్రముఖ కాంట్రాక్టర్ సంభంగి శ్రీనివాసరావు (55) అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. ఆయన మృతదేహం తూర్పుగోదావరి జిల్లా తుని వద్ద గురువారం ఉదయం రైల్వేట్రాక్‌పై పడి ఉండటం సంచలనం కలిగించింది. జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అనుచరుడు, 12వ వార్డు వైసీపీ కౌన్సిలర్ భర్త తన్నీరు నాగేంద్రతో కొద్దిరోజులుగా శ్రీనివాసరావుకు ఆర్థిక, భూ వివాదాలు ఉన్నాయి.

(విజయవాడ-ఆంధ్రజ్యోతి/జగ్గయ్యపేట) : కొద్దిరోజుల క్రితం శ్రీనివాసరావు జగ్గయ్యపేట సమీపంలో 5 సెంట్ల చొప్పున 3 బిట్లు కొన్నారు. వాటిని నాగేంద్ర పేరుతో అగ్రిమెంట్ చేయించారు. ఈ 3 బిట్లలో ఒక దానిని వేరొకరికి, మరో 2 బిట్లను వైసీపీ జగ్గయ్యపేట అధ్యక్షుడు బాజీకి నాగేంద్ర విక్రయించాడు. దీనిపై శ్రీనివాసరావుకు, నాగేంద్రకు, బాజీకి నడుమ వివాదం నడుస్తోంది. తనకు చెప్పకుండా నాగేంద్ర 3 స్థలాలను విక్రయించుకోవడంతో ఆగ్రహించిన శ్రీనివాసరావు వాటిలో మట్టిని తవ్వి తరలించారు. దీంతో ఆగ్రహించిన నాగేంద్ర, బాజీ ఆయనతో గొడవకు దిగారు. సుమారు 10 రోజుల క్రితం నాగేంద్ర, శ్రీనివాసరావు మధ్య ఘర్షణ జరగ్గా, వివాదం పోలీస్‌స్టేషన్‌కు చేరింది. పోలీసులు తొలుత సాధారణ కేసుగా నమోదు చేశారు. ఆ తర్వాత అధికార పార్టీ ఒత్తిళ్లతో బుధవారం రాత్రి కేసును మార్చి శ్రీనివాసరావుపై హత్యాయత్నంగా మార్పు చేశారు. ఘర్షణ జరిగాక.. ఈ పంచాయితీ స్థానిక ఎమ్మెల్యే వద్దకు చేరడం, ఆయన నాగేంద్ర, బాజీకి అనుకూలంగా మాట్లాడటంతో మనస్థాపానికి గురైన శ్రీనివాసరావు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. రాజకీయ ఒత్తిళ్లతో పోలీసులు శ్రీనివాసరావు ఆచూకీ కోసం ఆయన భార్యను, తండ్రిని వేధించడం ప్రారంభించారు. మరోవైపు స్థానిక ఎమ్మెల్యే సహా పలువురు వైసీపీ నేతలు శ్రీనివాసరావుకు ఫోన్ చేసి స్టేషన్‌లో లొంగిపోకుంటే నీ కుటుంబ సభ్యుల అంతు తేలుస్తామని హెచ్చరించినట్లు సమాచారం.

తుని వద్ద రైల్వేట్రాక్‌పై శ్రీనివాసరావు ఆత్మహత్య

నాగేంద్రతో ఘర్షణ జరిగాక కనిపించకుండా పోయిన కాంట్రాక్టర్ శ్రీనివాసరావు గురువారం తుని వద్ద రైల్వేట్రాక్‌పై శవమై కనిపించాడు. గురువారం ఉదయం ఖమ్మం రైల్వే పోలీసులు శ్రీనివాసరావు వద్ద పనిచేసే మేస్త్రీలకు ఫోన్ చేసి తమ వద్ద శ్రీనివాసరావు బ్యాగు మరిచిపోయి వెళ్లారని, దాంట్లో క్రెడిట్, డెబిట్ కార్డు, ఆధార్ తదితర కార్డులు ఉన్నాయని చెప్పారు. సాయంత్రం 4 గంటల సమయంలో కాంట్రాక్టర్ మిత్రుడు ఒకరికి తుని నుంచి రైల్వే పోలీసులు ఫోన్ చేసి ఒక వ్యక్తి రైల్వేట్రాక్‌పై చనిపోయి ఉన్నాడని, అతని జేబులో ఉన్న కాగితంలో నెంబరు చూసి ఫోన్ చేసినట్టు చెప్పారు. పోలీసులు పంపించిన ఫొటోల ఆధారంగా శ్రీనివాసరావుగా గుర్తించారు. కుటుంబసభ్యులు మాత్రం ఐదు రోజుల క్రితం శ్రీనివాసరావు తన తల్లితో కలిసి వి జయనగరంలోని మేనమామ ఇంటికి వెళ్లాడని, బుధవారం రాత్రి విశాఖపట్నం నుంచి ఏపీ ఎక్స్‌ప్రెస్‌లో ఒక్కడే బయల్దేరుతున్నట్టు చెప్పాడని చెబుతున్నారు. రైలు తుని వచ్చిన సమయాన్ని బట్టి బుధవారం అర్ధరాత్రి తర్వాత ఈ సంఘటన జరిగి ఉండవచ్చని అంటున్నారు. శ్రీనివాసరావు తండ్రి రంగారావు ఎన్‌ఎస్పీలో రిటైర్డ్ ఉద్యోగి. సంవత్సర కాలంగా శ్రీనివాసరావు ఊరచెరువు సుందరీకరణ పనులు చేస్తున్నాడు. అదే ప్రాంతంలో వార్డు సభ్యురాలి భర్త నాగేంద్రతో విభేదాలు రావటం, పలుమార్లు ఘర్షణ పడటం, వైసీపీ పెద్దలు సర్దిచెప్పటం జరిగింది. భూ వివాదం తలెత్తాక విభేదాలు పతాకస్థాయికి చేరి పరస్పర దాడులు, పోలీసు కేసుల వరకు వెళ్లింది. రెండు నెలల క్రితం శ్రీనివాసరావు సోదరుడు, మాజీ కౌన్సిలర్ కృష్ణకిషోర్ అనారోగ్యంతో మృతిచెందారు. నెల రోజుల క్రితం శ్రీనివాసరావు కుమార్తె వి వాహం ఘనంగా జరిపారు. ఇప్పుడు శ్రీనివాసరావు చనిపోవటంతో కుటుంబం తల్లడిల్లిపోతోంది. కాంట్రాక్టర్ మృతికి ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ అధికార పార్టీ వేధింపులు, ఒత్తిళ్లే కారణమని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. వారి వేధింపుల కారణంగా శ్రీనివాసరావు ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడంటున్నారు.

శ్రీనివాసరావు మృతి వార్త తెలియగానే అయ్యప్ప నగర్‌లోని ఆయన నివాసం వద్ద మిత్రులు, మునిసిపల్ కాంట్రాక్టర్లు, ఇంజనీర్లు అధికారులు చేరుకున్నారు. జగ్గయ్యపేట పోలీసులు మాత్రం తమకు ఎలాంటి సమాచారం లేదన్నారు. బుధవారం రాత్రి సంభంగి శ్రీనివాసరావుపై తన్నీరు నాగేంద్ర దాడి చేశారని ఇచ్చిన కేసును హత్యాయత్నంగా మార్పు చేసినట్టు తెలిపారు.




ఓపక్క భారీ ఎండలు.. మరోపక్క ఒంటిపూట బడులు.. చిన్నారులకు చుక్కలు కనిపిస్తున్నాయి. గురువారం వరకూ పదో తరగతి పరీక్షలు జరగడంతో ప్రైమరీ విద్యార్థులకు మధ్యాహ్నం ఒంటిగంట తర్వాత తరగతులు నడిపారు. దీంతో గురువారం నగరంలోని సివిల్ కోర్టుల వద్ద మండుటెండలో ఇలా తువ్వాలు కప్పుకొని వరుసగా నడుచుకుంటూ వెళ్తున్న విద్యార్థులు..

కాలువలు అస్తవ్యస్తం!

కృష్ణా డెల్టాలో వచ్చే ఖరీఫ్ సీజన్‌కు సాగునీటి కష్టాలు తప్పేలాలేవు. కాలువల్లో, డ్రెయినేజీల్లో పూడికతీత పనులు, గట్లు బలోపేతం వంటివి జరిగే సూచనలు ఈ ఏడాది కానరావడం లేదు. ఫిబ్రవరిలో తాగునీటి అవసరాల కోసం నీటిని విడుదల చేసిన అనంతరం పూర్తిస్థాయిలో నిలిపివేశారు. మళ్లీ ఏప్రిల్‌లో తాగునీటి అవసరాల కోసం నీటిని విడుదల చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియ పూర్తయిన తరువాత జూలై వరకు కాలువల్లో పనులు చేసేందుకు అవకాశం ఉంది. అయితే ఎన్నికల సమయం కావడంతో కాలువ మరమ్మతులను ఎంతమేర చేస్తారనేది ప్రశ్నార్థంగా మారింది.

గుర్రపు డెక్కతో నిండిన కాలువ



- సాగునీటి కాలువలు, డ్రెయినేజీల నిర్వహణ తూచ్!
- కాలువ పనులకు అంచనాల తయారీ అగమ్యగోచరం
- కాలువల్లో నాచు, పీచు, గుర్రపుడెక్క తొలగింపు శూన్యం
- గట్లు బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో అయినా పనులు జరిగితేనే ప్రయోజనం
- ఎన్నికల సమయం కావడంతో ప్రతిపాదనలు అనుమానమే..

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : కృష్ణాడెల్టాకు సంబంధించి వేసవి కాలంలో, కాలువలకు నీరు విడుదలచేసిన తరువాత చేసే పనులకు సంబంధించి నీటిపారుదల, డ్రెయినేజీ విభాగాల అధికారులు అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి పంపుతారు. ఈ ఏడాది అధికారులంతా ఎన్నికల విధుల్లో నిమగ్నమై ఉండటంతో నీటిపారుదలశాఖ అధికారులు అంచనాలు

- మిగతా 6లో



రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సాయంత్రం) : 6-20 (శుక్ర)

సహర్ (ఉదయం) : 4-52 (శని)



అమూల్‌కు దీటైన జవాబిచ్చాం

- 2023-24లో రూ.1,194 కోట్ల ఆదాయం, రూ. 40 కోట్ల నికర లాభం
- కృష్ణామిల్క్ యూనియన్ సర్వసభ్య సమావేశంలో చైర్మన్ చలసాని

- 6లో..

విజయ ఫ్యాక్టరీ వద్ద మామిడి మొక్క నాటుతున్న మాజీ సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణతో కృష్ణామి ల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు


అమ్మవారి పసుపు, కుంకుమ తీసుకువస్తున్న రథం

కన్నుల పండువగా తిరుపతమ్మ పసుపు, కుంకుమల ఉత్సవం

పెనుగంచిప్రోలు, మార్చి 28 : పెనుగంచిప్రోలు తిరుపతమ్మ చిన్న తిరునాళ్లలో ప్రధాన ఘట్టమైన పుట్టింటి పసుపు, కుంకుమల మహోత్సవం గురువారం రాత్రి కన్నుల పండువగా జరిగింది. అమ్మవారి పుట్టిల్లు అనిగండ్లపాడులో అమ్మవారి వంశీకులు కొల్లా శ్రీనివాసరావు ఇంటి వద్ద నుంచి ఆలయ ప్రధానార్చకులు మర్రిబోయిన గోపీబాబు, పురోహితుడు శివరాంబొట్ల ఆంజనేయశర్మలు ప్రత్యేక పూజలు నిర్వహించి పసుపు కుంకుమ, పట్టుచీరలు, పూలు, పళ్లను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో మేళ తాళాలతో తీసుకువచ్చారు. గ్రామస్థులు, భక్తులు అఖండ స్వాగతం పలుకుతు వారు పోశారు. ఈవో కె.రమేష్‌నాయుడు సాంప్రదాయం ప్రకారం కొల్లా కుటుంబీకులకు స్వాగతం పలికి, అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అమ్మాజీ, డీసీపీ కె.శ్రీనివాసరావు, ఏసీపీ రవికిరణ్, ఈఈ వైకుంఠరావు పలు శాఖల అధికారులు, భక్తులు పాల్గొన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా ఇంటికన్నె గ్రామానికి చెందిన గిరిజన కళాకారుల నృత్య ప్రదర్శన అలరించింది.

చంద్రమ్మకు పుట్టింటి పసుపుకుంకుమలు

తిరుపతమ్మ తోడికోడలు చంద్రమ్మ అమ్మవారి పుట్టింటి పసుపు, కుంకుమల మహోత్సవం గురువారం జరిగింది. పెనుగంచిప్రోలులో అమ్మవారి పుట్టింటి వారు కన్నేటి వెంకటరమణ వారి కుటుంబీకులు పసుపు కుంకుమ సారెతో గ్రామోత్సవంగా అమ్మవారికి సమర్పింప చేశారు.

సుబ్బారాయుడి హుండీల ఆదాయం రూ.79.69 లక్షలు



మోపిదేవి, మార్చి 28 : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి భక్తులు సమర్పించిన కానుకలు హుండీల ద్వారా రూ.79.69 లక్షలు వచ్చినట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్.ఎస్.చక్రధరరావు తెలిపారు. గురువారం ఆలయ ప్రాంగణంలో దేవదాయశాఖ అధికారుల పర్యవేక్షణలో స్వామివారికి భక్తులు సమర్పించిన కానుకల లెక్కింపులో భాగంగా 82 రోజుల కాల వ్యవధికి గాను రూ.79,69,009లు, వెండి 2 కేజీ 125 గ్రాములు, బంగారం 72 గ్రాములు, అమెరికన్ డాలర్లు 104 వచ్చినట్టు తెలిపారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు, ఆలయ పర్యవేక్షకులు బొప్పన సత్యనారాయణ వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన దేవాదాయశాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

చంద్రబాబు సీఎం కావాలని..

- మోకాళ్లపై నడుస్తూ తిరుమల వెంకన్నకు మొక్కు చెల్లింపు



ఉయ్యూరు, మార్చి 28 : రాష్ట్రంలో 175 నియోజకవర్గాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులు ఎన్నికల్లో విజయం సాధించి నారాచంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని కోరుతూ తెలుగుయువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి, పూజిత దపంతులు గురువారం తిరుమల అలిపిరి మెట్ల మార్గంలో మోకాళ్లపై నడుస్తూ శ్రీవారి దర్శనానికి వెళ్లారు. పెనమలూరు అభ్యర్థిగా బోడె ప్రసాద్‌కు సీటు రావాలని స్వామివారి మొక్కు తీర్చుకోవడంతో పాటు కూటమి అభ్యర్థులందరూ విజయం సాధించి చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయాలని మెట్ల మార్గంలో మోకాళ్లపై నడుస్తూ స్వామివారికి మొక్కుకున్నట్టు తెలిపారు.

ఫైబర్‌నెట్ చైర్మన్‌కు కోడ్ వర్తించదా?

- వైసీపీ ట్రేడ్ యూనియన్ ఆవిర్భావ వేడుకల్లో గౌతం రెడ్డి
- పార్టీ జెండాలు ఆవిష్కరించినా పట్టించుకోని ఎన్నికల అధికారులు


సత్యనారాయణపురం వద్ద జెండా ఆవిష్కరిస్తున్న ఫైబర్ నెట్ చైర్మన్ గౌతమ్‌రెడ్డి

విజయవాడ, మార్చి 28: ఏపీ ఫైబర్‌నెట్ కార్పొరేషన్ చైర్మన్ హోదాలో పూనూరు గౌతం రెడ్డి ప్రభుత్వ పదవిలో ఉంటూ ప్రజల సొమ్మును జీతభత్యాలుగా పొందుతున్నారు. అలాంటి వ్యక్తి రాజకీయ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనడం, పార్టీ జెండా ఎగురవేయడం.. రాజకీయ ప్రసంగాలు చేయడం విమర్శలకు తావిస్తోంది. గౌతం రెడ్డి ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారంటూ టీడీపీ నాయకులు ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేసినా వారు స్పందించకపోవడం గమనార్హం. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలోని సత్యనారాయణపురంలో వైసీపీ నేత, వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ నాయకుడు, ఏపీ ఫైబర్‌నెట్ చైర్మన్ పూనూరు గౌతమ్ రెడ్డి ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారు. సత్యనారాయణపురం ఫుడ్‌జంక్షన్ వద్ద గురువారం ఎటువంటి అనుమతులు లేకుండా పార్టీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్నికల కోడ్ ప్రకారం పార్టీ తరఫున ఏ చిన్న కార్యక్రమం జరిగినప్పటికీ జిల్లా ఎన్నికల అధికారి లేదా సంబంధిత రిటర్నింగ్ అధికారి, పోలీసు అధికారుల నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ అధికార పార్టీకి చెందిన గౌతమ్ రెడ్డి తన అనుచరులతో వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొనడంతో పాటు ట్రేడ్ యూనియన్ జెండాతోపాటు పార్టీ జెండాను కూడా ఎగురవేశారు. ఆ సమయంలో పోలీసులు అక్కడే ఉన్నప్పటికీ వారికి కోడ్ ఉల్లంఘన గుర్తుకు రాకపోవడం శోచనీయం. ఈ సంఘటనపై ఎన్నికల అధికారులకు టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. అయినా రాజకీయ ఒత్తిళ్లతో కేసు నమోదుచేయకుండా మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఇదే కార్యక్రమంలో గౌతంరెడ్డి పుట్టిన రోజు వేడుకలు నిర్వహించి, పలువురికి కానుకలు పంచిపెట్టడం గమనార్హం.

85 శాతం ఓటింగ్ లక్ష్యం

- విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులకు ప్రత్యేక సదుపాయాలు : ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



వయోవృద్ధులు, విభిన్న ప్రతిభావంతులు, ట్రాన్స్‌జెండర్స్‌తో సమావేశమైన కలెక్టర్ ఢిల్లీరావు

కృష్ణలంక, మార్చి 28 : విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్స్ ఓటు హక్కు వినియోగించుకొనేందుకు పోలింగ్‌కేంద్రాల్లో ప్రత్యేక సదుపాయాలు కల్పించడం జరిగిందని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. ఓటింగ్ శాతం 80 నుంచి 85 శాతం నమోదు అయ్యేలా స్వీప్ కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పిస్తున్నామన్నారు. సాధారణ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంపు, పోలింగ్ కేంద్రాలలో కల్పించిన సదుపాయాలపై వయోవృద్ధులు, విభిన్న ప్రతిభావంతులు, ట్రాన్స్‌జెండర్స్, సంబంధిత శాఖల అధికారులతో గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కు వినియోగించుకొనేందుకు పోలింగ్ కేంద్రాల్లో అన్ని సదుపాయాలు కల్పించామన్నారు. ర్యాంప్, వీల్‌చైర్, వలంటీర్ సర్వీస్, ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేశామన్నారు. 85 సంవత్సరాలు పైబడి, పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేయలేని స్థితిలో వుండి ఫారం-12డి ద్వారా నమోదు చేసుకొన్న వారి అర్హతను బట్టి హోమ్ ఓటింగ్ సదుపాయం కల్పించేందుకు ఏర్పాటు చేశామన్నారు. సదుపాయాలపై అధికారులు అవగాహన కల్పించి అన్ని వర్గాల ఓటర్లు ఓటు వేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో జిల్లా స్వీప్ నోడల్ అధికారి యు.శ్రీనివాసరావు, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరక్టర్ కె.శ్రీనివాసరావు, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరక్టర్ కామరాజు, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారిణి బి.విజయభారతి తదితరులు వున్నారు.

పారదర్శక ఎన్నికల్లో మీడియా పాత్ర కీలకం



మీడియా సెంటర్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్, అధికారులు

కృష్ణలంక : ఎన్నికలను స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత వాతావరణంలో పారదర్శకంగా నిర్వహించడంలో మీడియా పాత్ర కీలకమని, ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా ఏర్పాటు చేసిన మీడియా సెంటర్ ద్వారా ఎన్నికల సమాచారాన్ని అధికారికంగా అందించడం జరుగుతుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. నగరంలోని స్టేట్ గెస్ట్‌హౌస్ ప్రాంగణం జిల్లా సమాచార, పౌరసంబంధాల శాఖ కార్యాలయంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్ టి.విజయకుమార్‌రెడ్డి, సీపీ కాంతి రాణా టాటా, జేసీ పి.సంపత్ కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి మీడియా సెంటర్‌ను ప్రారంభించారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ఈసీఐ రూపొందించిన హ్యాండ్‌బుక్స్ స్టాల్‌ను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ఈసీఐ షెడ్యూల్ ప్రకారం మే 13న పోలింగ్ జరగనుందని, పోలింగ్‌కు ముందు, పోలింగ్ రోజున, పోలింగ్ తర్వాత ఈ మూడు దశలకు సంబంధించి జిల్లావ్యాప్త ఎన్నికల సమాచారాన్ని మీడియా సెంటర్ ద్వారా ఎప్పటికప్పుడు అందించడం జరుగుతుందన్నారు. కాగా రాష్ట్రంలోనే అత్యధికంగా రూ.3.68 కోట్ల నగదు, విలువైన లోహాలు తదితరాల సీజర్లు జరిగినట్లు కలెక్టర్ తెలిపారు. గరికపాడుతో పాటు 11 కీలక పాయింట్లలో పటిష్ఠ నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. హెల్ప్‌లైన్ 1950, సీ విజిల్, నేషనల్ గ్రీవెన్స్ సర్వీసెస్ పోర్టల్ (ఎన్‌ఈఎస్‌పీ) తదితరాల ద్వారా వస్తున్న ఫిర్యాదులను సత్వరం పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. పోలీస్ కమిషనర్ కాంతిరాణా మాట్లాడుతూ, సెన్సేషన్స్‌కు ప్రాధాన్యమివ్వకుండా ఖచ్చితమైన సమాచారాన్ని ప్రచురించడం లేదా ప్రసారం చేయడం ముఖ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఐపీఆర్వో యు.సురేంద్రనాథ్, డీపీఆర్వో ఎస్వీ మోహనరావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జేసీ సంపత్‌కుమార్

రేషన్ పంపిణీలో కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

- జేసీ సంపత్‌కుమార్

గవర్నర్‌పేట, మార్చి 28 : ప్రజా పంపిణీ వ్యవస్థలో పనిచేసే రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు ఎన్నికల కోడ్ పరిధిలోకి వస్తారని జాయింట్ కలెక్టర్ పి.సంపత్‌కుమార్ అన్నారు. గురువారం లెనిన్‌సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ ఐక్య వేదిక సమావేశ మందిరంలో జిల్లాస్థాయి డీలర్లు, ఎండీయూ ఆపరేటర్ల ప్రతినిధులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ, కోడ్‌కు విరుద్ధంగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నా, ఓటర్లను ప్రభావితం చేస్తున్నట్టు తెలిసినా చట్టప్రకారం చర్యలతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన ఎన్నికల నిబంధనలు, నియమావళిని వివరించారు. ప్రభుత్వం తరఫున పౌర సరఫరాల విభాగం ఆధ్వర్యంలో ప్రజలకు నిత్యావసరాలు అందించే రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు కూడా ప్రభుత్వ ప్రతినిధులుగానే చట్టం పరిగణిస్తుందని స్పష్టం చేశారు. డీలర్లు, వారి సంబంధీకులు, (ఈపాస్ మెషిన్‌లో నామినీగా నమోదైన వ్యక్తులు) ఎండీయూ ఆపరేటర్లు ఏ రాజకీయ పార్టీకి అనుకూలంగా గానీ, వ్యతిరేకంగా గానీ ప్రచారం చేయడం నిషేధమన్నారు. ఎండీయూ ఆపరేటర్లు నిర్దేశించిన షెడ్యూలు ప్రకారం రేషన్ నిత్యావసరాలను ఏప్రిల్ 1 నుంచి 17వ తేదీ వరకు కార్డుదారుల ఇంటివద్దనే పంపిణీ చేయాలన్నారు.



దుర్గమ్మ సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి

వన్‌టౌన్, మార్చి 28: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ కుటుంబసభ్యులతో గురువారం దుర్గమ్మను దర్శించుకున్నారు. ఈవో కేఎస్ రామారావు ఆయనకు సాదర స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం ప్రసాదం, శేషవస్త్రం, ఆశీస్సులు అందజేశారు. సౌభాగ్యమస్తులో భాగంగా గురువారం దుర్గమ్మ దర్శనానికి సుమారు 200 మందికి పైగా నవదంపతులు పసుపువస్త్రాలతో వచ్చారు. అమ్మవారి దర్శనానంతరం వారందరికీ పండితులు ఆశీస్సులు అందచేసి సౌభాగ్యమస్తు అని దీవించారు. ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ అలంకరణ నిమిత్తం మార్టూరుకు చెందిన మహాలక్ష్మీ సాయి గ్రానైట్స్ అధినేత టి.మల్లికార్జునరావు, కుటుంబసభ్యులు గురువారం ఆలయానికి విచ్చేసి 124 గ్రాముల బరువున్న బంగారు చైన్‌తో కూడిన మంగళసూత్రాలను కానుకగా ఇచ్చారు.

కాసులు.. కేసులు!

- మూడో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో మాయ
- కాసులు కురిపిస్తున్న డ్రంకెన్ డ్రైవ్ కేసులు
- బడాబాబులే టార్గెట్‌గా వసూళ్లు
- తాగి వాహనం నడిపినా వదిలేస్తారు
- ఇద్దరు కానిస్టేబుళ్ల వసూలు దందా

సత్యనారాయణపురం : డ్రంకెన్ డ్రైవ్‌లో దొరికిపోయి, తాగినట్టు నిర్ధారణై, పర్సంటేజీ స్లిప్ వచ్చి, బండి సీజ్ చేసినా మూడో ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదు చేయడం లేదు. దీని వెనుక పెద్ద తతంగమే నడుస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. డ్రైవ్‌లో పట్టుబడిన వారిలో బడాబాబులు ఉంటే ఒక్కొక్కరి వద్ద రూ.10 వేల నుంచి రూ.15 వేలు తీసుకుని కేసు పక్కదారి పట్టిస్తున్నారని చెప్పుకొంటున్నారు. అలాంటి వారి వద్ద కనీసం ఆధార్ కార్డు తీసుకోవట్లేదు. వాహనాలు పట్టుకున్నా వెంటనే ఇచ్చేస్తున్నారు. అదే సామాన్యుడైతే కోర్టులో జరిమానాతో పాటు ట్రాఫిక్ పోలీసులకు చేతులు తడిపితే కానీ వాహనం ఇవ్వని పరిస్థితి. కానీ, బడాబాబులకు మాత్రం కాసులు కాస్త ఎక్కువగానే తీసుకుని వదిలేస్తున్నారు. తోటి ఉద్యోగులు సైతం తమకు సంబంధించిన వారి వాహనం పట్టుకున్నారని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తే మూడో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లోని ఆ ఇద్దరు కానిస్టేబుళ్లతో మాట్లాడుకోమని చెబుతున్నారు.

వారిద్దరు ఎవరు..?

రెండు నెలలుగా మూడో ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో ఇద్దరు కానిస్టేబుళ్లు ఆడిందే ఆట, పాడిందే పాటగా సాగుతోంది. ఉన్నతాధికారులకు తెలిసే ఇదంతా జరుగుతోందనే ఆరోపణలు వస్తున్నాయి. కానీ, రోజుకు రెండు, మూడు వాహనాలను ఇలా అడ్డదారిలో కేసు లేకుండా పంపించేస్తున్నారని, రూ.వేలల్లో డబ్బు దండుకుంటున్నారని స్టేషన్ మొత్తం కోడై కూస్తోంది. ఉన్నతాధికారులకు వాటాలు అందుతున్నాయనే ఆరోపణలూ లేకపోలేదు.

బడాబాబులే టార్గెట్

ఆ ఇద్దరు కానిస్టేబుళ్లకు బడాబాబులే టార్గెట్. డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి జరిమానా విధించడంతో పాటు జైలుశిక్ష వేస్తుండటంతో.. వాటి నుంచి బయటపడటానికి బడాబాబులు ఎంత ఇవ్వడానికైనా వెనుకాడటం లేదు. దీన్ని ఆసరాగా చేసుకుని ఒక్కొక్కరి నుంచి అందినకాడికి దండుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇలా రెండు నెలలుగా లక్షలాది రూపాయలు వసూలు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఇలా వసూలైన డబ్బును సదరు కానిస్టేబుళ్లు డైరెక్టుగా తీసుకోకుండా, తమ భార్యల ఫోన్‌పే, గూగుల్ పే నెంబర్లకు పంపించేలా చూసుకుంటున్నారు.

ఆర్థిక నేరానికి పాల్పడిన అవినీతి అధికారిపై వేటు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

కృష్ణాజిల్లాలో గతంలో పనిచేసిన జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) సీహెచ్ సుబ్రహ్మణ్యంను ప్రభుత్వం ఉద్యోగం నుంచి తొలగించింది. భారీ ఆర్థిక నేరానికి పాల్పడినందున సుబ్రహ్మణ్యంను ప్రభుత్వం ఉద్యోగం నుంచే తొలగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. కృష్ణా జిల్లాలో పనిచేసినపుడు ఆయనపై తీవ్ర అవినీతి ఆరోపణలు వచ్చాయి. గ్రామ పంచాయతీల నుంచి భారీగా వసూళ్లకు పాల్పడేవాడన్న ఆరోపణలు అప్పట్లో జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. అప్పట్లో ఆయనను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ప్రస్తుతం పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖలో సీఈఓగా పనిచేస్తున్నారు. సుబ్రహ్మణ్యం దాదాపుగా రూ. 1.30 కోట్ల అవినీతికి పాల్పడినట్టుగా ప్రాథమికంగా గుర్తించారు. ఈ డబ్బును అతని నుంచి రికవరీగా ఆదేశించటం జరిగింది.

అమూల్‌కు దీటైన జవాబిచ్చాం

- 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.1194 కోట్ల ఆదాయం
- రూ. 40 కోట్ల నికర లాభం సాధించాం
- కృష్ణా మిల్క్‌యూనియన్ సర్వసభ్య సమావేశంలో చైర్మన్ చలసాని


పాల ఉత్పత్తిదారులకు బోనస్ చెక్కు అందజేస్తున్న ఎన్వీ రమణ, చిత్రంలో చలసాని తదితరులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ /జంక్షన్ రూరల్) : ప్రభుత్వ సహకారంతో కార్యకలాపాలు ప్రారంభించిన అమూల్‌కు దీటైన జవాబిస్తూ 2023-24 ఆర్థిక సంవత్సరంలో విజయ డెయిరీ సత్తాను చాటిందని కృష్ణా మిల్క్ యూనియన్ - విజయా డెయిరీ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్లు చలసాని ఆంజనేయులు, కొల్లి ఈశ్వర్‌బాబులు పేర్కొన్నారు. కృష్ణామిల్క్‌యూనియన్ 32వ సర్వసభ్య సమావేశం గురువారం వీరవల్లిలోని విజయడెయిరీ ఆటోమేషన్ ప్లాంట్‌లో జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ చలసాని ఆంజనేయులు మాట్లాడుతూ, కృష్ణామిల్క్ యూనియన్ ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.1194 కోట్ల టర్నోవర్‌కు చేరిందని, ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి రూ.1200 కోట్ల మేర ఆదాయం సాధించవచ్చని చెప్పారు. పాలసేకరణలో 8 శాతం వృద్ధి పెరిగిందని, నికర లాభం 12 శాతం పెరుగుదలతో రూ. 40 కోట్ల లాభం సాధించామని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అమూల్‌కు ఎంతో సహకారాన్నిచ్చినా.. పోటీని తట్టుకుంటూ వృద్ధిని సాధించటం గొప్ప విషయమన్నారు. రైతు కుటుంబం నుంచి వచ్చి అత్యున్నత న్యాయవ్యవస్థకు ప్రధాన న్యాయమూర్తి పదవి చేపట్టి పదవికే వన్నె తెచ్చిన నూతలపాటి వెంకటరమణ పాడిరైతులను కలుసుకునేందుకు రావడం గర్వకారణమన్నారు. రైతు కష్టంలో ఉంటే ఆ వ్యవస్థకు న్యాయం జరిగేలా తీర్పులతో సహకారమందించిన మహోన్నత వ్యక్తి నూతలపాటి రమణ అన్నారు. నాటి తీర్పు వల్లే కృష్ణామిల్క్ యూనియన్ సహకారరంగంలో అత్యధిక పాలసేకరణ ధర చెల్లిస్తోందన్నారు. ఎన్టీఆర్ సముచిత నిర్ణయాలతో పాటు కాకాని వెంకటరత్నం, మండవ జానకిరామయ్య లాంటి వారి కృషి ఫలితంగా రాజకీయాలకతీతంగా కృష్ణామిల్క్‌యూనియన్ అభివృద్ధి సాధ్యమైందన్నారు. ఎండీ ఈశ్వరబాబు మాట్లాడుతూ, ఆస్తులు బదలాయింపు, అధికారాల బదలాయింపు లాంటి వాటిల్లో సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నూతలపాటి వెంకటరమణ తీర్పులతో మనదైన కృష్ణామిల్క్ యూనియన్ అభివృద్ధిబాట పట్టిందన్నారు.

పాడిరైతు కుటుంబాలకు ఆర్థిక భరోసా

సుప్రీం మాజీ సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ

సహకారరంగంలో కృష్ణామిల్క్ యూనియన్ దినదినాభివృద్ధి చెందుతూ, అత్యధిక పాలసేకరణ ధర చెల్లిస్తూ పాడిరైతు కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తోందని భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ అభినందించారు. ఢిల్లీకి రాజైనా తల్లికి బిడ్డేనని ప్రస్తావిస్తూ ఎంతటి అత్యున్నత పదవులు అలంకరించినా కృష్ణాజిల్లాను తానెప్పుడూ మరువలేదన్నారు. సొంత ప్రాంతంలో, సొంత మనుషుల మధ్య సంబరాలు చేసుకోవటం ఎంతో ఆనందాన్నిచ్చిందన్నారు. అనంతరం పాడిరైతులకు 3వ విడతగా రూ. 12కోట్ల చెక్కును పాడి రైతులకు అందజేశారు. కళ్యాణమస్తు, క్షీరబంధు సంక్షేమ పథకాల చెక్కులు లబ్ధిదారులకు పంపిణీచేశారు. కృష్ణామిల్క్ యూనియన్ కార్యవర్గం, పాడి రైతులతో కలిసి సహకారసంఘ అధ్యక్షులు, ఆయిల్‌పామ్ రైతులు, వీరవల్లి గ్రామ ప్రజాప్రతినిధులు ఎన్వీ రమణను ఘనంగా సత్కరించారు.

రామాలయంలో ప్రత్యేక పూజలు

భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ జిల్లా పర్యటనలో భాగంగా బొమ్ములూరులోని రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈవో యార్లగడ్డ శ్రీనివాసు ఆలయమర్యాదలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. తెలుగుమహిళ ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయికళ్యాణి, కేతినీడి తేజోమూర్తి తదితరులు పాల్గొన్నారు.


రొయ్యూరులో ఇసుక తవ్వకాలు జరిపిన ప్రదేశం

రొయ్యూరులో అర్ధరాత్రి ఇసుక దోపిడీ!

- మంత్రి, ఎమ్మెల్యే అనుచరుల బరితెగింపు

తోట్లవల్లూరు, మార్చి 28 : రొయ్యూరులో అర్ధరాత్రి ఇసుక దందా యథేచ్ఛగా సాగుతోంది. వైసీపీ నేతల కనుసన్నల్లో మూడుయంత్రాలను పెట్టి తెల్లవార్లూ భారీగా ఇసుకను కొల్లగొట్టారు. మంత్రి జోగి రమేశ్, స్థానిక ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అనుచరులు ఇసుక దందాకు పాల్పడినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానికంగా కొందరికి డబ్బు ముట్టజెప్పి వారి అండతో అర్ధరాత్రి ఇసుక దందాకు తెరలేపారని స్థానికులు చెబుతున్నారు. గురువారం ఉదయం వరకు సుమారు 100 లారీల ఇసుకను తరలించారని సమాచారం. ఇసుకను పొరుగు రాష్ట్రాలకు తరలించినట్టుగా తెలుస్తోంది. ఎన్నికలకోడ్ రావటంతో ఇసుక చీకటి వ్యాపారానికి తెరలేపారు. ఇసుక తవ్వకాల సమయంలో పోలీసులు కరకట్టపై ఉన్నట్టు స్థానికులు పేర్కొంటున్నారు. అధికారుల సహకారంతోనే రాత్రి వేళల్లో ఇసుక దోపిడీ చేపట్టారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అంతర్‌జిల్లా దొంగ అరెస్ట్..

- 37 బైక్‌లు స్వాధీనం

తోట్లవల్లూరు, మార్చి 28 : యనమలకుదురుకు చెందిన తాపీ కార్మికుడు ఒడుగు సుబ్బారావు గుంటూరు జిల్లా వల్లభాపురం రామానగర్‌లో నివాసం ఉంటూ, తాపీ పని చేస్తు బైక్‌ల దొంగతనం అలవాటుగా మార్చుకుని, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, ఏలూరు జిల్లాల్లో 18 పోలీస్ స్టేషన్‌ల పరిధిలో 37 బైక్‌లను ఏడాది కాలంలో దొంగిలించాడు. ఇటీవల తోట్లవల్లూరు వద్ద కరకట్టపై వాహన తనిఖీలో సుబ్బారావు అనుమానస్పదంగా పట్టుబడగా విచారించటంతో పట్టుబడినట్టు కృష్ణాజిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి తెలిపారు. ఈ సందర్భంగా తోట్లవల్లూరు స్టేషన్ వద్ద గురువారం ఎస్పీ మీడియా సమావేశం నిర్వహించారు. తోట్లవల్లూరు, పమిడిముక్కల, కంకిపాడు, పెనమలూరు, మోపిదేవి, గుడివాడ టౌన్, రాబర్ట్‌సన్‌పేట, ఏలూరుజిల్లాలోని ఏలూరు టౌన్, గుంటూరుజిల్లా పొన్నూరు, గుంటూరు టౌన్, తెనాలి, బాపట్ల, రేపల్లె, అమృతలూరు, విజయవాడ కృష్ణలంక, సత్యనారాయణపురం, మాచవరం, వన్‌టౌన్, టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో మొత్తం 37 బైక్‌లను ఒడుగు సుబ్బారావు దొంగిలించినట్టు విచారణలో తేలిందని ఎస్పీ తెలిపారు. సీఐ ఎం.కిషోర్‌బాబు, ఎస్సై పి.విశ్వనాథ్ సిబ్బంది శ్రమించి 37 బైక్‌లను రికవరి చేశారన్నారు. నిందితుడు సుబ్బారావును ఉయ్యూరు కోర్టుకి హాజరు పరుస్తున్నట్టు చెప్పారు.


రికవరి చేసిన బైక్‌లు

కాలువలు అస్తవ్యస్తం!

(5వ పేజీ తరువాయి)

రూపొందించలేదు. ప్రధాన కాలువల్లో తూడు, నాచు, గుర్రపుడెక్కలను తొలగించేందుకు ఆపరేషన్ అండ్ మెయిన్‌టెనెన్స్(ఓఅండ్‌ఎం) పనుల ప్రతిపాదనలు రూపొందించలేదు. వైసీపీ అధికారం చేపట్టిన ఈ ఐదేళ్లలో డెల్టా ఆధునికీకరణ ప్రక్రియను పక్కనపెట్టేసింది. దీంతో ప్రధాన పంటకాలువలు రూపురేఖలను కోల్పోయేస్థితికి చేరుకున్నాయి. పూర్తిస్థాయిలో నీటిని విడుదల చేస్తే కాలువగట్టు తెగిపోతాయనే భయం అధికారుల్లో ఉంది. 2022వ సంవత్సరంలో కాలువల మరమ్మతులకు రూ.55కోట్లు, 2023లో రూ.27కోట్లు మాత్రమే ఓఅండ్‌ఎం పనులకు కేటాయించి పనులు మమ అనిపించారు. ఈసారి ప్రతిపాదనలే సిద్ధం కాలేదు.

- సాగునీటి సంఘాల ఉనికి ప్రశ్నార్థకం

టీడీపీ హయాంలో ఆయా రెవెన్యూ గ్రామాల పరిధిలో జిల్లాలో 226 వరకు సాగునీటి సంఘాలుండేవి. నీటి తీరువా ద్వారా వసూలైన నగదుతో పాటు కృష్ణాడెల్టా ఆధునికీకరణ ద్వారా కేటాయించిన నిధులను కలిపి సాగునీటి, డ్రెయినేజీలకు సంబంధించిన పనులు చేసేవారు. సాగునీటి సలహామండలి సమావేశం నిర్వహించి ఏయే ప్రాంతాల్లో కాలువ పనులు చేయాలో నిర్ణయించేవారు. వైసీపీ అధికారం చేపట్టాక సాగునీటి సంఘాలను పక్కన పెట్టింది. ఈ ఐదేళ్లలో మంత్రులు, శాసనసభ్యుల అనుచరులకు ఈ పనులు కట్టబెట్టారు. అవసరమైతే రూ.5 లక్షలకు పనులను విభజించి నామినేషన్ పద్ధతిన కేటాయించారు. పనులు చేస్తే బిల్లులు విడుదలకావనే భయంతో కొందరు కాంట్రాక్టర్లు పనులకు టెండర్లువేసి, చేయకుండా నిలిపివేసిన దాఖలాలు ఈ ఐదేళ్లలో చోటుచేసుకున్నాయి.

- శివారు ప్రాంతాలకు సాగునీరు అందేనా?

జిల్లాల్లో 4.13 లక్షల ఎకరాల్లో వివిధ పంటలసాగు జరుగుతుంది. 3.70 లక్షల ఎకరాల్లో వరిసాగు జరుగుతుంది. బందరుకాలువ, కేఈబీ కెనాల్ ద్వారా దాదాపు 2.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. ఈ రెండు ప్రధాన కాలువలు, వాటికి అనుబంధంగా ఉన్న బ్రాంచి కాలువలకు కనీస మరమ్మతులు చేయకుంటే శివారు ప్రాంతాల భూములకు సాగునీరు అందుతుందనేది ప్రశ్నార్థకమే. ఈ రెండు ప్రధాన కాలువలకు అనుబంధంగా ఉన్న బ్రాంచ్ కాలువల్లో డ్రాప్‌లు, రెగ్యులేటర్లకు నాలుగు సంవత్సరాలుగా కనీస మరమ్మతులు చేయలేదు. ఈ ఏడాది ఈ పనులు చేసే అవకాశం లేదు. ఉదాహరణకు కేఈబీ ప్రధాన కాలువ నుంచి మోపిదేవి మండలం కే-కొత్తపాలెం వద్ద 9వ నెంబరు ప్రధానకాలువ ప్రారంభమవుతుంది. ఈ కాలువకు మరో 10 బ్రాంచ్ కాలువలు ఉన్నాయి. చల్లపల్లి, ఘంటసాల, బందరు తదితర మండలాలకు ఈ 10 బ్రాంచ్ కాలువల ద్వారా సాగు, తాగునీరు అందుతుంది. ఈ కాలువల గట్లు బలహీనంగా ఉండటంతో పూర్తిస్థాయిలో నీటిని వదిలితే గట్లు తెగిపోతాయనే భయంతో అధికారులు నీటిని పూర్తిగా వదలరు. బందరు మండలంలోని బోగిరెడ్డిపల్లి, తుమ్మలచెరువు, పెదయాదర, తదితర ప్రాంతాల్లో 9వ నెంబరు ప్రధానకాలువకు ఉన్న బ్రాంచ్ కాలువల గట్లు బలహీనంగా ఉన్నాయి.

కోర్టు స్టేటస్‌కో ఇచ్చినా కొనసాగుతున్న పనులు

లబ్బీపేట, మార్చి 28: న్యాయస్థానం స్టేటస్ కో ఆర్డర్ ఇచ్చినా పనులు కొనసాగిస్తున్న వైసీపీ కార్పొరేటర్ బంధుగణానికి, కోర్టుకు వెళ్లిన వారికి మధ్య జరిగిన వివాదం పోలీస్‌స్టేషన్‌కు చేరింది. ఐజీఎంసీ స్టేడియంలోని హరిత అంగడి షాపుపై కేసు కోర్టులో పెండింగ్‌లో ఉన్నా ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాసరావు, మేయర్ భాగ్యలక్ష్మి అండతో అధికారులు గుట్టుచప్పుడు కాకుండా టెండర్ ప్రక్రియ కొనసాగించి కార్పొరేటర్ కుక్కల అనీత బంధుగణానికి కేటాయించారు. దీంతో సదరు కార్పొరేటర్ బంధుగణం కొన్నిరోజుల నుంచి ఆ షాపునకు మరమ్మతులు చేయిస్తున్నారు. ఎమ్మెల్యే వెల్లంపల్లి సెంట్రల్‌లో అభ్యర్థిగా పొగా వేసి ఇక్కడి కార్పొరేటర్లకు ఏం కావాలో అది చేసుకోండని హామీ ఇవ్వడంతో ఎమ్మెల్యే, మేయర్ అండతో అధికారులు ఆఘమేఘాలపై కార్పొరేటర్ కుక్కల అనిత బంధుగణానికి షాపు కేటాయించారు. విషయం తెలుసుకుని గతంలో కోర్టుకు వెళ్లిన వారు మళ్లీ కోర్టుకు వెళ్లి కేసు ఫైల్ చేశారు. స్పందించిన న్యాయస్థానం మరోసారి స్టేటస్ కో ఆర్డర్ ఇచ్చింది. కార్పొరేటర్ బంధుగణం ఆర్డర్ కాపీ తమకందలేదనే సాకుతో పనులు కొనసాగిస్తునారు. దీనిపై కోర్టుకు వెళ్లిన వారు అధికారులు దృష్టికి తీసుకువెళ్లినా స్పందించకపోవడంతో గురువారం వారే స్వయంగా షాపు వద్దకు వెళ్లి చెప్పగా ఇరువురి మధ్య వివాదం జరిగింది. పోలీసులు ఇరువర్గాలను స్టేషన్‌కు తరలించారు. ఇద్దరి వాదనలు విన్న పోలీసులు సమస్య న్యాయస్థానం పరిధిలో ఉండడంతో న్యాయమూర్తి ఎదుట హాజరు పరుస్తామని అప్పటి వరకు షాపు తెరవద్దని తాళాలు వారి వద్దే ఉంచుకున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	124, 133, 144
చికెన్ విత్ స్కిన్	236
చికెన్ స్కిన్‌లెస్	246

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.00

మల్లెల రాజేష్‌కు ఘన నివాళి

ఆటోనగర్(పెనమలూరు), మార్చి 28: ఆటోమొబైల్ టెక్నీషియన్స్ అసోసియేషన్(ఏటీఏ) సభ్యులు మల్లెల రాజేష్ నాల్గవ వర్ధంతి సందర్భంగా వారి సోదరులు అశోక్, శివకుమార్‌లు ఆటోనగర్ సాయి హోటల్ సెంటర్‌లో కార్మికులకు మజ్జిగ పంపిణీ చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు రాజనాల బాబ్జీ ముఖ్య అతిథిగా పాల్గొని రాజేష్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాబ్జీ మాట్లాడుతూ వేసవి దృష్ట్యా ఆటోనగర్ కార్మికులకు ప్రతి రోజూ మజ్జిగ పంపిణీ చేయాలని, చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. మల్లెల శివ మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా తమ సోదరుని జ్ఞాపకార్థం సేవా కార్యక్రమాలు చేస్తున్నామని పేర్కొన్నారు. తోట బాలపవన్ కుమార్, ఏటీఏ సభ్యులు శ్రీను, కమ్మిలి రంగనాథ్ పాల్గొనారు.



రాజేష్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న బాబ్జీ

మర్యాదపూర్వక కలయిక

అజిత్‌సింగ్‌నగర్, మార్చి 28 : సెంట్రల్ నియోజకవర్గం 64వ డివిజన్ టీడీపీ నేతలు గురువారం విజయవాడ టీడీపీ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని చిన్నిని మొగల్రాజపురంలోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేశినేని శివనాథ్ (చిన్ని) మాట్లాడుతూ రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల్లో 1994 నాటి ఫలితాలు పునరావృతం కానున్నాయని, తమ అధినేత చంద్రబాబు ముఖ్యమంత్రి అయి తీరుతారని ధీమా వ్యక్తం చేశారు. చిన్నిని కలిసిన వారిలో పరుచూరి ప్రసాద్, వింజమూరి సతీష్, నాగరాజు, పలగాని శివ, ఉన్నారు.



కేశినేని చిన్నిని కలిసిన సెంట్రల్ టీడీపీ నాయకులు

గొల్లపాలెంగట్టు ప్రాంతంలో అన్న క్యాంటీన్

చిట్టినగర్, మార్చి 28: టీడీపీ నాయకులు కేశినేని శివనాథ్(చిన్ని) కేశినేని ఫౌండేషన్ సహకారంతో గురువారం 50వ డివిజన్ గొల్లపాలెంగట్టు ప్రాంతంలో అన్న క్యాంటీన్ ద్వారా పేదలకు భోజనం అందజేశారు. తెలుగుయువత పశ్చిమ అధ్యక్షుడు ఆర్ మాధవ, నాయకులు కె. కొప్పుల గంగాధర్, కె. దుర్గారావు, ధనేకుల హరికృష్ణ, బాలరాజు గౌరి, రాజేష్ పాల్గొన్నారు.

చిత్రలేఖనంపై అవగాహన

చిట్టినగర్, మార్చి 28: బంగారయ్యకొట్టు సెయింట్ థామస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో గురువారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జాతీయ చిత్రకారుడు రమేష్ పాల్గొని విద్యార్థులకు చిత్రలేఖనంపై అవగాహన కల్పించారు. అనంతరం విజేతలను అభినందించారు. ప్రిన్సిపాల్ రాజు డేవిడ్, లయన్స్ పీజే సుధాకర్, పలువురు ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సిద్ధార్థ ఫార్మశీలో ప్రాంగణ ఎంపికలు

మొగల్రాజపురం, మార్చి 15: కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మశీ కళాశాలలో గురువారం ప్రాంగణ ఎంపికలు జరిగాయి. ఇన్ఫోక్యూరిస్ అనే ఫార్మా కంపెనీ బీ ఫార్మశీ, ఫార్మా డీ, ఎం ఫార్మశీ విద్యార్థులకు జరిసిన ఎంపికల్లో 30 మంది అర్హత పొందినట్లు ప్రాంగణ ఎంపికల విభాగం డాక్టర్ సిహెచ్. నాగభూషణం తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ అభినందించారు.

చంద్రబాబు సీఎం కావడం తథ్యం

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పటమట, మార్చి 28 : ప్రతి రోజూ వ్యాయామం ద్వారా మంచి ఆరోగ్యం పొందవచ్చునని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. 11వ డివిజన్ చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో గురువారం గద్దె వాకర్స్‌తో మాట్లాడారు. వారితో పాటు గద్దె వాకింగ్ చేసి, వాలీబాల్, షటిల్ ఇతర క్రీడలు ఆడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు ఏ మాత్రం ఇబ్బంది లేని సమయాల్లో వాకింగ్, ఇతర క్రీడలకు వినియోగించేకునేలా తమ ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత అవకాశం కల్పిస్తామన్నారు. జనసేన, బీజేపీలు బలపర్చిన టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, ఎంపీ అభ్యర్థిగా కేశినేని శివనాథ్(చిన్ని)లను సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాల్సిందిగా కోరారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలిచి చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం తథ్యమని తెలిపారు. డివిజన్ అధ్యక్షులు కోనేరు రాజేష్, పరుచూరి అజయ్, వీవీ.రామారావు, ముమ్మనేని ప్రసాద్, పి.సుజాత, టి. లక్ష్మి, పి. కిషోర్, డి. వెంకట్ పాల్గొన్నారు.

గుణదల: జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ గురువారం ఎన్నికల ప్రచారంలో భాగంగా 6వ డివిజన్లోని బ్రహ్మానందరెడ్డి నగర్లో ఇంటింటికి వెళ్లి తెలుగుదేశం ప్రభుత్వం వచ్చాక అమలు చేయనున్న పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవనం సాగించాలంటే టీడీపీ అధికారంలోకి రావాల్సిందేనని ఓటర్లు ధృడసకల్పంతో ఉన్నారని చెప్పారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గద్దె రామ్మోహన్, ఎంపీ అభ్యర్థి కేశినేని చిన్నిలను సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. డివిజన్ అధ్యక్షుడు పడాల గంగాధర్, పల్లె దుర్గాప్రసాద్, సప్పా శ్రీను, పడాల ఆదినారాయణ, మొకర గురునాథం, అమిర్నేని కరుణ, షకీలా, పఠాన్ మధార్బీ, ధర్మా, కె.భారతి, పి.వాసు, పీలా కళావతి, పి.నాగు తదితరులు పాల్గొన్నారు.



వాకర్స్‌తో షటిల్ ఆడుతున్న గద్దె రామ్మోహన్



బ్రహ్మానందరెడ్డి నగర్లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న గద్దె అనురాధ

పటమట: 14వ డివిజన్‌లో జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ గురువారం ఉదయం ప్రచారం నిర్వహించారు. జనసేన, బీజేపీలు బలపర్చిన టీడీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులుగా గద్దె రామ్మోహన్, కేశినేని శివనాథ్(చిన్ని)లను అఖండ మెజారిటీతో గెలిపించాలని అనురాధ కోరారు. ఈ సందర్భంగా ఓటర్లతో మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే గద్దెకే తమ ఓటు అని చెబుతున్నారని, సేవాభావం ఉన్న గద్దెను తప్పకుండా గెలిపించుకుంటామని, ప్రచారంలో తమతో చెబుతున్నారని తెలిపారు. నర్రా కిషోర్, బద్రి, వి. డాంగేకుమారి, సీహెచ్. సాంబయ్య, వై. శివనాగరాజు, ఫాతిమా పాల్గొన్నారు.

● తూర్పు నియోజకవర్గ ప్రశాంతత కోసం శాంతి కాముకుడైన గద్దె రామ్మోహన్‌ను మరొక్కసారి ఎమ్మెల్యేగా అత్యధిక ఓట్ల మెజారిటీతో గెలిపించాలని, కేశినేని శివనాథ్‌ను ఎంపీగా గెలిపించాలని గద్దె రాజేష్ కోరారు. 11వ డివిజన్‌లో కాకతీయ బజార్‌లో కూటమి అభ్యర్థులుగా గద్దె, కేశినేని చిన్నిల విజయాన్ని కాంక్షిస్తూ గద్దె తనయుడు గద్దె రాజేష్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కోనేరు రాజేష్, పి.సుజాత, పి. కిషోర్, పి. ప్రసాద్, డి. ఆంజనేయులు, కె.మాలతి పాల్గొన్నారు.

రామలింగేశ్వరనగర్: ఎన్నికల సమయంలో ప్రజల దగ్గరకు వచ్చి కల్లబొల్లి మాటలు చెప్పి ఎన్నికల్లో రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్న వైసీపీ నాయకుల తీరుపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ కుమారులు గద్దె రాజేష్, గద్దె క్రాంతిలు అన్నారు. 16వ డివిజన్‌లో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈసారి ఎన్నికల్లో గద్దె రామ్మోహన్ అత్యధిక మెజారిటీతో గెలిచి హ్యాట్రిక్ కొట్టడం ఖాయమని అన్నారు. రాష్ట్రం అభివృద్ధి జరగాలంటే చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని అన్నారు, బీజేపీ, జనసేనలు బలపరిచిన టీడీపీ అభ్యర్థులు గద్దె రామ్మోహన్, కేశినేని శివనాథ్‌లను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అన్నారు. స్థానిక నేతలు పాల్గొన్నారు.

నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ప్రారంభం

లబ్బీపేట, మార్చి 28: లబ్బీపేటలోని ఎ కన్వెన్షన్‌లో గురువారం నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ప్రారంభించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ఎగ్జిబిషన్ ఏప్రిల్ ఒకటో తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. ఈ ఎగ్జిబిషన్‌లో సంప్రదాయ, ఆధునిక ఫ్యాషన్ల వరకు అన్ని రకాల వస్త్రాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి మగ్గాలపై నేసిన ఎన్నో రకాల ఉత్పత్తులతో పాటు, దేశం నలుమూలల నుంచి తెచ్చిన వస్త్రాలను ఒకేచోట అందరికి అందుబాటులోనికి తేవడం ఈ ఎక్స్ పో లక్ష్యమని తెలిపారు. దీనిని షాపర్స్ ప్యారడైజ్ గా భావించవచ్చన్నారు. నేత కార్మికులు తమ సిల్క్ కాటన్ వస్త్రాలను 50శాతం వరకు ప్రత్యేక తగ్గింపు ధరలతో పాటు, డిజైనర్ వస్త్రాలు, బ్లౌజులు, కుర్తాలు అన్ని ఒకే చోట లభిస్తాయని తెలిపారు. ఈ ఎక్స్‌పోలో పైథాని సిల్క్ చీరలు, మహారాష్ట్ర, కర్ణాటక నుంచి సిల్క్, సాఫ్ట్‌సిల్క్, కషిద సిల్క్ చీరలు, మధ్యప్రదేశ్ నుంచి ప్రసిద్ధి గాంచిన చందేరి అండ్ మహేశ్వరి సిల్క్ చీరలు, పశ్చిమ బెంగాల్ బలుచారి, జమదాని, టాంగైల్, ఢకాయ్ మాస్లిన్ సిల్క్, లినెన్ చీరలు కాంతావర్క్ చీరలు, దేశంలోని అనేక ప్రాంతాల్లోని పేరుపొందిన వస్త్రాలు అందుబాటులో ఉంచామని తెలిపారు. ఈ ఎగ్జిబిషన్ ఉదయం 11గంటల నుంచి రాత్రి 9గంటల వరకు అందుబాటులో ఉంటుందని, అన్ని రకాల డెబిట్ అండ్ క్రెడిట్ కార్డులు స్వీకరించడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.



చీర ప్రదర్శిస్తున్న మోడల్

విద్యారంగంలో సంస్కరణలు తీసుకొచ్చాం

విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి

వన్‌టౌన్, మార్చి 28: రాష్ట్రంలోని విద్యారంగంలో అపూర్వ సంస్కరణలను తీసుకొచ్చామని ఉన్నత విద్యామండలి చైర్మన్ కే హేమచంద్రారెడ్డి అన్నారు. కేబీఎన్ కళాశాల 59 వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం జరిగిన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు కేవలం విద్యకే పరిమితం కాకుండా వారిలోని నైపుణ్యాలను పెంపొందించేందుకు సంస్కరణలు దోహదం చేస్తాయన్నారు. ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణలను అందిపుచ్చుకుని అవకాశాలను వినియోగించుకోవాలన్నారు. వెస్ట్‌జోన్ డీసీపీ టి. హరికృష్ణ, కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు టీ. శేషయ్య, తూనికుంట్ల శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ డాక్టర్ వి. నారాయణరావులు తమ సందేశాలలో విద్యార్థి ప్రగతికి తీసుకోవాల్సిన అంశాలను సూచించారు. సహాయ కార్యదర్శి జీవీ రామరావు, కోశాధికారి అన్నం రామకృష్ణారావు, హిందూ హైస్కూల్ కమిటీ ప్రతినిధులు, అధ్యాపకులు పలువురు పాల్గొన్నారు. విద్యార్థులు శాస్త్రీయ, పాశ్చాత్య నృత్యాలతో అలరించారు.



ప్రసంగిస్తున్న హేమచంద్రారెడ్డి

ఎన్నికల నియమావళి పాటించాలి

● కమిషనర్ స్వప్నిల్ దినకర్ సూచన

చిట్టినగర్, మార్చి 28: ప్రింటర్స్, పబ్లిషర్స్ యజమానులు తప్పక ఎన్నికల నియమావళి పాటించాలని లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని సెంట్రల్ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, కమిషనర్ స్వప్నిల్ దినకర్ హెచ్చరించారు. గురువారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం కమిషనర్ చాంబర్‌లో ప్రింటర్స్, పబ్లికేషన్ యజమానులతో సమావేశం నిర్వహించారు. ప్రింటర్స్ పబ్లిషర్స్ యజమానులు పోస్టర్స్ ముద్రించే సమయంలో ఎన్నికల నిబంధనలు పాటిస్తూ ముద్రించాలని లేకుంటే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. పోస్టర్‌లు, బ్రోచర్స్ ముద్రించే సమయంలో తమ సంస్థ ప్రింటర్, పబ్లిషర్స్ చిరునామా ఉండాలన్నారు. అలా లేనియెడల చర్యలుంటాయన్నారు. ప్రింటర్స్ పబ్లిషర్స్ యజమానులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సెంట్రల్ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి స్వప్నిల్ దినకర్

ఆ ముగ్గురి చేరికతో వెలంపల్లి పతనం ప్రారంభమైంది

● టీడీపీ ఫ్లోర్‌లీడర్ నెలిబండ్ల బాలస్వామి

గవర్నర్‌పేట, మార్చి 28: తిన్నింటి వాసాలు లెక్కించే నందెపు జగదీష్, గంటూరి మహేష్, కోసూరి సుబ్రహ్మణ్యం (మణి) వంటి వారు టీడీపీని వీడి వైసీపీలో చేరడం వల్ల టీడీపీకి పట్టిన దరిద్రం వదిలిపోయిందని, వైసీపీకి మొదలైందని టీడీపీ ఫ్లోర్‌లీడర్, 23వ డివిజన్ కార్పొరేటర్ నెలిబండ్ల బాలస్వామి అన్నారు. నగరంలో వీరు ముగ్గుర్ని ఏ పార్టీ, ఏ వ్యక్తి దగ్గరకు రానివ్వరని ఇది తెలియని వెలంపల్లి శ్రీనివాసరావు ఇలాంటి వ్యక్తుల్ని దగ్గర చేర్చుకోవడం ఆయన పతనం ప్రారంభమైనట్లేనని అన్నారు. గురువారం సూర్యారావుపేటలోని 23వ డివిజన్ టీడీపీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ 2018 నుంచి వీళ్లు వైసీపీ నేతలతో తిరుగుతూ పదవులు అనుభవిస్తున్నారని, మరి ఇప్పుడు పార్టీలో చేరినట్లు ప్రకటనలు ఇవ్వడం నవ్వు పుట్టిస్తోందన్నారు.

ఇళ్ల విషయంలో బొండా ఉమా ఒక్క దరఖాస్తు అమ్ముకున్నట్లు నిరూపిస్తే తాను కార్పొరేటర్ పదవికి రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు. నేతలు విజయకుమార్, గరిమెళ్ల చిన్ని, వెంకటేశ్వరరావు, గోపి, సుబ్బారావు, సామ్రాజ్యం, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

ఓట్లతో వైసీపీకి షాక్ ఇవ్వాలి : బాబూరావు

పాయకాపురం, మార్చి 28 : విద్యుత్ భారాలతో ప్రజలకు షాక్ ఇచ్చిన వైసీపీ ప్రభుత్వానికి ఎన్నికల్లో ప్రజలు ఓట్ల రూపంలో షాక్ ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు అన్నారు. 61వ డివిజన్ శాంతినగర్‌లో గురువారం ఆయన పర్యటించి స్థానికులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్తి, ఇంటి, చెత్త, విద్యుత్ పన్నుల పేరుతో ప్రజలపై భారాలు మోపుతున్న జగన్ ప్రభుత్వానికి ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

రక్తదాన శిబిరం

లబ్బీపేట, మార్చి 28: పీపుల్స్ మార్క్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో లబ్బీపేటలోని సొసైటీ బ్యాంక్ ఆవరణలో గురువారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ ఎల్లారావు మాట్లాడుతూ తమ సంస్థ ప్రతి నెలా ఒక సామాజిక సేవా కార్యక్రమం నిర్వహిస్తూ సమాజానికి తమ వంతు సహాయం అందిస్తుందని, దీనిలో భాగంగా ఈ నెలలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామని అన్నారు. ట్రెజరర్ జ్యోత్స్న మాట్లాడుతూ సేకరించిన రక్తనిల్వలను మచిలీపట్నం ప్రభుత్వ వైద్య సిబ్బంది ద్వారా రక్తనిధికి తరలిస్తామన్నారు. సంస్థ ఉద్యోగులు 40మంది రక్తదానం చేశారు.

పోలీసులు, పారామిలిటరీ దళాల ఫ్లాగ్‌మార్చ్



సత్యనారాయణపురం, మార్చి 28: ఎన్నికల దృష్ట్యా ప్రజల్లో భరోసా కలిగించేందుకు గురువారం సత్యనారాయణపురం పోలీసులు, పారామిలిటరీ దళాలు బీఆర్టీఎస్‌రోడ్డు ఫుడ్ జంక్షన్ వద్ద ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. బీఆర్టీఎస్‌రోడ్డు, రామకోటి మైదానం, బావాజీపేట ప్రాంతాల్లో ఫ్లాగ్‌మార్చ్ చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ మార్చ్‌లో డీసీపీ హరికృష్ణ , నార్త్ ఏసీపీ డీవీఎస్ఎన్ ప్రసాద్, సత్యనారాయణపురం సీఐ వెంకట నారాయణ, అజిత్‌సింగ్‌నగర్, నున్న, సత్యనారాయణపురం సిబ్బంది పాల్గొన్నారు.

పోతిన మహేశ్‌ను కలిసిన తాడి శకుంతల

వన్‌టౌన్, మార్చి 28: విజయవాడ మాజీ మేయర్ తాడి శకుంతల మరికొందరు నాయకులు గురువారం జనసేన అధికార ప్రతినిధి పోతిన మహేశ్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పోతిన మహేశ్ రాజకీయ భవిష్యత్తును ఆరా తీశారు. తనకే పశ్చిమ సీటు వస్తోందని ఎంతో ఆశతో ఎదురుచూసిన పోతినకు సీటు దక్కకపోవడంపై ఆయా వర్గాల్లో విస్తృత చర్చ జరుగుతోంది. ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తారన్న అభిప్రాయం కూడా వ్యక్తమవుతున్నది. ఈ నేపథ్యంలో తాడి శకుంతల తదితరులు కలవడం ప్రాధాన్యత సంతరించుకుంది.

ఆర్టీసీ ఈడీ కోటేశ్వరరావుకు సత్కారం

బస్టేషన్, మార్చి 28: పదవీ విరమణ చేయనున్న ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) కోటేశ్వరరావును ఆయన చాంబర్‌లో గురువారం కార్మిక పరిషత్ నాయకులు సత్కరించారు. కార్మిక పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు శేషగిరిరావు, శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కోశాధికారి సురేంద్ర, ప్రచార కార్యదర్శి యార్లగడ్డ రమేష్, గుంటూరు జిల్లా కార్యదర్శి ఎం. రాజేష్, కడప జిల్లా కార్యదర్శి, జోనల్ ఇన్‌ఛార్జి కార్యదర్శి ఎం పురుషోత్తం, ఇంకా రాష్ట్ర కమిటీ, రీజియనల్, జోనల్, డిపో కమిటీల నాయకులు పాల్గొన్నారు. ఇదే సమయంలో ఇటీవల ఆర్టీసీకి వచ్చిన ఐదు అవార్డులు అందుకున్న ఎండీ ద్వారకా తిరుమలరావును కూడా నాయకులు సత్కరించారు.



కోటేశ్వరరావును సత్కరిస్తున్న కార్మిక పరిషత్ నాయకులు

9న కాళీమాతకు గాజులతో అలంకారం

కృష్ణలంక, మార్చి 28 : త్రిశక్తిపీఠంలోని కాళీమాత అమ్మవారికి ఉగాది సందర్భంగా ఏప్రిల్ 9న గాజులతో విశేష అలంకారం చేయడం జరుగుతుందని ఆలయ కమిటీ కార్యదర్శి కొప్పురావూరి జగదీష్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గాజులు ఇవ్వదలచిన భక్తులు ఏప్రిల్ 3లోగా దేవస్థానంలో అందజేయాలని ఆయన కోరారు.

రేపు ధర్నాచౌక్‌లో సత్యాగ్రహ దీక్ష

భవానీపురం, మార్చి 28 : ప్రజాస్వామ్య పరిరక్షణ కోరుతూ ఈ నెల 30న ధర్నాచౌక్‌లో ఒక రోజు సత్యాగ్రహ దీక్షను నిర్వహిస్తున్నట్లు గాంధీ దేశం సోషల్ వెల్ఫేర్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు ఆర్. గాంధీ నాగరాజన్ ఒక ప్రకటనలో తెలిపారు. నా దీక్షకు అనుమతి ఇవ్వకపోతే ఊర్మిళానగర్ ట్రస్ట్ కార్యాలయంలోనే ఈ దీక్ష చేస్తానని తెలిపారు.

ఆంధ్రజ్యోతి

నవ్య | చిత్రజ్యోతి

శుక్రవారం • 29 మార్చి 2024

cinema@andhrajyothy.com

హుక్ స్టెప్‌తో .. ఇక నా మాటే!



శర్వానంద్ నటిస్తున్న 35వ చిత్రం 'మనమే'. శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో కృతిశెట్టి కథానాయిక. 'ఇక నా మాటే' అంటూ సాగే ఫస్ట్ సింగిల్‌ను గురువారం విడుదల చేశారు. హేషమ్ అబ్దుల్ వహాబ్ స్వరాలు అందించారు. కృష్ణ చైతన్య రాసిన పాట ఇది. లండన్‌లోని అద్భుతమైన లొకేషన్స్‌లో చిత్రీకరించిన ఈ పాటలో శర్వానంద్ హుక్ స్టెప్ యువతని విశేషంగా ఆకట్టుకొంటోంది. ఇంతకు మునుపెన్నడూ లేని స్టైలిష్ అవతార్‌లో శర్వానంద్ కనిపించారు. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తామని నిర్మాత చెప్పారు.

సరికొత్త ట్రెండ్ సృష్టిస్తుంది



నవీన్‌చంద్ర నటించిన వెబ్ సిరీస్ 'ఇన్‌స్పెక్టర్ రిషి'. సునయన, కన్నా రవి, శ్రీకృష్ణ దయాల్ కీలక పాత్రలు పోషించారు. క్రైమ్ హారర్‌గా తెరకెక్కిన ఈ వెబ్ సిరీస్‌కు జే.ఎస్ నందిని దర్శకత్వం వహించారు. సుఖ్‌దేవ్ లాహిరి నిర్మించారు. నేడు 'ఇన్‌స్పెక్టర్ రిషి' తెలుగు, తమిళ్, మలయాళం, హిందీ, కన్నడ భాషల్లో అమెజాన్ ప్రైమ్‌లో విడుదలవుతోంది. ఈ సందర్భంగా హీరో నవీన్‌చంద్ర మాట్లాడుతూ "ఇన్‌స్పెక్టర్ రిషి' కథ విన్నప్పుడు ఎంతో ఎక్సైట్ అయ్యా. హారర్ థ్రిల్లర్స్‌లో ఇది సరికొత్త ట్రెండ్ సృష్టిస్తుంది" అని చెప్పారు. డైరెక్టర్ నందిని మాట్లాడుతూ "తెలుగు ప్రేక్షకులు మంచి కంటెంట్‌ను ఆదరిస్తారు. ఈ వెబ్ సిరీస్‌ను కూడా అలాగే ఆదరిస్తారనే నమ్మకముంది" అని చెప్పారు.

శశివదనుడి ప్రేమగీతం



రక్షిత్ అట్లూరి, కోమలీ ప్రసాద్ జంటగా నటిస్తున్న చిత్రం 'శశివదనే'. సాయి మోహన్ దర్శకత్వంలో అహితేజ బెల్లంకొండ, అభిలాష్‌రెడ్డి గోడల నిర్మిస్తున్నారు. గోదావరి నేపథ్యంలో లవ్, యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతోన్న ఈ చిత్రం ఏప్రిల్ 19న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ చిత్రం నుంచి యూనిట్ మరో పాటను విడుదల చేసింది. 'గోదారి అటువైపో నాదారి ఇటువైపో అమ్మాయి నీదారెటువైపో' అంటూ సాగే గీతాన్ని గురువారం మేకర్స్ విడుదల చేశారు. కిట్టు విస్సా ప్రగడ సాహిత్యం అందించగా, అనుదీప్‌దేవ్ స్వరాలు అందించడంతో పాటు ఆలపించారు. ఈ చిత్రంలో శ్రీమన్, దీపక్ ప్రిన్స్, రంగస్థలం మహేశ్ కీలకపాత్రలు పోషించారు.



ఉత్తమ నటుడిగా జాతీయ అవార్డు అందుకొన్న అల్లు అర్జున్ తాజాగా మరో ఘనతను సాధించారు. దుబాయ్‌లోని మేడమ్ టుస్సాడ్స్ మ్యూజియంలో ఆయన మైనపు విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. గురువారం జరిగిన ఆవిష్కరణ కార్యక్రమంలో అల్లు అర్జున్ పాల్గొన్నారు. 'ఎంతో ఉద్విగ్నంగా ఉంది, ఇదొక గొప్ప గౌరవం' అని బన్నీ పేర్కొన్నారు.



బాలకృష్ణ నట విశ్వరూపాన్ని ప్రదర్శించిన చిత్రం 'లెజెండ్'. 2014 మార్చి 28న విడుదలైన ఈ చిత్రం అప్పట్లో ఇండస్ట్రీ రికార్డులను తిరగరాసింది. పలు అవార్డులు రివార్డులు కొల్లగొట్టింది. ఇప్పుడు మరోసారి ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ నెల 30న 'లెజెండ్'ను ప్రపంచవ్యాప్తంగా రీ రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా గురువారం 'లెజెండ్ బ్లాక్‌బస్టర్ టెన్ ఇయర్స్ సెలబ్రేషన్స్'ను చిత్రబృందం హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమంలో బాలకృష్ణతో పాటు దర్శకుడు బోయపాటి శ్రీను, రామ్ ఆచంట, గోపీ ఆచంట, కథానాయిక సోనాల్ చౌహాన్, నటీనటులు, సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు.

మరింత ఎనర్జిటిక్‌గా ఉంటుంది



తెలుగు ప్రేక్షకులు ఎదురుచూస్తున్న మోస్ట్ అవైటెడ్ సీక్వెల్స్‌లో 'టిల్లు స్క్వేర్' ఒకటి. ఈ చిత్రం నేడు విడుదలవుతున్న సందర్భంగా హీరో సిద్ధు జొన్నలగడ్డ మీడియాతో ఆసక్తికర విషయాలను పంచుకున్నారు.

"డీజే టిల్లు విడుదల సమయంలో ప్రేక్షకుల్లో ఎలాంటి అంచనాలు లేవు. కానీ ఇప్పుడు సీక్వెల్‌పై అంచనాలు తారస్థాయిలో ఉన్నాయి. కాబట్టే కొంచెం ఒత్తిడికి లోనయ్యాం. అయితే ఆ ఒత్తిడిని జయించి బెటర్ అవుట్‌పుట్ ఇచ్చాం. ఇందులో నా పాత్ర మొదటి భాగానికి కొనసాగింపుగా ఉంటుంది. కథ కూడా కొంత కొనసాగుతుంది. కానీ మొదటి భాగంతో పోలిస్తే రెండో భాగంలో నా పాత్ర మరింత ఎనర్జిటిక్‌గా ఉంటుంది. ఎందుకంటే ఈ సారి టిల్లు మరింత పెద్ద సమస్యలో ఇరుక్కుంటాడు. చాలా షాక్‌లు, సర్ప్రైజ్‌లు ఉంటాయి. సినిమా అంతా నవ్వుకుంటూనే ఉంటారు. టిల్లు పాత్ర నా ఆలోచనలు, నేను చూసిన అనుభవాల నుంచి పుట్టింది. టిల్లుకి, నాకు ఒక్కటే తేడా.

టిల్లు తన మనసులో ఉన్నవన్నీ బయటకు అంటాడు. నేను మనసులో అనుకుంటాను అంతే తేడా. సీక్వెల్‌లో రాధిక పాత్ర ఉంటుందో లేదో థియేటర్లో చూసి మీరే తెలుసుకోండి. ఈ సినిమాకు భీమ్స్ సంగీతం ప్రత్యేకాకర్షణ. ప్రస్తుతానికి నా ఫోకస్ అంతా 'టిల్లు స్క్వేర్' విడుదలపైనే ఉంది. పార్ట్-3 కోసం కొన్ని ఐడియాస్ ఉన్నాయి" అని చెప్పారు.

21 ఏళ్ల తర్వాత మళ్లీ అదే రోజున..



విజయ్ దేవరకొండ హీరోగా నటించిన 'ఫ్యామిలీ స్టార్' చిత్రం ట్రైలర్‌ను గురువారం ఉదయం హైదరాబాద్‌లోని శ్రీరాములు థియేటర్‌లో ప్రేక్షకుల మధ్య విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నిర్మాత దిల్‌రాజు మాట్లాడుతూ "గీత గోవిందం' చిత్రం తర్వాత విజయ్, పరశురామ్ కలసి వర్క్ చేసిన సినిమా ఇది. విజయ్ పాత్ర చాలా స్పెషల్‌గా ఉంటుంది. ఇరవై ఒక్క ఏళ్ల క్రితం ఏప్రిల్ 5న విడుదలైన 'దిల్' సినిమాతో నేను నిర్మాతగా మారి, దిల్‌రాజునయ్యా. మళ్లీ ఇప్పుడు అదే ఏప్రిల్ 5న 'ఫ్యామిలీ స్టార్' చిత్రాన్ని విడుదల చేస్తున్నాం. ఈ వేసవిలో మీకు వినోదాన్ని అందించే సినిమా ఇది. ఒక సూపర్ హిట్ చిత్రంతో మీ ముందుకు వస్తున్నాం' అని చెప్పారు. దర్శకుడు పరశురామ్ పెట్ల మాట్లాడుతూ 'ఈ సినిమానూ, హీరో విజయ్ దేవరకొండ, హీరోయిన్ మృణాల్ ఠాకూర్‌ను ప్రతి తెలుగు ప్రేక్షకుడు కొన్నేళ్ల పాటు గుర్తుంచుకుంటాడు. ఐ ఫీస్ట్ లాంటి సినిమా ఇది.' అని చెప్పారు.

పెళ్లి కాదు నిశ్చితార్థం?



హీరో సిద్ధార్థ్, హీరోయిన్ అదితీరావ్ హైదరీ తమ పెళ్లి విషయంలో ట్విస్ట్ ఇచ్చారు. బుధవారం వనపర్తిలోని గుడిలో వీరిద్దరి పెళ్లి జరిగినట్లు వార్తలు వచ్చాయి. అయితే అక్కడ జరిగింది పెళ్లి కాదు నిశ్చితార్థం మాత్రమే అని అదితీ, సిద్ధార్థ్ సోషల్ మీడియా వేదికగా తెలిపారు. తమ నిశ్చితార్థపు ఉంగరాలను చూపుతూ ఇద్దరూ కలసి దిగిన ఫొటోను వారు ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. 'ఆమె ఓకే చెప్పడంతో ఎంగేజ్‌మెంట్ చేసుకున్నాం' అని సిద్ధార్థ్ చెప్పారు. అయితే 'వీరిద్దరూ చెప్పినది నిజమేనా?' అనే సందేహాన్ని నెటిజన్లు వ్యక్తం చేస్తున్నారు. దీనికో కారణం ఉంది. అదితీరావ్ నటించిన 'హీరామండి: ద డైమండ్ బజార్' వెబ్‌సిరీస్ రిలీజ్ డేట్ అనౌన్స్‌మెంట్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. అదితి తప్ప నటీనటులు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. యాంకర్ సచిన్ కుంబర్ మాట్లాడుతూ 'ఈ రోజు అదితీరావ్ పెళ్లి చేసుకోబోతున్నారు. అందుకే ఆమె ఈ కార్యక్రమానికి రాలేదు' అని చెప్పడం గమనార్హం. దీంతో పెళ్లి విషయంలో ఈ జంట ఇంత డొంకతిరుగుడుగా వ్యవహరించడం ఎందుకో అర్థం కావడంలేదంటున్నారు నెటిజన్లు.

9
ఆంధ్రజ్యోతి
నవ్య
నివేదన
శుక్రవారం • 29 మార్చి 2024

క్రీస్తు మరణించిన రోజును గుడ్ ఫ్రైడేగా, పునరుత్థానం చెందిన రోజును ఈస్టర్‌గా క్రైస్తవులు పాటిస్తారు. మరణించిన మహనీయుడు తిరిగి లేచిన రోజును కాకుండా... మరణించిన రోజును శుభమైనదిగా పాటించడం వెనుక లోతైన అంతరార్థం ఉంది.



ఆ త్యాగం స్ఫూర్తితో...

ఈ అనంత విశ్వాన్ని సృష్టించిన దేవుడు... ఆ సృష్టికి మకుటాయమానమైన మానవుణ్ణి కూడా సృష్టించాడు. తన సృష్టినంతటినీ అనుభవించమన్నాడు. అందుకోసం కొన్ని హద్దులు నిర్దేశించాడు. షరతులు పెట్టాడు. వాటిని పాటించలేని మానవుడు గీత దాటాడు. అప్పటివరకూ దేవుని ఆజ్ఞకు బద్ధుడై ఉన్న మనిషి... సాతాను ప్రేరేపణతో... బలహీన క్షణాల్లో మాట మీరాడు. దానివల్ల దైవ ప్రేమను కోల్పోయాడు. "కష్టపడితే కాని నీకు కడుపు నిండదు. నీ సతితో వెళ్ళి, శ్రమించి, మనుగడ సాగించు" అంటూ దేవుడు ఆగ్రహించాడు. అలా దేవునికీ, మానవునికీ మధ్య వేల ఏళ్ళ ఎడబాటు సంభవించింది. అయితే మానవుణ్ణి దైవం పూర్తిగా విడిచిపెట్టలేదు. ఎడబాయక ఎప్పుడూ వెన్నంటే ఉన్నాడు. ప్రత్యక్షంగా కాకపోయినా పరోక్షంగానైనా... అంటే ప్రవక్తల ద్వారా, భక్తులద్వారా, విశ్వాసుల ద్వారా... తన బిడ్డలైన మానవులను సన్మార్గంలో నడిపిస్తూనే ఉన్నాడు. తప్పకుండా వచ్చి

దైవమార్గం




రక్షిస్తానని మాట ఇస్తూనే ఉన్నాడు. ఆ వాగ్దానం ప్రకారమే తన ప్రియమైన కుమారుణ్ణి ఈ లోకానికి పంపాడు. ఆయన ఏసు క్రీస్తు.

ఈ లోకంలో సాధారణ మానవుడిగా జన్మించిన ఏసు ప్రజల్లో తిరిగాడు. వారిని అమితంగా ప్రేమించాడు. సన్మార్గాన్ని బోధించాడు. అద్భుతాలు చేశాడు, వ్యాధులు నయం చేశాడు. చివరకు మానవుల పాప విముక్తి కోసం తన ప్రాణాలను సమర్పించాడు. ఆ సమర్పణ ఒక మహా త్యాగానికి చిహ్నం. అది మామూలు మరణం కాదు, చిత్రవధ. నిర్దాక్షిణ్యంగా చేసిన హత్య. అటువంటి పరిస్థితుల్లోనూ "తండ్రీ! వీరేమి చేయుచున్నారో వీరెరుగరు, గనుక వీరిని క్షమించు" అని అన్నాడు. ఏసు జీవితం యావత్ లోకానికీ ఆయన అందించిన మహా సందేశం.


సాతాను ప్రభావంతో ఆయనను శిష్యుడు ఇస్కరియోతు యూదా పట్టి ఇవ్వడం, యూదా మత పెద్దలు, రోమన్ సైనికులు ఆయనను బంధించడం, తలపై ముళ్ళ కిరీటాన్ని నాటడం, కల్వరి గిరికి ఆయనతో శిలువ మోయించడం, శిలువపై ఆయనను ఉంచి మేకులు కొట్టడం... ఇవన్నీ ఏసు మరణానికి దారి తీసిన సన్నివేశాలు. ఇదంతా దైవప్రణాళికలో భాగమేననేది క్రైస్తవ లోకం విశ్వాసం. ఏసు మరణం... ప్రజల పాప విమోచనకు కారణమైన మరణం. కాబట్టి ఆ శుక్రవారం శుభదాయకమని క్రైస్తవులు నమ్ముతారు. రెండు దినాల తరువాత... ఏసు పునరుత్థానం చెందిన రోజును ఈస్టర్‌గా జరుపుకొంటారు. అది ఆదివారం వస్తుంది. నెలరోజుల పాటు ఉపవాసాలతో క్రైస్తవులు పాటించే శ్రమ దినాలు దీనితో ముగుస్తాయి. ఏసుక్రీస్తు ప్రాణత్యాగం స్ఫూర్తితో... కష్టాలను ధైర్యంగా స్వీకరిస్తూ, తోటి మానవులను ప్రేమిస్తూ జీవనం సాగించాలి. దానికి శుభ శుక్రవారం నాంది కావాలి.

• డాక్టర్ దేవదాసు బెర్నార్డ్ రాజు
9866755024


నేడు గుడ్ ఫ్రైడే

అతిథి

భారతీయ మతాలు, వివిధ ధర్మాలకు సంబంధించిన అంశాలపై సాధికారత కలిగిన చరిత్రకారుల్లో **దేవదత్ పట్నాయక్** ఒకరు. ఆయన రాసిన అనేక పుస్తకాలు విశేష ప్రజాదరణ పొందాయి. తాజాగా ఆయన రాసిన 'బాహుబలి- 63 ఇన్‌సైట్స్ ఇన్ టూ జైనిజం' అనే పుస్తకంపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో- ఆయన 'నివేదన'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూ...



ఏ మత పురాణమైనా చెప్పేది ఒక్కటే

జైన మతంపై ప్రత్యేక దృష్టి సారించి ఈ పుస్తకం రాయడం వెనుక ఉద్దేశమేమిటి?

జైన మతం గురించి ఎవరికీ ఎక్కువగా తెలియదు. భారతీయ సంస్కృతి ఉద్దీపనలో జైనులకు ప్రత్యేకమైన పాత్ర ఉంది. అనేక రంగాల్లో వారి ప్రభావం ఈనాటికీ మనకు స్పష్టంగా కనిపిస్తూ ఉంటుంది. కానీ దురదృష్టవశాత్తు- జైనుల ప్రస్తావన వచ్చినప్పుడు- జైన్ ఫుడ్ గురించో, వారు ఉల్లిపాయలు తినరనే విషయం గురించో మాట్లాడుకుంటూ ఉంటారు. వైదిక మతం రాక ముందు భారత ఉపఖండంలో జైన మత ప్రభావం ఎక్కువగా ఉండేది. వారికి ఒక బలమైన తాత్విక పునాది ఉంది. తీర్థంకరులు, మహాపురుషులు, చక్రవర్తులు, వాసుదేవులు, ప్రతివాసుదేవులు- ఇలా అనేకమంది జైన మతంలో కనిపిస్తారు. వారందరూ భారతీయ తాత్విక చింతనను ప్రభావితం చేసినవారే! వీరితో పాటుగా- జైన మతంలోని 63 ప్రధానమైన ఆలోచనాధారలను ఈ పుస్తకంలో ప్రస్తావించా. ఈ పుస్తకం ద్వారా జైనమతం మన భారతీయ సంస్కృతిని పరిపుష్టం చేసిందనే విషయాన్ని చెప్పాలనుకున్నా. దానికి ఇంగ్లీషులో 'బాహుబలి- 63 ఇన్‌సైట్స్ ఇన్ టూ జైనిజం' అని పేరు పెట్టాను. దాన్నే హిందీలో కూడా విడుదల చేశాం.

ఈ పుస్తకానికి మూలంగా నిలిచిన గ్రంథాలేవైనా ఉన్నాయా?

జైన మత సిద్ధాంతాలకు సంబంధించిన అనేక పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. కానీ దేనికైనా మూలం అనేది ఎక్కడా లభించదు. ఉదాహరణకు భగవద్గీతను తీసుకుందాం. భగవద్గీత మూలం కనుక్కోవాలంటే - కృష్ణుడి దాకా వెతుక్కుంటూ వెళ్లాలి. అర్జునుడికి కృష్ణుడు చెప్పినది, దాన్ని ధృతరాష్ట్రుడికి సంజయుడు వినిపించినది... వీటన్నింటికీ ఆధారాలేముంటాయి? ఒక గొప్ప ఆలోచన- కొన్ని వేల సంవత్సరాలను ప్రభావితం చేస్తున్నప్పుడు- దానికి అనేక వ్యాఖ్యానాలు వస్తాయి. దీన్ని నేను వేరే కోణం నుంచి చూస్తాను. సనాతన ధర్మంలో- "మనకు ఎంత జీర్ణమవుతుందో అంతే తినాలి" అని చెబుతారు. అంటే- మనకున్న ఆలోచనా శక్తి ఆధారంగా విజ్ఞానాన్ని గ్రహించగలుగుతాం. కొందరు సులభంగా ఆలోచిస్తారు. కొందరు సంక్లిష్టంగా ఆలోచిస్తారు. వారి వారి మేధో వైశాల్యాన్ని బట్టి విజ్ఞానం లభ్యమవుతుంది. అందువల్ల కొన్ని సందర్భాలలో మూలాల గురించి చర్చ జరపటం వల్ల ప్రయోజనం ఉండదు.

కానీ నిజం అనేది ఒకటి ఉంటుంది కదా... పురాణాలు సత్యం చెబుతాయా?

చరిత్ర గడిచిన గతాన్ని, వర్తమానాన్ని చెబుతుంది. పురాణాలకు కాలం ఉండదు. చరిత్ర సంఘటనలను చెబుతుంది. పురాణాలు ఆలోచనా విధానాన్ని కథల రూపంలో చెబుతాయి. ఇక 'నిజం' అనే భావన- పాశ్చాత్య సంస్కృతి వల్ల 200 ఏళ్ల క్రితం వ్యాపించింది. చరిత్రను ఈ కోణం నుంచి చూడటం మొదలుపెట్టారు. ఇదొక విధానం. ఇక పురాణాల విషయానికి వస్తే- ప్రతి మతంలోనూ కొన్ని పురాణాలు ఉంటాయి. అవి ఆ మత సిద్ధాంతాలను చెబుతూ ఉంటాయి. ఇక్కడ అందరం గమనించాల్సిన విషయమేమిటంటే- అన్ని మత పురాణాలూ చెప్పేది- 'మానవులు అందరూ ఒక్కటే. అందరినీ దయతో చూడాలి' అని. నా ఉద్దేశంలో ఇదే సత్యం.

ఆధునిక కాలంలో మతం ఉపయోగమేమిటనే చర్చ ఇటీవల జరుగుతోంది.. దీనిపై మీ అభిప్రాయమేమిటి?

మనిషి మనుగడకు మతం చాలా ముఖ్యం. ఎందుకంటే- మనిషి పుట్టుకతోనే అభద్రతతో ఉంటాడు. అతనికి ఆ అభద్రతను తొలగించేది మతం. అందుకే ఇన్ని వేల ఏళ్లు రకరకాల మతాలు తమ అస్తిత్వాన్ని కోల్పోకుండా ఉన్నాయి. కానీ క్రమేపీ ఏ మతం గొప్ప అనే వాదనలు మొదలయ్యాయి. నా ఉద్దేశంలో - ఈ వాదన- ఇద్దరు పిల్లలు- 'మీ నాన్న కన్నా మా నాన్న గొప్ప' అని దెబ్బలాడుకున్నట్లు అనిపిస్తుంది. అయితే ఇక్కడ సరదాగా ఒక విషయం చెబుతాను. ఇలాంటి వాదనలన్నిటి కన్నా కత్తి గొప్పది. కత్తి ఎవరి చేతిలో ఉంటుందో వాళ్లదే పై చేయి అవుతుంది.

> **ఈ పుస్తకంలో అజీవికల గురించి ఉందా?**
>
> 
>
> జైన మత ప్రభావం ఎక్కువగా ఉన్న రోజుల్లో అజీవికలు అనే వారు కూడా ఉండేవారు. వారికి జైనులకు మధ్య సైద్ధాంతిక విభేదాలు ఉండేవి. 'మనల్ని మనం నియంత్రించుకోం. మనల్ని నియంత్రించేది వేరే ఉంది' అనేది అజీవికల సిద్ధాంతం. మనను మనం నియంత్రించుకోగలమనేది జైనుల సిద్ధాంతం. ఈ నియంత్రణ కోసమే జైనులు ఉపవాసాన్ని ఒక ఆయుధంగా వాడుకోవటం మొదలుపెట్టారు. అయితే అజీవికల గురించి ఎక్కువ సమాచారం అందుబాటులో లేదు. ఈ పుస్తకంలో వీలైనంత సమాచారాన్ని అందించాను.

> **మీ దృష్టిలో రాముడెవరు?**
>
> రాముడి గురించి ఒక కథ చెబుతాను. రాముడు వనవాసానికి వెళ్లేటప్పుడు- అయోధ్యలో ప్రజలందరూ ఆయనతో పాటు నగరం పొలిమేరల దాకా వచ్చారు. అప్పుడు రాముడు- "మీరందరూ తిరిగి వెళ్లిపోండి. నా రాజ్యం, నా నగరం ఎప్పటిలాగానే సుభిక్షంగా, సిరిసంపదలతో తులతూగుతూ ఉండాలి" అన్నాడు. ప్రజలు వెనక్కి తిరిగి వెళ్లిపోవటం మొదలుపెట్టారు. 14 ఏళ్ల తర్వాత వనవాసం ముగించుకొని రాముడు అయోధ్యకు తిరిగి వచ్చాడు. కొందరు ఆ పొలిమేరల్లోనే నివాసం ఏర్పాటు చేసుకుని ఉన్నారు. వాళ్లను చూసి రాముడు- "అందరినీ రాజ్యానికి వెళ్లిపొమ్మన్నా కదా... మీరెందుకు ఉండిపోయారు?" అని అడిగాడు. అప్పుడు వాళ్లు - "రామా! నువ్వు నరనారీలందరినీ వెళ్లిపొమ్మన్నావు. కానీ మేము నరులం కాదు నారీలం కాదు. మేము శాకాహారులం కాదు, మాంసాహారులం కాదు. అలాంటప్పుడు మేము రాజ్యానికి ఎలా తిరిగి వెళ్తాం" అని ప్రశ్నించారు. అప్పుడు రాముడి దుఃఖంతో- "నేను తప్పు చేశాను. క్షమించండి. నాకు అందరూ సమానమే! మీరు లేని రాజ్యంలో నేను ఎలా ఉంటాను." అని వాళ్లను తీసుకొని నగర ప్రవేశం చేశాడు. నా రాముడు అందరినీ సమదృష్టితో చూస్తాడు. అందరికీ సమాన అవకాశాలు కల్పిస్తాడు.

మీ ఉద్దేశంలో సీరియల్స్, సినిమాల్లో వచ్చే రామాయణ, మహాభారత గాథలు ఎంతవరకు మూలానికి అనుగుణంగా ఉంటాయి?

సీరియల్స్, సినిమాలు తీసే వారి అజెండా టీఆర్‌పీలు, కలెక్షన్స్. నేను అనేక టీవీ సీరియల్స్‌కు పనిచేశాను. డైరెక్టర్స్ వచ్చి- "ఇక్కడ కొంత డ్రామా కావాలండి" అని అడుగుతూ ఉంటారు. వాళ్లకు లక్ష్మీ కటాక్షం కావాలి... అంతే! అయితే ఇక్కడ ఒక విషయాన్ని స్పష్టంగా చెప్పదలుచుకున్నా. శాస్త్రం ఏ మనిషినీ ఉత్తేజితుణ్ణి చేయదు. అతనిలో ఆలోచన రేకెత్తిస్తుంది. ప్రశాంతత ఇస్తుంది. అంటే- మనం ఒక ధర్మశాస్త్రం చదివితే- మనకు ప్రశాంతత లభించాలి. అంతే తప్ప ఇతరులతో యుద్ధం చేయాలనే ఆలోచన రాకూడదు. ఒక వేళ అలాంటి ఆలోచనలు వచ్చాయంటే అది శాస్త్రం కాదు.

రైట్‌వింగ్, లెఫ్ట్‌వింగ్- ఈ రెండింటి మధ్య ఒక ఘర్షణ ఉంటుంది. ఈ రెండు భావజాలాలను మీరు ఎలా చూస్తారు?

సనాతన ధర్మంలో- కుడివైపు పురుష దేవుళ్లను పెడతాం. ఎడమవైపు దేవతలను ఉంచుతాం. కుడివైపు శివుడు ఉంటే, ఎడమవైపు శక్తిని ఉంచుతాం. వీరిద్దరూ కలిస్తేనే బ్యాలెన్స్ ఏర్పడుతుంది. ఈ రెండు భావజాలాలు అంతే! రెండూ కలిస్తేనే దేశం ముందుకు వెళ్తుంది.

మన ఆధునిక యువతకు పురాణాలు ఏ విధంగా ఉపయోగపడతాయి?

ఒక్కొక్క ప్రాంతానికి ఒక్కొక్క సంస్కృతి ఉంటుంది. ఆ సంస్కృతి అభివృద్ధి చెందటానికి వెనక కొన్ని కారణాలు ఉంటాయి. ఆ కారణాలను ఆ ప్రాంతంలో ఉన్న కథలు, పురాణాలు చెబుతాయి. ఆధునిక సమాజంలో మానవుడికి ఎటువంటి ఎల్లలూ లేవు. కానీ వేరే ప్రాంతానికి వెళ్లినప్పుడు అక్కడ ఉన్న సంస్కృతి గురించి తెలుసుకుంటే ఎంతో ప్రయోజనం ఉంటుంది. ఉదాహరణకు మనం చైనాతో వ్యాపారం చేయాలనుకున్నాం. వాళ్లు చేతులతో కాకుండా చాప్‌స్టిక్స్‌తో ఎందుకు తింటారు? వాళ్లు నమ్మే తాత్విక సిద్ధాంతాలేమిటి? అక్కడ ప్రచారంలో ఉన్న కథలేమిటి? మొదలైనవి తెలుసుకుంటే వాళ్లను కూడా కలుపుకొని పోగలుగుతాం.

• సివిఎల్ఎన్ ప్రసాద్

పొత్తులు ద్వాపరంలోనూ ఉన్నాయి

వందేభారతం



పొత్తులు తప్పేం కాదు. ఆకాశం తిరగబడినా... మోచేతులతో తోసేసి నిలబడగలం అనుకొనే వారికి కూడా చాలాసార్లు పొత్తులు అవసరమవుతాయి. పొత్తులకోసం వెళ్ళే వారికి కార్యం సాధించే విధానం, మాట్లాడే పద్ధతి తెలిసి ఉండాలి. సర్వం చక్కబెట్టుకురాగలిగే సామర్థ్యం ఉండాలి. పొత్తుకు వెళుతున్నప్పుడు ఒక్కొక్కరూ ఒక్కొక్క రకంగా మాట్లాడతారు. "మనకేం తక్కువ? ఒంటరి పోరు చెయ్యలేమా? మనం వెళ్తే... వాళ్ళందరికీ లోకువకామా? మనం అడగడం, వాళ్ళు "అవి ఇవ్వండి, ఇవి ఇవ్వండి" అని బేరాలాడడం అవమానం కాదూ? మనల్ని మనమే తక్కువ చేసుకోవలసిన అవసరం లేదు. ఎందరొచ్చినా మనం యుద్ధానికి తయారుగా ఉన్నాం, అంతే!" అంటూ అనవసరపు పౌరుషాలు ప్రదర్శించేవారు ఉంటారు. "మా బాగా చెప్పావు" అని నిప్పులో నెయ్యి పోసినట్టు ఎగదోసేవాళ్ళు ఉంటారు. సంధికో, పొత్తుకో వెళ్ళేవారు అందరికీ అనునయంగా నచ్చజెప్పాలి. ఇరుపక్షాలకూ మేలు కలిగే విధానం అవలంబించాలి.

ఒకసారి భారతాన్ని పరిశీలిస్తే... కురు-పాండవ యుద్ధ సమయం వచ్చింది. బలసమీకరణకోసం తమవారు, ఎదుటివారు అనే మీమాంస పెట్టుకోకుండా... యుద్ధంలో తమ పక్షాన నిలబడాలని కౌరవులు, పాండవులు తమకు మిత్రులనుకున్న రాజులందరినీ అభ్యర్థించారు. 'కృష్ణుడు మనవాడే కదా! అతణ్ణి కూడా సాయం అడగాలా?' అని పాండవులు అనుకోలేదు. శ్రీకృష్ణుడి దగ్గరకు అర్జునుడు వెళ్ళాడు. కృష్ణుడు వైరి పక్షంవాడని తెలిసి కూడా... అతని సాయం కోరడానికి దుర్యోధనుడే స్వయంగా ద్వారకకు వెళ్ళాడు. యుద్ధానికి వెళ్ళేవారు ఎప్పటికప్పుడు తమ బలం, ఎదుటివారి బలం బేరీజు వేసుకుంటూ ఉండాలి. మొండి పట్టుదలకు, దురభిమానానికి పోకుండా... సంధి చేసుకోవలసిన వారితో సంధి చేసుకోవాలి. పొత్తు మంచిదనుకున్నవారితో పొత్తు కుదుర్చుకోవాలి. దుర్యోధనుడివైపు బలశాలులైన పెక్కుమంది సోదరులతో పాటు... భీష్ముడు, ద్రోణుడు, కర్ణుడు, శల్యుడు, అశ్వత్థామ, కృపుడు, బాహ్లికుడు, కృతవర్మ, భూరిశ్రవుడు, శకుని, అతని కుమారుడు ఉలూకుడు, సైంధవుడు లాంటి యోధానుయోధులు ఉన్నారు. అలాగే తూర్పు, దక్షిణ, ఉత్తర, పడమటి దేశాల రాజులు, అంగ, కేకయ, సింధు దేశాధీశులు, మాహిష్మతి, అవంతి, మద్ర, గాంధార ,కాంభోజ, ప్రాగ్జ్యోతిష రాజులు, యవనులు, త్రిగర్తలు, అంబష్ఠులు, మాళవులు, విందానువిందులు, సౌవీరులు... ఇలా ఎందరితోనో పొత్తు పెట్టుకొని పదకొండు అక్షౌహిణుల సైన్యాన్ని కౌరవులు ఏర్పరుచుకున్నారు.

అలాగే పాండవులు... వారిలో ఎవరు తక్కువ చెప్పండి! ధర్మరాజు, అతని సోదరులు... అందరూ అతిరథులు, మహారథులు. ఇక అర్జునుడి సంగతికి వస్తే... ఇలాంటివాడని చెప్పడానికి పోలిక కూడా లేదు. పైగా అతనికి జగత్పతి, జగదేకవంద్యుడు అయిన శ్రీహరి తోడు. అభిమన్యుడు కూడా సామాన్యుడు కాడు. అతనొక్కడే కృష్ణార్జునులకు సమానం. వీరుకాక సాత్యకి, ద్రుపదుడు, విరాటుడు, శిఖండి, దృష్టద్యుమ్నుడు, ఘటోత్కచుడు, మల్లరాజులు, కాశీరాజులు, కుంతిభోజులు, చోళ, దక్షిణ నిషాద, ద్రవిడ, కుళింద, అశ్మక... ఇంకా మగధ చుట్టూ ఉన్న నిషాద రాజ్యాలు, నాగ రాజ్యానికి చెందిన ఇరావణుడు... ఇలా ఎందరో రాజులు, రాజ్యాలు, సామంత రాజ్యాలు, మిత్ర రాజ్యాలతో పాండవుల వైపున ఏడు అక్షౌహిణుల బలగం ఏర్పడింది. కాబట్టి పొత్తులు పెట్టుకోడం తప్పూ కాదు, బలహీనతా కాదు. ధరణిలో సహకారం, ఐక్యతే బలం.

> యుద్ధానికి వెళ్ళేవారు ఎప్పటికప్పుడు తమ బలం, ఎదుటివారి బలం బేరీజు వేసుకుంటూ ఉండాలి. మొండి పట్టుదలకు, దురభిమానానికి పోకుండా... సంధి చేసుకోవలసిన వారితో సంధి చేసుకోవాలి. పొత్తు మంచిదనుకున్నవారితో పొత్తు కుదుర్చుకోవాలి.

అయితే... గాంధారి చెప్పిన 'యతో ధర్మస్తతో జయః' అనే మాట ఇక్కడ గుర్తుచేసుకోవాలి. ఎవరి పక్షాన ఎంతమంది ఉన్నారనేది ఎంత ముఖ్యమో... ఎంతమంది శ్రేయోభిలాషులు, రాజనీతిజ్ఞులు, నీతిమంతులు, యుద్ధనియమాలు తప్పనివారూ ఉన్నారనేది కూడా అంతే ముఖ్యం. పాలకులకు రెండు కళ్ళుంటే... పాలితులకు మూడు కళ్ళుంటాయి. వారు మూడో కన్ను తెరవకుండా ప్రభువులు జాగ్రత్తపడాలి.

• ప్రయాగ రామకృష్ణ

సందేశం

ఫిత్రాతో ప్రక్షాళన

రంజాన్ మాసంలో ఉపవాసాలు, ఖుర్‌ఆన్ పఠనం, నమాజ్‌తో పాటు దానధర్మాలు కూడా విరివిగా చెయ్యాలనేది నియమం. మన కడుపు నింపుకోవడం, సుఖాలు అనుభవించడం అనేవి జీవిత ధ్యేయాలు కాకూడదనీ, వాటికన్నా విలువైన విషయాలు ఉన్నాయనీ ఉపవాసవ్రతం మనకు నేర్పుతుంది. పవిత్ర రంజాన్ మాసంలో అత్యధికంగా దానధర్మాలు చేయాలి. ఈ లక్ష్యం కోసమే ఫిత్రాను విధిగా ఇస్లాం ధర్మం నిర్ణయించింది. అంతిమ దివ్యగ్రంథమైన ఖుర్‌ఆన్ అవతరించిన రంజాన్ మాసంలో పేదలకు అందజేసే సాయాన్ని 'ఫిత్రా' (దానం) అంటారు. ఫిత్రా పేదల హక్కు. దాన్ని తప్పనిసరిగా నెరవేర్చాలి.

'ఫిత్ర్' అంటే ఉపవాసాలను విరమించడం లేదా పరిసమాప్తం చేయడం అని అర్థం. 'ఈద్-ఉల్-ఫిత్ర్' అంటే రంజాన్ రోజాలు (ఉపవాసాలు) ముగించి... సంతోషించే రోజు. ఆ రోజున పేదలకు తప్పనిసరిగా దానం చేయాలి. ఫిత్రా ముఖ్య ఉద్దేశాలు రెండు. ఉపవాస సమయంలో మనిషి ఎంత జాగ్రత్తగా మసలుకున్నా తెలిసీ తెలియని పొరపాట్లు జరుగుతాయి. మనిషి తన సంపద నుంచి కొంత మొత్తం దైవమార్గంలో ఖర్చు పెడితే... జరిగిన పొరపాట్ల క్షమాపణకు అది దోహదపడుతుంది. రెండోది సమాజంలోని నిరుపేదలు, అనాథలు, అర్హులు కూడా పండుగ చేసుకోవడానికి వీలు కలుగుతుంది.

"ఉపవాసి వల్ల జరిగే అవాంఛనీయ విషయాలను ప్రక్షాళన చేయడానికి, సమాజంలో నిరుపేదలను, అభాగ్య జీవులను ఆదుకోవడానికి ఫిత్రాదానాన్ని ఒక విధిగా చేయడం జరిగింది. నిరుపేదలకు పండుగ కన్నా ముందే ఫిత్రా దానం చేయడం చాలామంచిది దానివల్ల వారికి పండగ రోజున యాచించే అగత్యం ఏర్పడకుండా ఉంటుంది" అని వివిధ సందర్భాల్లో దైవ ప్రవక్త మహమ్మద్ స్పష్టం చేశారు.

ఆర్థిక స్థోమత కలిగిన పురుషులు యుక్తవయసు రాని తమ సంతానం తరఫున ఫిత్రా చెల్లించాలి. యుక్తవయసులో ఉన్నవారు ఆర్థిక స్థోమత కలిగినట్టయితే... వారే చెల్లించాల్సి ఉంటుంది. లేకపోతే వారి తరఫున తండ్రి చెల్లించాలి. తండ్రి లేని వారైతే ఆ బాధ్యత వారి తాతపై ఉంటుంది. ఆహార వస్తువుల్లో ఒక 'సా' పరిమాణంలో (రెండున్నర కిలోలు) ఫిత్రాను ఇవ్వాల్సి ఉంటుంది. అర్హులు, నిరుపేదలు, బాటసారులు ఫిత్రాకు అర్హులు. అలాగే ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నవారిని ఆదుకోవడానికి, బానిసలను విముక్తి చేయడానికి, రుణగ్రస్తుల్ని రుణవిముక్తి చేయడానికి, దైవ మార్గంలో ఖర్చు చేయడానికి ఫిత్రాను వినియోగించవచ్చు. ఒక వ్యక్తి తన ఫిత్రాను ఒకరికీ, అంతకన్నా ఎక్కువమందికి ఇవ్వవచ్చు. అలాగే కొందరి ఫిత్రాలను కలిపి ఒకరికైనా, ఎక్కువమందికైనా ఇవ్వవచ్చు. రంజాన్ ఉపవాసాలు చేయడం వీలు కానివారు కూడా ఫిత్రా దానం చేయాలి. ఈద్ నమాజ్‌కు ముందే ఇవ్వాలి. ఈద్‌కు రెండు మూడు రోజుల ముందు ఈ దానం చేస్తే... అర్హుల అవసరాలకు ఉపయోగపడతాయి.



• మహమ్మద్ వహీదుద్దీన్

గీతాసారం

అదే అర్జునుడు... అదే బాణం

'అదే అర్జునుడు, అదే బాణం' అనేది ఒక సామెత. సమర్థుడైన వ్యక్తి ఎప్పుడైనా తన కర్మక్షేత్రంలో విఫలమైనప్పుడు... ఆ స్థితిని వివరించడానికి దీన్ని ఉపయోగిస్తారు. యోధుడిగా అర్జునుడు ఎప్పుడూ యుద్ధంలో ఓడిపోలేదు. కానీ అతని జీవితపు చరమాంకంలో... కొంతమంది కుటుంబ సభ్యులను బందిపోట్ల సమూహం నుంచి రక్షించడానికి చేసిన చిన్న యుద్ధంలో ఓటమిపాలయ్యాడు. అప్పుడు తన సోదరుడితో "ఏం జరిగిందో నాకు తెలీదు. నేను అదే అర్జునుణ్ణి. ఇవి కురుక్షేత్ర యుద్ధాన్ని గెలిచిన అవే బాణాలు. కానీ ఈసారి నా బాణాలు లక్ష్యాన్ని ఛేదించలేకపోయాయి. లేదా శక్తిని కోల్పోయాయి" అంటాడు. మనలో ఎవరికైనా ఇలా జరగవచ్చు. ప్రతిభావంతులైన క్రీడాకారులు కొంత కాలం తమ క్రీడా సామర్థ్యాన్ని (ఫామ్‌ను) కోల్పోతారు. ఒక నటుడు, గాయకుడు విఫలమవుతారు.



దురదృష్టం, చెడు సమయం లాంటివి వీటికి ఆపాదిస్తూ ఉంటారు. దీనికి శాస్త్రీయమైన వివరణ లేదు.

కర్మ - కర్మఫలాల మధ్య సంబంధాన్ని శ్రీకృష్ణుడు వివరిస్తూ దైవం (భగవంతుడి సహకారం/ సంకల్పం/ ఆశీస్సులు) కర్మను నెరవేర్చడానికి దోహదపడే అంశాల్లో ఒకటని తెలిపాడు. "కర్మపై నీకు హక్కు ఉంది కాని కర్మ ఫలం మీద కాదు" అని శ్రీకృష్ణుడు చెప్పడానికి కారణం అదే. హస్తసాముద్రికం, జ్యోతిషం, రాశిఫలాలు చెప్పడం లాంటి విద్యలను కొందరు అభ్యసిస్తారు. కానీ వాటిలో ఏదీ దైవం కాదు. అదే విధంగా దైవాన్ని అంచనా వేయగలిగే శాస్త్రీయ సిద్ధాంతం ఏదీ లేదు. సర్వశక్తిమంతుడు చేసిన గొప్ప రూపకల్పనలో (సృష్టిలో) మనం నిమిత్రమాత్రులం అనీ, చిన్న తునకలం అనీ శ్రీకృష్ణుడు మనకు గుర్తు చేస్తున్నాడు. విజయం మనలో అహంకారాన్ని పుట్టించకపోతే... వైఫల్యం మనల్ని బాధించదు. ఎందుకంటే రెండూ దైవం ద్వారానే ప్రభావితమవుతాయి.


కె. శివప్రసాద్
ఐఎఎస్

బిజినెస్

కార్వీ ఇన్వెస్టర్ సర్వీసెస్‌పై సెబీ వేటు

రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ రద్దు

న్యూఢిల్లీ: కార్వీ ఇన్వెస్టర్ సర్వీసెస్ (కేఐఎస్ఎల్)పై మార్కెట్ నియంత్రణ మండలి సెబీ మరోసారి కొరడా ఝుళిపించింది. మర్చంట్ బ్యాంకర్‌గా ఆ సంస్థకు ఉన్న రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసింది. గురువారం దీనికి సంబంధించి 24 పేజీల ఆదేశాలు జారీ చేసింది. గత ఏడాది మార్చి 15-17 తేదీల్లో తాము జరిపిన తనిఖీల్లో సంస్థ పేర్కొన్న చిరునామాల్లో కార్యాలయాలు కూడా లేవని తెలిపింది. దీనికి తోడు మర్చంట్ బ్యాంకర్‌గా విధులు నిర్వహించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ఉద్యోగులు, పరికరాలు కూడా కంపెనీ వద్ద లేవని పేర్కొంది. రిజిస్ట్రేషన్ రద్దుతో కేఐఎస్ఎల్ మర్చంట్ బ్యాంకర్‌గా విధులు నిర్వహించే అవకాశాన్నీ కోల్పోయింది.

ప్రభుత్వ అప్పులు రూ.160 లక్షల కోట్లు

న్యూఢిల్లీ: గత ఏడాది డిసెంబరు త్రైమాసికం ముగిసే నాటికి కేంద్ర ప్రభుత్వ స్థూల అప్పుల భారం రూ.160.69 లక్షల కోట్లకు చేరింది. 2023 సెప్టెంబరు త్రైమాసికంలో నమోదైన రూ.157.84 లక్షల కోట్లతో పోలిస్తే ఇది 1.8 శాతం ఎక్కువ. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఇందుకు సంబంధించిన వివరాలను గురువారం విడుదల చేసింది. గత ఏడాది డిసెంబరు మాసాంతానికి ఉన్న స్థూల రుణ భారంలో 90 శాతం ప్రభుత్వ అప్పులని తెలిపింది. మొత్తం రుణాల్లో ఏడాది లోపు చెల్లించాల్సిన అప్పులు సెప్టెంబరు త్రైమాసికంతో పోలిస్తే డిసెంబరు త్రైమాసికంలో 4.6 శాతం నుంచి 4.1 శాతానికి తగ్గాయి. ఏడాది నుంచి ఐదేళ్లలో చెల్లించాల్సిన అప్పులూ 23 శాతం నుంచి 21.8 శాతానికి తగ్గినట్లు ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది.

ఫిబ్రవరి చివరికి విత్తలోటు రూ.15 లక్షల కోట్లు: కేంద్ర ప్రభుత్వ విత్తలోటు ఫిబ్రవరి చివరి నాటికి వార్షికంగా నిర్దేశించిన లక్ష్యంలో 86.5 శాతానికి చేరింది. రూపాయి విలువపరంగా ఇది రూ.15 లక్షల కోట్లుగా నమోదైంది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	67,310 ▲	61,700 ▲	80,500 ▲
ముంబై	67,252 ▲	61,603 ▲	74,127 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



29వ తేదీ

హైదరాబాద్	375
చిత్తూరు	458
గోదావరి	400
విజయవాడ	400
విశాఖపట్నం	415
వరంగల్	377

డజను గుడ్లు రూ.72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	122
వరంగల్	122
కరీంనగర్	122
మహబూబ్‌నగర్	122
కర్నూలు	123
విశాఖపట్నం	117
గోదావరి	121
విజయవాడ	121
గుంటూరు	122
ఒంగోలు	122
చిత్తూరు	135

రూ.129 లక్షల కోట్లు

2023-24లో మార్కెట్ సంపద వృద్ధి ఇది..

ఏడాదిలో 14,660 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్

సరికొత్త రికార్డు గరిష్ఠాలకు ఈక్విటీ సూచీలు

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-24)లో స్టాక్ మార్కెట్ కొనుగోళ్ల జాతరలా కళకళలాడింది. సూచీల రికార్డులతో దలాల్ స్ట్రీట్ దద్దరిల్లింది. బీఎస్ఈ సెన్సెక్స్ ఏకంగా 14,659.83 పాయింట్లు (24.85 శాతం) పుంజుకుంది. ఈ నెల 7న సూచీ 74,245.17 వద్ద సరికొత్త జీవితకాల గరిష్ఠాన్ని నమోదు చేసింది. నిఫ్టీ విషయానికొస్తే, ఏడాది కాలంలో 4,967.15 పాయింట్లు (28.61 శాతం) లాభపడింది. గడచిన ఏడాది కాలంలో ఈక్విటీ మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్ఈ మార్కెట్ క్యాపిటలైజేషన్ ఏకంగా రూ.128.77 లక్షల కోట్లు పెరిగి మొత్తం రూ.386.98 లక్షల కోట్ల స్థాయికి చేరుకుంది. భారత ఆర్థిక వ్యవస్థ మూలాలు బలంగా ఉండటంతో పాటు మార్కెట్లోకి పెట్టుబడులు భారీగా తరలి రావడం, కార్పొరేట్ కంపెనీల ఆశాజనక పనితీరు మార్కెట్ ర్యాలీకి ప్రధానంగా దోహదపడ్డాయి.



మార్కెట్ విలువపరంగా టాప్-5 కంపెనీలు

సంస్థ	రూ.లక్షల కోట్లు
రిలయన్స్ ఇండస్ట్రీస్	20.14
టీసీఎస్	14.05
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	11.00
ఐసీఐసీఐ బ్యాంక్	7.69
భారతీ ఎయిర్‌టెల్	6.99

స్మాల్, మిడ్‌క్యాప్‌లదే హవా

ఈ ఆర్థిక సంవత్సరంలో చిన్న, మధ్య స్థాయి కంపెనీల షేర్లు భారీగా పుంజుకున్నాయి. చాలా కంపెనీల షేర్లు ఇన్వెస్టర్లకు మల్టీ బ్యాగర్ రిటర్నులు పంచాయి. 2023-24లో బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ 70 శాతం, మిడ్‌క్యాప్ ఇండెక్స్ 60 శాతం వృద్ధి చెందడమే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం. బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీలోని 1,000 కంపెనీల షేర్ల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ గడిచిన ఏడాది కాలంలో ఏకంగా రూ.26 లక్షల కోట్ల పెరుగుదలతో మొత్తం రూ.66 లక్షల కోట్లకు చేరుకుంది. స్మాల్, మిడ్‌క్యాప్ విభాగంలో బుడగ ఏర్పడుతున్నదని సెబీ చీఫ్ మాధవి పురి బుచ్ చేసిన వ్యాఖ్యలతో పాటు చాలా షేర్లు అధిక ధరల వద్ద ట్రేడవుతున్నాయన్న ఆందోళనల నేపథ్యంలో ఈ నెలలో స్మాల్, మిడ్‌క్యాప్ సూచీల్లోని షేర్లలో భారీగా అమ్మకాలు జరిగి, సూచీలు గణనీయంగా జారుకున్నాయి. అయినప్పటికీ, ఆర్థిక సంవత్సరం మొత్తానికి సూచీల్లో ఈ స్థాయి వృద్ధి నమోదు కావడం గమనార్హం. బీఎస్ఈలోని రంగాలవారీ సూచీలు సైతం ఈ ఏడాది భారీగా పెరిగాయి. రియల్టీ, ప్రభుత్వ రంగ బ్యాంక్‌లు, ఆటో, ఎనర్జీ రంగాలు 135 శాతం నుంచి 70 శాతం వరకు వృద్ధి చెందాయి.

అంచనాలకు భిన్నంగా..

గత ఆర్థిక సంవత్సరం (2022-23)లాగే ఈసారీ మార్కెట్ పనితీరు అంతంత మాత్రంగానే ఉండవచ్చన్న అంచనాలకు భిన్నంగా సూచీలు బుల్ స్వారీ చేశాయి. ద్రవ్యోల్బణం, వడ్డీ రేట్ల పోటుతో పాటు అమెరికా సహా అభివృద్ధి చెందిన దేశాల్లో ఆర్థిక మాంద్యం భయాలు, అంతర్జాతీయ రాజకీయ భౌగోళిక ఉద్రిక్తతలు తాత్కాలికంగా ప్రభావం చూపినప్పటికీ సెన్సెక్స్, నిఫ్టీ జోరును నిలువరించలేకపోయాయి. "భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, సెంట్రల్ బ్యాంక్‌ల వడ్డీ రేట్ల పెంపు, ముడిచమురు ధరల పెరుగుదల వంటి ప్రతికూలతల్లోనూ స్టాక్ మార్కెట్ సూచీలు ఈ ఆర్థిక సంవత్సరంలో మెరుగైన రిటర్నులు పంచాయి. ప్రైమరీ మార్కెట్లో పబ్లిక్ ఇష్యూల (ఐపీఓ) జోరు పెరిగింది. ఎస్ఎంఈ సెగ్మెంట్లోనూ చాలా కంపెనీలు మార్కెట్లో లిస్టయ్యాయి. అంతేకాదు, ఈక్విటీల్లో రిటైల్ మదుపరుల పెట్టుబడులు గడిచిన కొన్నేళ్లలో భారీగా పుంజుకున్నాయ"ని మాస్టర్ క్యాపిటల్ సర్వీసెస్ లిమిటెడ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అర్వింద్ సింగ్ నంద అన్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో సెన్సెక్స్ కేవలం 423 పాయింట్లు (0.72 శాతం) వృద్ధి చెందగా.. మార్కెట్ వర్గాల సంపద రూ.5.86 లక్షల కోట్ల మేర తరిగిపోయింది.

భారీ లాభాలతో ముగింపు

2023-24 చివరి ట్రేడింగ్ సెషన్‌లో సెన్సెక్స్ 655 పాయింట్లు అప్

ప్రామాణిక ఈక్విటీ సూచీలు ఈ ఆర్థిక సంవత్సరానికి భారీ లాభాలతో ముగింపు పలికాయి. ఆర్థిక సంవత్సరం చివరి ట్రేడింగ్ సెషన్ అయిన గురువారం సెన్సెక్స్ 655.04 పాయింట్ల లాభంతో 73,651.35 వద్ద స్థిరపడింది. ఒక దశలో 1,194 పాయింట్లు పెరిగి 74,190 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసినప్పటికీ.. చివర్లో జరిగిన లాభాల స్వీకరణ కారణంగా సూచీలు మళ్లీ జారుకున్నాయి. నిఫ్టీ 203.25 పాయింట్ల వృద్ధితో 22,326.90 వద్ద క్లోజైంది. గ్లోబల్ మార్కెట్ల సానుకూల సంకేతాల నేపథ్యంలో ఇన్వెస్టర్లు అన్ని రంగాల షేర్లలో భారీగా కొనుగోళ్లకు పాల్పడటం నేటి ర్యాలీకి ప్రధానంగా దోహదపడింది. ప్రధాన కంపెనీలతో పాటు చిన్న, మధ్య స్థాయి షేర్లకూ కొనుగోళ్ల ఆదరణ లభించింది. దాంతో బీఎస్ఈ స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ సూచీలు 0.62 శాతం వరకు పెరిగాయి. రంగాల వారీ సూచీలన్నీ పాజిటివ్‌గా ముగిశాయి. దాంతో బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ ఒక్క రోజులోనే రూ.3.33 లక్షల కోట్ల మేర పెరిగింది.

నేడు మార్కెట్లకు సెలవు

గుడ్ ఫ్రైడే సందర్భంగా శుక్రవారం (మార్చి 29) స్టాక్ ఎక్స్ఛేంజీలు బీఎస్ఈ, ఎన్ఎస్ఈలకు సెలవు పాటించనున్నాయి. ఏప్రిల్ 1 (సోమవారం)న మార్కెట్లు యథావిధిగా పనిచేస్తాయి.

టెస్లాకు పోటీగా షామీ కారు..

- ఎస్‌యూ7 విక్రయాలు ప్రారంభించిన కంపెనీ
- ప్రారంభ ధర 2,15,900 యువాన్లు

టెస్లా మోడల్ 3 కంటే 30,000 యువాన్లు తక్కువ



బీజింగ్: చవక స్మార్ట్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ ఉత్పత్తులకు పేరుగాంచిన చైనా కంపెనీ షామీ.. ఎలక్ట్రిక్ వాహన రంగంలోకీ తనదైన శైలిలో అరంగేట్రం చేసింది. షామీ తన తొలి ఎలక్ట్రిక్ ప్రీమియం సెడాన్ కారు 'స్పీడ్ అల్ట్రా 7' (ఎస్‌యూ7) విక్రయాలను గురువారం ప్రారంభించింది. టెస్లా, బీవైడీ వంటి ప్రముఖ కంపెనీల ఈవీలకు పోటీగా మార్కెట్లోకి వస్తున్న ఈ కారు మూడు వేరియంట్లలో (స్టాండర్డ్, ప్రో, మ్యాక్స్), తొమ్మిది రంగుల్లో లభించనుంది. దీని ప్రారంభ ధర 29,870 డాలర్లు (చైనా కరెన్సీలో 2,15,900 యువాన్లు, మన కరెన్సీలో రూ.25 లక్షలు). టెస్లా మోడల్ 3 రేటు (2,45,900 యువాన్లు) కంటే 30,000 యువాన్లు తక్కువ ఇది. ప్రస్తుతం ఎస్‌యూ7ను చైనా మార్కెట్లో విక్రయించనున్న షామీ.. త్వరలో భారత్ సహా ఇతర మార్కెట్లలోకి అందుబాటులోకి తెచ్చే అవకాశం ఉంది.

అదానీ-అంబానీ భాయ్ భాయ్

అదానీ పవర్ ఎంపీ యూనిట్‌లో అంబానీకి వాటా

న్యూఢిల్లీ: రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ, అదానీ గ్రూప్ అధిపతి గౌతమ్ అదానీ. దేశంలో అత్యంత సంపన్నులైన పారిశ్రామికవేత్తలు. ఇద్దరూ గుజరాతీలు. ఇప్పుడు వీరిద్దరూ చేతులు కలిపారు. మధ్యప్రదేశ్‌లో అదానీ పవర్ అనుబంధ సంస్థ మహాన్ ఎనర్జెన్ లిమిటెడ్ (ఎంఈఎల్) ఈక్విటీలో ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) 26 శాతం వాటాను రూ.50 కోట్లకు కొనుగోలు చేస్తోంది. దీనికి సంబంధించి రెండు కంపెనీల మధ్య ఒక ఒప్పందం కుదిరింది. ఈ పారిశ్రామిక దిగ్గజాలు చేతులు కలపడం ఇదే మొదటిసారి.

ఎందుకంటే: అదానీ పవర్ మధ్యప్రదేశ్‌లోని ఈ థర్మల్ పవర్ ప్రాజెక్టును 2,800 మెగావాట్ల సామర్థ్యంతో నిర్మిస్తోంది. ఇందులో 500 మెగావాట్లను ఆర్ఐఎల్ తన సొంత అవసరాల కోసం వినియోగించుకోబోతోంది. అయితే ఏ ప్రాజెక్టు అవసరాల కోసం ఆర్ఐఎల్ ఈ విద్యుత్‌ను ఉపయోగించబోతోందనే విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. ఈ ఒప్పందం కింద ఎంఈఎల్ 20 ఏళ్ల పాటు ఆర్ఐఎల్‌కు విద్యుత్ సరఫరా చేయాల్సి ఉంటుంది. రెండు వారాల్లో ఈ ఒప్పందానికి రెగ్యులేటరీ సంస్థల అనుమతులు లభించే అవకాశం ఉందని రెండు సంస్థలు తెలిపాయి.

అంబుజా సిమెంట్స్‌లో అదానీకి మరింత వాటా: అంబుజా సిమెంట్స్ ఈక్విటీలో అదానీ గ్రూప్ వాటా 63.1 శాతం నుంచి 66.7 శాతానికి పెరిగింది. ఇందుకోసం రూ.6,661 కోట్లతో 21.2 కోట్ల వారంట్లను ఈక్విటీ షేర్లుగా మార్చుకుంది. అంబుజా సిమెంట్స్ డైరెక్టర్ల బోర్డు ఇందుకు ఆమోదం తెలిపింది. ఈ నిధులతో 2028 నాటికి అంబుజా సిమెంట్స్ తన వార్షిక సిమెంట్ ఉత్పత్తి సామర్థ్యాన్ని 14 కోట్ల టన్నులకు పెంచుకునేందుకు వీలవుతుందని భావిస్తున్నారు.

కాగా అదానీ గ్రూప్ రాగి (కాపర్) ఉత్పత్తిలోకి ప్రవేశించింది. గుజరాత్‌లో ముంద్రా వద్ద 5 లక్షల టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో కచ్ కాపర్ పేరుతో ఏర్పాటు చేసిన ప్లాంట్‌లో ఉత్పత్తిని ప్రారంభించింది.

మోసపూరిత లావాదేవీల బారిన యాక్సిస్ క్రెడిట్ కార్డు కస్టమర్లు

న్యూఢిల్లీ: యాక్సిస్ బ్యాంక్ క్రెడిట్ కార్డు లున్న పలువురు కస్టమర్లు మోసపూరిత లావాదేవీల ప్రభావానికి బాధితులయ్యారని బ్యాంక్ కార్డ్స్ అండ్ పేమెంట్స్ విభాగం హెడ్ సంజీవ్ మోఘె తెలిపారు. ప్రధానంగా కొన్ని ఈ-కామర్స్ వెబ్‌సైట్ల ద్వారా ఇలాంటి లావాదేవీలు నమోదయ్యాయని ఆయన చెప్పారు. కొందరు కస్టమర్లు తాము ఎలాంటి కొనుగోళ్లు చేయకపోయినా కొన్ని లావాదేవీలకు చెల్లింపులు జరిగినట్టు అలర్ట్‌లు వచ్చాయని ఆయన తెలిపారు. అయితే ఎలాంటి "డేటా చౌర్యం" మాత్రం జరగలేదని మోఘే స్పష్టం చేశారు. అలాంటి లావాదేవీల విలువ, పరిధి కూడా తక్కువగానే ఉన్నట్టు చెప్పారు. అనధీకృత లావాదేవీల సమాచారం బహిర్గతం కాగానే బ్యాంక్ అంతర్గత వ్యవస్థ కొన్ని అనుమానాస్పద లావాదేవీలకు చెల్లింపులు చేయలేదని ఆయన తెలిపారు.

స్పోర్ట్స్



వార్నర్, స్టాయినిస్‌లకు నో కాంట్రాక్ట్

మెల్‌బోర్న్: క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) తమ సెంట్రల్ కాంట్రాక్ట్ ఆటగాళ్ల జాబితాను ప్రకటించింది. ఈసారి 23 మంది ప్లేయర్లకు కాంట్రాక్ట్ ఇవ్వగా, ఇందులో స్టార్ ఆటగాళ్లు స్టాయినిస్, ఆస్టన్ ఏగర్‌లకు చోటు దక్కలేదు. అలాగే ఇప్పటికే వన్డే, టెస్టుల నుంచి వైదొలిగిన ఓపెనర్ డేవిడ్ వార్నర్ పేరును సైతం పరిగణనలోకి తీసుకోలేదు.

సింధు ముందంజ



స్పెయిన్ మాస్టర్స్ టోర్నీ

మాడ్రిడ్: పీవీ సింధు స్పెయిన్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో ముందంజ వేసింది. సింధు 21-14, 21-12తో హవాంగ్ యు స్యూన్ (తైపీ)ని ఓడించి క్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టింది. అలాగే సిక్కిరెడ్డి/సుమిత్ జోడీ మిక్స్‌డ్‌లో 22-20, 21-18తో స్మిత్/లీ (అమెరికా)ను ఓడించి క్వార్టర్స్ చేరింది. మహిళల డబుల్స్‌లో అశ్విని/తనీషా జోడీ 21-14, 21-18తో టిఫానీ/గ్రోన్యా (ఆస్ట్రేలియా)పై నెగ్గి రౌండ్-8లో ప్రవేశించింది. పురుషుల డబుల్స్‌లో అర్జున్/ధ్రువ్ కపిల జోడీ, అలాగే కృష్ణప్రసాద్/సాయి ప్రతీక్ ఓటమి పాలయ్యారు. బుధవారం జరిగిన మ్యాచ్‌లో ఓడిన కిడాంబి శ్రీకాంత్ తొలిరౌండ్‌లోనే నిష్క్రమించాడు. కొ టకాహషి (జపాన్)తో జరిగిన మొదటి రౌండ్‌లో శ్రీకాంత్ 18-21, 15-21తో పరాజయం పాలయ్యాడు.

బస్ వద్దు...బైక్ ముద్దు

లఖ్‌నవూ వీధుల్లో రోడ్స్ రయ్..రయ్..



లఖ్‌నవూ: లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ ఫీల్డింగ్ కోచ్ జాంటీ రోడ్స్‌కు మోటార్ సైకిల్ ప్రయాణమంటే మహా సరదా. భారత్‌లోని పలు ప్రాంతాలను అతడు గతంలో బైక్‌పై చుట్టేసి వచ్చాడు. ఇక..ఐపీఎల్‌లో శనివారం ఇక్కడ జరిగే తదుపరి మ్యాచ్‌లో పంజాబ్‌ను లఖ్‌నవూ ఢీకొననుంది. ఈనేపథ్యంలో గురువారం జట్టు మొత్తం ప్రాక్టీస్ కోసం హోటల్‌నుంచి బస్సులో స్టేడియానికి వెళ్లగా..రోడ్స్ మాత్రం బుల్లెట్‌పై వచ్చి తన ప్రత్యేకతను చాటుకున్నాడు.

అమెరికా జట్టులో తెలుగమ్మాయి శాన్వి



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): అమెరికా మహిళల జాతీయ క్రికెట్ జట్టులో తెలుగమ్మాయి ఇమ్మడి శాన్వికి చోటు లభించింది. యూఏఈలో జరుగనున్న టీ20 వరల్డ్‌కప్ క్వాలిఫయర్స్‌లో తలపడే అమెరికా జట్టుకు శాన్వి ప్రాతినిధ్యం వహించనుంది. అండర్-15 ఎంఎల్‌సీ జూనియర్‌లీగ్‌లో కాలిఫోర్నియా కెప్టెన్‌గా వ్యవహరించింది. ఈ కుడి చేతివాటం లెగ్‌స్పిన్ ఆల్‌రౌండర్ శాన్ డియేగో టీ20 టోర్నీలో 10, జాతీయ సెలెక్షన్స్‌లో 9 వికెట్లు తీసి అమెరికా జట్టులో స్థానం సంపాదించింది. ఇక, సికింద్రాబాద్‌లో నివాసముండే శాన్వి కుటుంబం 1997లో అమెరికాకు వెళ్లి కాలిఫోర్నియాలో స్థిరపడింది.

విహారికి ఏసీఏ షోకాజ్ నోటీసు

కొత్తగా చెప్పాల్సిందేమీ లేదన్న హనుమ



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఆంధ్ర రంజీ జట్టు మాజీ కెప్టెన్, టీమిండియా క్రికెటర్ హనుమ విహారికి ఆంధ్ర క్రికెట్ సంఘం (ఏసీఏ) మధ్య వివాదం షోకాజ్ నోటీసుకు దారితీసింది. గత వారంలో జరిగిన ఏసీఏ అపెక్స్ కౌన్సిల్‌లో విహారికి షోకాజ్ నోటీసు ఇవ్వాలని తీర్మానించారు. ఈనెల 25న ఈ-మెయిల్‌లో ఏసీఏ షోకాజ్ నోటీసులు పంపించింది. విహారికి తన సమస్యలను చెప్పుకోవడానికి ఇదొక అవకాశమని, తాను ఎదుర్కొన్న ఇబ్బందులను తెలియజేయాలని ఒక ఏసీఏ ఉన్నతాధికారి వ్యాఖ్యానించారు. అసలేమి జరిగిందో తెలుసుకోవడానికే తాము ఈ నోటీసు ఇచ్చామని ఆయన తెలిపారు. ఆంధ్ర క్రికెట్ అభివృద్ధిలో విహారి పాత్ర విలువైందని, అతడి సమస్యలు తెలియజేయడానికి ఇదొక అవకాశమని సదరు ఏసీఏ పెద్ద అభిప్రాయపడ్డారు. అయితే, దీనిపై విహారి స్పందిస్తూ తాను షోకాజ్ నోటీసుకు బదులిచ్చానని తెలిపాడు. ఈ సీజన్ రంజీ ట్రోఫీ క్వార్టర్స్‌లో ఆంధ్ర జట్టు ఓడిన రోజునే తాను చెప్పాల్సిందంతా చెప్పానన్నాడు. వచ్చే దేశవాళీ సీజన్‌లో తాను వేరే జట్టు తరఫున ఆడాలని నిర్ణయించుకున్నానని, ఇందుకోసం నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) ఇవ్వాల్సిందిగా ఏసీఏను అడిగానని, వారి స్పందన కోసం వేచి చూస్తున్నానని విహారి తెలిపాడు. ఇక, ఈ సీజన్ రంజీ ట్రోఫీ తొలి మ్యాచ్ అనంతరం విహారి హఠాత్తుగా సారథ్య బాధ్యతల నుంచి తప్పుకోవడం, ఆ తర్వాత జట్టులోని 17వ నెంబర్ ఆటగాడు పృథ్వీరాజ్, అతడి తండ్రి తెచ్చిన ఒత్తిడిపై విహారి బహిరంగంగానే విమర్శలు చేయడం తెలిసిందే.

ఐపీఎల్ తొలిరోజు రికార్డు బద్దలు

న్యూఢిల్లీ: ఐపీఎల్ 17వ సీజన్ తొలిరోజు వ్యూయర్‌షిప్‌లో రికార్డులను బద్దలుకొట్టింది. టోర్నీకి మొదటి రోజైన ఈనెల 22వ తేదీన టీవీల్లో ఏకంగా 16.8 కోట్ల వ్యూస్ వచ్చాయని అధికారిక బ్రాడ్‌కాస్టర్ డిస్నీ స్టార్ పేర్కొంది. ఆ రోజు చెన్నై-బెంగళూరు జట్ల మధ్య మ్యాచ్‌కు ముందు బాలీవుడ్ స్టార్ల ప్రదర్శనలు ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. అలాగే తిలకించిన సమయం కూడా 1,276 కోట్ల నిమిషాలుగా నమోదైందట. ఇప్పటివరకు అన్ని సీజన్ల తొలి రోజుకు సంబంధించి ఇదే అత్యుత్తమం. గతేడాది ఇది 870 కోట్ల నిమిషాలుగా ఉందట. మొత్తంగా గతేడాదితో పోలిస్తే టీవీక్షణంలోనూ 16 శాతం పెరుగుదల నమోదైంది. ఇక డిజిటల్ ప్లాట్‌ఫామ్ జియో సినిమాకూ తొలి మ్యాచ్‌కు 11.3 కోట్ల వ్యూయర్‌షిప్ దక్కింది.

నేటి మ్యాచ్
బెంగళూరు x కోల్‌కతా
రాత్రి 7.30 గం. నుంచి

ఫటాఫట్ పరాగ్

మెరుపు అర్ధసెంచరీ

రాజస్థాన్‌కు రెండో గెలుపు ● ఢిల్లీకి నిరాశ

జైపూర్: తాజా సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ జోరు సాగిస్తోంది. యువ బ్యాటర్ రియాన్ పరాగ్ (45 బంతుల్లో 7 ఫోర్లు, 6 సిక్సర్లతో 84 నాటౌట్) మెరుపు ఆటతీరుతో ఐపీఎల్‌లో తన అత్యధిక స్కోరు సాధించగా.. బౌలర్లు సైతం తమ వంతు సహకారం అందించారు. దీంతో గురువారం ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆర్ఆర్ 12 పరుగుల తేడాతో నెగ్గింది. ఆఖరి ఓవర్‌లోనూ ఢిల్లీకి గెలిచే అవకాశం ఉన్నా.. పేసర్ అవేశ్ పదునైన యార్కర్లతో కట్టడి చేశాడు. శాంసన్ సేనకిది వరుసగా రెండో విజయం కాగా.. డీసీకిది రెండో ఓటమి. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన రాజస్థాన్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 185 పరుగులు చేసింది. అశ్విన్ (19 బంతుల్లో 3 సిక్సర్లతో 29), ధ్రువ్ (12 బంతుల్లో 3 ఫోర్లతో 20) వేగంగా ఆడారు. ఆ తర్వాత ఛేదనలో ఢిల్లీ 20 ఓవర్లలో 5 వికెట్లకు 173 పరుగులు చేసి ఓడింది. వార్నర్ (34 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సర్లతో 49), స్టబ్స్ (23 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్సర్లతో 44 నాటౌట్) రాణించారు. చాహల్, బర్గర్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా రియాన్ పరాగ్ నిలిచాడు.

ఆరంభం బాగున్నా..

భారీ ఛేదనను ఢిల్లీ ఆత్మవిశ్వాసంతో ఆరంభించినా.. తుదికంటా ఆ ఊపును కొనసాగించలేకపోయింది. కీలక సమయాల్లో రాయల్స్ బౌలర్లు వికెట్లు తీసి ఫలితాన్ని సాధించారు. చివర్లో స్టబ్స్ పోరాటం సరిపోలేదు. ప్రారంభంలో ఓపెనర్లు డేవిడ్ వార్నర్, మార్ష్ ఎడాపెడా బౌండరీలతో స్కోరు పది పరుగుల రన్‌రేట్‌తో దూసుకెళ్లింది. రెండో ఓవర్‌లో మార్ష్ మూడు ఫోర్లు, మూడో ఓవర్‌లో రెండు ఫోర్లతో జోరు చూపాడు. కానీ నాలుగో ఓవర్‌లో పేసర్ బర్గర్.. మార్ష్ (23), భుయ్ (0)ల వికెట్లను తీశాడు. అటు వార్నర్ మాత్రం తగ్గకుండా బౌల్ట్ ఓవర్‌లో 6,6, బర్గర్ ఓవర్‌లో మరో 4,6తో పవర్‌ప్లేలో ఢిల్లీ 59/2తో పటిష్టంగానే కనిపించింది. అటు పంత్ (28) కూడా వీలు చిక్కినప్పుడల్లా బౌండరీలు సాధించాడు. అయితే హాఫ్ సెంచరీకి పరుగు దూరంలో వార్నర్‌ను పేసర్ అవేశ్ పెవిలియన్‌కు చేర్చాడు. అప్పటికే మూడో వికెట్‌కు 67 పరుగులు జత చేరాయి. ఓవర్ వ్యవధిలోనే కెప్టెన్ పంత్ వికెట్‌ను సైతం డీసీ కోల్పోవడం దెబ్బతీసింది. చాహల్ ఓవర్‌లో కట్ షాట్ ఆడబోయిన తను కీపర్ శాంసన్‌కు క్యాచ్ ఇచ్చాడు. ఇక నాలుగు ఓవర్లలో 60 పరుగులు చేయాల్సిన వేళ ఢిల్లీపై ఒత్తిడి పెరిగింది. అటు రాజస్థాన్ బౌలర్లు ఆత్మవిశ్వాసంతో కనిపించారు. కానీ హిట్టర్ ట్రిస్టాన్ స్టబ్స్ ఎదురుదాడికి దిగడంతో లక్ష్యం వేగంగా కరిగింది. 17వ ఓవర్‌లో రెండు సిక్సర్లు బాది 19 రన్స్ అందించడంతో డీసీ శిబిరంలో కాస్త జోష్ కనిపించింది. ఇక 19వ ఓవర్‌లోనూ తను 6,4 సాధించగా, సమీకరణం ఆరు బంతులు, 17 రన్స్‌కి మారింది. అయితే పేసర్ అవేశ్ అద్భుతంగా కట్టడి చేస్తూ 20వ ఓవర్‌లో కేవలం నాలుగు పరుగులే ఇవ్వడంతో డీసీకి రెండో ఓటమి తప్పలేదు.

డెత్ ఓవర్లలో దాడి

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన రాజస్థాన్ తొలి పది ఓవర్లలో 57 పరుగులే చేయగా.. ఆ తర్వాత పది ఓవర్లలో ఏకంగా 128 పరుగులు రాబట్టింది. ఇందులో యువ బ్యాటర్ రియాన్ పరాగ్ విజృంభణకు ఆఖరి ఆరు ఓవర్లలోనే 92 రన్స్ వచ్చాయి. మధ్య ఓవర్లలో అశ్విన్ వేగం కూడా ఉపయోగపడింది. పవర్‌ప్లేలో 31 పరుగులకే పరిమితమైన జట్టు ఓపెనర్ జైస్వాల్ (5), కెప్టెన్ శాంసన్ (15) వికెట్లను కోల్పోయింది. ఇక ఓపెనర్ బట్లర్ (11) పేలవ ఫామ్ ఈ మ్యాచ్‌లోనూ కొనసాగింది. 37/3 స్కోరుతో కష్టాల్లో పడిన ఆర్ఆర్‌ను అశ్విన్, రియాన్ జోడీ ఆదుకుంది. ఐదో నెంబర్‌లో బరిలోకి దిగిన అశ్విన్ హిట్టింగ్‌కు దిగి పదో ఓవర్‌లో సిక్సర్, తర్వాతి ఓవర్‌లో రెండు సిక్సర్లతో ఆకట్టుకున్నాడు. అటు పరాగ్ సైతం కుల్దీప్ ఓవర్‌లో సిక్సర్ బాదడంతో ఆటలో కాస్త వేగం పెరిగింది. అయితే చక్కగా కుదురుకున్న అశ్విన్ భారీ షాట్‌కు వెళ్లి స్పిన్నర్ అక్షర్‌కు దొరికిపోయాడు. దీంతో నాలుగో వికెట్‌కు 54 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అనంతరం పరాగ్ బ్యాట్ ఝుళిపిస్తూ ఖలీల్ ఓవర్‌లో 6,4,4.. ముకేశ్ ఓవర్‌లో 4,6 బాది 34 బంతుల్లో ఫిఫ్టీని పూర్తి చేసుకున్నాడు. అటు ధ్రువ్ జురెల్ (20)తో ఐదో వికెట్‌కు 52 పరుగులు జత చేశాడు. ఇక ఆఖరి ఓవర్‌లో రియాన్ విశ్వరూపం ప్రదర్శిస్తూ.. 4,4,6,4,6తో 25 పరుగులు సమకూర్చాడు. అటు తన చివరి 19 బంతుల్లో పరాగ్ 58 పరుగులు సాధించడం విశేషం.



స్టబ్స్ (44 నాటౌట్)



రియాన్ పరాగ్ (45 బంతుల్లో 7 ఫోర్లు, 6 సిక్సర్లతో 84 నాటౌట్)

స్కోరుబోర్డు

రాజస్థాన్: జైస్వాల్ (బి) ముఖేష్ 5, బట్లర్ (ఎల్బీ) కుల్దీప్ 11, శాంసన్ (సి) పంత్ (బి) ఖలీల్ 15, పరాగ్ (నాటౌట్) 84, అశ్విన్ (సి) స్టబ్స్ (బి) అక్షర్ 29, జురెల్ (బి) నోకియా 20, హెట్‌మయెర్ (నాటౌట్) 14, **ఎక్స్‌ట్రాలు 7: మొత్తం (20 ఓవర్లలో) 185/5 ; వికెట్లపతనం :** 1/9, 2/30, 3/36, 4/90, 5/142 ; **బౌలింగ్ :** ఖలీల్ 4-0-24-1, ముఖేష్ 4-0-49-1, నోకియా 4-0-48-1, అక్షర్ 4-0-21-1, కుల్దీప్ 4-0-41-1

ఢిల్లీ క్యాపిటల్స్: వార్నర్ (సి) సందీప్ (బి) అవేశ్ 49, మార్ష్ (బి) బర్గర్ 23, భుయ్ (సి) శాంసన్ (బి) బర్గర్ 0, పంత్ (సి) శాంసన్ (బి) చాహల్ 28, స్టబ్స్ (నాటౌట్) 44, పోరెల్ (సి) బట్లర్ (బి) చాహల్ 9, అక్షర్ (నాటౌట్) 15, **ఎక్స్‌ట్రాలు 5: మొత్తం (20 ఓవర్లలో) 173/5 ; వికెట్లపతనం :** 1/30, 2/30, 3/97, 4/105, 5/122 ; **బౌలింగ్ :** బౌల్ట్ 3-0-29-0, బర్గర్ 3-0-29-2, అశ్విన్ 3-0-30-0, అవేశ్ ఖాన్ 4-0-29-1, చాహల్ 3-0-19-2, సందీప్ శర్మ 4-0-36-0.

ఇదే 'మీనా' బాగుందా?

యథేచ్ఛగా వైసీపీ కోడ్ ఉల్లంఘనలు

- పోలీసులు, కొందరు అధికారుల వత్తాసు
- క్షేత్రస్థాయిలో రెచ్చిపోతున్న వలంటీర్లు
- చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న కింది స్థాయి ఎన్నికల సంఘం అధికారులు
- విపక్షాల విషయంలో నిబంధనల కత్తి



అమరావతి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలు విషయంలో క్షేత్రస్థాయిలో ఎన్నికల సంఘం అధికారుల తీరును టీడీపీ సహా విపక్ష నాయకులు తప్పుబడుతున్నారు. కోడ్ పేరుతో ప్రతిపక్షాల వాహనాలను పదే పదే తనిఖీ చేస్తూ.. వారి రోజువారీ రాజకీయ కార్యకలాపాలకు మోకాలడ్డేలా అధికారులు, పోలీసులు వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు. ఇక, ఇదేసమయంలో అధికార పార్టీ వైసీపీ నేతల తాయిలాల పంపకాలను, వలంటీర్ల ప్రచారాలను అడ్డుకోవడంలో విఫలమవుతున్నారని విమర్శిస్తున్నారు. "ఇదేమైనా బాగుందా?" అని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేశ్ కుమార్ మీనాను ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా కింది స్థాయిలో ఎన్నికల అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు అసలు ఈసీ పరిధిలో ఉన్నారా? లేదా? కోడ్‌ను, ఈసీ ఆదేశాలను పటిష్ఠంగా అమలు చేస్తున్నారా? లేదా? అనే సందేహం కూడా సర్వత్రా వ్యక్తమవుతోంది. రాష్ట్రంలో అధికార పార్టీ యథేచ్ఛగా కోడ్‌ను ఉల్లంఘిస్తూనే ఉంది. దీనిపై నిరంతరం ప్రతిపక్షాలు ఆధారాలతో సహా జిల్లా స్థాయిలో అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నా ఫలితం లేకుండా పోతోందని నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికార పార్టీ నేతలు నగదు, బహుమతులు, ఇతర తాయిలాలు యథేచ్ఛగా పంపిణీ చేస్తున్నా చూసీ చూడనట్టుగానే వ్యవహరిస్తున్నారని చెబుతున్నారు.

వలంటీర్లను నిలువరించలేని దైన్యం!

వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొనకుండా ఎన్నికల సంఘం వలంటీర్లను నిలువరించలేకపోయిందనే విమర్శలు వినిపిస్తూనే ఉన్నాయి. వలంటీర్లు ప్రభుత్వంలో భాగమేనని, ఈ నేపథ్యంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొనకూడదని ఎన్నికల సంఘం ఆదేశాలు ఇచ్చినా ఫలితం లేకపోయింది. ఎన్నికల సంఘం పలు జిల్లాల్లో వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వలంటీర్లను తొలగిస్తూ ఆదేశాలు ఇచ్చింది. ఇలా తొలగించిన వలంటీర్లు యథేచ్ఛగా వైసీపీ నేతల ప్రచారంలో పాల్గొంటున్నారు. అయితే, వలంటీర్లపై కఠినమైన చర్యలు తీసుకోకుండా కేవలం విధుల నుంచి తొలగించి వదిలేయడంతోనే వారు రెచ్చిపోతున్నారని ప్రతిపక్ష నేతలు అంటున్నారు. ఇంటింటికీ ప్రచారానికి, కరపత్రాల పంపిణీకి ఈసీ నుంచి అనుమతి తీసుకోవాలన్న నిబంధన ప్రతిపక్షాలకే పరిమితమైందనే వాదన వినిపిస్తోంది. వైసీపీ నిబంధనలు తుంగలోతొక్కి అడ్డదిడ్డంగా ప్రచారం చేస్తున్నా ఎవరూ మాట్లాడడం లేదు. అధికార నేతలు కింది స్థాయిలో ఎన్నికల అధికారులను ఆకట్టుకుని ప్రతిపక్ష పార్టీలకు అడ్డంకులు సృష్టిస్తున్నారని నేతలు అంటున్నారు. లోకేశ్ కారును పదే పదే తనిఖీ చేయడం దీనిలో భాగమేనని ఆరోపిస్తున్నారు. కోడ్ ఉల్లంఘనల పేరుతో ప్రతిపక్ష టీడీపీ, జనసేనలకు చెందిన వందల మంది నేతలపై పోలీసులు కేసులు నమోదు చేశారు. అధికార పార్టీకి చెందిన ఏ ఒక్క నేతపైనా ఒక్క కేసు కూడా నమోదు చేయలేదని టీడీపీ నేతలు చెబుతున్నారు. నెల రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా పత్రికలు, మీడియాలో కోడ్ ఉల్లంఘనలతో పాటు నగదు, తాయిలాలు, మద్యం పంపిణీపై విస్తృతంగా కథనాలు ప్రసారం అయ్యాయి. మంత్రులు, ఎమ్మెల్యేలు ఓటర్లకు భోజనాలు పెట్టి, తాయిలాలు పంచిన ఉదంతాలున్నాయి. అయితే, ఇప్పటి వరకు అలాంటి ఘటనలపై ఒక కేసు కూడా నమోదు చేయలేదని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. కోడ్ నిబంధనల ప్రకారం చర్చిలు, మసీదులు, దేవాలయాల్లో ఎన్నికల ప్రచారం చేయకూడదు. అయితే, సీఎం జగన్‌కు స్వయానా బంధువైన విమలారెడ్డి చర్చిల్లోనూ, కన్వెన్షన్ సెంటర్లలోనూ పాస్టర్లు, ఫాదర్లకు నగదు పంపిణీ చేస్తున్న అంశాలపై టీడీపీ అనేక సార్లు ఫిర్యాదులు చేసింది. వీటిపైనా చర్యలు లేవు. ఏకంగా విజయవాడలో వైసీపీ ఎమ్మెల్సీ మసీదులో డబ్బులు పంచుతున్న ఫొటోలను ఆధారాలతో ఇచ్చినా జిల్లా స్థాయిలో ఎన్నికల అధికారులు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. దీంతో ఎన్నికల సంఘం పనితీరు క్షేత్రస్థాయిలో ప్రశ్నార్థకంగా మారిందనే వాదన వినిపిస్తోంది.

అమరావతి రైతుల పాపమేంటి?

రాజధాని నిర్మాణానికి భూములిచ్చారు.. అంతే తప్ప వారేమీ నేరం చేయలేదు

- కేసులతో మహిళా రైతులకు ఇబ్బందులు
- దక్షిణ భారతంలోనే పెద్ద రైతు ఉద్యమం...
- అమరావతి రైతుల పోరాటం
- దేశంలో వ్యవసాయానికి గుర్తింపు లేదు
- పార్లమెంట్, అసెంబ్లీలో రైతు ప్రతినిధుల్లేరు
- రైతు వ్యతిరేక చట్టాలను ప్రశ్నించలేని దుస్థితి
- కృష్ణామిల్క్ యూనియన్ సర్వసభ్య సమావేశంలో జస్టిస్ ఎన్వీ రమణ



గన్నవరం విమానాశ్రయం వద్ద మాజీ సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణను కలిసి తమ గోడు వెళ్లబోసుకుంటున్న అమరావతి రైతులు

విజయవాడ, మార్చి 28(ఆంధ్రజ్యోతి): అమరావతి రైతులు చేసిన పాపమేంటని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ ప్రశ్నించారు. రాజధాని నిర్మాణానికి భూములు ఇవ్వమని ఆనాటి ప్రభుత్వం అడిగితే ఇచ్చారే తప్ప... వారేమీ నేరం చేయలేదని పేర్కొన్నారు. అయినప్పటికీ అక్కడి మహిళలపై కేసులు పెట్టి ప్రభుత్వం అనేక రకాల బాధలు పెట్టిన విషయం చూశామన్నారు. కృష్ణా జిల్లా వీరవల్లిలోని విజయా డెయిరీ ఆటోమేషన్ ప్లాంట్‌లో గురువారం కృష్ణా మిల్క్ యూనియన్ 32వ సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. అమరావతి రైతుల ఉద్యమం ఇటీవల కాలంలో దక్షిణ భారతదేశంలో జరిగిన పెద్ద పోరాటంగా అభివర్ణించారు. ఎయిర్‌పోర్టులో అమరావతి ప్రాంతానికి చెందిన రైతులు తనను కలిసి, రాజధాని నిర్మాణానికి భూములు ఇచ్చామని, ప్రభుత్వ వ్యతిరేక విధానాలతో ఐదేళ్లుగా పడుతున్న ఇబ్బందులు, వారి కష్టాలను వివరించారని తెలిపారు. చట్టసభల్లో రైతు ప్రతినిధులు లేకపోవడంవల్ల అనేక రైతు వ్యతిరేక చట్టాలు పాస్ అవుతున్నా ప్రశ్నించలేని పరిస్థితి ఏర్పడుతోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని, ఇది వ్యవసాయ రంగానికి ఏమాత్రం మంచిది కాదని అభిప్రాయపడ్డారు. రైతాంగ ప్రయోజనాల కోసం ఏం చేస్తున్నారో చెప్పాలని రాజకీయ పార్టీలను నిగ్గదీసినపుడే న్యాయం జరుగుతుందన్నారు. దేశంలో వ్యవసాయం, రైతు అనే వృత్తికి అంత గౌరవముందని తాననుకోవడం లేదన్నారు. అధునాతన కాలంలో పారిశ్రామికాభివృద్ధి జరిగిన తర్వాత వ్యవసాయం అనేది అంటరానితనంగా తయారైందని చెప్పారు. దేశంలో కోట్ల మంది రైతులున్నా.. వారికి సంబంధించిన ప్రత్యేక కార్యక్రమాలను అధికార, ప్రతిపక్ష పార్టీలు ఆలోచించటం లేదని పేర్కొన్నారు. సాగు రక్షణకు చట్టపరమైన విధానాలేవీ అమలు కావడం లేదన్నారు. ఆరుగాలం శ్రమించి చేతికొచ్చే సమయానికి వరదలు, ప్రకృతి విపత్తులు, వర్షాలు పడక పంట నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవేళ పంట పండినా మార్కెట్‌కు వచ్చేసరికి గిట్టుబాటు ధర లభించకపోవడం, ఆ డబ్బు కోసం ఎదురుచూడాల్సి రావడం వంటి దౌర్భాగ్య పరిస్థితులను చూడాల్సి వస్తోందని చెప్పారు. కాకాని వెంకటరత్నం వంటి రైతాంగ నేతలు రైతుల్లో చైతన్యం తీసుకొచ్చి వ్యవసాయానికి తోడుగా పాల ఉత్పత్తి, పౌల్ట్రీ వంటి రంగాలను ప్రోత్సహించారని గుర్తుచేశారు. పాడిపై వచ్చే ఆదాయంతో పిల్లలను చదివించుకుని విదేశాలకు పంపించే పరిస్థితులు ఏర్పడ్డాయని, ఇవన్నీ ఆనాటి రైతు నాయకుల దూరదృష్టి వల్లే సాధ్యమైందని తెలిపారు. పాడి పరిశ్రమను రక్షించాలని గుర్తించిన ఒకప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌కు కృతజ్ఞతలు చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. పారిశ్రామికవేత్తలు, ధనవంతులకే చట్టసభలకు వెళ్లే అవకాశాన్ని రాజకీయ పార్టీలు కల్పిస్తున్నాయని జస్టిస్ రమణ చెప్పారు. రైతు ప్రతినిధుల ముసుగులో కూడా పారిశ్రామికవేత్తలే చట్టసభలకు వస్తున్నారే తప్ప నిజమైన రైతులు, రైతు ప్రతినిధులు, రైతు నాయకులు రావడం లేదన్నారు. ఉత్తరాదితో పోల్చుకుంటే దక్షిణ భారతంలో రైతు సంఘాల ఐక్యత చాలా తక్కువగా ఉందని పేర్కొన్నారు. రైతు సంఘాలు, సమాఖ్యలు సంఘటితంగా లేకపోవటం వల్ల ఇక్కడ ప్రభుత్వాలు రైతులను పట్టించుకునే పరిస్థితి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

న్యాయ వ్యవస్థలోనూ అదే పరిస్థితి

న్యాయ వ్యవస్థలో రైతు కుటుంబాల నుంచి, గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చినవారు చాలా తక్కువ సంఖ్యలో ఉంటారని జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. రైతుల గురించి చాలా దుర్మార్గంగా ఆలోచించే పరిస్థితులు ఉన్నాయని చెప్పారు. 'ఒకసారి కోర్టులో నా పక్కన ఉన్న న్యాయమూర్తి ఒక రైతుకు సంబంధించి నష్టపరిహారపు కేసు వచ్చినపుడు... ఆ రైతు తాలూకా, జిల్లా, హైకోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకు ఎందుకు వచ్చాడు? భూమిని ఆయనేమైనా సంపాదించాడా? తాతలు ఇచ్చిన భూమికి రూ.10 వేలు నష్టపరిహారం ఇచ్చారు కదా. దీనికోసం కోర్టుకు వచ్చి యుద్ధం చేయాల్సిన పరిస్థితి ఏమిటి? అన్నపుడు తాను కలగజేసుకుని రైతుకు, భూమికీ ఉన్న సంబంధం తల్లికీ, బిడ్డకూ ఉన్న సంబంధమని, భూమి లేకపోతే ఆ రైతు నష్టపోతాడని నచ్చజెప్పటానికి ఒకరోజు సమయం పట్టింది' అని జస్టిస్ ఎన్వీ రమణ వివరించారు. రైతాంగానికి, వెనుకబడిన వర్గాలకు న్యాయం జరగాలంటే ప్రత్యేక రిజర్వేషన్లు ఏర్పాటు చేయాల్సిన అవసరముందని, లేకపోతే కొన్ని సామాజిక కుటుంబాలకు చెందిన వ్యక్తుల ఆధిపత్యంలో ఉండిపోయి రైతాంగం, బలహీన వర్గాలకు సరైన న్యాయం జరగకుండా పోతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

రైతులపై కేసులు పెట్టడం తగదు

రైతుకు ఎలాంటి స్వార్థం ఉండదని, పంటకు మద్దతు ధర లభిస్తే చాలని ఆశించే అల్పజీవులైన రైతులపై ఏ ప్రభుత్వమైనా దమనకాండ జరపడం దురదృష్టకరమని జస్టిస్ రమణ అన్నారు. రైతాంగానికి ఎలాంటి ఆరోగ్య భద్రత లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం అత్యంత ప్రమాదకరమైన పని ఏదైనా ఉందంటే అది వ్యవసాయమే అన్నారు. ఖాళీ సమయంలో వ్యవసాయం చేస్తున్నందున రైతుల బాధలు తనకు తెలుసని చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఇంతకుమించి మాట్లాడితే దురుద్దేశాలను ఆపాదించే అవకాశం ఉందని పేర్కొంటూ పిల్లల చదువులపై దృష్టి సారించాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో విజయా డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే దాసరి బాలవర్ధనరావు తదితరులు పాల్గొన్నారు.

అచ్చెన్నాయుడిపై తొందరపాటు చర్యలొద్దు

- సీఐడీకి హైకోర్టు ఆదేశం

అమరావతి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నిధులు మళ్లించారనే ఆరోపణలతో సీఐడీ 2021 డిసెంబర్‌లో నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ టీడీపీ ఏపీ అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు దాఖలు చేసిన పిటిషన్ గురువారం హైకోర్టులో విచారణకు వచ్చింది. సీఐడీ తరఫున ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ వివేకానంద స్పందిస్తూ.. ఈ వ్యవహారంలో అదనపు దస్త్రాలు కోర్టు ముందుంచేందుకు సమయం ఇవ్వాలని అభ్యర్థించారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపిస్తూ పిటిషనర్ ఎన్నికల్లో పోటీ చేయబోతున్నారని, అరెస్ట్ చేస్తారనే ఆందోళన ఉందని చెప్పారు. తొందరపాటు చర్యలు తీసుకోకుండా రక్షణ కల్పించాలని అభ్యర్థించారు. ఈ వివరాలను పరిగణలోకి తీసుకున్న న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు అదనపు వివరాలు సమర్పించేందుకు సీఐడీకి సమయం ఇస్తూ విచారణను ఏప్రిల్ 2కి వాయిదా వేశారు. అప్పటివరకు పిటిషనర్‌పై అరెస్ట్‌తో పాటు ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోవద్దని సీఐడీకి స్పష్టం చేశారు.

తిరుపతి కలెక్టర్‌కు ఎన్నికల డ్యూటీ వేయొద్దు

- ఫిర్యాదులు పట్టించుకోని అధికారులపై చర్యలు తీసుకోవాలి
- సీఈవోని కోరిన ఎన్డీయే కూటమి నేతలు

అమరావతి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తున్న అధికారులపై, వైసీపీ అక్రమాలపై ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎన్డీయే కూటమి నేతలు ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సహకార సంఘాల (సొసైటీ)లో పర్సన్ ఇన్‌చార్జిలుగా కొనసాగుతున్న అధికార పార్టీకి చెందిన వ్యక్తులను తక్షణమే తొలగించాలన్నారు. అలాగే వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్న తిరుపతి జిల్లా కలెక్టర్‌ను ఎన్నికల విధుల నుంచి తప్పించాలని కోరారు. దేవాలయాల్లో పని చేసే ఉద్యోగులకు ఎలక్షన్ డ్యూటీలు వేయవద్దని సూచించారు. ఈ మేరకు గురువారం అమరావతి సచివాలయంలో సీఈవో ముఖేష్ కుమార్ మీనాకు టీడీపీ నేతలు వర్ల రామయ్య, సయ్యద్ రఫీ, బీజేపీ నేతలు పాతూరి నాగభూషణం, పార్థసారధి జనసేన పార్టీ నేత చిల్లపల్లి శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారు.

పరిపాలన జగన్ చేతిలోనే ఉందా...?: వర్ల

పరిపాలన ఎన్నికల కమిషన్ చేతిలో ఉందా? ఇంకా జగన్‌రెడ్డి చేతిలోనే ఉందా..? అనేది ఈసీ తేల్చాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య అన్నారు. సీఈవోని కలిసిన తర్వాత ఆయన మీడియాతో మాట్లాడుతూ.. శ్రీకాళహస్తిలోని గోడౌన్‌లో పెద్ద డంప పట్టుకుని, అధికారులే ఆశ్చర్యపోతే.. తిరుపతి జిల్లా కలెక్టర్‌కి చీమకుట్టినట్లైనా లేదన్నారు. మా పార్టీ నేతలు ఫిర్యాదు చేయడానికి వెళ్తే.. ఆయన కనీసం వినే ప్రయత్నం కూడా చేయలేదన్నారు. వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్న ఆ కలెక్టర్‌కు ఎన్నికల విధులు అప్పగిస్తే సమన్యాయం జరగదని అన్నారు. దేవాలయాల్లో పనిచేసే అధికారులకు ఎన్నికల డ్యూటీలు వేయవద్దని కోరినట్లు బీజేపీ నేత పాతూరి నాగభూషణం కోరారు.

వైసీపీకి ప్రచారం చేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలి

- ఎన్నికల ప్రధానాధికారికి ఎంఏ షరీఫ్ లేఖ

అమరావతి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలోని ఓ ఉన్నతాధికారి జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి అధికారిక పత్రాలపై సీఎం జగన్ బొమ్మను యథావిధిగా కొనసాగించాలని ఆదేశించారని, ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తున్న ఆ అధికారిపై చర్యలు తీసుకోవాలని శాసనమండలి మాజీ చైర్మన్ ఎంఏ షరీఫ్ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి లేఖ రాశారు. అలాగే ఏపీఎండీసీ అసిస్టెంట్ మేనేజర్ పి.హేమంత్‌కుమార్‌రెడ్డి వైసీపీ తరఫున ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారని, 23న తిరుపతిలో వైసీపీ నిర్వహించిన 'మేమంతా సిద్ధం' బ్రోచర్ విడుదల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారని తెలిపారు. 25న పూతలపట్టులో వైసీపీ యూత్ మీటింగ్‌లోనూ పాల్గొన్నారని, వెంటనే ఆయనను ఆ పదవి నుంచి తొలగించాలని కోరారు. డోన్ పట్టణంలో ఎడ్గా మసీదు, రాష్ట్రంలోని ఇతర మసీదుల కేర్‌టేకర్ కమిటీ ఏర్పాటు.. కోడ్‌కు విరుద్ధమని ఈసీ దృష్టికి తీసుకెళ్లారు. మంగళగిరి అంజుమన్ పాలనా కమిటీ వైసీపీకి ప్రచారం చేస్తోందని, గుంటూరు సిటీలోని వక్ఫ్ ఇన్‌స్టిట్యూషన్‌కు కేర్‌టేకర్ కమిటీ ఏర్పాటు చేయాలని గుంటూరు సిటీ వక్ఫ్ ఇన్‌స్పెక్టర్ ఒత్తిడి చేస్తున్నారని అన్నారు. వక్ఫ్‌బోర్డు ప్రధాన ఎగ్జిక్యూటివ్ అధికారి కోడ్‌కు విరుద్ధంగా వ్యవహరించవద్దని ఆదేశించాలన్నారు.

పథకాలు రద్దు చేసింది జగనా.. బాబా?

'చంద్రబాబు గెలిస్తే సంక్షేమ పథకాలు రద్దవుతాయని జగన్ మొదలుకొని వైసీపీ నేతలంతా ప్రచారం చేస్తున్నారు. అధికారంలోకొచ్చిన తర్వాత పథకాలు రద్దు చేసింది చంద్రబాబా... జగన్మోహన్‌రెడ్డా..? దమ్ముంటే బహిరంగ చర్చకు రండి' అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, శాసన మండలి మాజీ చైర్మన్ ఎంఏ షరీఫ్ సవాల్ విసిరారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. చంద్రబాబు ప్రభుత్వం అమలు చేసిన వందలాది సంక్షేమ పథకాలను జగన్ అధికారంలోకి రాగానే రద్దు చేశారన్నారు. అన్న క్యాంటీన్లు మూసివేయించి పేదల కడుపు కొట్టారన్నారు. 26 దళిత సంక్షేమ పథకాలను రద్దుచేసి వారిని వంచించారని, విదేశీ విద్య, పెళ్లి కానుక, రంజాన్ తోఫా, క్రిస్మస్ కానుక, సంక్రాంతి కానుక వంటి సంక్షేమ పథకాలను రద్దుచేసి బడుగు బలహీన వర్గాల వర్గాలకు ద్రోహం చేసింది జగన్ కాదా? అని ప్రశ్నించారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే ఇప్పటికంటే రెట్టింపు సంక్షేమ పథకాలను అమలు చేస్తారన్నారు. చంద్రబాబు ప్రజాగళం సభలకు వస్తున్న స్పందన చూసి వైసీపీ నేతలు వణికిపోతున్నారని షరీఫ్ వ్యాఖ్యానించారు.

కిలారు రోశయ్య కోడ్ ఉల్లంఘించారు: కేఎస్ రామకృష్ణ

ప్రభుత్వ కార్యాలయాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించిన వైసీపీ ఎంపీ అభ్యర్థి కిలారు రోశయ్య కోడ్‌ను ధిక్కరించారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నేత మాజీ ఎమ్మెల్సీ కేఎస్ రామకృష్ణ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి లేఖ రాశారు. 22న గుంటూరు మిర్చి యార్డు ఆవరణలో కిలారి రోశయ్య గుంటూరు తూర్పు, ప్రత్తిపాడు నియోజకవర్గాల వైసీపీ శాసనసభ అభ్యర్థులు నూరిఫాతిమా, బలసాని కిరణ్‌కుమార్ ప్రచారం నిర్వహించి ఓటర్లను ప్రలోభపెట్టారన్నారు. ఇప్పటికే రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశామని తెలిపారు. కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, రిటర్నింగ్ అధికారి రాజ్యలక్ష్మి ఎన్నికల నిబంధనలు అమలు చేయడంలో ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

శివసేనలో చేరిన బాలీవుడ్ నటుడు గోవింద

ముంబై, మార్చి 28: బాలీవుడ్ సీనియర్ నటుడు గోవింద.. ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన పార్టీలో చేరారు. గురువారం సీఎం షిండేను కలిసిన అనంతరం బాలాసాహెబ్ భవన్‌లో ఆయన పార్టీ కండువా కప్పుకున్నారు. వాయవ్య ముంబై పార్లమెంట్ స్థానం నుంచి శివసేన తరఫున గోవింద పోటీ చేయనున్నట్లు తెలుస్తోంది. 2004లో కాంగ్రెస్‌లో చేరిన గోవింద ముంబై నార్త్ స్థానం నుంచి ఎంపీగా గెలిచారు. ఆ తర్వాత 2009లో ఆయన కాంగ్రెస్ పార్టీని వీడి రాజకీయాలకు దూరంగా ఉన్నారు.

బీజేపీలోకి సావిత్రి జిందాల్

న్యూఢిల్లీ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): దేశంలో అత్యంత సంపన్నురాలైన హరియాణా మాజీ మంత్రి సావిత్రి జిందాల్ బీజేపీలో చేరారు. గురువారం హిస్సార్‌లో జరిగిన కార్యక్రమంలో హరియాణా సీఎం నయాబ్ సింగ్ సైనీ, మాజీ సీఎం మనోహర్ లాల్ ఖట్టర్ సమక్షంలో ఆమె బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. బుధవారం రాత్రి కాంగ్రెస్‌కు రాజీనామా చేస్తున్నట్లు ఆమె ఎక్స్ వేదికగా ప్రకటించారు. ఆమె కుమారుడు, పారిశ్రామికవేత్త నవీన్ జిందాల్ ఆదివారం బీజేపీలో చేరారు. ఆయనను కురుక్షేత్ర స్థానం నుంచి ఎంపీ అభ్యర్థిగా బీజేపీ ప్రకటించింది.

ఆకట్టుకున్న సైనిక విన్యాసాలు

సర్పవరం జంక్షన్(కాకినాడ), మార్చి 28: కాకినాడ సాగరతీరంలోని.. సూర్యారావుపేట నేవల్ ఎన్‌క్లేవ్‌లో భారత్ త్రివిధ దళాలు-అమెరికా యాంఫిబియాస్ టైగర్ ట్రయంఫ్-2024 సైనిక విన్యాసాలు గురువారం రెండోరోజూ కొనసాగాయి. ఎక్స్ టైగర్ ట్రయంఫ్ సీ ఫేజ్‌లో భాగంగా యుద్ధ సమయంలో శత్రువులపై ఆకాశం, భూభాగం, సముద్రంపై నుంచి త్రివిధ దళాలు జరిపే పోరాటం, యుద్ధ నైపుణ్యాల ప్రదర్శన, యుద్ధ ట్యాంకర్లు, యుద్ధ నౌకలు, ఆయుధాల వినియోగం, హెలికాప్టర్ల ద్వారా శత్రువుల శిబిరాలపై దాడులు వంటి విన్యాసాలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

కాకినాడ సముద్ర విన్యాసాల్లో పాల్గొన్న అమెరికా యుద్ధ నౌకలు



ఎట్టకేలకు 'బీడువారిన వరిచేల'కు

సాగునీరు

మరోసారి ఆందోళనతో దిగివచ్చిన అధికారులు



కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం పి.మల్లవరం పంచాయతీ గ్రాంటులో పురుగు మందుల డబ్బాలతో రైతుల రాస్తారోకో

తాళ్లరేవు, మార్చి 28: వంతులవారీ విధానంతో సంబంధం లేకుండా గ్రాంటు ప్రాంతంలో వరిచేలకు సాగునీరందించేందుకు ఎట్టకేలకు ఇరిగేషన్ అధికారులు హామీ ఇచ్చారు. 'వరిచేలో రయ్ రయ్.. బీడువారిన వరిచేలు' శీర్షికన గురువారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ఇరిగేషన్ అధికారుల బృందం గ్రాంటు ప్రాంతానికి కదిలింది. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం పి.మల్లవరం పంచాయతీ గ్రాంటులో సాగునీరు అందక వరిచేలు ఎండిపోవడంతో.. అందులో రైతులు ద్విచక్రవాహనాలు నడిపి తమ నిరసన తెలియజేసిన విషయం తెలిసిందే. దీంతో గురువారం ఆ వరిచేలను ఇరిగేషన్ అధికారుల బృందం పరిశీలించింది. అయితే, ఇరిగేషన్ అధికారులు కారులోనే ప్రయాణిస్తూ సర్వే చేసి, ఏ సమాధానం చెప్పకుండా వెళ్లిపోవడంతో రైతులు ఆగ్రహించారు. రోడ్డుపై పురుగు మందు డబ్బాలను పట్టుకుని రాస్తారోకో నిర్వహించారు. సాగునీరు ఇస్తారా.. పురుగుల మందు తాగమంటారా అంటూ నినాదాలు చేశారు. ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ సతీష్‌కుమార్, ఈఈ రామకృష్ణ, ఎస్ఈ శ్రీనివాసరావు, డీఈ హిమరత్నం, ఏఈ ఈశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకోవడంతో అధికారులను సాగునీరు ఇవ్వాలని నిలదీశారు. దీంతో ఇరిగేషన్ అధికారులు అక్కడికక్కడే కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి రైతుల ఇబ్బందులను వివరించి, వారితో చర్చలు జరిపారు. అనంతరం.. 'ఇకపై వంతులవారీ విధానంతో సంబంధం లేకుండా 15రోజులపాటు సాగునీటి సరఫరాకు చర్యలు చేపడతామ'న్నారు. ఇంజన్లతో సాగునీరు కాలువలోకి డంప్ చేసి ప్రతి ఎకరాకూ నీరందించేందుకు చర్యలు చేపడతామని చెప్పారు. ఆ వెంటనే ఓఎన్‌జీసీ అధికారులతో ఇరిగేషన్ అధికారులు, ఆర్డీవో చర్చించి ఓఎన్‌జీసీ పైపులైన్‌ను తెరిపించారు. దీంతో పంట పొలాలకు సాగునీరు పారుతోంది.

లేడనుకున్న వాడు తిరిగొచ్చాడు..!

- మతి చలించి ఏడేళ్ల క్రితం కుటుంబానికి దూరం
- ఎర్రగడ్డ మానసిక వైద్యశాలలో ఏళ్లతరబడి చికిత్స
- పూర్తిగా నయం అయ్యాక ఊరు పేరు వెల్లడి
- వైద్యుల చొరవతో కర్నూలు ఫ్యామిలీకి అప్పగింత

ఎర్రగడ్డ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మతి చలించడంతో ఏడేళ్ల క్రితం కనిపించకుండా పోయాడు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. ఏళ్లు గడిచిపోవడంతో ఇక తిరిగిరాడని కలతచెందారు. తీరా ఇన్నేళ్లకు తమ కుమారుడు బతికే ఉన్నాడని తెలిసి.. ఆనందంతో అక్కున చేర్చుకున్నారు. హైదరాబాద్‌లోని ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రి వైద్యుల చొరవతో ఆ వ్యక్తి కుటుంబానికి చేరువయ్యాడు. వివరాల్లోకి వెళితే... 2017లో కర్నూలు జిల్లాలోని ఓ గ్రామానికి చెందిన 40 సంవత్సరాల మానసిక రోగి తప్పిపోయాడు. 2020లో కాజీపేట రైల్వేస్టేషన్లో కొందరు ఎన్జీవోలు ఆ వ్యక్తిని చూసి కోర్టు ద్వారా ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రిలో చేర్పించారు. రెండు సంవత్సరాలు ఆస్పత్రిలో చికిత్స అందించిన అనంతరం అతన్ని బన్సీలాల్ పేటలోని హోం ఫర్ ది డిజేబుల్ ఆశ్రమానికి పంపించారు. గతేడాది డిసెంబరులో ఆయనను మళ్లీ మానసిక వైద్యశాలకు తీసుకొచ్చి చికిత్స అందిస్తున్నారు. రోగి పూర్తిగా సాధారణ స్థితికి వచ్చినప్పటికీ తన కుటుంబ సభ్యుల వివరాలు వెల్లడించలేకపోవడంతో ఆస్పత్రిలోనే ఉంచారు. నాలుగు రోజుల క్రితం రోగి కర్నూలు జిల్లాలోని తన స్వగ్రామం పేరు తెలియజేశాడు. దీంతో ఆస్పత్రిలో ట్రైనీ వైద్యుడిగా పనిచేస్తున్న అదే గ్రామానికి చెందిన డాక్టర్ హరి.. ఆ గ్రామ సర్పంచ్‌తో వీడియో కాల్ మాట్లాడించారు. రోగిని గుర్తుపట్టిన సర్పంచ్.. అతని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. బుధవారం రాత్రి రోగి కుటుంబ సభ్యులైన అమ్మ, నాన్న, అక్క, బావ, భార్య, పిల్లలతో ఆస్పత్రికి రోగిని చూసి ఆనందంలో మునిగిపోయారు. గురువారం వైద్యులు అతన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

వేడి నీళ్లు పోసి.. రోకలి బండతో కొట్టి..

- మద్యం మత్తులో వేధింపులకు గురిచేస్తున్నాడనే ఆగ్రహంతో భర్తను చిత్రహింసలు పెట్టి చంపిన భార్య
- ఇద్దరు స్నేహితులతో కలిసి తాళ్లతో కట్టేసి ఒంటిపై కారంపొడి చల్లి దాడి
- రోకలి బండతో కొట్టడంతో తలపై తీవ్ర గాయాలు
- ఆపై అంబులెన్స్‌కు తానే ఫోన్ చేసిన వైనం
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ భర్త మృతి



తోట హేమంత్

కరీంనగర్ క్రైం, మార్చి 28: పని మానేసి ఖాళీగా ఉండటమే కాకుండా పూటుగా మద్యం తాగి, ఆ మత్తులో తనను వేధిస్తున్నాడనే ఆగ్రహంతో భర్తను చిత్రహింసలు పెట్టి చంపిందో భార్య! తన ఇద్దరు స్నేహితులతో కలిసి భర్తను తాళ్లతో బంధించి.. ఒంటిపై వేడినీళ్లు పోసి.. కళ్లలో కారంపొడి చల్లి.. రోకలిబండతో కొట్టి ప్రాణాలు తీసింది. కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఈ ఘటన జరిగింది. స్థానికుల సమాచారం ప్రకారం.. పట్టణంలోని సుభాష్‌నగర్‌కు చెందిన తోట రోహిత, హేమంత్ (39) భార్యాభర్తలు. రోహిత, జిల్లా ఆస్పత్రిలో ఔట్‌సోర్సింగ్ విధానంలో ఉద్యోగం చేస్తోంది. హేమంత్ ఓ పెట్రోలు బంక్‌లో పనిచేస్తున్నాడు. కొన్నాళ్ల క్రితం అతడు పని మానేసి తాగుడుకు బానిసయ్యాడు. ఆ మత్తులో భార్య రోహితతో గొడవ పడుతుండేవాడు. మంగళవారం రాత్రి కూడా భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. దీన్ని మనసులో పెట్టుకున్న రోహిత.. భర్తను అడ్డు తొలగించుకోవాలని పథకం రూపొందించింది. తనతో కలిసి పనిచేసే సాయి కిరణ్, నవీన్‌ను బుధవారం రాత్రి ఇంటికి పిలిపించుకుంది. ఆ ఇద్దరి సాయంతో ఇంట్లోనే భర్త హేమంత్‌ను తాళ్లతో కట్టేసింది. ముగ్గురు కలిసి హేమంత్ ఒంటిపై పొగలుగక్కుతున్న వేడినీళ్లు పోసి.. ఆపై కారంపొడి చల్లారు. ఆపై రోకలిబండతో తీవ్రంగా కొట్టడంతో అతడి తలపై తీవ్రగాయాలయ్యాయి. కొద్దిసేపటికి హేమంత్ స్పృహ కోల్పోవడంతో రోహిత స్వయంగా అంబులెన్స్‌కు ఫోన్ చేసి కరీంనగర్ జిల్లా ఆస్పత్రికి తీసుకువెళ్లింది. అక్కడ చికిత్స పొందుతూ హేమంత్ మృతి చెందాడు. రోహితని, ఆమెకు సాయపడిన సాయి కిరణ్, నవీన్‌ను అదుపులోకి తీసుకున్నట్లు, నిందితులపై హత్య కేసు నమోదు చేసినట్లు కరీంనగర్ టౌన్ ఏసీపీ జీ నరేందర్ తెలిపారు.

అక్రమ మద్యంపై చర్యలు తీసుకోండి

- రాష్ట్ర సరిహద్దుల్లో నిఘా పెంచాలి: సీఎస్

అమరావతి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అక్రమ మద్యం, గంజాయి సాగు, ఇతర మత్తు పదార్థాల రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం మోపాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం అమరావతి సచివాలయంలో ఎక్సైజ్, పోలీస్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. సీఎస్ మాట్లాడుతూ 'సరిహద్దు రాష్ట్రాల డీజీపీల సమన్వయంతో మాదకద్రవ్యాల తయారీ, రవాణాకు మూలకారకులను గుర్తించి, వారిని పీడీ యాక్టు కింద అరెస్ట్ చేయాలి. మత్తు పదార్థాల తయారీ, రవాణా, సరఫరాలో భాగస్వాములైన వారిని గుర్తించి, చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలి. సరిహద్దు రాష్ట్రాల చెక్‌పోస్టుల్లో నిఘా మరింత పెంచాలి. ఎన్నికల నేపథ్యంలో ఇతర రాష్ట్రాల నుంచి ఏపీలోకి వచ్చే చీప్ లిక్కర్‌తోపాటు ఇతర మద్యంపై నిఘా పెంచాలని ఆదేశించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో కమిషనర్ రవిప్రకాశ్ మాట్లాడుతూ నార్కోటిక్స్ బ్యూరో సహకారంతో గంజాయి, ఇతర మత్తు పదార్థాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎక్సైజ్‌శాఖ కమిషనర్ వివేక్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని మద్యం డిస్టిలరీల వద్ద సీసీ కెమేరాలతో నిఘా ఉంటుందని, మద్యం రవాణా చేసే వాహనాలను జీపీఎస్‌తో మానటరింగ్ చేస్తామని చెప్పారు. అక్రమ మద్యం నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

రాష్ట్రానికి ముగ్గురు ప్రత్యేక పరిశీలకులు

అమరావతి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రానికి ముగ్గురు ప్రత్యేక పరిశీలకులను భారత ఎన్నికల సంఘం నియమించినట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 1987 బ్యాచ్‌కి చెందిన రిటైర్డు ఐఏఎస్ అధికారి రామ్‌మోహన్ మిశ్రాను స్పెషల్ జనరల్ అబ్జర్వరుగా, 1984 బ్యాచ్‌కి చెందిన రిటైర్డు ఐపీఎస్ అధికారి దీపక్ మిశ్రాను స్పెషల్ పోలీస్ అబ్జర్వరుగా, 1983 బ్యాచ్‌కి చెందిన రిటైర్డు ఐఆర్ఎస్ అధికారి నీనా నిగమ్‌ను స్పెషల్ ఎక్స్‌పెన్డీచర్ అబ్జర్వరుగా నియమించినట్లు తెలిపారు. ఈ ముగ్గురు ప్రత్యేక పరిశీలకులు వచ్చే వారం నుంచి రాష్ట్రంలో పర్యటిస్తారని, ఎన్నికల నిర్వహణకు రాష్ట్రంలో చేస్తున్న ముందస్తు ఏర్పాట్లను పరిశీలిస్తారన్నారు.

రెండోదశ లోక్‌సభ ఎన్నికలకు నోటిఫికేషన్

» 88 స్థానాలకు మొదలైన నామినేషన్ల పర్వం

న్యూఢిల్లీ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల రెండో దశ పోలింగ్ నోటిఫికేషన్‌ను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. 12 రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతం పరిధిలోని మొత్తం 88 లోక్‌సభ నియోజకవర్గాలకు ఈసీ రెండో దశలో ఎన్నికలను నిర్వహించనుంది. అసోం, బిహార్, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, రాజస్థాన్, త్రిపుర, ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్, మణిపూర్, జమ్మూ కశ్మీర్‌లోని పలు నియోజకవర్గాలకు రెండో దశలో పోలింగ్ జరగనుంది. నామినేషన్ల స్వీకరణ గురువారం నుంచే ప్రారంభమైంది. నామినేషన్ల దాఖలుకు ఏప్రిల్ 4 చివరి తేదీ.. ఏప్రిల్ 26న పోలింగ్ జరగనుంది. జమ్మూ కశ్మీర్‌లో ఏప్రిల్ 6న నామినేషన్ల పరిశీలన ఉంటుందని, మిగిలిన 11 రాష్ట్రాల్లో ఏప్రిల్ 5న నామినేషన్ల పరిశీలన ఉంటుందని ఈసీ వెల్లడించింది.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఈరోడ్ ఎండీఎంకే ఎంపీ గణేషమూర్తి మృతి

చెన్నై, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యాయత్నానికి పాల్పడి నాలుగు రోజులుగా ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న తమిళనాడు ఈరోడ్ ఎండీఎంకే లోక్‌సభ సభ్యుడు గణేషమూర్తి గురువారం వేకువజామున మృతి చెందారు. గత లోక్‌సభ ఎన్నికల్లో ఎండీఎంకే కోశాధికారిగా ఉన్న గణేషమూర్తి డీఎంకే ఉదయసూర్యుడి గుర్తుపై పోటీ చేసి గెలిచారు. ఈసారి కూడా ఈరోడ్ నియోజకవర్గాన్ని డీఎంకే కూటమి కేటాయిస్తుందని, మళ్లీ పోటీ చేయవచ్చునని గణేష్‌మూర్తి ఆశలు పెట్టుకున్నారు. అయితే డీఎంకే అధిష్ఠానం ఎండీఎంకేకు ఈరోడ్ నియోజకవర్గానికి బదులుగా ఈసారి తిరుచ్చి నియోజకవర్గాన్ని కేటాయించింది. ఈరోడ్‌లో డీఎంకే పోటీ చేయనుంది. ఈ విషయం తెలిసినప్పటి నుంచి గణేష్‌మూర్తి మానసిక ఒత్తిడికి లోనయ్యాడు. గత ఆదివారం మధ్యాహ్నం క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు.

తొలిసారి గాల్లోకి ఎగిరిన తేజస్ మార్క్-1ఏ

బెంగళూరు, మార్చి 28: స్వదేశీ తేలికపాటి యుద్ధ విమానం (ఎల్‌సీఏ) తేజస్ మార్క్-1ఏ తన తొలి ప్రయాణాన్ని విజయవంతంగా పూర్తిచేసుకుంది. హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హాల్) దేశీయంగా తయారు చేసిన ఈ యుద్ధ విమానాన్ని బెంగళూరులో గురువారం తొలిసారిగా పరీక్షించారు. ఈ పరీక్షలో భాగంగా తేజస్ మార్క్-1ఏ 15 నిమిషాలపాటు గాలిలో ఎగిరిందని హాల్ అధికారులు తెలిపారు. రక్షణ వర్గాల సమాచారం మేరకు ఈ ట్విన్ సీటర్ ట్రైనర్ వెర్షన్ యుద్ధ విమానాలను ఈ నెల 31లోపు ఐఏఎఫ్‌కు అప్పగించాలని హాల్ ప్రయత్నిస్తోంది.

స్కైరూట్ రాకెట్ మోటార్ పరీక్ష సక్సెస్

హైదరాబాద్, మార్చి 28: హైదరాబాద్‌కు చెందిన అంతరిక్ష స్టార్టప్ కంపెనీ స్కైరూట్ ఏరోస్పేస్ ఈ ఏడాది చివర్లో విక్రమ్-1 రాకెట్ ద్వారా ఉపగ్రహ ప్రయోగానికి సిద్ధమవుతోంది. అందులో భాగంగా రాకెట్‌లోని స్టేజ్-2 మోటార్ 'కలామ్-250'ను విజయవంతంగా పరీక్షించినట్టు ఆ సంస్థ గురువారం పేర్కొంది. స్టేజ్-2లోని హై-స్ట్రెంత్ కార్బన్ కాంపోజిట్ మోటార్ రాకెట్‌ను వాతావరణ దశ నుంచి అంతరిక్షంలోకి తీసుకెళ్తుందని స్కైరూట్ తెలిపింది. తిరుపతి జిల్లా శ్రీహరికోటలో ఇస్రోకు చెందిన ప్రొపల్షన్ టెస్ట్ బెడ్ వద్ద 'కలాం-250' మోటార్‌ను 85 సెకన్లపాటు మండించి పరీక్షించారు. "భారత అంతరిక్ష పరిశ్రమకు ఇదొక ముఖ్యమైన మైలురాయి. ప్రైవేటు రంగం రూపొందించిన కార్బన్-కాంపోజిట్-బిల్ట్ మోటారును ఇస్రోలో విజయవంతంగా పరీక్షించాం. ఈ సందర్భంగా ఇది అన్ని పారామితులను అందుకుంది. ఈ విజయం విక్రమ్-1 రాకెట్ ప్రయోగానికి మమ్మల్ని మరో అడుగు చేరువ చేసింది" అని స్కైరూట్ ఏరోస్పేస్ సహ వ్యవస్థాపకుడు, సీఈవో పవన్ చందన పేర్కొన్నారు.

నెట్ స్కోర్‌తో పీహెచ్‌డీలో చేరొచ్చు

» వచ్చే విద్యాసంవత్సరం నుంచే అమల్లోకి: యూజీసీ

న్యూఢిల్లీ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఇకపై విద్యార్థులు యూనివర్సిటీల వారీగా పీహెచ్‌డీ అడ్మిషన్ పరీక్షలకు హాజరవ్వకుండా జాతీయ అర్హత పరీక్ష (నెట్) స్కోర్‌తో ప్రవేశాలు పొందవచ్చని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) గురువారం పేర్కొంది. ఈ ఏడాది జూన్ సెషన్‌లో నిర్వహించే యూజీసీ-నెట్ పరీక్షలో కొత్త కేటగిరీని ప్రవేశపెట్టనున్నట్లు తెలిపింది. వచ్చే విద్యా సంవత్సరం (2024-25) నుంచే ఈ విధానం అమల్లోకి వస్తుంది. గతంలో జూనియర్ రిసెర్చ్ ఫెలోషిప్(జేఆర్ఎఫ్)-అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియామకానికి అర్హతకు మొదటి కేటగిరీ, అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియామకానికి అర్హతకు రెండో కేటగిరీలో నెట్ పరీక్షలు నిర్వహించేవారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా నియామకానికి నెట్ అర్హత జీవిత కాలం చెల్లుబాటయ్యేది. తాజాగా పీహెచ్‌డీలో ప్రవేశాలకు అర్హతను చేర్చారు. దీంతో మొదటి కేటగిరీ కేవలం జేఆర్ఎఫ్ లేదా అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా అర్హతకే పరిమితమౌతుంది. రెండో కేటగిరీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియామకానికి, పీహెచ్‌డీలో ప్రవేశానికి అర్హతగాఉంటుంది. కేవలం పీహెచ్‌డీ అర్హత కోసం మూడో కేటగిరీని పరిచయం చేశారు. అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియామకానికి అర్హతలో మొదటి రెండు కేటగిరీలు జీవితకాలం చెల్లుబాటులో ఉంటాయి. పీహెచ్‌డీలో చేరేందుకు ఏడాది కాలపరిమితి ఉంటుంది. "వేర్వేరు వర్సిటీల్లో పీహెచ్‌డీ ప్రవేశాలకు విద్యార్థులు ఆయా విశ్వవిద్యాలయాలు నిర్వహించే ప్రవేశ పరీక్షలకు హాజరుకావాల్సి వచ్చేది. నెట్‌ను ప్రామాణికంగా తీసుకోవడం వల్ల ఆ ఇబ్బందులుండవు. ఏడాదిలో రెండుసార్లు నెట్ నిర్వహణ ఉంటుంది" అని యూజీసీ చైర్మన్ జగదీశ్‌కుమార్ తెలిపారు. తమ విశ్వవిద్యాలయంలో నెట్, జేఆర్ఎఫ్, తెలంగాణసెట్‌ను పీహెచ్‌డీ ప్రవేశాల్లో అర్హతగా పరిగణిస్తున్నామని, ఇవి లేని వారికి ప్రవేశపరీక్ష నిర్వహిస్తున్నట్టు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం డీన్ డాక్టర్ వడ్డాణం శ్రీనివాసరావు తెలిపారు.

ఆన్సర్ షీట్ చూపించలేదని కత్తితో పొడిచారు

» పదో తరగతి విద్యార్థిపై ముగ్గురు సహచరుల దాడి

» మహారాష్ట్రలో ఘటన.. తప్పిన ప్రాణాపాయం

భివాండి, మార్చి 28: బుద్ధిగా పరీక్ష రాసి, సెంటరు నుంచి బయటకొచ్చిన పదో క్లాసు విద్యార్థి కత్తిపోటుకు గురయ్యాడు! అతడిపై ఈ దాడికి తెగబడింది తోటి విద్యార్థులే! పరీక్ష గదిలో తాము అడిగినా జవాబు పత్రం చూపించడానికి నిరాకరించాడనే ఆగ్రహంతోనే వారు ఇంతటి దారుణానికి ఒడిగట్టారు. మహారాష్ట్రలోని ఠాణే జిల్లా భివాండీలో ఈ ఘటన జరిగింది. మంగళవారం పరీక్ష కేంద్రం గదిలో విద్యార్థి పరీక్ష రాస్తుండగా ఆన్సర్ షీట్‌ను చూపించాలని అతడిని ముగ్గురు సహచర విద్యార్థులు అడిగారు. ఇందుకు అతడు నిరాకరించాడు. ఫలితంగా ఆ విద్యార్థిపై కోపం పెంచుకున్న ముగ్గురు, కాస్త ముందే జవాబు పత్రాలను ఇచ్చేసి బయటకొచ్చేశారు. ఆ విద్యార్థి ఎగ్జామ్ సెంటర్ నుంచి బయటకు రాగానే కత్తితో పొడిచారు. గాయపడిన బాలుడిని చికిత్స కోసం వెంటనే ఆస్పత్రికి తరలించారు. అతడికి ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. దాడికి పాల్పడిన ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

దక్షిణాదికి డేంజర్ బెల్

» ప్రమాదకర స్థాయికి ప్రధాన డ్యామ్‌లు

» నిల్వ సామర్థ్యం కంటే 25శాతం లోటు: సీడబ్ల్యూసీ

చెన్నై, మార్చి 28: దక్షిణ భారతదేశంలో ప్రధాన జలాశయాల నీటి మట్టాలు ప్రమాదకర స్థాయికి చేరుకున్నాయని కేంద్ర జల కమిషన్(సీడబ్ల్యూసీ) హెచ్చరించింది. ఆంధ్రప్రదేశ్- తెలంగాణ సరిహద్దుల్లోని నాగార్జున సాగర్, శ్రీశైలం డ్యామ్‌లకు ప్రమాద ఘంటికలు మోగించింది. నీటి నిల్వ సామర్థ్యం కంటే సాగర్‌లో, శ్రీశైలంలో అధిక లోటు కనిపిస్తోందని కమిషన్ తన నివేదికలో హెచ్చరించింది. బెంగళూరును ఇప్పుడు అల్లాడిస్తున్న నీటి కరువు రానున్న కాలంలో దక్షిణాదిలోని మిగతా నగర ప్రాంతాలనూ తాకనున్నదని హెచ్చరించిన ఈ అధ్యయనం, కేరళలో మాత్రమే డ్యామ్‌లు నిర్దిష్ట జలప్రమాణాలతో ఉన్నాయని తెలిపింది. కర్ణాటక, తమిళనాడు, ఏపీ, తెలంగాణలో ప్రధాన డ్యామ్‌ల్లో నీటి నిల్వ సామర్థ్యం కంటే 25% లోటు నెలకున్నదని కమిషన్ వివరించింది. వేసవి ఎండలు ముదరకముందే ఈ పరిస్థితి ఉంటే, రానున్న నెలల్లో ఎటువంటి ఎద్దడిని ఎదుర్కోవాల్సి వస్తుందోనన్న భయాందోళనలు వ్యక్తం అవుతున్నాయి.

అసలు కుంభకోణం ఈడీదే!

(మొదటి పేజీ తరువాయి)

ఆరోపించారు. అరెస్టు తర్వాతే శరత్ చంద్రారెడ్డి బీజేపీకి 55 కోట్లు చెల్లించాడన్నారు. ఆ తర్వాతే ఆయనకు బెయిలు ఇచ్చారని ఆరోపించారు. ఈడీకి నచ్చినంత కాలం తనను రిమాండ్‌లో ఉంచుకోవచ్చని కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు. విచారణకు తాను సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. ఎలాంటి ఆధారాలు లేకున్నా తనను ఇరికించడమే లక్ష్యంగా ఈడీ పని చేస్తోందని ఆరోపించారు. మద్యం కుంభకోణంలో ఇటీవల అరెస్టయిన కేజ్రీవాల్‌ను ఈడీ గురువారం ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో హాజరు పరిచింది. మరో వారం రోజుల కస్టడీకి అనుమతించాలని కోరింది. సీబీఐ ప్రత్యేక న్యాయమూర్తి కావేరీ బవేజా విచారణ నిర్వహించారు. కేజ్రీవాల్‌కు స్వయంగా వాదనలు వినిపించడానికి అవకాశం ఇవ్వాలని ఆయన తరఫున హాజరైన సీనియర్ అడ్వొకేట్ రమేశ్ గుప్తా కోరారు. న్యాయమూర్తి అంగీకరించారు. కేజ్రీవాల్‌కు ఐదు నిమిషాల పాటు అవకాశం ఇచ్చారు. దాంతో కేజ్రీవాల్ స్వయంగా హిందీలో వాదనలు వినిపించారు. ఈడీపై పలు కీలక ఆరోపణలు చేశారు. ఈడీ ఫైల్‌లో ఉన్న లక్ష పేజీలు తమకు అనుకూలంగా ఉన్నా రికార్డుల్లోకి తేవడం లేదన్నారు.

సీఎం అరెస్టుకు నలుగురి మాటలు సరిపోతాయా?

ఆ తర్వాత కేజ్రీవాల్ మాట్లాడుతుండగా, మధ్యలో ఈడీ న్యాయవాదులు జోక్యం చేసుకోబోగా కోర్టు అనుమతించలేదు. ఈడీ దర్యాప్తు విధానం, అరెస్టులు తదితర అంశాలపై కేజ్రీవాల్ అభ్యంతరం వ్యక్తం చేశారు. "2022 ఆగస్టు 17వ తేదీన సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. 2022 ఆగస్టు 22న ఈసీఐఆర్ నమోదు చేసింది. నన్ను అరెస్టు చేశారు. కానీ ఏ కోర్టు కూడా నన్ను దోషిగా నిర్ధరించలేదు. సీబీఐ 31,000 పేజీలు, ఈడీ 25,000 పేజీల సమాచారాన్ని ఈ విషయానికి సంబంధించి కోర్టు ముందు ఉంచాయి. మీరు వాటిని కలిపి చదివారా? అసలు నన్ను ఎందుకు అరెస్టు చేశారు? సిట్టింగ్ ముఖ్యమంత్రిని అరెస్టు చేయడానికి నలుగురు వ్యక్తులు చేసిన ప్రకటనలు సరిపోతాయా?" అని కేజ్రీవాల్ న్యాయస్థానాన్ని ప్రశ్నించారు. ఢిల్లీ మద్యం పాలసీ కేసును ఈడీ తప్పుదారి పట్టిస్తోందని ఆరోపించారు. మనీశ్ సిసోడియా సమక్షంలో తనకు మద్యం విధాన పత్రాలు ఇచ్చారని సి.అరవింద్ చెప్పారని ఈడీ అంటోందని కేజ్రీవాల్ ప్రస్తావించారు. ప్రస్తుత సీఎంను అరెస్టు చేయడానికి ఇది కారణం అవుతుందా? అని ప్రశ్నించారు. రోజూ చాలా మంది ప్రజాప్రతినిధులు వస్తారని, బయటికి వచ్చిన తర్వాత చాలామంది చాలా ప్రకటనలు చేస్తారని కేజ్రీవాల్ ప్రస్తావించారు. అలాగే, తనకు వ్యతిరేకంగా మాగుంట శ్రీనివాసులురెడ్డి ఇచ్చిన ప్రకటనను ఆధారంగా చేసుకొని ముఖ్యమంత్రిని అరెస్టు చేస్తారా? అని ప్రశ్నించారు. మద్యం పాలసీ మీద మాగుంట చాలాసార్లు మాట్లాడారని, ఈ కేసులో ఆయన తనయుడు రాఘవను అరెస్టు చేశాకే, మాట మార్చి తనకు వ్యతిరేకంగా సాక్ష్యం ఇచ్చారని చెప్పారు. ఇవన్నీ చూస్తుంటే ఈడీ కేవలం తనను ట్రాప్ చేయడానికే కంకణం కట్టుకుందని అర్థం అవుతోందన్నారు.



ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు వద్ద సీఎం కేజ్రీవాల్

మూడు రకాల ప్రకటనలు ఇచ్చినపుడు తనకు వ్యతిరేకంగా ఉన్న సాక్ష్యం ఒక్కటే ఎందుకు తీసుకుంటున్నారని ప్రశ్నించారు. మాగుంట శ్రీనివాసులు రెడ్డి కుమారుడు రాఘవరెడ్డి తొలి ఆరు ప్రకటనలు తనకు అనుకూలంగా ఇచ్చారని, మాట మార్చి తనకు వ్యతిరేకంగా సాక్ష్యం ఇవ్వగానే బెయిలు లభించిందని ప్రస్తావించారు. అతని వాంగ్మూలం తన అరెస్టుకు ఎలా ప్రామాణికం అవుతుందన్నారు. చివరగా అరబిందో ఫార్మా డైరెక్టర్ శరత్ చంద్రారెడ్డి ప్రకటనను తన అరెస్టుకు ప్రాతిపదికగా వాడారన్నారు. ఆయన 2022 నవంబరులో అరెస్టు అయితే, 2023 జూన్‌లో అప్రూవర్‌గా మారారని ప్రస్తావించారు. శరత్‌రెడ్డి మొదటి 11 ప్రకటనల్లో తన ప్రస్తావన చేయలేదన్నారు. 12వ ప్రకటనలో కూడా తాను కేజ్రీవాల్‌ను కలిశానని, హడావిడిగా ఉన్న సీఎం ఆప్ సమాచార విభాగం అధిపతిగా ఉన్న విజయ్ నాయర్‌తో టచ్‌లో ఉండాలని చెప్పారని మాత్రమే శరత్‌చంద్రారెడ్డి పేర్కొన్నారని కేజ్రీవాల్ గుర్తు చేశారు. శరత్‌చంద్రారెడ్డి ఈ కేసులో అరెస్టు అయిన తర్వాతే బీజేపీకి రూ.55 కోట్ల బాండ్లు కొన్నారని, పచ్చిగా చెప్పాలంటే బెయిలు కొనుక్కున్నారని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ఈడీ ముడుపుల రాకెట్‌కు ఇంతకన్నా ఆధారాలేం కావాలని ప్రశ్నించారు. రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన ముఖ్యమంత్రిని అరెస్టు చేసేందుకు ఈ నాలుగు ప్రకటనలు సరిపోతాయా? అని ప్రశ్నించారు.

సౌత్ గ్రూప్ హవాలపై ఆధారాలు ఉన్నాయ్

కేజ్రీవాల్ ఆరోపణలను ఈడీ న్యాయవాది ఎస్వీ రాజు ఖండించారు. మద్యం విధానం కుంభకోణంలో స్వీకరించిన లంచాల మొత్తాలను ఆప్ గోవా ఎన్నికల్లో వినియోగించిందని రాజు ఆరోపించారు. సౌత్ గ్రూప్ నుంచి హవాలా రూపంలో డబ్బులు వచ్చాయని చెప్పడానికి ఈడీ దగ్గర సాక్ష్యాలు ఉన్నాయన్నారు. మద్యం కుంభకోణానికి బీజేపీకి ఎలక్టోరల్ బాండ్ల రూపంలో వచ్చిన రూ.55 కోట్లకు ఎలాంటి సంబంధం లేదని ఈడీ న్యాయవాది చెప్పారు. సీఎం అయినంత మాత్రాన అరెస్ట్ చెయ్యకూడదని లేదని రాజు కోర్టుకు వివరించారు. సీఎంకు భిన్నమైన ప్రమాణాలు లేవని, సామాన్యుల లాగానే సీఎంను అరెస్ట్ చేసే అధికారం ఉందని చెప్పారు. కేజ్రీవాల్ తరఫు న్యాయవాది రమేశ్ గుప్తా స్పందిస్తూ ఎలక్టోరల్ బాండ్స్‌తో ఈ కేసుకు సంబంధం లేదంటే దీనిపై కూడా విచారణ జరిపేలా ఈడీకి ఆదేశాలు ఇవ్వాలని న్యాయస్థానాన్ని కోరారు. ఇరువైపు వాదనలు విన్న స్పెషల్ జడ్జ్ కావేరి బవేజా తీర్పు రిజర్వ్ చేశారు. కేజ్రీవాల్ వాదనలను లిఖితపూర్వకంగా ఇవ్వాలని ఆదేశించారు. సాయంత్రం 4 గంటల తర్వాత ఇచ్చిన ఉత్తర్వుల్లో కేజ్రీవాల్‌కు ఏప్రిల్ 1 వరకు ఈడీ కస్టడీకి ఇస్తున్నట్లు వెల్లడించారు. ఆ రోజు ఉదయం 11 గంటలకు తన ముందు హాజరు పరచాలని ఆదేశించారు.

కేజ్రీవాల్ సహకరించడం లేదు

కేజ్రీవాల్ కన్నా ముందు ఈడీ తరఫున అడిషనల్ సోలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు, సీనియర్ న్యాయవాది జోహెబ్ హుస్సేన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వాదనలు వినిపించారు. ఎస్వీ రాజు వాదనలు కొనసాగిస్తూ... ఈడీ విచారణకు కేజ్రీవాల్ సహకరించడం లేదని ఆరోపించారు. ఈ కేసులో గోవాకు చెందిన పలువురికి ఈడీ సమన్లు జారీ చేసిందని చెప్పారు. ఆ వ్యక్తులతో కలిపి కేజ్రీవాల్‌ను విచారించాల్సి ఉందన్నారు. అలాగే పంజాబ్‌కు చెందిన పలువురు సీనియర్ ఎక్సైజ్ అధికారులకు ఈడీ సమన్లు జారీ చేసిందని చెప్పారు. కేజ్రీవాల్‌ను 5 రోజులు విచారించి, ఆయన చెప్పినవి రికార్డు చేశామని ప్రకటించారు. కేజ్రీవాల్ తప్పించుకునే సమాధానాలు చెబుతున్నారని కోర్టుకు నివేదించారు. కేజ్రీవాల్ ఉద్దేశపూర్వకంగానే దర్యాప్తునకు సహకరించడం లేదని, ఆదాయ పన్ను రిటర్న్‌ల వివరాలను ఇవ్వడం లేదని చెప్పారు. డిజిటల్ పరికరాల పాస్‌వర్డ్‌లను సైతం కేజ్రీవాల్ వెల్లడించడం లేదన్నారు.

జైలు నుంచే కేజ్రీవాల్ పాలన

కేజ్రీవాల్‌కు ఢిల్లీ హైకోర్టులో పెద్ద ఊరట లభించింది. జైలు నుంచి ప్రభుత్వాన్ని నడపడాన్ని అడ్డుకోలేమని ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. కేజ్రీవాల్ ముఖ్యమంత్రిగా కొనసాగడానికి ఎలాంటి చట్టపర అడ్డంకులు లేవని తేల్చిచెప్పింది. మద్యం విధానం కేసులో కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్ట్ చేసినందున, ఆయనను ముఖ్యమంత్రి పదవి నుంచి తొలగించాలని కోరుతూ ఢిల్లీ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. గురువారం ఢిల్లీ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి, జస్టిస్ మన్మోహన్, జస్టిస్ మన్మీత్ ప్రీతమ్ సింగ్ అరోరాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. కేజ్రీవాల్ ముఖ్యమంత్రి పదవిలో కొనసాగడం వల్ల న్యాయ ప్రక్రియకు ఆటంకం కలుగుతుందని పిటిషనర్ వాదించగా ధర్మాసనం తోసిపుచ్చింది. పరిపాలన పరమైన అంశాల్లో తాము జోక్యం చేసుకోలేమని, పరిపాలన విభాగం, రాష్ట్రపతి పరిశీలించాలని స్పష్టం చేసింది. "ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ పరిశీలిస్తున్నట్లు ప్రసార మాధ్యమాల్లో చూశాం. ఇది రాష్ట్రపతి ముందుకు వెళ్లాల్సిన అంశం" అని తేల్చిచెప్పింది. ఈ పరిస్థితి గతంలో ఎప్పుడూ ఎదురు కాలేదని, తాము రాజకీయాల్లోకి పోదలచుకోలేదని ప్రకటించింది.

లోకం తీరు



ఉష్ణోగ్రతలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
నంద్యాల	41.0	27.0
హైదరాబాద్	39.2	24.6
విజయవాడ	37.4	24.4
విశాఖపట్నం	36.4	24.8
ఒంగోలు	35.3	26.1
బాపట్ల	33.6	22.6

కేజ్రీవాల్ అరెస్టుపై మళ్లీ స్పందించిన అమెరికా

» తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన భారత్

న్యూఢిల్లీ, మార్చి 28: ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అరెస్టుపై అమెరికా మరోసారి స్పందించింది. ఈసారి కేజ్రీవాల్ అరెస్టుతోపాటు కాంగ్రెస్‌పార్టీ బ్యాంకు ఖాతాల స్తంభన అంశాన్నీ ప్రస్తావించింది. వీటికి సంబంధించి నిష్పాక్షిక, పారదర్శక, నిర్ణీత గడువుతో కూడిన న్యాయప్రక్రియ కొనసాగుతుందని ఆశిస్తున్నామని పేర్కొంది. అమెరికా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మాథ్యూ మిల్లర్ బుధవారం ఈ వ్యాఖ్యలు చేశారు. కేజ్రీవాల్ అరెస్టు అంశాన్ని పరిశీలిస్తున్నామని, ఆయన పట్ల నిష్పాక్షిక విచారణ జరగాలని కోరుకుంటున్నామని అమెరికా ఇటీవల వ్యాఖ్యానించటంపై కేంద్రప్రభుత్వం బుధవారం ఢిల్లీలోని అమెరికా రాయబార కార్యాలయ ఉప అధిపతిని పిలిచి తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసింది. అయినా అమెరికా కేజ్రీవాల్ అరెస్టుపై తన వైఖరిని పునరుద్ఘాటించటం గమనార్హం. అమెరికా వ్యాఖ్యలపై స్పందిస్తూ... 'భారత ఎన్నికల, న్యాయ ప్రక్రియలపై ఏ విదేశీ శక్తుల ప్రభావాన్ని ఆమోదించేది లేదు. భారత్‌లో న్యాయ ప్రక్రియలు చట్టబద్ధపాలనకు అనుగుణంగా పని చేస్తాయి. ఇతరుల సార్వభౌమాధికారం, అంతర్గత వ్యవహారాలపట్ల దేశాలు గౌరవ భావంతో ఉండాలి' అని విదేశాంగశాఖ పేర్కొంది.

'అప్పు'డే మొదలైంది

» 2024-25 ఆర్థిక సంవత్సరంలో మొదటి వర్కింగ్ డేనే 4,000 కోట్ల అప్పు

అమరావతి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కొత్త ఆర్థిక సంవత్సరం 2024-25లో మొదటి వర్కింగ్ డే నాడే జగన్ సర్కార్ అప్పులకు ఎగబడుతోంది. ఏప్రిల్ 1 ఆర్‌బీఐకి సెలవు కావడంతో రెండో తేదీ మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ సెక్యూరిటీలు వేలంలో అమ్మి రూ.4,000 కోట్లు అప్పు తెచ్చుకుంటామంటూ జగన్ సర్కార్ గురువారం రిజర్వ్ బ్యాంక్‌కు సమాచారం ఇచ్చింది. ఈ నెల 31తో ముగిసే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కేవలం మంగళవారం అప్పులే రూ.69,000 కోట్లు తెచ్చింది. ఇవి కాకుండా కార్పొరేషన్లు, ఇతర మార్గాల ద్వారా తెచ్చిన అప్పులు దాదాపు రూ.50,000 కోట్ల వరకు ఉన్నాయి. ఏప్రిల్ 1తో ప్రారంభమయ్యే కొత్త ఆర్థిక సంవత్సరంలో అప్పులకు కేంద్రం అనుమతులిస్తుంది. ఏప్రిల్ నుంచి డిసెంబరు వరకు 9 నెలలకు గాను ఏపీకి రూ.45,000 కోట్ల నుంచి రూ.50,000 కోట్ల వరకు అనుమతి వచ్చే అవకాశం ఉంది. ఈ మొత్తాన్ని 9 నెలల పాటు వాడుకోవాలి. కానీ ఒక్క వారంలోనే రూ.4,000 కోట్ల అప్పులు తెస్తే, నెల గడిచే సరికి రూ.20,000 కోట్ల అప్పులు తెచ్చే అవకాశం ఉంది. ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు ఆ పరిమితి మొత్తం వాడేసింది. ఇప్పుడు ఒక్క వారంలోనే రూ.4,000 కోట్ల అప్పులకు ఎగబడుతోంది.

800 కోట్ల బిల్లుల చెల్లింపు

జగన్ సర్కార్ తన అస్మదీయులకు మాత్రమే బిల్లులు చెల్లించే ప్రక్రియను కొనసాగిస్తోంది. కోడ్ అమల్లో ఉన్నప్పటికీ ఫిఫో ఉల్లంఘన ప్రతిరోజు జరుగుతోంది. ఈ నెల 27న ఆర్థిక శాఖ రూ.800 కోట్ల బిల్లులు చెల్లించింది. మూడు, నాలుగేళ్ల నుంచి ఎదురు చూస్తున్న, కోర్టుల్లో పిటిషన్లు వేసిన ఏ ఒక్క బాధితుడి ఖాతాలో రూపాయి కూడా బిల్లు పడడం లేదు. కానీ ఖజానా నుంచి వేల కోట్ల చెల్లింపులు జరిగిపోతున్నాయి. ఈనెల 6 నుంచి 15వరకు రూ.6,500 కోట్లు, 16 నుంచి 20వరకు రూ.584 కోట్లు, 21 నుంచి 26 వరకు రూ.1500 కోట్లు, 27న ఏకంగా రూ.800 కోట్ల బిల్లులు ప్రభుత్వం చెల్లించింది.

న్యాయ వ్యవస్థపై రాజకీయ కుట్ర

కోర్టులపై విశ్వసాన్ని తగ్గించేలా అసత్య ప్రచారం.. న్యాయస్థానాల ప్రతిష్ఠకు భంగం కలిగే ప్రమాదం

» సీజేఐకు 600 మంది సుప్రీంకోర్టు న్యాయవాదుల లేఖ

న్యూఢిల్లీ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): న్యాయ వ్యవస్థపై రాజకీయ కుట్ర జరుగుతున్నదని పలువురు న్యాయవాదులు ఆరోపించారు. రాజకీయ ఒత్తిళ్లతో న్యాయ వ్యవస్థకు ముప్పు వాటిల్లే ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్‌కు సుమారు 600 మంది న్యాయవాదులు లేఖ రాశారు. ఈనెల 26వ తేదీన రాసిన లేఖ ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రాజకీయ లక్ష్యాలతో కొన్ని ప్రత్యేక బృందాలు న్యాయ వ్యవస్థపై ఒత్తిడి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆ లేఖలో ఆరోపించారు. న్యాయవ్యవస్థ ప్రతిష్ఠకు భంగం కలిగించేందుకు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. ప్రత్యేకించి రాజకీయ నేతల ఆర్థిక సంబంధాలకు సంబంధించిన కేసుల్లో పరోక్షంగా ఒత్తిడి తీసుకొచ్చే ప్రయత్నం జరుగుతోందన్నారు. న్యాయస్థానాలు, న్యాయమూర్తుల గురించి తప్పుడు సంకేతాలు ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. కోర్టులపై ప్రజల్లో విశ్వాసాన్ని తగ్గించేందుకు న్యాయస్థానాల కీలక తీర్పులపై తప్పుడు కథనాలు సృష్టిస్తున్నారని లేఖలో పేర్కొన్నారు. "రాజకీయ ప్రముఖులు, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి చెందిన కేసుల్లో నిందితులు న్యాయవ్యవస్థ స్వతంత్రతకు భంగం వాటిల్లేలా ప్రవర్తిస్తున్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థతో పాటు న్యాయ వ్యవస్థపై కూడా ప్రజల్లో నమ్మకాన్ని దెబ్బతీయాలని చూస్తున్నారు. రాజకీయ నేతలు కొందరిపై అవినీతి ఆరోపణలు చేస్తారు. ఆ తర్వాత మళ్లీ వారే కోర్టుల్లో వాటిని సమర్థించుకుంటారు. కోర్టు నిర్ణయాలు తమకు అనుకూలంగా రాకపోతే వెంటనే బహిరంగ విమర్శలకు దిగుతున్నారు. సోషల్ మీడియాలో అవాస్తవాలను ప్రచారం చేస్తూ న్యాయమూర్తులపై ఒత్తిడి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారు. న్యాయ వ్యవస్థ పనితీరును కించపరిచేలా స్వర్ణయుగం, బెంచ్ ఫిక్సింగ్ వంటి పదాలను కొందరు వ్యంగ్యంగా వినియోగిస్తున్నారు. న్యాయస్థానాలను అగౌరవ పరిచే ఇలాంటి పదజాలాన్ని ప్రయోగించే వారిని ఉపేక్షించకూడదు. వ్యక్తిగత, రాజకీయ కారణాలతో కోర్టు ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు చేస్తున్న ఇలాంటి ప్రయత్నాలను తిప్పికొట్టాలి. దీనిపై మౌనంగా ఉంటే న్యాయవ్యవస్థకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. దీనినే అలుసుగా తీసుకుని వారు మరింత పేట్రేగిపోయే అవకాశముంది. ప్రత్యేకించి ఎన్నికల సమయంలోనే ఇలాంటివి ఉత్పన్నం అవుతున్నాయి. 2018-19 ఎన్నికల సమయంలోనూ ఇలాగే జరిగింది. మళ్లీ ఇప్పుడు అదే ప్రయత్నం జరుగుతోంది. వీటిని ఉపేక్షించడం మంచిది కాదు. అందుకే.. దీనిపై కఠిన చర్యలు తీసుకోవాలని సర్వోన్నత న్యాయస్థానాన్ని కోరుతున్నాం" అని లేఖలో పేర్కొన్నారు. లేఖపై సంతకం చేసిన వారిలో హరీశ్ సాల్వే, మనన్ కుమార్ మిశ్రా, అదిష్ అగర్వాల, చేతన్ మిట్టల్, పింకీ ఆనంద్ తదితరులు ఉన్నారు.



ఇది పాతకాలపు కాంగ్రెస్ సంస్కృతి: మోదీ

సీజేఐకి న్యాయవాదుల లేఖపై ప్రధాని మోదీ స్పందించారు. ఇతరులను బుజ్జగించడం, వేధించడం పాత కాలపు కాంగ్రెస్ సంస్కృతి అని ఎక్స్ వేదికగా మోదీ ఆరోపించారు. ఐదు దశాబ్దాల క్రితమే కమిటెడ్ జ్యుడీషియరీ కోసం కాంగ్రెస్ పిలుపునిచ్చిందన్నారు. కాంగ్రెస్ వాళ్లు స్వార్థ ప్రయోజనాల కోసం దేనికైనా సిద్ధంగా ఉంటారన్నారు. ఇతరుల నుంచి నిబద్ధతను సిగ్గు లేకుండా కోరతారని, దేశం పట్ల నిబద్ధతకు మాత్రం దూరంగా ఉంటారని పేర్కొన్నారు. 140 కోట్ల మంది భారతీయులు వారిని తిరస్కరించడంలో ఆశ్చర్యమేమీ లేదని మోదీ వ్యాఖ్యానించారు.

మోదీ వ్యాఖ్యలు కపటత్వానికి పరాకాష్ఠ: ఖర్గే

ప్రధాని మోదీ వ్యాఖ్యలు కపటత్వానికి పరాకాష్ఠ అని కాంగ్రెస్ ఎద్దేవా చేసింది. ప్రజాస్వామ్యాన్ని ఏమార్చారని ఆరోపించింది. ప్రధాని దేశంలోని ప్రతీ వ్యవస్థ పైనా బలప్రయోగానికి పాల్పడ్డారని, రాజ్యాంగాన్ని దెబ్బ తీశారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. నలుగురు సుప్రీం కోర్టు న్యాయమూర్తులు విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి ప్రజాస్వామ్యం నాశనం అవుతోందని వ్యాఖ్యానించిన విషయం ప్రధాని గుర్తు చేసుకోవాలన్నారు. అది మోదీ ప్రధానిగా ఉన్నపుడే జరిగిందని చెప్పారు. అందులో ఒక న్యాయమూర్తి రాజ్యసభకు నామినేట్ అయ్యారని ప్రస్తావించారు.

మరో ఆరుగురు వలంటీర్లపై వేటు

» శ్రీకాకుళంలో వైసీపీ తరఫున ప్రచారం

» సి-విజిల్‌కు ఫిర్యాదు రావడంతో చర్యలు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

శ్రీకాకుళం జిల్లాలో వైసీపీ తరఫున ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆరుగురు వలంటీర్లను విధుల నుంచి తొలగించారు. టెక్కలి వైసీపీ అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్‌తో కలిసి సంతబొమ్మాళిలో వలంటీర్లు కల్లూరి పాపారావు, వాదాల దుర్గారావు, అట్టాడ కామేశ్వరరావు, బొమ్మాళి ఉమాశంకర్ ప్రచారంలో పాల్గొన్నారు. దీనిపై టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు సి-విజిల్‌కు ఫిర్యాదు చేశారు. ఆధారాలను పరిశీలించిన నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, సబ్‌కలెక్టర్ నూరుల్‌కమర్.. ఆ వలంటీర్లను విధుల నుంచి తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. సంతబొమ్మాళి మండలం బోరుభద్రలో ఉపాధిహామీ పనుల వద్ద వలంటీర్లు మల్ల అశ్విని, బొడ్డ శ్రీలత వైసీపీకి అనుకూలంగా ప్రచారం చేస్తున్నట్టు సి-విజిల్‌కు ఫిర్యాదు అందిందని ఎంపీడీవో ఉమాసుందరి తెలిపారు. దీనిపై విచారణ చేపట్టి ఆ ఇద్దరినీ విధుల నుంచి తొలగించామన్నారు. కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం కృష్ణవరం గ్రామానికి చెందిన గొరకపూడి గోపీనాథ్ ఎన్నికల నోడల్ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్నారు. కృష్ణవరంలో వైసీపీ ప్రచారంలో పాల్గొన్నట్టు ఫిర్యాదులు రావడంతో ఉన్నతాధికారులు విచారణ చేసి గోపీనాథ్‌ను సస్పెండ్ చేసినట్టు ఆర్వో శ్రీనివాస్ తెలిపారు. ప్రకాశం జిల్లా కొనకనమిట్ల మండలం ఎదురాళ్లపాడు పంచాయతీ పరిధి కొత్తపల్లి గ్రామంలో వైసీపీ ఎన్నికల ప్రచారంలో గ్రామానికి చెందిన వలంటీర్లు సంజీవరెడ్డి, కొండారెడ్డి పాల్గొన్నారు. తర్లుపాడు మండలంలోని పోతలపాడులో గురువారం వైసీపీ ప్రచార కార్యక్రమంలో ఇటీవల సెలవులపై వచ్చిన సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ కొమ్ము రమేశ్ పాల్గొన్నారు.

వైసీపీకి ప్రచారం చేయలేదని...

తిరుపతి జిల్లా కోట మండలం కొత్తపట్నం పంచాయతీలో 22మంది గ్రామ వలంటీర్లున్నారు. ఇటీవల వైసీపీ నుంచి టీడీపీలో చేరిన నాయకుడి సిఫారసుతో 8 మంది గతంలో వలంటీర్లుగా చేరారు. ఆయన టీడీపీలోకి వెళ్లడంతో వలంటీరు పోస్టులకు రాజీనామా చేయాలని వైసీపీ నాయకులు ఒత్తిడి తెస్తున్నారు. అందుకు నిరాకరించడంతో ఈ నెల 1 నుంచి ఐదుగురు వలంటీర్ల పేర్లను హోల్డ్‌లో ఉంచారు. దీనిపై స్పందించిన ఎంపీడీవో హోల్డ్‌లో ఉంచిన లాగిన్‌ను తొలగించి విచారణ అనంతరం వలంటీర్లకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

'ఉపాధి' వేతనం పెంపు

న్యూఢిల్లీ, మార్చి 28: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలి రేట్లను సవరించారు. దీంతో ఉపాధి హామీ పనులు చేసే కూలీలకు వివిధ రాష్ట్రాలలో 4% నుంచి 10% వరకు కూలి రేట్లు పెరగనున్నాయి. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ ఎన్నికల కమిషన్ నుంచి అనుమతి పొంది.. సవరించిన కూలిరేట్లను ఈనెల 27వ తేదీన నోటిఫై చేసింది. ఆ నోటిఫికేషన్ ప్రకారం నైపుణ్యం లేని కార్మికులకు అత్యధికంగా హరియాణాలో రోజుకు రూ.374, అత్యల్పంగా అరుణాచల్‌ప్రదేశ్, నాగాలాండ్ రాష్ట్రాలలో రూ.234 చెల్లించనున్నారు. ఈ పథకం కింద కూలీలకు ఆర్థిక సంవత్సరంలో కనీసం 100 రోజుల పని కల్పిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో కూలీ రేటు రూ.28 పెరిగి, రూ.300కు చేరింది. నోటిఫికేషన్‌లోని వివరాల మేరకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, గోవాలలో సుమారు 10% వరకు కూలీ రేటును పెంచారు.

కనీసం రూ.400 అయినా చేయలేదు: కాంగ్రెస్..

ఉపాధి కూలీల వేతనాలను రూ.400 చేస్తామని 'శ్రామిక న్యాయ్' గ్యారెంటీలో తాము హామీ ఇచ్చామని, మోదీ ప్రభుత్వం కనీసం అంతకైనా పెంచలేదని కాంగ్రెస్ విమర్శించింది. 'ఉపాధి కూలీలకు శుభాకాంక్షలు. ప్రధానమంత్రి మీ వేతనాన్ని 7 రూపాయలు పెంచారు. అంత పెద్ద మొత్తంతో మీరు ఏం చేస్తారని బహుశా ఆయన మిమ్మల్ని అడగొచ్చు. మీ పేరుతో థాంక్యూ మోదీ ప్రచార కార్యక్రమాన్ని రూ.700 కోట్ల వ్యయంతో ప్రారంభించే అవకాశం కూడా ఉంది' అని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ ఎక్స్‌లో పోస్టు చేశారు. ఇండియా కూటమి అధికారంలోకి రాగానే కార్మికులకు కనీస వేతనాన్ని రూ.400కు పెంచుతుందని ఆయన పేర్కొన్నారు.

ఐదేళ్లలో ఏం కోల్పోయారో, ఎంత నష్టపోయారో ఆడబిడ్డలంతా ఆలోచించుకోవాలి. ఒక అహంకారి విధ్వంసంతో రాష్ట్రాన్ని లూటీ చేసి, పేదలను నిరుపేదలను చేశాడు. ఆ దుర్మార్గుడి అంతుచూసే సమయం వచ్చింది.

మద్యపాన నిషేధం అమలు చేయకపోతే ఓటు అడగనని చెప్పాడా.. లేదా? ఇప్పుడు ఓటు అడుగుతున్నాడా.. లేదా? ఇలాంటి వాళ్లకు ఓట్లు వేస్తారా..? అందుకే నిలదీయమంటున్నా.

నిరుద్యోగుల సంఖ్యను పెంచిన ఘనత జగన్‌దే. ఖాళీగా ఉన్న యువత నిరుత్సాహానికి గురవుతోంది. తద్వారా మత్తు పదార్థాలకు బానిసలవుతున్నారు. యువతను చెడుదారిలో పెట్టి, జాతిని నిర్వీర్యం చేసిన దుర్మార్గుడు జగన్.

అనంతపురం కియ మన బ్రాండ్.. పెట్టుబడులు ఆకర్షించి, యువతకు ఉద్యోగాలివ్వడం మన బ్రాండ్. జాకీ పారిపోవడం.. పెట్టుబడులను తరిమేయడం జగన్‌రెడ్డి బ్రాండ్.

- చంద్రబాబు



అనంతపురం జిల్లా రాప్తాడులో చంద్రబాబు బహిరంగసభకు భారీగా హాజరైన జనం, మేడలపైనా ఎక్కేశారు

గొడ్డలి వేటు వేసి..

నంగనాచి కబుర్లు

(మొదటి పేజీ తరువాయి)

ఓట్ల సునామీ రాబోతోందని.. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమిదే విజయమని ధీమా వ్యక్తం చేశారు. ఐదేళ్లలో రాష్ట్రానికి, అన్ని వర్గాల ప్రజలకు జరిగిన అన్యాయం ప్రతి ఇంట్లో చర్చ జరగాలని.. ఈ అన్యాయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుపెట్టుకుని మరీ ఓటు వేయాలని కోరారు. ఈ ఎన్నికల్లో ప్రజలు గెలవాలని, రాష్ట్రం నిలబడాలని అన్నారు. మీ బిడ్డల జీవితాలు బాగుపడాలంటే వైసీపీ అరాచక పాలనకు అంతం పలకాలని ప్రజలకు పిలుపిచ్చారు. జగన్‌రెడ్డి కట్టుకథలకు మోసపోయేందుకు సిద్ధంగా లేరన్నారు. రాబోయేది ఎన్డీయే ప్రభుత్వమేనని, కేంద్రంలో 410 ఎంపీ సీట్లు, రాష్ట్రంలో 160కిపైగా ఎమ్మెల్యే సీట్లు, 24 ఎంపీ సీట్లు గెలుస్తున్నామని చెప్పారు. ఇంకా ఏమన్నారంటే..

అందరినీ నేనే మేనేజ్ చేస్తున్నానట!

2019 మార్చి 15న జగన్ టీవీలో వివేకాది గుండెపోటు అని చూపించారు. ఆ తర్వాత గుండెపోటు కాదు.. రక్తపు వాంతులు అన్నారు. అనంతరం గొడ్డలిపోటు అన్నారు. చివరగా నా చేతిలో గొడ్డలిపెట్టి నారాసుర రక్తచరిత్ర అంటూ దొంగ సాక్షిలో నా బొమ్మ వేశారు. తర్వాత బెంగళూరులో ఆస్తికి సంబంధించి సెటిల్‌మెంట్లే హత్యకు కారణమన్నారు. ఏపీ పోలీసులపై నమ్మకం లేదు.. సీబీఐ విచారణ కావాలన్నారు. హైకోర్టుకు వెళ్లి గ్యాగ్ ఆర్డర్ తెచ్చుకున్నారు. అధికారంలోకి రాగానే సీబీఐ విచారణ అవసరం లేదని పిటిషన్‌ను విత్‌డ్రా చేసుకున్నారు. తన తండ్రిని హత్య చేసిన హంతకులు ఎవరో పట్టుకోవాల్సిందేనని వివేకా కుమార్తె సునీత పోరాడారు. రెండో వివాహమే కారణమని అదే దొంగ సాక్షిలో కథనాలు వచ్చాయి. ఆస్తిలో అల్లుడితో విరోధమే వివేకా హత్యకు కారణమన్నారు. కూతురే హత్య చేసిందని మరో మారు చెబుతారు. సునీల్ యాదవ్ తల్లిని వివేకా లైంగికంగా వేధించినందునే చంపేశారని అన్నారు. నిన్న పులివెందుల వచ్చిన జగన్.. బాబాయిని ఎవరో చంపేసి తన మీదకు నెట్టేస్తున్నారని నంగనాచి కబుర్లు చెప్పాడు. ఆయన ఇద్దరు చెల్లెళ్లను నేను మేనేజ్ చేస్తున్నానని కథలు చెబుతున్నాడు.

ప్రజాగళం సూపర్ హిట్.. సిద్ధం అట్టర్ ఫ్లాప్

ప్రజాగళం సభలు సూపర్ డూపర్ హిట్ అవుతున్నాయి. మధ్యాహ్నం మండుటెండలో పెద్ద సంఖ్యలో హాజరై.. మనమంతా ఎన్నికల యుద్ధానికి సిద్ధమని జనం చెబుతున్నారు. అటు వైసీపీ సిద్ధం సభలు ఎక్కడ చూసినా అట్టర్ ఫ్లాప్ అవుతున్నాయి. విధ్వంసమైన రాష్ట్రం పునర్నిర్మాణం కోసం మాకు మద్దతివ్వండి. వైసీపీ నాయకులు ఇప్పటి వరకు బెదిరించారు. ఇక అవి చెల్లవు. ఎన్నికల కమిషన్ వచ్చింది. భయపడాల్సిన పనిలేదు. గత ఎన్నికలకు ముందు కరెంటు చార్జీలు తగ్గిస్తానని జగన్ హామీ ఇచ్చి, అధికారంలోకి రాగానే ఇప్పటికి 9 సార్లు చార్జీలు పెంచి ప్రజలపై భారం మోపాడు. గతంలో రూ.200 కరెంటు బిల్లు ఉండేది. ఇప్పుడు రూ.500 నుంచి రూ.1000 వరకూ వస్తోంది. వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించి రైతు మెడలకు ఉరితాళ్లు వేసిన దుర్మార్గుడు జగన్. మద్యం గురించి గతంలో ఎప్పుడూ ఇంత చర్చ జరగలేదు. మీ బలహీనతను జగన్ బలంగా మార్చుకున్నారు. ధరలు పెంచితే మీరు తాగుడు మానేస్తారని కొత్త నిర్వచనం చెప్పి ప్రజలను మోసం చేశాడు. మద్యపాన నిషేధం దేవుడికెరుక. జగన్ ఆదాయం కోసం నాసిరకం మద్యం ఇస్తున్నాడు. మీ ఆరోగ్యం పాడైపోయింది. కొంత మంది చనిపోతున్నారు. గతంలో క్వార్టర్ బాటిల్ రూ.60 ఉంది. దానిని రూ.200కు పెంచారు. క్వార్టర్‌పై రోజుకు రూ.140 కొట్టేస్తున్న జలగ జగన్ రెడ్డి. ఆ డబ్బులు తాడేపల్లి ప్యాలెస్ కొంపకు వెళ్తానే ఉంటాయి.

హోదా తేకపోవడమే విశ్వసనీయతా!

సాగునీటి ప్రాజెక్టుల కోసం టీడీపీ హయాంలో ఐదేళ్లలో రూ.68 వేల కోట్లు ఖర్చుపెట్టాం. రాయలసీమకు రూ.12 వేల కోట్లు ఖర్చు పెట్టాం. జగన్ కనీసం రూ.2 వేల కోట్లు కూడా ఖర్చు పెట్టలేదు. రాయలసీమ ద్రోహి. 95 శాతం హామీలు అమలు చేశానని అబద్ధాలు వల్లిస్తున్నాడు. కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా తేకపోవడమేనా జగన్‌రెడ్డి విశ్వసనీయత..? మద్యపాన నిషేధం అమలు చేయకపోవడం, వారంలో సీపీఎస్‌ను రద్దు చేయకపోవడం, ఏటా జాబ్ కేలెండర్ ఇవ్వకపోవడం, ఏ ఒక్కరికీ ఉద్యోగం ఇవ్వకపోవడం, మెగా డీఎస్సీ ఇవ్వకపోవడం, కరెంట్ చార్జీలు పెంచడం.. ఇదేనా విశ్వసనీయత..? పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తానని చెప్పి, గోదావరిలో ముంచాడు. దళితులందరికీ న్యాయం చేయాలనే లక్ష్యంతో 1996-97లో ఏ,బీ,సీ,డీ వర్గీకరణ తీసుకొస్తే.. దాన్ని వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నాశనం చేశారు. దళితులకు న్యాయం చేస్తానని అధికారంలోకి వచ్చిన జగన్.. వారి గొంతు కోశాడు. దళితుల కోసం అమలు చేసిన 27 సంక్షేమ పథకాలను రద్దు చేశాడు. సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లించాడు. విదేశాల్లో చదువుకునే వారికి అంబేడ్కర్ విదేశీ విద్యను మేం తీసుకొస్తే.. అంబేడ్కర్ పేరు తీసేసి తన పేరు పెట్టుకున్నాడు. ఆయన పాలనలో దళితులకు స్వాతంత్ర్యం లేదు. మాట్లాడే పరిస్థితి లేదు. ఆరు వేల మందికిపైగా దళితులపై తప్పుడు కేసులు పెట్టిన చరిత్ర జగన్‌ది. కాకినాడలో ఏకంగా వైసీపీ ఎమ్మెల్సీ ఓ దళితుడిని చంపి డోర్ డెలివరీ చేస్తే, ఆ హంతకుడి భుజాలపై చేతులు వేసి ప్రోత్సహించిన దళిత ద్రోహి జగన్. బీసీలకు అమలు చేసిన 30కిపైగా పథకాలు రద్దు చేశాడు. మేమొచ్చాక వాటన్నిటినీ పునరుద్ధరిస్తాం.

రూ.10 ఇచ్చి.. రూ.100 దోచేశాడు...

ఒక్క చాన్స్ అన్నాడు. బుగ్గలు నిమిరాడు. నెత్తిన చెయ్యి పెట్టాడు. ముద్దులు పెట్టాడు. అధికారంలోకి రాగానే పిడిగుద్దులు గుద్దుతున్నాడు. రూ.10 ఇచ్చి.. రూ.100 దోచేశాడు. రావణుడు తనకంటే గొప్పోడు లేడన్నాడు. చివరికి రాముడి చేతుల్లో ఏమయ్యాడు? ఈ సీఎం ముసుగు వీరుడు. పరదాల చాటున వచ్చే కరకట్ట కమలహాసన్ బుల్లెట్ బస్సులో బయల్దేరాడు. నా మాదిరిగా రోడ్డు మీదకు వస్తే వాస్తవాలు తెలుస్తాయి. కదిరిలో కేక వేస్తే పులివెందులలో వినబడుతుంది. పులివెందులలో గొడ్డలి వేటు కదిరికి వినిపించింది. ఆ గొడ్డలి తయారైంది ఈ కదిరిలోనే కదా..?మా చిన్నాన్నను ఎవరో చంపారో దేవుడికి తెలుసంటున్న జగన్.. ముద్దాయిని వెంటపెట్టుకుని ప్రచారం చేస్తున్న డ్రామాలరాయుడు. ఇలాంటి సీఎం మనకు అవసరమా..?

రాష్ట్రం కోసమే ఎన్డీయేలోకి

- మైనారిటీల హక్కులకు భంగం కలగదు
- రంజాన్ నెలలో హామీ ఇస్తున్నా: బాబు

కదిరి, మార్చి 28: రాష్ట్రం బాగు కోసమే తాము ఎన్డీయేతో కలిశామని.. అయినా మైనారిటీల హక్కులకు ఢోకా ఉండదని టీడీపీ అధినేత చంద్రబాబు భరోసా ఇచ్చారు. శ్రీసత్యసాయి జిల్లా కదిరి డిగ్రీ కళాశాల మైదానంలో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. తమ హయాంలో మైనారిటీల కోసం అనేక అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేశామన్నారు. 'రంజాన్ మాసంలో హామీ ఇస్తున్నా.. ఒక కులం, ఒక మతం, ఒక వర్గానికి చెందిన వ్యక్తిని కాను. నేను అందరివాడిని' అని స్పష్టం చేశారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

జాబ్ కేలెండర్ ఇవ్వకుండా..

బటన్ నొక్కానని చెప్పే జగన్‌రెడ్డి.. బటన్ నొక్కి వేస్తున్నదెంత..? బొక్కుతున్నదెంత..? చెత్తపై పన్ను వేసే చెత్త ముఖ్యమంత్రి. రాష్ట్రాన్ని సర్వనాశనం చేసేందుకు కంకణం కట్టుకున్న మానసిక రోగి. జాబ్ కేలెండర్ ఇవ్వలేని వ్యక్తి ముఖ్యమంత్రిగా అర్హుడా? టీడీపీ వస్తేనే పెట్టుబడులు... ఉద్యోగాలు వస్తాయి. వైసీపీని చిత్తుచిత్తుగా ఓడించి, ఫ్యాన్‌ను డస్ట్ బిన్‌లో వేయాలి. ఎన్నికలకు ముందే రిజల్ట్ వచ్చేసింది. ఈ అన్‌స్టాపబుల్‌ను ఎవరూ ఆపలేరు.

జయం మనదే

- సంక్షేమానికి, అభివృద్ధికి పసుపు శుభ సూచకం: బాలయ్య

హైదరాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : "పసుపు శుభానికి సూచకం. సంక్షేమానికి నిర్వచనం. అభివృద్ధికి నిదర్శనం. ఆత్మాభిమానానికి నిలువెత్తు రూపం, ఎగరేసిన జయకేతనం" అని నటుడు నందమూరి బాలకృష్ణ అన్నారు. లెజెండ్ చిత్రం విడుదలై గురువారానికి పదేళ్లు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో 'లెజెండ్ బ్లాక్ బస్టర్ టెన్ ఇయర్స్ సెలబ్రేషన్స్' పేరిట కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి కథానాయిక సోనాల్ చౌహాన్ పసుపు రంగు దుస్తుల్లో రావడంపై బాలయ్య పై వ్యాఖ్యలు చేశారు. "పదేళ్ల తర్వాత జరగబోయేదాన్ని మా సినిమాలో చెప్పాం. అదే ఇప్పుడు జరుగుతుండడం దురదృష్టకరం. 2014 ఎన్నికల ముందు 'లెజెండ్' విడుదలైంది. ఆ సినిమా ప్రభావం అప్పటి ఎన్నికల ఫలితాలపై కనిపించింది. మళ్లీ రేపు ఎన్నికలు రాబోతున్నాయి. సినిమా మాధ్యమం ప్రభావం జనాలపై ఎంత ఉండబోతోందో రేపు ఎలక్షన్లలో మీరు చూడబోతున్నారు. నేను రాజకీయాల గురించి ఇక్కడ ఎక్కువ మాట్లాడదల్చుకోలేదు. ఎన్నికల ప్రచారంలో మాట్లాడతాను. జయం మనదే" అని వ్యాఖ్యానించారు. కాగా, 'లెజెండ్' చిత్రం ఈ నెల 30న ప్రపంచవ్యాప్తంగా రీ రిలీజ్ అవుతోంది.



శ్రీసత్యసాయి జిల్లా కదిరి పట్టణంలో రోడ్ షో నిర్వహిస్తున్న చంద్రబాబు



అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం బహిరంగ సభలో ప్రసంగిస్తున్న చంద్రబాబు

ఉనికి కోసం పాట్లు!

- సీట్ల సర్దుబాటుపై కాంగ్రెస్-లెఫ్ట్ తుది చర్చలు
- నేడు షర్మిలతో కమ్యూనిస్టు నేతల భేటీ
- ఏప్రిల్ మొదటి వారం దాకా చేరికలపై కాంగ్రెస్ ఫోకస్
- రెండో వారంలో 60 మందితో తొలి జాబితా?

అమరావతి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రాజకీయ ఉనికి కోసం కామ్రేడ్లు కసరత్తు ముమ్మరం చేశారు. అదే ఉనికి కోసం ఆరాటపడుతున్న కాంగ్రెస్‌తో సీట్ల సర్దుబాటుకు సమాయత్తమయ్యారు. శుక్రవారం హైదరాబాద్‌లో పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలతో సీపీఐ, సీపీఎం నేతలు సమావేశమై తుది చర్చలు జరుపనున్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సీపీఎం నాయకులు, కాంగ్రెస్ సీనియర్ నేతలు కొప్పుల రాజు, ఎన్.రఘువీరారెడ్డి, గిడుగు రుద్రరాజు తదితరులు పాల్గొంటారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఒకప్పుడు చట్టసభల్లో బలమైన వాణి వినిపించడం ద్వారా రాజకీయాలపై గట్టి ప్రభావం చూపిన వామపక్షాలు.. రాష్ట్ర విభజన తర్వాత నవ్యాంధ్రలో తమ ఉనికిని పూర్తిగా కోల్పోయాయి. గత ఎన్నికల్లో జనసేనతో పొత్తు పెట్టుకుని ఏడేసి స్థానాల్లో పోటీ చేసిన సీపీఐ, సీపీఎం.. ఒక్క స్థానంలోనూ గెలువలేదు. ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో అధికార వైసీపీకి వ్యతిరేకంగా తొలుత జట్టు కట్టిన టీడీపీ-జనసేన కూటమితో చేతులు కలిపేందుకు ఆ పార్టీలు ఆసక్తి చూపించాయి. అయితే బీజేపీ వాటితో వచ్చి కలవడంతో వామపక్షాలు దూరం జరిగాయి. అలాగని ఒంటరిగా పోటీ చేసి.. ప్రధాన పార్టీలకు గట్టి పోటీ ఇచ్చేంత బలం, బలగం వాటికి లేవు. జాతీయ స్థాయిలో బీజేపీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ నేతృత్వంలోని 'ఇండియా' కూటమిలో తామూ ఉన్నందున.. రాష్ట్రంలో కూడా కాంగ్రెస్‌తోనే జత కట్టి ఎన్నికల్లో పోటీ చేయాలని కమ్యూనిస్టు నేతలు నిర్ణయించారు. అటు రాష్ట్ర విభజన తర్వాత కాంగ్రెస్ సైతం ఆంధ్రప్రదేశ్‌లో క్షీణించిపోయింది. వైఎస్ షర్మిల పీసీసీ పగ్గాలు చేపట్టాక ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. ఈ నేపథ్యంలో చిన్నా చితకా పార్టీలను కలుపుకొని కాంగ్రెస్ నేతృత్వంలో ప్రత్యామ్నాయ రాజకీయ కూటమిని ఏర్పాటు చేసే దిశగా సీపీఐ, సీపీఎం నేతలు అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే రెండు, మూడు దఫాలు ఉమ్మడి సమావేశాలు నిర్వహించుకుని సీట్ల సర్దుబాటుపై చర్చించుకున్నారు. కాంగ్రెస్ నేతలతోనూ రెండు దఫాలు చర్చించారు. తమకు బలమున్న నియోజకవర్గాల్లో అభ్యర్థులను బరిలోకి దించేందుకు సన్నద్ధమయ్యారు.

అరకు, కర్నూలు లోక్‌సభ స్థానాలతోపాటు మరో 16 అసెంబ్లీ స్థానాలను తమకివ్వాలంటూ సీపీఎం రాష్ట్ర కమిటీ ఇప్పటికే కాంగ్రెస్ నాయకత్వానికి జాబితా అందజేసింది. వాటిలో కురుపాం (ఎస్టీ), అరకు లోయ (ఎస్టీ), రంపచోడవరం (ఎస్టీ), గాజువాక, గన్నవరం, విజయవాడ సెంట్రల్, మంగళగిరి, నెల్లూరు, కర్నూలు, సంతనూతలపాడు (ఎస్సీ).. ఈ పది అసెంబ్లీ స్థానాలను తప్పనిసరిగా కేటాయించాలని కోరుతోంది. అదేవిధంగా సీపీఐ కూడా 2 పార్లమెంటు, 15 అసెంబ్లీ స్థానాలు అడుగుతోంది. ఇంకోవైపు.. వైసీపీలోని అసంతృప్త నాయకులు ఒక్కరొక్కరుగా కాంగ్రెస్‌లో చేరేందుకు వస్తుండడంతో.. ఏప్రిల్ మొదటివారం వరకు చేరికలపై దృష్టిపెట్టాలని భావిస్తోంది. ఏప్రిల్ రెండో వారంలో దాదాపు 60 మందితో కూడిన అసెంబ్లీ అభ్యర్థుల జాబితాను విడుదల చేయాలని షర్మిల యోచిస్తున్నారని పీసీసీ వర్గాలు చెబుతున్నాయి.

పాలకొండ, అవనిగడ్డ అభ్యర్థులపై

పవన్ కసరత్తు

- పిఠాపురం పర్యటన తర్వాత స్పష్టత



అమరావతి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): జనసేన పోటీ చేయనున్న 21 అసెంబ్లీ స్థానాల్లో 19 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు. పాలకొండ, అవనిగడ్డ అభ్యర్థులపై ఆ పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ కసరత్తు సాగుతోంది. పిఠాపురం పర్యటనకు ముందే వాటి అభ్యర్థులను ప్రకటించాలని భావించారు. కానీ ఆ రెండు స్థానాలకు పోటీపడుతున్న ఆశావహుల సంఖ్య ఎక్కువగా ఉండడంతో ప్రకటన కొంత ఆలస్యం అయ్యేలా కనిపిస్తుంది. పాలకొండకు ఆరుగురు పోటీ పడుతున్నారు. పార్టీలో కొంత మంది నాయకులు ఆ సీటు ఇప్పిస్తామని కొంత మందిని వెంట పెట్టుకుని పార్టీ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఇలా ఎవరికి వారు పవన్ కల్యాణ్‌ను కలిసేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఇక్కడ వైసీపీ నుంచి విశ్వాసరాయి కళావతి పోటీ చేస్తున్నారు. జనసేన తరపునా మహిళనే బరిలోకి దించే ఆలోచనలో జనసేన నాయకత్వం ఉంది. అవనిగడ్డ సీటు కోసం విక్కుర్తి శ్రీనివాస్, బండి రామకృష్ణ, బండ్రెడ్డి రామకృష్ణ పోటీ పడుతున్నారు. వీరిలో ఐవీఆర్ఎస్ సర్వేలో విక్కుర్తికే మొగ్గు ఉన్నట్లు తేలింది. ఈ రెండు సీట్లకూ అభ్యర్థులపై పవన్ పిఠాపురం పర్యటన తర్వాత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. మచిలీపట్నం లోక్‌సభ సీటు విషయంలో కూడా కొంత గందరగోళం నెలకొంది. వైసీపీకి రాజీనామా చేసి జనసేనలో చేరిన ఎంపీ వల్లభనేని బాలశౌరి ఇక్కడి నుంచి పోటీ చేసే అంశంపై స్పష్టత ఇవ్వలేదు. ఆయన పోటీ నుంచి వైదొలిగితే గ్రీన్‌కో డైరెక్టర్ బండారు నరసింహారావు బరిలో నిలిచే అవకాశముంది.

రాక్షస పాలన అంతానికే పొత్తు

11వ సీటు.. అధిష్ఠానం చూసుకుంటుంది: పురందేశ్వరి



రాజమహేంద్రవరం అర్బన్, తణుకు, మార్చి 28: రాష్ట్రంలో రాక్షస, నిరంకుశ పాలనను అంతమొందించేందుకే బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీలు పొత్తు పెట్టుకున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. జగన్మోహన్‌రెడ్డి పార్టీ విధ్వంసకర పాలనకు చరమగీతం పాడాలని ప్రజలను కోరుతున్నానని పేర్కొన్నారు. గురువారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం వచ్చిన పురందేశ్వరి ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో కొద్దిసేపు మీడియాతో మాట్లాడారు. బీజేపీ, తెలుగుదేశం, జనసేన కూటమి రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ అధికారంలోకి రావాలన్నారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు కేవలం తమ అభ్యర్థి కోసమేకాకుండా తెలుగుదేశం, జనసేన పార్టీల అభ్యర్థులను కూడా గెలిపించాలని కోరారు. తెలుగుదేశం, జనసేనతో పొత్తులో భాగంగా బీజేపీ తరపున పది అసెంబ్లీ సీట్లు ప్రకటించారని, 11వ సీటు ఉంటుందా లేదా అనేది పార్టీ అధిష్ఠానం చూసుకుంటుందని ఆమె పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర ఎన్నికల సహ ఇన్‌చార్జి సిద్ధార్థనాథ్ సింగ్ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే సాధ్యమన్నారు. రాష్ట్రంలో జగన్ అవినీతి పెరిగిపోయిందని, శాండ్ మాఫియా, మద్యం మాఫియా, ల్యాండ్ మాఫియా పోవాలంటే కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి అధికారంలోకి రావాలని స్పష్టం చేశారు.

జగన్ షో అట్టర్‌ఫ్లాప్



నంద్యాల సభలో సీఎం జగన్ ప్రసంగిస్తుండగానే ఖాళీగా ఉన్న సభా ప్రాంగణం

నంద్యాల సభకు స్పందన కరువు

- మాట్లాడుతుండగానే జారుకున్న జనం
- వారిని ఆపేందుకు పోలీసుల తంటాలు
- బారికేడ్లు దూకి పారిపోయిన జనం

నంద్యాల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): గత ఎన్నికలకు ముందు చెప్పిన మాటలేవీ ఆచరణలో పెట్టకుండా, ఈ ఐదేళ్లలో చెప్పిన మాటలనే చెబుతుండటంతో జగన్ బస్సు యాత్ర తుస్సుమంటోంది. నంద్యాలలో జరిగిన 'మేమంతా సిద్ధం' సభకు వచ్చిన జనం జగన్ తీరుతో విసిగిపోయారు. ఊకదంపుడు ప్రసంగాన్ని భరించలేని ఆయన మాట్లాడుతుండగానే.. బయటకు దారి తీశారు. తద్వారా 'మేం సిద్ధంగా లేం' అని స్పష్టంగానే చెప్పేశారు. ఎన్నికల వేళ జగన్ చేపట్టిన 21 రోజుల బస్సు యాత్ర రెండో రోజు నంద్యాల జిల్లాలో కొనసాగింది. మొదటి రోజు కడపలో యాత్ర ముగించుకుని, బుధవారం రాత్రి జిల్లాలోని ఆళ్లగడ్డకు జగన్ చేరుకున్నారు. రాత్రి అక్కడే బస చేసి.. గురువారం ఉదయం తిరిగి యాత్ర ప్రారంభించారు. అదే మండలంలోని ఎర్రగుంట్ల గ్రామంలో రైతులతో ముఖాముఖి నిర్వహించారు. అనంతరం భోజన విరామం సమయానికి నంద్యాల శివారులోని రైతు నగరానికి చేరుకున్నారు. అక్కడనుంచి బయలుదేరి సాయంత్రం నంద్యాలలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన సభావేదిక వద్దకు చేరుకున్నారు. సభ అనంతరం పాణ్యం మీదుగా కర్నూలుకు పయనమయ్యారు.

పాడిందే పాడుతూ..

జగన్ సభ ఆసాంతం ఒక్కటే పాట.. తాను అధికారంలోకి వచ్చి 58 నెలలు అవుతోందని, ఈ కాలమంతా అంతులేని సంక్షేమాన్ని అందించానని, లక్షల కోట్ల రూపాయలు బటన్ నొక్కి జనం ఖాతాల్లో జమ చేశానని, ఇవన్నీ కేవలం తాను మాత్రమే చేయగలిగానని, 58 నెలల్లోనే చేయగలిగానని.... ఇలా సాగిన జగన్ సభ జనం సహనాన్ని పరీక్షించింది. వాస్తవంలో జనవరి నుంచి జగన్ పలు పథకాలకు సంబంధించి బటన్ నొక్కినా ఆ నిధులు ఆయా లబ్ధిదారులు ఖాతాలో పడలేదు. అయినా జగన్ ఎందుకు ఇలా అబద్ధాలు ఎందుకు చెబుతున్నారో అర్థం కాక సభకు వచ్చిన వారంతా అవాక్కయ్యారు. తాను అందించిన పథకాల గురించి, నొక్కిన బటన్‌ల గురించి జగన్ మాట్లాడేటప్పుడు జనం నుంచి స్పందన కరువైంది. ఇది గ్రహించిన సీఎం జగన్.. తన ప్రసంగాన్ని కూటవిపైకి మళ్లించి విమర్శలు గుప్పించడం మొదలుపెట్టారు. ఆ కూటమిని నమ్మవద్దని, తననే నమ్మాలని, తనకే ఓటు వేయాలని పదే పదే కోరారు. ఆయన ప్రతి సభలో ఇదే చెబుతున్నారనీ, మళ్లీ కొత్తగా చెప్పేదేమీలేదని నిర్ధారణ చేసుకున్న ప్రజలు మెల్లిగా జారుకోవడం మొదలుపెట్టారు. చివరకు వచ్చే సరికి జగన్ ఖాళీ ప్రాంగణానికి తన ఎమ్మెల్యే అభ్యర్థులను పరిచయం చేయాల్సి రావడం గమనార్హం. దీంతో అప్రమత్తమైన కొందరు పోలీసులు ప్రజలు పారిపోకుండా వారికి కాపలాగా ఉండాల్సి వచ్చింది.



సభా ప్రాంగణం పక్కనే గుంపులుగా కూర్చుని మద్యం తాగుతున్న దృశ్యం

ఒక్కొక్కరికి రూ.200.. క్వార్టర్ బాటిల్

నంద్యాల జిల్లాలో ఏర్పాటు చేసిన 'మేమంతా సిద్ధం' సభకు జనసమీకరణ భారీగా చేసి, సభను విజయవంతం చేయాలని వైసీపీ అధిష్ఠానం స్థానిక నేతలకు ఆదేశించింది. దీంతో స్థానిక నేతలు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి బస్సుల్లో ప్రజలను తరలించారు. అంతేకాకుండా వైసీపీ చుట్టుపక్కల కడప, అనంతపురం, చిత్తూరు జిల్లాల నుంచి కూడా భారీగా బస్సులు పెట్టారు. ఇలా వచ్చిన వారందరికీ ఒక్కొక్కరికి రూ.200, పురుషులకు క్వార్టర్ బాటిళ్లు ఇచ్చారు. దీంతో సభకు వచ్చే వారంతా ఎక్కడికక్కడ బస్సులు నిలుపుదల చేసుకుని 'జే బ్రాండ్లు' తాగడం కనిపించింది. ఇక కొంతమంది సభా ప్రాంగణంలోనే తాగుతూ కనిపించారు. కిక్కు ఎక్కువ కావడంతో కొంతమంది సభా ప్రాంగణంలోనే పడిపోయారు. ఇక బస్సుల్లో తరలిన వారంతా సభ ప్రారంభమవడానికి ముందే తిరుగు పయనమవడం కనిపించింది.

చెడిపోయిన సీఎం బస్సు..

జగన్ ప్రయాణిస్తున్న బుల్లెట్ ప్రూఫ్ బస్సు నంద్యాల శివారు భోజన విడిది కేంద్రం వద్దకు రాగానే చెడిపోయింది. దీంతో సభా ప్రాంగణానికి వేరే వాహనంలో జగన్ వచ్చారు. సభ ముగిసే సమయానికి బస్సు బాగవడంతో మళ్లీ బస్సులో తిరుగు పయనమయ్యారు. ఇక ఆళ్లగడ్డ నుంచి నంద్యాల వరకు సాగిన బస్సు యాత్రలో ఎర్రగుంట్ల సమావేశం మినహా ఎక్కడా ర్యాలీ సాగలేదు. ఈ రెండు మండలాల మధ్య ఉన్నది ఎక్కువ శాతం జాతీయ రహదారి కావడంతో మధ్యలో తగిలిన గ్రామాల్లో కార్యకర్తలకు అభివాదం చేసుకుంటూ జగన్ సాగిపోయారు. సభ అనంతరం పాణ్యం మండలంలోని ఆర్‌జీఎం కళాశాల వద్ద విద్యార్థులకు అభివాదంచేస్తూ కర్నూలు వైపు సాగారు. కాగా, సీఎం వచ్చేలోపు విద్యార్థులు వెళ్లిపోకుండా యాజమాన్యం గేట్లు వేసి వారిని లోపలే ఉంచేసింది.


సభ ప్రారంభానికి ముందే పరార్!


నంద్యాల సభ సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభమవ్వాల్సి ఉంది. స్థానిక నాయకులు మాత్రం మధ్యాహ్నం 12 గంటల నుంచే సభకు జనాన్ని తరలించడం మొదలుపెట్టారు. ఓ వైపు ఎండ విపరీతంగా ఉండటం, కూర్చోవడానికి కుర్చీలు, నిలబడటానికి కనీసం నీడ కూడా లేకపోవడంతో జనమంతా తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బయటకు వెళ్లేందుకు ప్రయత్నించారు. వారంతా వెళ్లిపోతే సభాప్రాంగణం ఖాళీగా కనిపిస్తుందన్న ఉద్దేశంతో కళాశాల గేటు మూసివేశారు. ఇక సీఎం వచ్చిన తర్వాత గేట్లు తీయాల్సి రావడంతో జనమంతా బయటకు వెళ్లిపోయారు.

పోలవరం వైసీపీ అభ్యర్థి రాజ్యలక్ష్మి ఎస్టీ కాదు

- హైకోర్టులో వ్యాజ్యం.. నోటీసులు జారీ

అమరావతి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వైసీపీ తరఫున పోలవరం (ఎస్టీ) నియోజకవర్గం నుంచి పోటీకి దిగుతున్న తెల్లం రాజ్యలక్ష్మి ఎస్టీ కాదంటూ దాఖలైన వ్యాజ్యంపై హైకోర్టు స్పందించింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న రాజ్యలక్ష్మి, గిరిజన సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి, ఏలూరు జిల్లా కలెక్టర్, ఆర్డీవో, బుట్టాయిగూడెం తహశీల్దార్‌కు నోటీసులు జారీచేసింది. విచారణను ఏప్రిల్ 25కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ గురువారం ఆదేశాలిచ్చారు. ఎస్టీ నియోజకవర్గమైన పోలవరం నుంచి వైసీపీ తరఫున పోటీకి దిగనున్న తెల్లం రాజ్యలక్ష్మి ఎస్టీ కాదంటూ మాదంవారి గూడెం నివాసి మడకం వెంకటేశ్వరరావు హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ వ్యాజ్యం గురువారం విచారణకు రాగా పిటిషనర్ తరఫున న్యాయవాది జడ శ్రవణ్‌కుమార్ వాదనలు వినిపించారు. రాజ్యలక్ష్మి బీసీ సామాజికవర్గానికి చెందినవారన్నారు. తనకు అధికారపరిధి లేకపోయినా బుట్టాయిగూడెం తహశీల్దార్ ఆమెకు ఎస్టీ సర్టిఫికెట్ జారీ చేశారని అన్నారు. సామాజిక సర్టిఫికెట్ల జారీ చట్టంలోని సెక్షన్-5 ప్రకారం జిల్లా కలెక్టర్ విచారణ జరిపి తగిన ఉత్తర్వులు జారీచేయాల్సి ఉంటుందన్నారు. రాజ్యలక్ష్మిని ఎస్టీగా ధ్రువీకరిస్తూ తహశీల్దార్ జారీచేసిన ఉత్తర్వులను రద్దు చేయాలని కోరారు.





ఓరి దేవుడా!

(మొదటి పేజీ తరువాయి)

సభలో జగన్ చేసిన 'పెర్ఫార్మెన్స్'కు సొంత జిల్లా జనమే ఆశ్చర్యపోతున్నారు. అసలు... 'సిద్ధం' సభలో జగన్ చెప్పిన అబద్ధాలేమిటి, సీబీఐ తన దర్యాప్తులో తేల్చిన వాస్తవాలు, ఇతర అంశాలు ఏమిటి?

జగన్: వివేకాను చంపిందెవరో ఆయనకు, దేవుడికీ, ఈ జిల్లా ప్రజలందరికీ తెలుసు!

సీబీఐ: ఆయన చెప్పింది నిజమే! అయితే... వివేకాను చంపిందెవరో దేవుడు, ప్రజలతో పాటు ముఖ్యమంత్రి జగన్ దంపతులకూ తెలుసన్నది సీబీఐ వ్యక్తం చేసిన అనుమానం! వివేకా హత్య జరిగిన రోజు తెల్లవారుజామున... జగన్ హైదరాబాద్ లోటస్‌పాండ్‌లో మీటింగ్‌లో ఉండగా ఆయన ఇంటికి ఎవరు ఫోన్ చేశారు, వివేకా 'హత్య' గురించి జగన్ దంపతులకు ఎలా తెలిసింది, 'టైమింగ్' ఏవిటి అనే అంశాలపై సీబీఐ లోతుగా దర్యాప్తు చేసింది. ఆ భేటీలో పాల్గొన్న ప్రభుత్వ సలహాదారు అజేయ కల్లం రెడ్డినీ ప్రశ్నించింది. వెరసి... వివేకాను చంపిందెవరో జగన్‌కూ తెలుసనేది సీబీఐ అనుమానం!

జగన్: వివేకా చిన్నాన్నను అతి దారుణంగా చంపిన హంతకుడు, ఆ హంతకుడికి మద్దతు ఇస్తున్న వారిని కూడా మీరు రోజూ చూస్తున్నారు.

సీబీఐ: ఈ హత్యలో ప్రత్యక్షంగా పాల్గొన్న దస్తగిరి అప్రూవర్‌గా మారాడు. హత్య జరిగినప్పుడు ప్రత్యక్ష సాక్షులెవరూలేరు. ఇలాంటి కేసుల్లో నిందితులు అప్రూవర్‌గా మారి, నేరాన్ని ఒప్పుకోవడం కొత్తేమీ కాదు. దస్తగిరి అప్రూవర్‌గా మారడాన్ని న్యాయస్థానం కూడా ఆమోదించింది. చంపించిన వారెవరో, ఎందుకు చంపించారో తెలుసుకోవడమే దీనికి వెనుక అసలు ఉద్దేశం. అన్నింటికంటే మించి... దస్తగిరి ఒక ఉపకరణం మాత్రమే! దానిని ప్రయోగించిందెవరన్నదే అసలు ప్రశ్న! సీబీఐతోపాటు వివేకా కుటుంబ సభ్యులూ ఇదే అడుగుతున్నారు. దీనికి జగన్ ఏమని బదులిస్తారో!

జగన్: ఇంతటి దారుణం చేస్తూ నన్ను దెబ్బతీసే రాజకీయం చేస్తున్నారంటే... ఇది కలియుగంకాక మరేమిటి! ఇంతకన్నా అన్యాయం ఎక్కడన్నా ఉందా!

వాస్తవం: నిజమే... ఇది కలియుగమే! అందుకే జగన్ ఇలా మాట్లాడగలుగుతున్నారనేది జనం మాట! 2019 ఎన్నికల్లో వివేకా హత్యను రాజకీయంగా వాడుకుని లబ్ధి పొందింది ఆయనే! తన రోత పత్రిక ద్వారా చేయాల్సిన దుష్ప్రచారమంతా చేశారు. అసలు వాస్తవాలు బయటపడుతుండటంతో... వివేకా హత్య గురించి టీడీపీ, ఇతర పార్టీలు మాట్లాడకూడదంటూ హైకోర్టు నుంచి 'గ్యాగ్' ఆర్డర్ తెచ్చుకున్నారు. అధికారంలోకి వచ్చాక అసలు నిందితులను కాపాడటం మొదలుపెట్టారు. హైకోర్టు ఉత్తర్వులతో సీబీఐ రంగంలోకి దిగడంతో ఒక్కొక్కరి పాత్ర బయటపడింది. చివరికి... అవినాశ్ రెడ్డి అరెస్టును ఆపేందుకు ఏకంగా సీబీఐనే ముప్పుతిప్పలు పెట్టారు. ఇప్పుడు... ఎన్నికల ముందు మరోసారి 'కలియుగం, ఇంత అన్యాయమా' అని వాపోవడం జగన్‌కే చెల్లింది.

జగన్: నాపై బురదజల్లేందుకు ఇద్దరు చెల్లెమ్మలను ఎవరు పంపించారో, వారి వెనకాలో ఎవరు ఉన్నారో మీ అందరికీ కనిపిస్తూనే ఉంది.

వాస్తవం: చెల్లెమ్మలు బురద జల్లడం కాదు... చెల్లెమ్మ సునీతా రెడ్డిపైనే జగన్ తన రోత పత్రిక ద్వారా బురద జల్లిస్తున్నారు. వివేకాను సునీతా దంపతులే చంపించారనేలా అనేక రోత కథనాలు ప్రచురించారు. ఈ కేసులో అండగా నిలవాలని ముందుగా జగన్‌నే ఆశ్రయించిన వైనం, ఆయన చెప్పిన వింత సమాధానం, చివరికి న్యాయం కోసం తాను చేస్తున్న పోరాటం, గత్యంతరం లేని పరిస్థితుల్లో మీడియా ముందుకూ రావడం... వీటన్నింటిపైనా సునీతా రెడ్డి తన వివరణ ఇప్పటికే ఇచ్చారు. ఇస్తూనే ఉన్నారు. తామే ఈ హత్య చేసి ఉంటే... ఆ ఆధారాలు సీబీఐకి ఇవ్వాలని కూడా సవాలు విసిరారు. దీనికి జగన్ ఏం సమాధానం చెబుతారో!

సీబీఐ తేల్చిందిదే!

చంపింది..

గంగిరెడ్డి, సునీల్ యాదవ్, ఉమా శంకర్ రెడ్డి, దస్తగిరి... ఈ నలుగురే వివేకా హత్యలో ప్రత్యక్షంగా పాల్గొన్నట్లు సీబీఐ తేల్చింది. వీరిలో దస్తగిరి అప్రూవర్‌గా మారాడు.

చంపించింది..

ఈ హత్య వెనుక ఉన్న పెద్దలు వైఎస్ అవినాశ్ రెడ్డి, ఆయన తండ్రి వైఎస్ భాస్కర్ రెడ్డితోపాటు దేవిరెడ్డి శంకర్ రెడ్డి, ఉదయ్ కుమార్ రెడ్డి అని సీబీఐ గుర్తించింది. వీరందరినీ నిందితులుగా చేర్చింది. గొడ్డలిపోటును గుండెపోటుగా మార్చడం, గాయాలను కవర్ చేస్తూ బ్యాండేజీలు కట్టించడం, రక్తపు మరకలు చెరిపివేయడం... ఇవన్నీ వీరి ఆదేశాల మేరకు, వీరి ఆధ్వర్యంలోనే జరిగినట్లు సీబీఐ తేల్చింది. వివేకా హత్యకు ముందు నిందితులు అవినాశ్ రెడ్డి ఇంట్లోనే ఉన్నట్లు గూగుల్ టేకౌట్‌తోపాటు ఇతర సాంకేతిక ఆధారాలను సంపాదించింది. వాళ్ల మధ్య ఫోన్ సంభాషణలూ/చాటింగ్ కూడా జరిగినట్లు గుర్తించింది. 'గుండెపోటు కథ' అల్లింది వైఎస్ అవినాశ్ రెడ్డే అని కూడా స్పష్టం చేసింది.

కారణం...

కడప ఎంపీ టికెట్ ఇస్తే తనకు లేదా షర్మిలకు ఇవ్వాలని వివేకా పట్టుబట్టడం, ఆయన క్రియాశీలకంగా ఉంటే తమ రాజకీయ ఉనికికి ఇబ్బంది అని భావించడమే ఈ హత్యకు కారణమని సీబీఐ గుర్తించింది. దీంతో... వివిధ కారణాలవల్ల వివేకాపై కోపంగా ఉన్న వారిని సంప్రదించి, రూ.40 కోట్లకు డీల్ మాట్లాడి హత్య చేయించినట్లు నిర్ధారణ అయ్యింది. సీబీఐ దాఖలు చేసిన చార్జిషీట్‌లో పూర్తిస్థాయిలో ఈ వివరాలను పొందుపరిచింది.

వివేకాను ఎవరు చంపారో జగన్‌కు తెలుసు



(మొదటి పేజీ తరువాయి)



జగన్ వాళ్లను రక్షిస్తున్నారని ఆరోపించారు. వివేకా హత్య వెనుక వైఎస్ భాస్కర్‌రెడ్డి, అవినాశ్‌రెడ్డి ఉన్నారని హత్య చేసిన వాడే స్వయంగా చెప్తున్నా ఎందుకు నమ్మరని ప్రశ్నించారు. హత్య చేయించినవారితో జగన్ చెట్టాపట్టాలేసుకుని తిరుగుతున్నాడని ఆరోపించారు. నిందితుడిని పక్కన పెట్టుకుని ఆయనకు ఓటు వేయమని చెప్పడం, పార్టీ టికెట్ ఇవ్వడం తప్పుగా అనిపించలేదా? అని జగన్‌ను ప్రశ్నించారు. వివేకా రక్తంతో వైసీపీ పునాదులు తయారు చేసుకుందని, ఆ పార్టీకి, తన సోదరుడికి (జగన్), హత్య చేయించిన ఎంపీ (వైఎస్ అవినాశ్‌రెడ్డి)కి ఓటు వేయవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వివేకా హత్య ఘటనపై కడప జిల్లా పర్యటనలో సీఎం జగన్ చేసిన వ్యాఖ్యలపై సునీత స్పందించారు. గురువారం ఆమె హైదరాబాద్‌లో హైకోర్టు వద్ద మీడియాతో మాట్లాడుతూ... జగన్ చేసిన ప్రతి వ్యాఖ్యకు కౌంటర్ ఇచ్చారు. 'వివేకా చిన్నాన్నను ఎవరు చంపారో ఆయనకు, దేవుడికి, కడప జిల్లా ప్రజలందరికీ తెలుసునని జగన్ చెప్పారు. ఆయన కరెక్ట్‌గా చెప్పారు. దేవుడికి, ప్రజలకు, మీకు (జగన్) కూడా తెలుసు. అందుకేనా చేయించవారిని అంతగా ప్రొటెక్ట్ చేస్తున్నారు. మీకు తెలిసి కూడా ఎందుకు ప్రొటెక్ట్ చేస్తున్నారు? దేనికి భయపడి ప్రొటెక్ట్ చేస్తున్నారు?' అని జగన్‌ను సునీత ప్రశ్నించారు. ఇద్దరు చెల్లెల్లను ఇంకొరు నడిపిస్తున్నారని, వివేకాను చంపినోడే తాను హత్య చేశానని చెబుతున్నాడని, బయట తిరుగుతున్నాడని జగన్ చేసిన వ్యాఖ్యలపై ఆమె ఘాటుగా స్పందించారు. 'వివేకాను చంపినోడు నేను (దస్తగిరి) హత్య చేశానంటే నమ్ముతున్నారు. అదే వ్యక్తి ఎవరు చేశారో కూడా క్లియర్‌గా చెబుతున్నాడు. దీని వెనుక వైఎస్ భాస్కరరెడ్డి, వైఎస్ అవినాశ్ రెడ్డి ఉన్నారని చెప్పాడు. వైఎస్ జగన్ రెడ్డి, భారతీరెడ్డి వాళ్లను ప్రొటెక్ట్ చేస్తున్నారు. హంతకుడి చెప్పిన దాంట్లో ఒకటి నమ్ముతున్నారు. ఇంకొకటి నమ్మడం లేదా? నవిృతే రెండూ నమ్మాలి కదా?' అని సునీత అన్నారు.

సీబీఐ విచారణ ఎందుకు వద్దన్నారు?

వివేకాను హత్య చేయించింది ఎవరో హంతకుడు చెప్పాడని, సీబీఐ కూడా అదే విషయం విచారణ చేసిందని సునీత చెప్పారు. 'ఒకప్పుడు మీరు(జగన్) సీబీఐ విచారణ అడిగారు. ఆ తర్వాత మీరే వద్దన్నారు. అప్పుడు ఎందుకు వద్దన్నారు. మీ పేరు బయటకు వస్తుందని వద్దన్నారా? ఆ పిటిషన్ విత్ డ్రా చేసుకోవాల్సిన అవసరమేంటి? ఇంకా సిగ్గుచేటు ఏంటంటే.. నిందితుడిని పక్కన పెట్టుకుని, ఆయనకు ఓటు వేయమని అడుగుతున్నారు. మీకు, మీ తమ్ముడి (అవినాశ్)కి ఓటు వేయమని అడుగుతున్నారు. అదే మనిషిని సీబీఐ విచారించి, నిందితుడని చెబుతోంది. వివేకా చనిపోయి ఐదు సంవత్సరాలైంది. ఈ ఐదు సంవత్సరాలు మీ ప్రభుత్వమే ఉంది. ఇన్నాళ్లూ మీరు ఏం చేశారు? మీ ముందుకు వచ్చి నేను మాట్లాడాల్సిన అవసరం ఎందుకొచ్చింది? ఆయన (జగన్) చేయాల్సిన పని చేయకపోవడం వల్ల కదా? నేను చెప్పేదంతా నిజం. ఆయన అట్లా చెప్పగలుగుతాడా? అది చెప్పినా నమ్మే పరిస్థితి ఉందా? గతేడాది కర్నూలులో ఏం జరిగిందో మనకందరికీ తెలుసు. రాష్ట్ర ప్రజలందరూ చూశారు. మీరు (జగన్), మీ గవర్నమెంట్‌ను పెట్టుకుని మీ పోలీసుల ద్వారా నిందితులను ప్రొటెక్ట్ చేసింది నిజమా? కాదా?' అని సునీత ప్రశ్నించారు.

ఎన్నికల ముందు గుర్తొచ్చాడా?

'ఐదేళ్ల క్రితం వివేకాను చంపించారు. అప్పుడు రాజకీయానికి వాడుకున్నారు. ఈ ఐదేళ్లూ మరిచిపోయారు. అధికారంలోకి వచ్చాక ఒక్కసారైనా వివేకాను గుర్తు చేసుకున్నారా? ఆయన చేసిన పనులను గుర్తు చేసుకున్నారా? ఎన్నికలు రావడంతో ఇన్నిరోజులు మరిచిపోయిన మనిషి మళ్లీ ఈ రోజు గుర్తుకొచ్చాడు. ఎవరు స్వార్థపరులు? ఎవరు పదవుల కోసం ఉపయోగించుకుంటున్నారు? హత్య చేయించినవాళ్లకు ఓటు వేయమని మీరు (జగన్) అడుగుతున్నారు' అని సునీత వ్యాఖ్యానించారు.

చిన్నాన్న అంటే అర్థం తెలుసా?

'వివేకా చిన్నాన్న అని జగన్ అన్నారు. చిన్నాన్న అంటే ఆయనకు అర్థం తెలుసా? నాన్న తర్వాత నాన్న చిన్నాన్న. అసలు ఈ బంధుత్వాలకు అర్థం తెలుసా? చిన్నాన్న అంటే మీ నాన్నతో సమానం. అలాంటి చిన్నాన్న చనిపోతే, ఆ చావు వెనుక కుట్ర ఏంటి అన్నది నిర్ధారించకుండా, ఆ చిన్నాన్న కూతురు మీదే నిందలు వేయడం న్యాయమా? మీ చెల్లెలు కోర్టు చుట్టూ, పోలీసుల చుట్టూ తిరుగుతుంటే అన్నయ్యగా మీ బాధ్యత ఏంటి? అమ్మా నీ కోసం నేనున్నాను.. నీ పని చూసుకో (డాక్టర్ వృత్తి) అని చెప్పేది పోయి నా మీదే కేసులు పెడతాడు. ఏమైనా న్యాయమా?' అని సునీత ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఓట్లు పడాలని మళ్లీ సానుభూతి కోసం జగన్ ప్రయత్నిస్తున్నాడని ఆరోపించారు. 'నేను న్యాయం కోసం పోరాడుతున్నాను. నువ్వు (జగన్) పోరాడేది పదవుల కోసం. పదవి పోతే ఎక్కడ ఇరకాటంలో పడతారో అని మీరు శాయశక్తులా కృషి చేస్తున్నారు. అక్కలు, చెల్లెల్లు అని అంటుంటారు. ఈ ఐదు సంవత్సరాలు మీకు ఈ చెల్లెలు గుర్తుకు రాలేదా?' అని ప్రశ్నించారు.

విలన్ మీరేనా?

'సినిమాలో విలన్ ఉంటాడు. విలన్ పక్కన రౌడీలు ఉం టారు. రౌడీలను పట్టుకుంటే సరిపోతుందా.. విలన్ దగ్గరకు వెళ్లొద్దా? మూల కారణం అయ్యేది విలన్. దీంట్లో (వివేకా కేసు) విలన్ ఎవరు? విలన్ మీరా (జగన్)? అందుకేనా వాళ్లను (నిందితులు) ప్రొటెక్ట్ చేస్తున్నారు?' అని జగన్‌ను సునీత ప్రశ్నించారు.

వైసీపీకి ఓటేయొద్దు

వివేకా హత్య కేసులో హంతకులకు ఓటు వేయవద్దని ఏపీ ప్రజలకు సునీత విజ్ఞప్తి చేశారు. 'పదవులు ఆశించి నేను రాజకీయాలు చేస్తున్నానని విమర్శిస్తున్నారు. నాకు కావాల్సింది న్యాయం. వివేకా హత్య జరిగిన తీరు భయంకరంగా ఉంటుంది. అదంతా మరిచిపోయి మళ్లీ ప్రజల ముందుకు వచ్చి ఓటు అడగటానికి మీకు (జగన్) మనసెలా ఒప్పుతుంది. హత్య చేసినవాళ్లతో, చేయించినవాళ్లతో మీరు తిరుగుతున్నారు. దీనికి ఆధారాలు కూడా ఉన్నాయి. దయచేసి ప్రజలందరూ దీన్ని అర్థం చేసుకోవాలి. వైఎస్ఆర్ పార్టీ పునాదులు వివేకానందరెడ్డి రక్తంతో మునిగి ఉన్నాయి. దయచేసి వైసీపీకి, మా అన్నకు, హత్య చేసిన ఎంపీకి ఓటు వేయకండి' అని సునీత ఏపీ ప్రజలను కోరారు.

పచ్చి అబద్ధాలకు జగన్ బ్రాండ్ అంబాసిడర్

» ఆయన అడ్డుపడకుంటే వివేకా హంతకులు ఏనాడో జైలుకు: వర్ల



అమరావతి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): 'అబద్ధానికి ప్యాంటు చొక్కా వేస్తే జగన్ లాగా ఉంటుంది. పచ్చి అబద్ధాలకు ఆయన బ్రాండ్ అంబాసిడర్.' అని టీడీపీ వ్యాఖ్యానించింది. సిగ్గు అనేది జగన్ డిక్షనరీ లో లేదని, తన బాబాయి వివేకాహత్యకేసులో అలవోకగా ఆయన ఆడుతున్న అబద్ధాలే దీనికి నిదర్శనమని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య విమర్శించారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ.. వివేకా హంతకులు బయట తిరుగుతున్నారని, వారిని తన చెల్లెళ్లు సమర్థిస్తున్నారని జగన్ చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టారు. వివేకాను దారుణంగా హత్యచేసిన హంతకులను చట్టానికి పట్టించి చెల్లెళ్ల కన్నీళ్లు తుడవకుండా ఎదురు వారిపైనే ఆరోపణలు చేయడం దుర్మార్గమన్నారు. జగన్ ఎంత బుకాయించినా ఆయన మాటలు నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరని, ఆయన పక్కకు తప్పుకొంటే అసలు హంతకులను సీబీఐ 5నిమిషాల్లో లోపల వేయగలదన్నారు. వీటన్నింటికీ జగన్‌కు ప్రజా కోర్టులో శిక్ష తప్పదని వర్ల హెచ్చరించారు.

హంతకులెవరో అందరికీ ఎరుకే: బీజేపీ



మాట్లాడుతున్న వంగల శశిభూషణ్‌రెడ్డి

కడప (మారుతీనగర్), మార్చి 28: ఉన్నది లేనట్లు, లేనిది ఉన్నట్లు.. జరిగింది జరగనట్లు, జరగనిది జరిగినట్లుగా.. నోరుంది కదా అని ప్రజలను తన మాయమాటలతో మరోసారి బురిడీ కొట్టించేందుకు సీఎం జగన్ ప్రయత్నిస్తున్నారని బీజేపీ కడపజిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్ రెడ్డి అన్నారు. జగన్ ఓ పచ్చి అబద్ధాల కోరు అని మండిపడ్డారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వివేకానందరెడ్డిని హత్య చేయించిన వ్యక్తిని సిద్ధం సభలో పక్కనే ఉంచుకుని మరీ ఇతరులపై జగన్ నిందారోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. వివేకా హంతకులెవరో, నిర్దోషులెవరో ప్రజలందరికీ బాగా తెలుసునన్నారు.

జగన్ బెయిల్ రద్దుపై 1న సుప్రీం విచారణ

న్యూఢిల్లీ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): అక్రమాస్తుల కేసులో వైసీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి బెయిల్ రద్దు పిటిషన్‌పై సుప్రీంకోర్టులో ఏప్రిల్ 1వ తేదీన విచారణ జరగనుంది. జగన్ బెయిల్‌ను రద్దు చేయాలంటూ నరసాపురం ఎంపీ రఘురామకృష్ణంరాజు దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టనుంది. జగన్ కేసుల విచారణను మరో రాష్ట్రానికి బదిలీ చేయాలంటూ రఘురామరాజు దాఖలు చేసిన మరో పిటిషన్‌పైనా ఒకటో తేదీన విచారణ జరుపుతామని జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ధర్మాసనం తెలిపింది. ఆంధ్ర అసెంబ్లీ ఎన్నికల ముంగిట సుప్రీంకోర్టు విచారణపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

నేడు, రేపు వడగాల్పులు

అమరావతి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రానున్న రెండు రోజులు ఎండ తీవ్రతతో పాటు వడగాల్పులు ప్రభావం చూపుతాయని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ కూర్మనాథ్ హెచ్చరించారు. శుక్రవారం కడప, నంద్యాల, మన్యం, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని 42మండలాల్లో ఎండ తీవ్రతతో పాటు వడగాల్పులు వీచే అవకాశం ఉందని తెలిపారు. శనివారం 44 మండలాల్లో వడగాల్పులు వీస్తాయన్నారు.

తాగునీటిని ఇతర అవసరాలకు వాడొద్దు

» ఎద్దడి ప్రాంతాలకు ట్యాంకర్లతో సరఫరా: సీఎస్

అమరావతి, మార్చి28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటికి ఇబ్బంది లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం అమరావతి సచివాలయంలో తాగునీటి సరఫరాపై సమీక్ష నిర్వహించారు. 'నీటి ఎద్దడి అధికంగా ఉన్న ప్రాంతాలు, ఆవాసాలకు ట్యాంకర్ల ద్వారా మంచినీరు అందించాలి. తాగునీటి కోసం సరఫరా చేసే నీటిని ఇతర అవసరాలకు వాడరాదు. వాహనాలు, ఇంటి ఆవరణల శుభ్రతకు, గార్డెన్లకు తాగునీటిని ఉపయోగించవద్దు. కుళాయిల వద్ద నీరు వృథాగా పోకుండా, నీటిని పొదుపుగా వాడుకోవాలి' అని ఆయన విజ్ఞప్తి చేశారు. దీనిపై విస్తృత ప్రచారం చేయాలని అధికారులను ఆదేశించారు. తాగునీటి సరఫరాపై సంబంధిత శాఖలు రోజూ పర్యవేక్షిస్తూ, ఎద్దడి ఉన్న ప్రాంతాలకు ట్యాంకర్లతో సరఫరా చేయాలని ఆదేశించారు. పంచాయతీరాజ్‌శాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్‌కుమార్, పురపాలక శాఖ డైరెక్టర్ శ్రీకేశ్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

రేషనలైజేషన్ ప్రక్రియను ఆపండి

» ఆంధ్రప్రదేశ్ ఐక్యవేదిక ఫిర్యాదు

అమరావతి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ టీచర్లను జీవో 84 కింద రైషనలైజేషన్ ప్రక్రియ చేపట్టడం ఎన్నికల నియమావళికి విరుద్ధమని, వెంటనే రేషనలైజేషన్, మెర్జింగ్ ప్రక్రియను నిలిపివేయాలని ఏపీ ఐక్య వేదిక చైర్మన్ సూర్యనారాయణ డిమాండ్ చేశారు. గురువారం ఈ మేరకు అమరావతి సచివాలయంలో రాష్ట్ర అదనపు ఎన్నికల ప్రధానాధికారి హరేంధిర ప్రసాద్‌ని, సీఎస్ జవహర్‌రెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. రేషనలైజేషన్ ప్రక్రియకు సంబంధించిన సమాచారాన్ని సేకరించి ప్రక్రియ నిలిపి వేయాలని ఈసీని కోరామన్నారు. కోడ్ ముగిసే వరకు ఈ నిర్ణయాన్ని నిలుపుదల చేయాల్సిందిగా ఈసీ, సీఎస్‌ను కోరామన్నారు. విద్యాశాఖ నుంచి నివేదిక తెప్పించుకుని చర్యలు తీసుకుంటామని ఎన్నికల అధికారులు చెప్పారని, మున్సిపల్‌శాఖ యాజమాన్యంలో పనిచేసే ఉపాధ్యాయులు ఆందోళన చెందాల్సిన అవసరంలేదని సూర్యనారాయణ చెప్పారు.

కాకినాడ కలెక్టర్‌గా జె.నివాస్

» మెటర్నిటీ లీవ్‌లో కృత్తికా శుక్లా

అమరావతి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కలెక్టర్‌గా జె.నివాస్‌ను ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం ఆ జిల్లా కలెక్టర్‌గా ఉన్న కృత్తికా శుక్లా మెటర్నిటీ లీవ్‌లో వెళ్లారు. గురువారం నుంచి దాదాపు 180 రోజుల పాటు మెటర్నిటీ లీవ్‌కు సీఎస్ ఆమోదించారు. ఆమె స్థానంలో కాకినాడ కలెక్టర్‌గా జె.నివాస్ వెంటనే బాధ్యతలు స్వీకరించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా, ఆరోగ్యశాఖ డైరెక్టర్‌గా ఉన్న జె.నివాస్ బదిలీ కావడంతో ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈవోగా ఉన్న డి.కె.బాలాజీకి తాత్కాలిక బాధ్యతలు అప్పగించారు.

నిందితుల బెయిల్ రద్దు కోరే హక్కు అప్రూవర్‌కు ఉంటుంది

» దస్తగిరి పిటిషన్‌ను తిరస్కరించలేం

» తెలంగాణ హైకోర్టు స్పష్టీకరణ

» అవినాశ్ బెయిల్ రద్దుపై విచారణ 4వ తేదీకి వాయిదా

హైదరాబాద్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): వివేకా హత్య కేసులో 8వ నిందితుడిగా ఉన్న ఎంపీ అవినాశ్‌రెడ్డి బెయిల్ రద్దు చేయాలని కోరుతూ 4వ నిందితుడు దస్తగిరి (అప్రూవర్) దాఖలు చేసిన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు గురువారం విచారించింది. అప్రూవర్‌కు బెయిల్ రద్దు కోరే హక్కు లేదని అవినాశ్‌రెడ్డి తరఫు సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి చేసిన వాదనలతో ఏకీభవించలేదు. ఇటీవల ఎన్ఐఏకు సంబంధించిన కేసులో అప్రూవర్ హక్కుల గురించి పూర్తిస్థాయిలో చర్చిస్తూ డివిజన్ బెంచ్ తీర్పు ఇచ్చిందని.. బెయిల్ రద్దు కోరే అధికారం అప్రూవర్‌కు ఉందని స్పష్టం చేసిందని పేర్కొంది. దస్తగిరి పిటిషన్‌ను తోసిపుచ్చలేమని తేల్చిచెప్పింది. ప్రస్తుత పిటిషన్‌లో కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులకు ఆదేశాలు జారీచేసింది. తదుపరి విచారణను ఏప్రిల్ 4వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ ఉత్తర్వులిచ్చారు. కాగా... ఈ కేసులో వైఎస్ భాస్కర్ రెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డి బెయిల్ పిటిషన్లను వ్యతిరేకిస్తూ సీబీఐ కౌంటర్లు దాఖలు చేసింది. ఈ పిటిషన్లపై విచారణ 3కు, సునీల్‌యాదవ్ బెయిల్ పిటిషన్‌పై విచారణ 12కు వాయిదా పడింది. విచారణ నేపథ్యంలో వివేకానందరెడ్డి కుమార్తె డాక్టర్ సునీతారెడ్డి కోర్టుకు వచ్చారు.

తమ్ముడు చెప్పాడని!

(మొదటి పేజీ తరువాయి)

తొలగించాలని అవినాశ్ కోరడమే ఆలస్యమన్నట్లుగా... అన్నయ్య జగన్ వాటిని నెరవేర్చుతున్నారు. వారి సమీప బంధువు, కడప మాజీ ఆర్‌డీఓ ధర్మచంద్రారెడ్డిపై ఉన్న అభియోగాలన్నీ ఒక్క కలంపోటుతో మాఫీ చేసేశారు.

ఇదీ అ..ధర్మ చంద్రారెడ్డి నిర్వాకం

ధర్మచంద్రారెడ్డి సుదీర్ఘకాలం కడప ఆర్‌డీఓగా పనిచేశారు. అంతకుముందు ఆయన విశాఖ జిల్లా భీమిలి తహసిల్దార్‌గా పనిచేశారు. ఆ సమయంలో అత్యంత విలువైన 27.44 ఎకరాల భూమి విషయంలో కోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ పై కోర్టులో అప్పీల్ చేయలేదు. దీంతో ఆ భూమి చేజారిపోయింది. ఏపీసీఎస్ రూల్స్ (కండక్ట్)- 1964లోని రూల్ 3ను ఉల్లంఘించారని ఆయనపై అభియోగాలు నమోదు చేశారు. అందులో 3వ అభియోగం రుజువైంది కూడా. దీంతో ఆయనపై చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఇప్పుడు ఆయన డిప్యూటీ కలెక్టర్ల సంఘానికి ప్రతినిధి కూడా!

అవినాశ్‌ను ఆశ్రయించి..

తాను తప్పు చేయలేదనుకుంటే ముఖ్యమంత్రికో, ప్రధాన కార్యదర్శికో లేఖ రాయాలి. చర్యలు తీసుకోవద్దని కోరాలి. అదీ లేదంటే... డి ప్యూటీ కలెక్టర్ల సర్వీసు అంశాలు చూసే భూ పరిపాలనా ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) లేదా రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికో విన్నపం చేయవచ్చు. అధికారులు అనుసరించాల్సిన పద్ధతి ఇదే. కానీ... ఆయన నేరుగా సీఎం తమ్ముడు, కడప ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డికి లేఖ రాశారు. 'ధర్మచంద్రారెడ్డి నిజాయితీపరుడు' అని సర్టిఫికెట్ ఇస్తూ ఆయన జగన్‌కు లేఖ రాశారు. పైగా... 'మనోడే' అని కూడా చెప్పారు. "ధర్మచంద్రారెడ్డి భీమిలి తహసిల్దార్‌గా పని చేస్తున్న సమయంలో ఆయనపై కొన్ని అభియోగాలు నమోదుచేశారు. మానవతా దృక్పథంతో వాటిని ఉపసంహరించాలని కోరుతున్నా. ఆయన నిజాయితీపరుడు. బాగా కష్టపడి పనిచేస్తాడని తెలుసు. పులివెందుల నియోజకవర్గంలోని రామిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి. ధర్మచంద్రారెడ్డి నాకు ఇచ్చిన వినతిపత్రాన్ని మీ పరిశీలనకు పంపిస్తున్నాను. అతని వ్యక్తిగత విన్నపాన్ని పరిగణనలోకి తీసుకొని వీలైనంత త్వరగా అతనికి మేలు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాను" అని అవినాశ్ తన లేఖలో పేర్కొన్నట్లు తెలిసింది.

అన్న పాటించాడు

అవినాశ్ లేఖపై ముఖ్యమంత్రి జగన్ స్పందించారు. ఈ అంశంపై వెంటనే రెవెన్యూ శాఖ నుంచి ఫైల్ తెప్పించాలని తన కార్యాలయాన్ని ఆదేశించారు. ఇదంతా ఎన్నికల ప్రవర్తనా నియమావళి రావడానికి సరిగ్గా నాలుగు రోజుల ముందు జరిగింది. సీఎం ఆదేశాలతో ఆయన కార్యదర్శి ధనుంజయ రెడ్డి రంగప్రవేశం చేశారు. రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న అజయ్ జైన్‌కు ఓ లేఖ రాశారు. "డిప్యూటీ కలెక్టర్‌గా ఉన్న ధర్మచంద్రా రెడ్డిపై ఉన్న అభియోగాలను ఉపసంహరించాలని కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి రాసిన లేఖను మీకు పంపిస్తున్నాం. తగిన నిర్ణయం తీసుకునేందుకు ఫైల్‌ను పంపించండి" అని అజయ్‌జైన్ ను ఆదేశిస్తూ లేఖ రాసినట్లు విశ్వసనీయంగా తెలిసింది.

ఇదెక్కడి ఆదేశం?

ధనుంజయరెడ్డిది కార్యదర్శి హోదా. రెవెన్యూశాఖ ముఖ్యకార్యదర్శిది ప్రత్యేక ప్రధాన కార్యదర్శి హోదా. ధర్మచంద్రారెడ్డిపై నమోదు చేసిన అభియోగాలను సెటిల్ చేయాల్సింది రెవెన్యూ శాఖనే. పైగా ధర్మచంద్రారెడ్డిపై నమోదైన అభియోగాల్లో 3వది నిరూపితమైంది. అలాంటిది, కడప ఎంపీ విన్నపాన్ని పరిగణనలోకి తీసుకొని సంబంధిత ఫైలును పంపించాలని రెవెన్యూ స్పెషల్ సీఎస్‌ను ఆదేశించడమేమిటి? ఇదెక్కడి విడ్డూరం? మరో నాలుగు రోజుల్లో ఎన్నికల కోడ్ రాబోతుందనగా ఈ తరహా ఆదేశాలు పంపించడం దేనికి సంకేతం? అధికారం ఉండగానే సొంత మనుషులకు మేలుచేసిపెట్టాలన్న ప్రయత్నం కాదా? ఇందులో విచిత్రం ఏమంటే, అభియోగాలు ఎదుర్కొంటున్న ధర్మచంద్రారెడ్డి, ఆయన కోసం లేఖ రాసిన అవినాశ్ రెడ్డి, ముఖ్యమంత్రి జగన్, ఆయన కార్యదర్శిగా ఉన్న ధనుంజయరెడ్డి... ఇలా వీరంతా ఉమ్మడి కడప జిల్లావారే కావడం. ఎన్నికల కోడ్ రాకముందే కేసును సెటిల్‌చేద్దామనుకొని రెవెన్యూశాఖపై తీవ్రంగానే ఒత్తిడి తీసుకొచ్చినట్లు తెలిసింది. దీంతో ఆగమేఘాల మీద రెవెన్యూశాఖ ధర్మచంద్రారెడ్డి ఫైలును రెడీ చేసి సీఎం కార్యాలయానికి పంపించినట్లు తెలిసింది. ఈ విషయంలో సీఎం నిర్ణయం తీసుకొన్నారని అధికారవర్గాలు చెబుతున్నాయి. ధర్మచంద్రా రెడ్డిపై అభియోగాలను ఉపసంహరిస్తూ రెవెన్యూశాఖ ఉత్తర్వులు కూడా ఇచ్చినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఈనెల 16వ తేదీ మధ్యాహ్నం నుంచే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. దీంతో... పాత తేదీతో ఉత్తర్వులు ఇచ్చినట్లు చెబుతున్నారు. ఈ మొత్తం తతంగంపై రెవెన్యూ యంత్రాంగంలో తీవ్ర విస్మయం వ్యక్తమవుతోంది.



బాక్సుల్లో ఉన్న డబ్బును వెలుపలకు తీస్తున్న పోలీసులు

రాయల్ మెరైన్ ఆక్వాలో రూ.56లక్షలు సీజ్

» డబ్బుకు ఆధారాలు చూపిన కంపెనీ ప్రతినిధులు

చీరాల, మార్చి 28: బాపట్ల జిల్లా చీరాల మండలం కావూరివారిపాలెం పంచాయతీ పరిధిలోని రాయల్ మెరైన్ ఆక్వాలో డీఎస్పీ జేత పూడి ప్రసాద్ బృందం, ఫ్లయింగ్ స్క్వాడ్ టీం (ఎఫ్ఎస్‌టీ) బృందం గురువారం సంయుక్తంగా తనిఖీలు నిర్వహించాయి. రొయ్యల కంటైనర్‌లో 200 బాక్సులు ఉండగా, అందులో ఓ అట్టపెట్టెలో రూ.56 లక్షల నగదును గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ ప్రసాద్, ఎఫ్ఎస్‌టీ ఆఫీసర్ ఖాదర్‌బీ, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. రాయల్ మెరైన్ ఆక్వాకు వచ్చే కంటైనర్‌లో డబ్బు తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఎఫ్ఎస్‌టీ టీం రాయల్ మెరైన్ కంపెనీకి వెళ్లారు. కంటైనర్‌లోని రొయ్యల బాక్సులను పరిశీలించే క్రమంలో ఓ అట్టపెట్టెలో నగదును గమనించారు. ఆ మొత్తం రూ.10లక్షల కన్నా ఎక్కువగా ఉండటంతో ఐటీ నోడల్ ఆఫీసర్, ఆర్వో సూర్యనారాయణరెడ్డి, తహసీల్దార్ నాసరయ్యకు సమాచారం అందించారు. వారి సమక్షంలో డబ్బును లెక్కించగా రూ.56లక్షలు ఉన్నట్లు తేలింది. ఆ నగదుకు సంబంధించిన రసీదులను కంపెనీ ప్రతినిధులు చూపారు. అయితే ఎన్నికల నిబంధనల మేరకు రూ.10లక్షలు మించి ఉండకూడదు. దీంతో ఆ మొత్తాన్ని సబ్ ట్రెజరీలో భద్రపరిచారు. ఈ అంశానికి సంబంధించి ఎలాంటి కేసు నమోదు చేయలేదని, ఎఫ్ఎస్‌టీ, నోడల్ టీం ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామని డీఎస్పీ ప్రసాద్ తెలిపారు.

డీఎస్సీ పరీక్షలు వాయిదా?

» షెడ్యూల్ ప్రకారం రేపటి నుంచే ప్రారంభం

» పరీక్షల నిర్వహణపై ఈసీ నుంచి రాని స్పష్టత

» సెంటర్ల ఎంపిక ప్రక్రియ ప్రారంభమే కాలేదు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

డీఎస్సీ పరీక్షలు వాయిదా పడనున్నాయి. షెడ్యూలు ప్రకారం శనివారం నుంచి పరీక్షలు ప్రారంభం కావాలి. మార్చి 30 నుంచి ఏప్రిల్ 30 వరకు డీఎస్సీ పరీక్షలు నిర్వహిస్తామని పాఠశాల విద్యాశాఖ ఇటీవల ప్రకటించింది. కానీ, పరీక్షల నిర్వహణపై ఇప్పటికీ ఈసీ నుంచి స్పష్టత రాలేదు. అలాగే టెట్ ఫలితాలూ విడుదల కాలేదు. దీంతో డీఎస్సీ పరీక్షలు వాయిదా పడినట్లేనని అభ్యర్థులు అంచనాకొచ్చారు. దీనిపై పాఠశాలవిద్యాశాఖ అధికారులు స్పందించడం లేదు. ఒకవేళ ఈసీ అనుమతిచ్చినా అభ్యర్థులు సెంటర్లు ఎంపిక చేసుకోవడం, హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవడం ఒక్కరోజులో సాధ్యంకాదు. షెడ్యూలు ప్రకారం సెంటర్ల ఎంపికకు, హాల్‌టికెట్ల డౌన్‌లోడ్‌కు ఐదు రోజుల వ్యవధి ఉండాలి. అభ్యర్థులకు సెంటర్ల ఎంపికకు గడువు ఇవ్వాలి. ఇవన్నీ శుక్రవారం పూర్తిచేసే అవకాశం లేనందున డీఎస్సీ వాయిదా పడినట్లేనని అర్థమవుతోంది. ఒకవేళ ఈసీ నుంచి అనుమతి లభిస్తే, రీషెడ్యూలు చేసే అవకాశం ఉంది. అనుమతి రాకపోతే ఎన్నికల తర్వాతే పరీక్షలు జరుగుతాయి. ఎన్నికల్లోపు డీఎస్సీ నిర్వహణ ఉండదని అభ్యర్థులు భావిస్తున్నారు. మరోవైపు ఏపీపీఎస్సీ నిర్వహించే పరీక్షలు కూడా వాయిదా పడుతున్నాయి. ఎన్నికల కోసం ఒకటీ రెండు పరీక్షలనే ఏపీపీఎస్సీ వాయిదా వేస్తుంటే, నెల రోజులు జరిగే డీఎస్సీ ఎలా సాధ్యమవుతుందని అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు.

డీవై ఈవో పరీక్ష వాయిదా

అమరావతి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి ఏప్రిల్ 13న జరగాల్సిన పరీక్షను వాయిదా వేసినట్లు ఏపీపీఎస్సీ గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. ఎన్నికల షెడ్యూలు, డీఎస్సీ పరీక్షల నేపథ్యంలో అభ్యర్థుల వినతుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. ఎన్నికల అనంతరం మే 25న పరీక్ష నిర్వహిస్తామని తెలిపింది.

నీట్, జేఈఈ సాధనకు 'కోటా' గ్రాండ్ టెస్ట్స్ సిద్ధం

హైదరాబాద్ సిటీ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): నీట్-యూజీ, జేఈఈ అడ్వాన్స్‌డ్- 2024 పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల కోసం టెస్ట్ సిరీస్, గ్రాండ్ టెస్ట్స్ అండ్ సొల్యూషన్స్‌ను డిజిటల్ బుక్‌లెట్స్‌గా సిద్ధం చేసినట్లు 'కోటా పేజెస్' సంస్థ తెలిపింది. విద్యార్థులు తన సమర్థతను పరీక్షించుకునేందుకు అవి ఉపయోగపడతాయని చెప్పింది. గణితం, భౌతికశాస్త్రం, రసాయనశాస్త్రం, జీవశాస్త్రం పార్ట్, ఫుల్ టెస్ట్‌లను వాట్సాప్ ద్వారా డిజిటల్ మొబైల్ వెర్షన్‌లో పొందవచ్చని కోటా పేజెస్ వెల్లడించింది. మరింత సమాచారం కోసం NEET 2024, JEEA 2024 అని టైప్ చేసి 98490-16661 నంబరుకు వాట్సాప్ మెసేజ్ చేయాలని సూచించింది.

జేఈఈ మెయిన్ పరీక్ష షెడ్యూల్‌లో మళ్లీ మార్పు

జేఈఈ మెయిన్ (సెషన్-2) పరీక్ష షెడ్యూల్‌లో మళ్లీ స్వల్ప మార్పు చేశారు. ఏప్రిల్ 4 నుంచి 15 వరకు ఈ పరీక్షలు నిర్వహించనున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) గత నెలలో ప్రకటించింది. తాజాగా ఈ పరీక్షలను ఏప్రిల్ 4 నుంచి 12 వరకు నిర్వహించనున్నట్లు పేర్కొంది. సిటీ ఇంటిమేషన్ స్లిప్పుల విడుదల సందర్భంగా గురువారం ఓ ప్రకటనలో ఈ తేదీలను వెల్లడించారు. సవరించిన షెడ్యూల్ ప్రకారం జేఈఈ మెయిన్-2 పేపర్-1 (బీఈ/బీటెక్) పరీక్షలు ఏప్రిల్ 4, 5, 6, 8, 9 తేదీల్లో, పేపర్-2 పరీక్షను ఏప్రిల్ 12న నిర్వహించనున్నారు. పేపర్-1 పరీక్ష రెండు షిఫ్టుల్లో (ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు; మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు) జరగనుంది. పేపర్-2 పరీక్ష ఒకే షిఫ్ట్ (ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు) నిర్వహించనున్నారు. కాగా, అభ్యర్థులకు సిటీ ఇంటిమేషన్ స్లిప్పులు అందుబాటులోకి వచ్చాయి. జేఈఈ అధికారిక వెబ్‌సైట్‌లో తమ అప్లికేషన్ నంబర్, పుట్టినతేదీ, కోర్సు, సెక్యూరిటీ పిన్ ఎంటర్ చేయడం ద్వారా పరీక్ష కేంద్రం వివరాలు తెలుసుకోవచ్చు. ఈ స్లిప్పులో పరీక్ష కేంద్రం, నగరం, తేదీ, సమయం, నిబంధనలు తదితర సమాచారం ఉంటుంది. ఈ పరీక్షకు సంబంధించిన అడ్మిట్ కార్డులు త్వరలో విడుదల చేయనున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

ఆంధ్రజ్యోతి దిక్సూచి
diksuchi@andhrajyothy.com
విజయవాడ ● శుక్రవారం 29 మార్చి 2024

తిరుపతి ఐసర్‌లో పీహెచ్‌డీ

తిరుపతిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(ఐసర్)-పీహెచ్‌డీ (2024 ఆగస్టు సెషన్) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. బయాలజీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్, మేథమెటిక్స్, ఎర్త్ అండ్ క్లయిమేట్ సైన్సెస్ విభాగాల్లో పరిశోధనకు అవకాశం ఉంది. ప్రథమ శ్రేణి మార్కులతో బీఈ/బీటెక్ పూర్తిచేసినవారు అన్ని విభాగాలకూ అప్లయ్ చేసుకోవచ్చు. నిర్దేశిత జాతీయ పరీక్షలో సాధించిన ర్యాంక్/ఫెలోషిప్ అర్హత, అకడమిక్ ప్రతిభ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు. ఐసర్ సంస్థల నుంచి కనీసం 8 సీజీపీఏతో బీఎస్-ఎంఎస్ ప్రోగ్రామ్ పూర్తిచేసినవారిని నేరుగా ఇంటర్వ్యూలకు పిలుస్తారు. అభ్యర్థి వయసు ప్రోగ్రామ్ ప్రారంభం నాటికి 28 ఏళ్లు మించకూడదు.

బయాలజీ



పరిశోధనాంశాలు: కంప్యూటేషనల్ బయాలజీ అండ్ సిస్టమ్స్ బయాలజీ, బయోఫిజిక్స్, క్యాన్సర్ బయాలజీ, డిసీజ్ బయాలజీ, ఇమ్యూనాలజీ, కెమికల్ బయాలజీ, ఎకాలజీ అండ్ ఎవల్యూషనరీ బయాలజీ, డెవలప్‌మెంటల్ బయాలజీ అండ్ న్యూరో బయాలజీ, జీనోమ్ బయాలజీ, ఇన్ఫెక్షన్ బయాలజీ, ప్లాంట్ బయాలజీ, స్ట్రక్చరల్ బయాలజీ, సింగిల్ మాలిక్యూల్ బయాలజీ/న్యూక్లియక్ యాసిడ్ బయాలజీ, మైక్రో బయాలజీ

అర్హత: కనీసం 55 శాతం మార్కులతో మాస్టర్స్ డిగ్రీ(ఫిజిక్స్/కెమిస్ట్రీ/మేథమెటిక్స్/బయలాజికల్ సైన్సెస్/ఎకలాజికల్ సైన్సెస్/అగ్రికల్చరల్ సైన్సెస్/సైకాలజీ)/ఎంటెక్/ఎంవీఎస్సీ/ఎంబీబీఎస్ ఉత్తీర్ణులై ఉండాలి. జేజీఈఈబీఐఎల్ఎస్ 2023/గేట్ (లైఫ్ సైన్సెస్, బయోటెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్ అండ్ ఐటీ, కెమిస్ట్రీ, ఎకాలజీ అండ్ ఎవల్యూషన్‌లకు 200లోపు ర్యాంక్) అర్హత ఉండాలి. లేదా డీబీటీ జేఆర్ఎఫ్/ఐసీఎంఆర్ జేఆర్ఎఫ్/డీబీటీ బీఐఎన్‌సీ/యూజీసీ జేఆర్ఎఫ్/సీఎస్ఐఆర్ జేఆర్ఎఫ్/డీఎస్‌టీ ఇన్‌స్పయిర్ జేఆర్ఎఫ్ అర్హత ఉండాలి.

కెమిస్ట్రీ



పరిశోధనాంశాలు: ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఇనార్గానిక్ కెమిస్ట్రీ, థియరిటికల్ అండ్ కంప్యూటేషనల్ కెమిస్ట్రీ, ఫిజికల్ అండ్ మెటీరియల్స్ కెమిస్ట్రీ, కెమికల్ బయాలజీ, కెమిస్ట్రీ సంబంధిత ఇతర అంశాలు.

అర్హత: కనీసం 55 శాతం మార్కులతో పీజీ(ఫిజిక్స్/కెమిస్ట్రీ/మేథమెటిక్స్/ బయాలజీ)/ఎంఈ/ఎంటెక్ పూర్తిచేసి ఉండాలి. సీఎస్ఐఆర్/యూజీసీ నుంచి ఎల్ఎస్/జేఆర్ఎఫ్ అర్హత లేదా ఇన్‌స్పయిర్ పీహెచ్‌డీ ఫెలోషిప్/ గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి.

మేథమెటిక్స్



పరిశోధనాంశాలు: అనలిటికల్ నంబర్ థియరీ, ఆల్జీబ్రిక్ నంబర్ థియరీ, గాలోయిస్ రిప్రజంటేషన్స్, హార్మోనిక్ అనాలిసిస్, ఆల్జీబ్రిక్ జామెట్రీ, ఆల్జీబ్రిక్ కే థియరీ, హోమోటోపీ థియరీ, రిప్రజంటేషన్ థియరీ, రిమాన్నియన్ జామెట్రీ, డిఫరెన్షియల్ అండ్ ఆల్జీబ్రిక్ టోపాలజీ


అర్హత: పీజీ(ఫిజిక్స్/కెమిస్ట్రీ/మేథమెటిక్స్/స్టాటిస్టిక్స్/బయలాజికల్ సైన్సెస్)/ ఎంఈ/ఎంటెక్ ఉత్తీర్ణులై ఉండాలి. సీఎస్ఐఆర్/యూజీసీ నుంచి జేఆర్ఎఫ్ అర్హత లేదా ఇన్‌స్పయిర్ పీహెచ్‌డీ/ఎన్‌బీహెచ్ఎం పీహెచ్‌డీ/ గేట్ అర్హత పొంది ఉండాలి.

ఎర్త్ అండ్ క్లయిమేట్ సైన్స్



పరిశోధనాంశాలు: సెస్మిక్ టోమోగ్రఫీ, సెస్మిక్ యానిసోట్రోపీ, ఎర్త్‌క్వేక్ ఫిజిక్స్ అండ్ గ్రౌండ్ మోషన్, ఎర్త్‌క్వేక్ ఎర్లీ వార్నింగ్ సిస్టమ్, ఇగ్నస్ పెట్రాలజీ, మినరాలజీ, రేర్ మెటల్ అండ్ రేర్ ఎర్త్ మినరలైజేషన్, అట్మాస్ఫిరిక్ సైన్స్, మెటియోరాలజీ, ఎకనామిక్ జియాలజీ, గోల్డ్ మెటలోజెనీ

అర్హత: మాస్టర్స్ డిగ్రీ(జియాలజీ/జియోఫిజిక్స్/ఫిజిక్స్/మెటియోరాలజీ/అట్మాస్ఫిరిక్ సైన్స్/స్పేస్ ఫిజిక్స్/అప్లయిడ్ ఫిజిక్స్/ఆస్ట్రో ఫిజిక్స్/ప్లానెటరీ సైన్సెస్/ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్) పూర్తిచేసి ఉండాలి. నెట్(ఎర్త్, అట్మాస్ఫిరిక్ ఓషన్, ప్లానెటరీ సైన్సెస్, ఫిజిక్స్, ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్) లేదా గేట్(ఫిజిక్స్, జియాలజీ, జియోఫిజిక్స్, ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్ అండ్ ఇంజనీరింగ్) అర్హత ఉండాలి.



ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 3
- **ఇంటర్వ్యూకి ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** ఏప్రిల్ 10 నుంచి 15 మధ్య
- **ఇంటర్వ్యూలు:** మే 7 నుంచి 9 వరకు
- **ఫలితాలు విడుదల:** జూన్ 1 నుంచి 7 మధ్య
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** ఆగస్టు 1 నుంచి
- **వెబ్‌సైట్:** iisertirupati.ac.in


లిటిల్స్




మీకు తెలుసా?

- ఆల్ప్స్ పర్వతాలు, ఆస్ట్రియా, అజర్‌బైజాన్, ఫ్రాన్స్, బల్గేరియా, బోస్నియా, టర్కీ దేశాల్లోని కొండల్లో ఉండే ఈ జంతువును 'చామియోస్' అంటారు. ఇదో అడవి మేక.
- 107 సెం.మీ. నుంచి 137 సెం.మీ పొడవు, 80 సెం.మీ. ఎత్తు ఉంటాయివి.
- 25 కేజీలనుంచి 60 కేజీల లోపు ఉండే ఈ మేకలు కనీసం పదిహేనేళ్ల నుంచి 22 ఏళ్ల వరకూ జీవిస్తాయి.
- గంటకు 50 కి.మీ. వేగంతో పరిగెత్తుతాయివి.
- మధ్యాహ్నం వరకూ విశ్రాంతి తీసుకుంటాయి. సాయంత్రం పూట కదిలి రాత్రి పూట చురుగ్గా ఉంటాయి.
- ఇవి ఒక్కో మందలో 15 నుంచి 30 వరకు ఉంటాయి.
- ఆడజంతువుల కంటే మగ జీవులు పెద్దగా ఉంటాయి.
- వీటి గర్భధారణ సమయం 170 రోజులు. ఒక్క పిల్లను మాత్రమే కంటాయి.
- మనుషులతో పాటు చిరుతలు, పులులు, నక్కల వల్ల ఇవి చనిపోతుంటాయి.
- గడ్డి, పూలు, పండ్లను తింటాయి. చలికాలంలో మాత్రం మంచు ఎక్కువున్నప్పుడు ఆహారం దొరక్క రెండు వారాల పాటు అలానే ఉంటాయివి.
- రాళ్లమధ్య కింద పడిపోకుండా వేగంగా దూకగలవు. పరిగెత్తగలవు. రెండు మీటర్ల ఎత్తువరకూ ఎగరగలవు. ఆరు మీటర్ల దూరం దూకగలవు.








8 తేడాలను గుర్తించండి

సరైన నీడ ఏది?



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 267


	4			9	2		7	
		3						4
			3	6	4	9		
		8						9
9	6						8	5
7						6		
		9	5	8	7			
8						3		
	7		1	4			9	

సుడోకు - 266 సమాధానం

1	7	3	9	5	8	2	6	4
5	2	4	3	7	6	9	8	1
9	6	8	2	4	1	3	7	5
7	9	1	8	2	4	6	5	3
2	4	6	5	9	3	7	1	8
3	8	5	1	6	7	4	9	2
4	1	9	6	8	2	5	3	7
8	5	7	4	3	9	1	2	6
6	3	2	7	1	5	8	4	9

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.

ఏపీ పీఈసెట్ నోటిఫికేషన్



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి (ఏపీఎస్‌సీహెచ్ఈ)-'ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఏపీ పీఈసెట్) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీనిని గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నిర్వహిస్తోంది. ఈ టెస్ట్ ద్వారా రెండేళ్ల వ్యవధి గల బీపీఈడీ, డీపీఈడీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ/ప్రైవేట్/ అనుబంధ కళాశాలల్లో అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత వివరాలు: బీపీఈడీ కోర్సులో ప్రవేశానికి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 జూలై 1 నాటికి 19 ఏళ్లు నిండి ఉండాలి.

- డీపీఈడీ కోర్సులో ప్రవేశానికి ఏదేని గ్రూప్‌తో ఇంటర్/పన్నెండోతరగతి/ తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 జూలై 1 నాటికి 16 ఏళ్లు నిండి ఉండాలి.
- ఇప్పటికే ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్(పీఈటీ)గా పని చేస్తున్నవారు ఎంట్రెన్స్ టెస్ట్ రాయనవసరం లేదు. వీరు గుంటూరు జిల్లా-మంగళగిరి-ఆత్మకూరులోని డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్‌కు నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చు.

ఏపీ పీఈసెట్ వివరాలు: ఇందులో రెండు పార్ట్‌లు ఉంటాయి. మొదటి పార్ట్‌లో ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్ ఉంటుంది. దీనికి 400 మార్కులు కేటాయించారు. పురుషులకు 100 మీటర్ల పరుగు, 6 కేజీల పుట్టింగ్ ద షాట్, 800 మీటర్ల పరుగు, లాంగ్ జంప్/ హై జంప్; మహిళలకు 100 మీటర్ల పరుగు, 4 కేజీల పుట్టింగ్ ద షాట్, 400 మీటర్ల పరుగు, లాంగ్ జంప్/ హై జంప్ ఉంటాయి. ఒక్కో ఈవెంట్‌కు 100 మార్కులు ఉంటాయి. రెండో పార్ట్‌లో స్కిల్ టెస్ట్ ఉంటుంది. బాల్ బ్యాడ్మింటన్, బాస్కెట్ బాల్, క్రికెట్, ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్, హాకీ, కబడ్డీ, ఖోఖో, షటిల్ బ్యాడ్మింటన్, టెన్నిస్, వాలీబాల్ క్రీడల్లో ఒకదానిలో అభ్యర్థి క్రీడానైపుణ్యాన్ని పరీక్షిస్తారు. దీనికి 100 మార్కులు ఉంటాయి. హార్ట్ సంబంధిత సమస్యలు ఉన్నవారు, గర్భిణులు ఈ టెస్ట్‌లలో పాల్గొనడానికి అనర్హులు. ఏపీ పీఈసెట్ 2024లో అర్హత సాధించాలంటే కనీసం 30 శాతం మార్కులు రావాలి.


- ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ ఫెడరేషన్స్/ స్పోర్ట్స్ అసోసియేషన్స్/స్పోర్ట్స్ అథారిటీస్ నుంచి దేశం తరపున ప్రాతినిధ్యం వహించినవారికి 100 మార్కులు; నేషనల్ లెవెల్ మీట్స్/ఇంటర్ యూనివర్సిటీ మీట్స్/నేషనల్ స్కూల్ గేమ్స్‌లో మొదటి స్థానం సాధించినవారికి 75 మార్కులు, రెండో స్థానం సాధించినవారికి 50 మార్కులు, మూడోస్థానం సాధించినవారికి 30 మార్కులు, పాల్గొన్నవారికి 25 మార్కులు; స్టేట్/ఇంటర్ డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్, స్టేట్ స్కూల్ గేమ్స్‌లో మొదటి స్థానం సాధించిన వారికి 20 మార్కులు, రెండో స్థానం సాధించినవారికి 15 మార్కులు, మూడో స్థానం సాధించినవారికి 10 మార్కులు; ఎన్ఐఎస్‌లో ఏడాది కోర్సు లేదా యోగా/స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్/స్పోర్ట్స్ సైన్స్/స్పోర్ట్స్ జర్నలిజం/ఒలింపిక్ ఎడ్యుకేషన్‌లో ఏడాది డిప్లొమా లేదా డీపీఈడీ కోర్సు పూర్తిచేసినవారికి 5 మార్కులు; ఎన్‌సీసీ-సీ/బీ సర్టిఫికెట్ ఉన్నవారికి 5 మార్కులు అదనంగా ఏపీ పీఈసెట్ స్కోర్‌కు కలుపుతారు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.900; బీసీ అభ్యర్థులకు రూ.800; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.700
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 15
- **ఆన్‌లైన్ దరఖాస్తులో కరెక్షన్స్:** మే 30, 31
- **హాల్‌టికెట్స్ డౌన్‌లోడింగ్:** జూన్ 4 నుంచి
- **టెస్ట్ సెంటర్:** ఆచార్య నాగార్జున యూనివర్సిటీ క్యాంపస్, నాగార్జున నగర్, గుంటూరు
- **ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్‌లు, గేమ్ స్కిల్ టెస్ట్‌లు:** జూన్ 11 నుంచి
- **వెబ్‌సైట్:** cets.apsche.ap.gov.in

ఆర్ఐఈఐలో డిప్లొమా, పీజీ డిప్లొమా

బెంగళూరులోని రీజనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీష్, సౌత్ ఇండియా (ఆర్ఐఈఎస్ఐ)- డిప్లొమా ఇన్ ఇంగ్లీష్ కమ్యూనికేషన్ (డీఐఈసీ), పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచింగ్ (పీజీడీఈఎల్‌టీ) ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. వీటిని దూరవిద్య విధానంలో నిర్వహిస్తారు. ఒక్కో కోర్సు వ్యవధి ఏడాది.

డిప్లొమా ఇన్ ఇంగ్లీష్ కమ్యూనికేషన్



ప్రోగ్రామ్ వివరాలు: ఇందులో ఫ్లూయెన్సీ, అక్యూరసీ, డిస్కోర్స్ మేనేజ్‌మెంట్ అనే మూడు మాడ్యూల్స్ ఉంటాయి. ఇంగ్లీష్ లాంగ్వేజ్ పెడగాగి, ఇంగ్లీష్ ఫర్ బిజినెస్, ఇంగ్లీష్ ఫర్ మీడియా అనే ఆప్షనల్ మాడ్యూల్స్ నుంచి ఒకదాన్ని ఎంచుకోవాల్సి ఉంటుంది.

బోధన: రెండు కంపల్సరీ కాంటాక్ట్ ప్రోగ్రామ్‌ల ద్వారా తరగతులు నిర్వహిస్తారు. అక్టోబరులో మొదటి కాంటాక్ట్ ప్రోగ్రామ్ ఉంటుంది. ఇందులో రెండు రోజులపాటు ఆన్‌లైన్ సెషన్స్ ఉంటాయి. రెండోది 2025 ఏప్రిల్, మే నెలల్లో ఉంటుంది. ఇందులో 18 రోజులపాటు ఆఫ్‌లైన్ తరగతులు ఉంటాయి. కమ్యూనికేషన్ స్కిల్స్, ఒకాబులరీ, ఫ్లూయెన్సీ ఇన్ స్పీకింగ్ అండ్ రీడింగ్, ఎఫెక్టివ్‌లీ రైటింగ్, బెటర్ లిజెనింగ్ మెథడ్స్ సంబంధిత అంశాలు వివరిస్తారు. కోర్సు ఫీజు రూ.4,000.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఏ గ్రూపుతోనైనా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

పీజీ డిప్లొమా ఇన్ ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచింగ్

ప్రోగ్రామ్ వివరాలు: ఇందులో ప్రధానంగా ఇంగ్లీష్ లాంగ్వేజ్‌కు సంబంధించి లిజెనింగ్ అండ్ స్పీకింగ్, రీడింగ్, రైటింగ్, లాంగ్వేజ్ వర్క్, మెథడ్స్ అండ్ మెటీరియల్స్ ఆఫ్ ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచింగ్, టీచర్ డెవలప్‌మెంట్, ఇంగ్లీష్ టీచింగ్ ప్రాక్టీస్ వంటి అంశాలు ఉంటాయి. ఒక్కోదానిలో నాలుగు మాడ్యూల్స్, ప్రతి మాడ్యూల్‌లో మూడు/నాలుగు యూనిట్‌లు ఉంటాయి.

బోధన: కోర్సులో భాగంగా రెండు కాంటాక్ట్ ప్రోగ్రామ్‌లు నిర్వహిస్తారు. మొదటిది అక్టోబరులో ఉంటుంది. ఇందులో మూడు రోజులపాటు ఆన్‌లైన్ సెషన్స్ ఉంటాయి. రెండోదాన్ని 2025 ఏప్రిల్, మే నెలల్లో నిర్వహిస్తారు. ఇందులో 22 రోజులపాటు ఆఫ్‌లైన్ తరగతులు ఉంటాయి. కనీసం 80 శాతం అటెండెన్స్ ఉంటేనే ఫైనల్ ఎగ్జామ్‌కు అనుమతిస్తారు. ఈ ప్రోగ్రామ్‌ని గరిష్ఠంగా నాలుగేళ్లలో పూర్తిచేయాలి. కోర్సు ఫీజు రూ.10,000.

స్టడీ మెటీరియల్: ప్రోగ్రామ్‌లో అడ్మిషన్ తీసుకొన్న అభ్యర్థులకు ఆరు బుక్‌లెట్‌లతో కూడిన లెర్నింగ్ మెటీరియల్, 12 అసైన్‌మెంట్‌లకు సంబంధించిన వివరాలు-వాటి షెడ్యూల్, కాంటాక్ట్ ప్రోగ్రామ్‌ల షెడ్యూల్, ఐడీ కార్డ్ పంపుతారు.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

- **దరఖాస్తు ఫీజు:** రూ.250
- **దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** ఏప్రిల్ 1 నుంచి
- **రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** మే 31
- **దరఖాస్తుకు జతచేయాల్సిన కాపీలు:** పదోతరగతి సర్టిఫికెట్; ఇంటర్, డిగ్రీ మార్కుల పత్రాలు; ఆధార్ కార్డ్; రెండు ఫోటోలు
- **ప్రోగ్రామ్‌లు ప్రారంభం:** జూన్ 1 నుంచి
- **చిరునామా:** ద డైరెక్టర్, రీజనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీష్, సౌత్ ఇండియా, జనభారతి క్యాంపస్, బెంగళూరు - 560056
- **వెబ్‌సైట్:** www.riesi.ac.in

SCHOLARSHIP ALERT

Directorate General of Trade Remedies (DGTR) Internship Program 2024

Description: Directorate General of Trade Remedies (DGTR) Internship Program 2024 is an opportunity offered by the Ministry of Commerce and Industry, Government of India to postgraduate students/research scholars. The objective of this program is to equip interested and motivated students with the knowledge and skills necessary to understand and engage in Trade Remedies Investigations and Trade Defence Measures.

Eligibility: Open for postgraduate students/research scholars from recognised universities/institutions.

Prizes & Rewards: A certificate of completion

Last Date to Apply: Round The Year

Application mode: via email or post: to the General Administration Section of DGTR

Short Url: www.b4s.in/aj/DGCI1

The Sonny and Gita Mehta Scholarship for Writers



Description: The Sonny and Gita Mehta Scholarship for Writers 2024 is an opportunity offered by the University of East Anglia (UEA) to support aspiring writers from the Indian subcontinent, the Middle East or North Africa to enable them to undertake study in the Department of Literature, Drama and Creative Writing at UEA.

Eligibility: Open for Indian writers who are native of India and demonstrate outstanding creative writing potential.

Prizes & Rewards: A tuition fee of £28,500 and maintenance fees

Last Date to Apply: 01-05-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/SOIS6

ICRO Amrit Internship Programme 2024

Description: ICRO Amrit Internship Programme 2024 is a joint initiative of the Indian Potash Limited (IPL) and the National Productivity Council (NPC) under the Ministry of Commerce and Industry, Government of India for Class 12 passed, final-year graduation students, graduates, and diploma holders.

Eligibility: Open for Indian nationals aged between 18-45 years. Applicants must be Class 12 passed, final-year graduation students, graduates, or diploma holders with a a valid Aadhaar card.

Prizes & Rewards: A monthly stipend of 6,000 and a certificate of completion

Last Date to Apply: 01-10-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/ICRA1

buddy4study.com